
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 255

బుధవారం 29-5-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




హెడ్ కోచ్‌గా గంభీర్!

టీమిండియా మాజీ కెప్టెన్‌తో బీసీసీఐ మంతనాలు - 12లో



ఆధార్‌తో పాన్ లింక్ చేసుకోండి

ఈ నెల 31వరకు గడువు.. ఆదాయపు పన్ను శాఖ సూచన - 13లో



మూడు రోజులపాటు మోదీ ధ్యానం

ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత ఈ నెల 30వ తేదీ సాయంత్రం నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు ప్రధాని మోదీ కన్యాకుమారిలో ధ్యానం చేస్తారు.

వివరాలు 6లో ▸



సీజేఐ పరిశీలనకు కేజ్రీవాల్ పిటిషన్

బెయిల్ గడువు పొడిగించాలని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ పరిశీలనకు పంపించనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది.

వివరాలు 6లో ▸

ఈ సడలింపులు.. 'పచ్చ'సిరాతో!



పోస్టల్ బ్యాలెట్ ఆమోదంపై గతేడాది జూలై 19న కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలు

దేశవ్యాప్తంగా అవే అమలు కూడా..

- కానీ, డిక్లరేషన్ ఫారంపై అటెస్టింగ్ అధికారి స్టాంప్ లేకపోయినా.. సంతకం ఉంటే చాలు ఆమోదించాలని టీడీపీ విజ్ఞప్తి
- ఆ మేరకు సడలింపు ఇస్తూ ఈనెల 25న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఉత్తర్వులు
- అటెస్టింగ్ ఆఫీసర్ సంతకంపై అనుమానం వస్తే ఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి వద్ద సంతకంతో సరిపోల్చుకోవాలని ఆదేశాలు
- ఇది పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు సమయంలో వివాదాలకు దారితీస్తుందంటున్న రాజకీయ పక్షాలు.. శాంతిభద్రతల సమస్యగా పరిణమిస్తుందంటూ ఆందోళన
- రాష్ట్ర ఎన్నికల సంఘం మరీ ఇంత 'పచ్చ'పాతంపై విస్మయం

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల సందర్భంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఒక నిబంధనావళి రూపొందించిందంటే అది దేశవ్యాప్తంగా అమలు జరగాలి. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో నిబంధన అంటూ ఏమీ ఉండదు. అలాగే, గత ఎన్నికల్లో లేని నిబంధన.. అదే విధంగా దేశంలో ఎక్కడాలేని నియమం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే అమలు చేస్తున్నారంటే ఏమనుకోవాలి? పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విషయంలో ఇప్పుడు రాష్ట్రంలో ఇదే జరుగుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు భిన్నంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన సడలింపులు ఇప్పుడు రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఎందుకంటే.. ఈ సడలింపులు టీడీపీ కోసం

మిగతా 2వ పేజీలో ▸

ఈసీ అంపైర్‌లా లేదు

- దానికి బాబు వైరస్ సోకింది.. వారంలో టీడీపీ పీడ విరగడ
- అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీనే
- గీత దాటిన అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి హెచ్చరిక

2లో

కౌంటింగ్‌లో అప్రమత్తత అవసరం

- ఫలితాలు వెలువడే వరకు ఏమరుపాటు పనికిరాదు
- అనుమానాలు నివృత్తి చేసుకోవాలి.. కౌంటింగ్ ఏజెంట్ల జాబితా 31లోగా అందివ్వాలి
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు సజ్జల రామకృష్ణారెడ్డి సూచన

2లో

మూడు కేసుల్లో పిన్నెల్లికి ముందస్తు బెయిల్

ఫలించని పచ్చ బ్యాచ్, పోలీసుల కుట్రలు

- రికార్డులు తారుమారు చేసి శక్తివంచన లేకుండా పనిచేసిన పోలీసులు
- వీరి కుట్రలను పటాపంచలు చేసిన న్యాయస్థానం
- అరెస్ట్‌తో సహా పిన్నెల్లిపై ఎలాంటి తొందరపాటు చర్యలొద్దని పోలీసులకు ఆదేశం.. కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకే ఈ మధ్యంతర బెయిల్
- ఉత్తర్వులు జారీ చేసిన న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప
- పలు షరతులు విధించిన కోర్టు
- పిన్నెల్లి తరఫు న్యాయవాది అభ్యర్థన మేరకు ఓ షరతులో సవరణ



సాక్షి, అమరావతి: పచ్చ బ్యాచ్, పోలీసులకు హైకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఓట్ల కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనకుండా మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అడ్డుకునేందుకు వారు పన్నిన కుట్రలను పటాపంచలు చేసింది. రామకృష్ణారెడ్డికి మధ్యంతర ముందస్తు బెయిల్ రాకుండా చేసేందుకు తెలుగుదేశం పార్టీ, పోలీసులు కుమ్మక్కయినా కూడా ప్రయోజనం లేకపోయింది. రికార్డులను తారుమారు చేసి, బాధితులను ముందు పెట్టి పిన్నెల్లి ముందస్తు బెయిల్‌ను

మిగతా 2వ పేజీలో ▸



పిల్లల మార్కులు నేరుగా తల్లిదండ్రులకే

- రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి హోలిస్టిక్ రిపోర్టు కార్డు
- తల్లిదండ్రులకు ఎస్ఎంఎస్ రూపంలో పంపుతున్న పాఠశాల విద్యాశాఖ
- 1 నుంచి 9 తరగతుల విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులకు వివరణ
- 61.81 లక్షల మందికి ఎస్ఎంఎస్‌లు.. 100 శాతం పూర్తి చేసిన ప్రభుత్వ స్కూల్స్
- 89 శాతంతో వెనుకబడ్డ ప్రైవేట్ స్కూల్స్

3లో

ఇవాంజీ కార్టూన్



డైరెక్టుగా దేవుడితో టచ్‌లో ఉన్నారట!

వేగంగా బీసీజీ వ్యాక్సినేషన్



- మూడు నెలల్లో 20లక్షల మందికి పంపిణీ లక్ష్యం
- తొలి రెండు వారాల్లోనే 16.98 శాతం వ్యాక్సినేషన్ పూర్తి
- ఆరు వర్గాలకు చెందిన హై రిస్క్ వ్యక్తులకు టీకా వేస్తున్న వైద్యశాఖ
- టీబీ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు

3లో

వజ్రాన్వేషణ



కర్నూలు జిల్లా జొన్నగిరి సమీపంలోని పొలాల్లో వజ్రాలను వెతుకుతున్న జనం

- కర్నూలు, అనంతపురం జిల్లాల సరిహద్దుల్లో పొలాల వైపు అన్వేషకుల పరుగులు
- ఈ సీజన్‌లో ఇప్పటికే 9 వజ్రాలు లభ్యం
- ఏటా 40–50 వజ్రాలు లభ్యమవుతున్న వైనం
- తమ పొలాల్లోకి రావొద్దని విజ్ఞప్తి బోర్డులు పెడుతున్న రైతులు
- ఆఫ్రికా తరహాలో ప్రభుత్వమే వజ్రాలు కొనుగోలు చేస్తే మేలంటున్న వజ్రాన్వేషకులు

14లో



రోహిణి తీవ్రత లేనట్టే!

- మూడు రోజులు స్వల్పంగా పెరగనున్న ఉష్ణోగ్రతలు
- వడగాడ్పులకు ఆస్కారం లేదంటున్న ఐఎండీ
- గంటకు 30–40 కి.మీ.ల వేగంతో పశ్చిమ గాలులు

14లో

క్లుప్తంగా...

ఏపీలో వైద్యం బాగుంది



సమావేశంలో పాల్గొన్న మానవ హక్కుల ప్రత్యేక పర్యవేక్షకుడు బాలకృష్ణన్ గోయల్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో వైద్యం బాగుందని.. ఎక్కడా లేనివిధంగా ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నారని జాతీయ మానవ హక్కుల ప్రత్యేక పర్యవేక్షకుడు బాలకృష్ణన్ గోయల్ ప్రశంసించారు. చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ప్రసూతి వార్డు, చిన్నపిల్లల వార్డు, ఎస్ఎన్‌సీయూలను పరిశీలించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమావేశమై మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల్లో తాను పర్యటించి ఆస్పత్రులను సందర్శించానన్నారు. ఏపీలో వైద్య సేవలు బాగున్నాయని కొనియాడారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఇక్కడి వైద్యులు మెరుగ్గా సేవలు అందిస్తున్నారని అభినందించారు. అంతకుముందు సంజయ్‌గాంధీ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లలతో కాసేపు ముచ్చటించారు. కేంద్ర నిర్వహణ, బోధన విషయంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్ర భవనాలు, నిర్వహణ, పిల్లలకు విద్యాబోధన బాగుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్ని నాడు–నేడు కింద కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రబ్బానీ భాష, డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఐసీడీఎస్ పీఓ నాగశైలజ, సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, సీడీపీఓ శ్యామ్ సుగుణకుమారి, అపోలో ఆస్పత్రి ఇన్‌చార్జ్ నరేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రోత్సాహంతోనే పీఆర్కేపై అక్రమ కేసులు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు హనుమంత్ నాయక్



మాట్లాడుతున్న మేరాజోత్ హనుమంత్ నాయక్

మాచర్ల రూరల్: మాచర్ల నియోజకవర్గంలో ఎలాగూ గెలవలేమని తెలుసుకున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై అక్రమ కేసులు బనాయింపజేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ విమర్శించారు. మంగళవారం పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పీఆర్కే ఎన్నికైన నాటి నుంచి ఏ ఒక్క గ్రామంలోనూ ఘర్షణలు తలెత్తకుండా పల్నాడును ప్రశాంతంగా ఉంచారన్నారు. ఓట్లు, సీట్లు కోసం ఏడు మర్డర్ల కేసులో నిందితుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డిని టీడీపీ ఇన్‌చార్జిగా నియమించి ప్రశాంతంగా ఉన్న పల్నాడులో ఘర్షణలు రేపుతున్నారని ధ్వజమెత్తారు. రెంటచింతల మండలం పాలవాయి గేటులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గీయులను ఓటింగ్‌కు రానివ్వకుండా టీడీపీ వారు రిగ్గింగ్ చేసుకుంటున్నారని, దానిని అడ్డుకునేందుకు పీఆర్కే చేసిన ప్రయత్నాన్ని ఈవీఎం ధ్వంసం చేశారంటూ కేసు నమోదు చేయటం దారుణమన్నారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా పల్నాడు ప్రజలు ఎమ్మెల్యే పీఆర్కే వెంటే ఉన్నారని, ఐదో సారి ఘన విజయం సాధిస్తారని చెప్పారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ సభావత్ రవినాయక్, సంఘం నాయకులు కేతావత్ శ్రీనునాయక్, నూన్సావత్ రంగానాయక్, బాణావత్ లాచూ నాయక్ తదితరులున్నారు.

ఆగని 'సంక్షేమం'

రాష్ట్రంలో పోలింగ్ తర్వాత కూడా ఆగని 'చేయూత'

- లబ్ధిదారుల ఖాతాల్లో కొనసాగుతున్న డబ్బుల జమ
- పోలింగ్ అనంతరం 18న రూ. 1,513 కోట్లు
- 24న మరో రూ. 200 కోట్లు, 27న ఇంకో రూ. 400 కోట్లు
- 20న ఈబీసీ నేస్తం లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 629 కోట్లు
- ఎన్నికలతో సంబంధం లేకుండా పథకాల లబ్ధి పొందిన మహిళలు



సాక్షి, అమరావతి: ఐదు సంవత్సరాలుగా ప్రతి ఏటా ముందుగానే సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి ఠంఛన్‌గా ఆయా పథకాలకు నిధులు అందిస్తున్న ప్రభుత్వం ఎన్నికల అనంతరం కూడా పథకాల అమలు కొనసాగిస్తూ వస్తోంది. ఎన్నికల కోడ్ కారణంతో మధ్యలో నిలిచిన వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, ఈబీసీ నేస్తం పథకాల లబ్ధిదారులకు ఈ 13న పోలింగ్ ముగిసిన అనంతరం ఆయా పథకాల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో జమ చేసింది. ఒక్కో మహిళకు రూ. 18,750ల చొప్పున 18న వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా రూ. 1,513.78 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం ఆయా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. 24న మరో రూ. 200 కోట్లు, 27న ఇంకో రూ. 400 కోట్లు ఆయా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. మిగిలిన వారికి కూడా పంపిణీ కొనసాగుతున్నట్టు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో 45–60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన అర్హులైన మహిళలకు నాలుగు విడతల్లో రూ. 75 వేల మొత్తం అందించేలా వైఎస్సార్ చేయూత పథకం అమలులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు నాలుగో విడతగా పంపిణీ చేస్తున్న రూ. 5,060.49 కోట్లతో కలిపి ప్రభుత్వం గత ఐదేళ్లలో 26,98,931 మందికి ఈ ఒక్క పథకం ద్వారానే రూ.19,189.60 కోట్లు అందించినట్లు అవుతుంది.

పోలింగ్ ముగిసిన మర్నాటి నుంచే

ఐదేళ్లగా కొనసాగుతున్న పథకాలే అయినప్పటికీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో టీడీపీ, జనసేనల ఫిర్యాదుతో కేంద్ర ఎన్నికల సంఘం ఆయా పథకాల అమలును తాత్కాలికంగా నిలిపివేసింది. అయితే పోలింగ్ ముగిసిన మరుసటి రోజు మే 14న 21.56 లక్షల మంది పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించి రూ. 1,843.07 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేసింది. దీంతో 2019 ఎన్నికల నాటికి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు బ్యాంకుల్లో ఉండే అప్పు మొత్తాన్ని వైఎస్సార్ ఆసరా పథకం పేరిట ప్రభుత్వం నాలుగు విడతల్లో నేరుగా అందజేసే ప్రక్రియ పూర్తయింది. 2019 ఏప్రిల్ 11 నాటికి 78.94 లక్షల మంది మహిళలకు రూ.25,570 కోట్లు అప్పు ఉండగా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఆ మొత్తం రుణాన్ని ప్రభుత్వం అందించింది. మరోవైపు ఈబీసీ నేస్తం పథకానికి సంబంధించి అగ్ర వర్ణాల్లోని 45–60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న అర్హులైన పేద మహిళలకు ఈ విడతలోను రూ.15 వేలు చొప్పున లబ్ధిదారులు అందరికీ చెల్లించాల్సిన మొత్తం రూ. 629 కోట్లను చెప్పిన ప్రకారమే పోలింగ్ ముగిసిన తర్వాత ఈ నెల 20న వారి ఖాతాల్లో జమ చేసినట్టు అధికారులు వెల్లడించారు.

కౌంటింగ్‌లో అప్రమత్తత అవసరం

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు సజ్జల రామకృష్ణారెడ్డి సూచన

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అభ్యర్థులంతా కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఏమరుపాటుకు తావివ్వరాదని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు, రీజనల్ కో–ఆర్డినేటర్లతో మంగళవారం ఆయన తాడేపల్లి నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యంగా ఈసీ అనుసరిస్తున్న తీరు, అధికార యంత్రాంగంపై అనుమానాలున్న నేపథ్యంలో అందరూ ప్రజాస్వామ్యయుతంగా కౌంటింగ్ జరిగేలా చూడాలని చెప్పారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

- ప్రజల ఆదరాభిమానాలతో వైఎస్సార్‌సీపీ తిరిగి విజయం సాధించబోతోంది. కాబట్టి మరింత జాగరూకత అవసరం. అభ్యర్థులకు ఏమైనా అనుమానాలుంటే వాటిని వెంటనే నివృత్తి చేసుకోవాలి. కౌంటింగ్ ఏజెంట్ల జాబితాను 31వ తేదీలోగా ఇవ్వాలి. పార్టీకి అంకితభావంతో పని చేసే కార్యకర్తలను కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలి.
- ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేస్తూ అవకాశాలను తనకు అనుకూలంగా మలుచుకుని కుయుక్తులు పన్నుతున్నందున నియమ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ఏజెంట్లదే. పోస్టల్ బ్యాలెట్, ఇతర అంశాలపై ఈసీ గైడ్‌లైన్స్‌కు భిన్నంగా ఆదేశాలు ఇవ్వమని కూడా ఈసీపై ఒత్తిడి చేస్తున్నారు. కౌంటింగ్ ప్రాంతాలలో పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేసే అవకాశం ఉంది.
- కౌంటింగ్ ఏజెంట్ల నియామకం రెండు రోజుల్లో పూర్తి చేయాలి. కౌంటింగ్ ప్రారంభ సమయంలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు, ఆ తర్వాత ఈవీఎంల లెక్కింపు ఉంటుంది. ఫైనల్ గా డిక్లరేషన్ తీసుకునే వరకు అప్రమత్తంగా ఉండాలి.
- సీఎం జగన్ తిరిగి విజయం సాధించాలని ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంత బలంగా కోరుకుంటున్నారో ఏజెంట్లు కూడా ప్రతి టేబుల్ దగ్గరా అంత పట్టుదలగా ఉండాలి. ఈ నెల 29వ తేదీనాటికి కౌంటింగ్ ఏజెంట్ల ఫార్మాట్‌లో పేర్లు, ఫోన్ నంబర్ తదితర వివరాలు అందించాలి. మన ఏజెంట్లు ఎక్కడ కూర్చోవాలో ముందుగా తెలుసుకోవాలి.
- పోస్టల్ బ్యాలెట్ల విషయంలో చాలా అప్రమత్తత అవసరం. వీటివల్లే గతంలో గుంటూరులో వేలాది ఓట్లు మనపార్టీ నష్టపోవాల్సి వచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలి.

ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు 42,000 దరఖాస్తులు

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని 4 ట్రిపుల్ ఐటీలలో అడ్మిషన్లలో భాగంగా మంగళవారం వరకు 42,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2024–25అడ్మిషన్లకు నోటిఫికేషన్‌ను ఆర్జీయూకేటీ ఉన్నతాధికారులు ఈ నెల 6న విడుదల చేసి 8 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తుకు జూన్ 25 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంది. 4 ట్రిపుల్ ఐటీలలో కలిపి 4,000 సీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ కింద మరో 400 సీట్లు కలిపి మొత్తం 4,400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి రిజర్వేషన్‌ను అనుసరించి సీట్లను భర్తీ చేయనున్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసే నాటికి 50,000 పైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

మూడు కేసుల్లో పిన్నెల్లికి ముందస్తు బెయిల్

▶ మొదటి పేజీ తరువాయి

అడ్డుకునేందుకు పన్నిన కుట్రలు విఫలమయ్యాయి. రామకృష్ణారెడ్డిపై పోలీసులు నమోదు చేసిన మూడు కేసుల్లో హైకోర్టు ఆయనకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అరెస్ట్‌తో సహా పిన్నెల్లిపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఈ నెల 6వ తేదీ వరకు ఈ బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. జేసీ అస్మిత్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, చింతమనేని ప్రభాకర్, పరిమి సోమశేఖర్ నాయుడు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసిన తరహాలోనే పిన్నెల్లికి కూడా బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. పిన్నెల్లికి మధ్యంతర ముందస్తు బెయిల్‌కు పలు షరతులు విధించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

మధ్యంతర ముందస్తు బెయిల్ కోసం పిటిషన్లు...

ఈవీఎం కేసులో హైకోర్టు ఈ నెల 23న పిన్నెల్లికి మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసిన వెంటనే పోలీసులు ఆయనపై రెండు హత్యాయత్నం కేసులతో సహా మూడు కేసులు నమోదు చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనాల్సి ఉన్నందున మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ రామకృష్ణారెడ్డి హైకోర్టులో వేర్వేరుగా మూడు అనుబంధ వ్యాజ్యాలు దాఖలు చేశారు. పిన్నెల్లి తరపున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, న్యాయవాది ఎస్.రామలక్ష్మణరెడ్డి వాదనలు వినిపించారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన జస్టిస్ జ్యోతిర్మయి ఆ మూడు అనుబంధ వ్యాజ్యాలను అనుమతిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇవీ షరతులు..

పిన్నెల్లిపై నిఘా ఉంచేలా పోలీసులను ఆదేశించాలని ఎన్నికల సంఘానికి హైకోర్టు స్పష్టం చేసింది. ఎలాంటి నేరపూరిత చర్యల్లో పాల్గొనకూడదని, పునరావృతం చేయరాదని పిన్నెల్లిని ఆదేశించింది. జిల్లాలో శాంతిభద్రతల సమస్య సృష్టించకూడదని చెప్పింది. ప్రజాశాంతికి, సాక్షుల రక్షణకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని, అనుచరులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా చూడాలని పిన్నెల్లిని ఆదేశించింది. అనుచరుల బాధ్యత రామకృష్ణారెడ్డిదేనని స్పష్టం చేసింది. ఈ కేసు గురించి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో మాట్లాడవద్దని ఆదేశించింది. సాక్షులు, బాధితులతో సంభాషించవద్దని, వారిని బెదిరించడం వంటివి చేయరాదని తెలిపింది. పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో మాత్రమే ఉండాలని, ఒకవేళ కౌంటింగ్ కేంద్రం మరో చోట ఉంటే లెక్కింపు రోజున ఆ కేంద్రానికి వెళ్లొచ్చని తెలిపింది. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 లోపు పల్నాడు ఎస్పీ ముందు హాజరు కావాలని పిన్నెల్లిని ఆదేశించింది. నర్సరావుపేటలో తాను ఎక్కడ ఉంటున్నదీ, తన మొబైల్ నంబరు వివరాలను పోలీసులకు తెలియచేయాలని ఆదేశించింది. స్థానిక కోర్టుల్లో పాస్‌పోర్ట్ జమ చేయాలని, కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లడానికి వీల్లేదని చెప్పింది. బాధితులకు తగిన రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. అయితే, ఓ షరతును కొద్దిగా సవరించాలని పిన్నెల్లి తరపు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి అభ్యర్థించారు. కౌంటింగ్ రోజున ఎస్పీ ముందు హాజరయ్యేంత సమయం ఉండదని, అందువల్ల ఆ రోజున రిటర్నింగ్ అధికారి ముందు హాజరవుతారని తెలిపారు. ఇందుకు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి సమ్మతించి ఆ మేరకు ఆ షరతును సవరించారు. ప్రజా ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ చర్యల విషయంలో చాలా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తన ఉత్తర్వుల్లో న్యాయమూర్తి స్పష్టంచేశారు. 'న్యాయ చక్రాలు నెమ్మదిగా కదిలినప్పటికీ, అవి గొప్పగా కదులుతాయి,' అంటూ ఓ తీర్పులో సుప్రీంకోర్టు చెప్పిన కొటేషన్‌తో న్యాయమూర్తి తన ఉత్తర్వులను ముగించారు.

పోలీసుల చర్య చాలా తీవ్రమైనది

ఈ మూడు కేసుల్లో పోలీసుల తీరును హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. మిగిలిన నిందితులను 16వ తేదీనే అరెస్ట్ చేసినప్పటికీ, వారిని 23వ తేదీన నిందితులుగా చేర్చినట్లు రిమాండ్ రిపోర్ట్‌లో చెప్పడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఇది చాలా తీవ్రమైన విషయమని స్పష్టం చేసింది. ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే ఇలా చేయడం డీకే బసు కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధమని తేల్చి చెప్పింది. పిన్నెల్లిని 22వ తేదీనే నిందితునిగా చేర్చారని పోలీసులు చెప్పిన విషయాన్ని, కింది కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌లో 23వ తేదీ రాత్రి 8 గంటలకు నిందితునిగా చేర్చినట్లు పేర్కొనడాన్ని హైకోర్టు తన ఉత్తర్వుల్లో ప్రముఖంగా ప్రస్తావించింది. దీనిపై తుది విచారణ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరింత వివరణనివ్వాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

ఈసీ అంపైర్‌లా లేదు

దానికి చంద్రబాబు వైరస్ సోకింది.. వారంలో టీడీపీ పీడ విరగడ

- అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీనే
- గీత దాటిన అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి హెచ్చరిక
- సీఈసీ మార్గదర్శకాలు దేశమంతా ఒకేలా ఉండాలి..
- పోలీసుల ద్వారా పిన్నెల్లిని అంతమొందించేందుకు బాబు కుట్ర
- అందుకే ఏడుగురి హత్య కేసులో నిందితుడైన బ్రహ్మారెడ్డికి మాచర్ల టికెట్
- చంద్రబాబు, ఎల్లో మీడియా కంటే ఉగ్రవాదులే నయం
- గోబెల్స్ ప్రచారం చేసి.. వ్యక్తిత్వహననంతో అధికారులను లొంగదీసుకునే యత్నం
- అందులో భాగమే సీఎస్‌పై అభూతకల్పనలతో కథనాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు వైరస్ సోకిందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. అందుకే ఎన్నికల కమిషన్ అంపైర్‌లా నిష్పక్షపాతంగా వ్యవహరించడంలేదని.. పోలింగ్ రోజు నుంచి ఇప్పటివరకూ వ్యవహరిస్తున్న తీరే అందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు బదులిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే.. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో అన్నింటినీ గత ఐదేళ్లు సీఎం జగన్ అమలుచేశారు. సుపరిపాలన అందించారు. పరీక్షలో వంద శాతం మార్కులు రావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మేం పరీక్షలు అలాగే రాశాం. వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడం తథ్యం. వారంలో టీడీపీ పీడ విరగడ కావడం ఖాయం. బహుశ బీజేపీకి ఉత్తరాదిలో కలిసొస్తుందన్న కారణంతో అమిత్ షా దక్షిణాదిలో సీట్లు వస్తాయని చెప్పారేమో. ఉద్యోగులూ సమాజంలో భాగమే. వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నట్లు.. తమకు అనుకూలంగా ఉన్నట్లు టీడీపీ భ్రమపడుతోంది. గతంలో పోస్టల్ బ్యాలెట్ కవర్‌పై సీరియల్ నంబర్‌లేదని తిరస్కరించారు. ఈసారి ఏమీలేకున్నా పరిగణనలోకి తీసుకోవాలని టీడీపీ వాళ్లే అడుగుతున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఏ మార్గదర్శకాలు జారీచేసినా దేశమంతా ఒకేలా ఉండాలి. దేశమంతా ఎలాంటి నిబంధనలు ఉంటాయో ఇక్కడ కూడా అవే నిబంధనలు అమలుచేయాలి.

మాచర్లలో పిన్నెల్లి లక్ష్యంగా కుట్ర..

ఇక 15 రోజులుగా మాచర్లలో ఏం జరుగుతోందో అందరూ గమనించాలి. అక్కడి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని లక్ష్యంగా చేసుకుని కుట్ర జరుగుతోంది. మాచర్ల కేంద్రంగా టీడీపీ, ఎల్లోమీడియా గందరగోళం సృష్టిస్తోంది. నిష్పక్షపాతంగా ఈసీ వ్యవహరించాలన్నదే మా కోరిక. దురదృష్టవశాత్తు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ఏర్పడిన నాటి నుంచి ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు వైరస్ సోకినట్లుగా ఉంది. ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరే ఈ అనుమానాలకు కారణం. ఈసీ జోక్యం మాచర్ల కేసులో తీవ్రంగా కనిపిస్తోంది. మాచర్ల నియోజకవర్గం పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను ఎమ్మెల్యే పిన్నెల్లి ధ్వంసం చేసినట్లుగా ఉన్న వీడియో ఎలా బయటకొచ్చిందో ఈసీ చెప్పడంలేదు. అదే నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఈవీఎంలు ధ్వంసమయ్యాయి. ఆ వీడియోలను బయటపెట్టాలి. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓటర్లపై టీడీపీ గూండాలు చేసిన దాడుల వీడియోలనూ బయటపెట్టాలి. ఈవీఎంలు ధ్వంసమైన పోలింగ్ కేంద్రాల పరిధిలో రిగ్గింగ్‌కు పాల్పడింది కాబట్టే టీడీపీ రీపోలింగ్ కోరడంలేదు. వైఎస్సార్‌సీపీకి అన్యాయం జరిగింది కాబట్టే ఎమ్మెల్యే పిన్నెల్లి రీపోలింగ్ కోరుతున్నారు.

పదిరోజులు ఆ సీఐ నిద్రపోయారా?

ఇక ఈవీఎం ధ్వంసం కేసులో పిన్నెల్లికి హైకోర్టు బెయిల్ ఇవ్వగానే.. పోలింగ్ మరుసటి రోజు అంటే ఈనెల 14న జరిగిన అల్లర్లలో తన తలకు గాయమైందని.. ఆ ఘటనలో ఎమ్మెల్యే పిన్నెల్లి ఉన్నారని పది రోజుల తర్వాత సీఐ కేసు పెట్టడమేంటి? పది రోజులూ సీఐ ఎక్కడ నిద్రపోయారు? ఆ సీఐ తరఫున ప్రైవేట్ లాయర్ ఎలా వాదిస్తారు? ఇందుకు ఈసీ ఎలా అనుమతిస్తుంది. పోలీసుల ద్వారా పిన్నెల్లిని అంతమొందించడానికి చంద్రబాబు కుట్ర చేస్తున్నారు. అందుకే ఏడుగురి హత్య కేసులో నిందితుడైన బ్రహ్మారెడ్డిని టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి దించారు. అలాగే, మాచర్లలో పోలీసులు వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేశారు. కారంపూడిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై, ఆస్తులపై టీడీపీ రౌడీలు ఇష్టారాజ్యంగా దాడులకు పాల్పడితే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించడంలో ఆంతర్యమేమిటి? పోలింగ్ అయిపోయిన తరువాత బైండోవర్, రౌడీషీట్లు వేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అన్ని విధాలా అండగా ఉంటాం. ఇదంతా తాత్కాలికమే. ఫలితాల అనంతరం జగన్ ప్రమాణ స్వీకారం చేస్తారు. గీత దాటి పక్షపాతంగా వ్యవహరిస్తున్న అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

కౌంటింగ్ సమయంలో ఈసీ నిష్పక్షపాతంగా ఉండాలి

చంద్రబాబు గతంలో ఎన్నికల కమిషన్‌పై ఎలా దాడికి వెళ్లారో చూశాం. వైఎస్ జగన్ ఎప్పుడూ ఈసీపై చంద్రబాబులా వ్యవహరించలేదు. ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ చంద్రబాబుకు అనుకూలంగా వ్యవహరిస్తోంది. కౌంటింగ్ సమయంలోనైనా ఈసీ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని మేం కోరుతున్నాం. కేవలం వ్యవస్థలను మేనేజ్ చేయడమే లక్ష్యంగా చంద్రబాబు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీతో పొత్తు పెట్టుకున్నారు. గోబెల్స్ ప్రచారం చేసి.. వ్యక్తిత్వ హననానికి పాల్పడి.. బెదిరించి అధికారులను లొంగదీసుకుని తమ వైపు తిప్పుకునేలా ఎల్లో మీడియా ద్వారా చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు, ఎల్లో మీడియా కంటే ఉగ్రవాదులే నయం. ఎన్నికల సమయంలో చీఫ్ సెక్రటరీ (సీఎస్)ని తప్పించాలని ప్రయత్నం చేస్తున్నారు. అందుకే ఆయనపై అభూతకల్పనలతో తప్పుడు కథనాలు అచ్చేసి.. వాటిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తోంది.

అగ్నిబాన్ రాకెట్ ప్రయోగం మరోసారి వాయిదా

- చివరి 11 సెకన్లలో సాంకేతిక సమస్య
- వెంటనే ప్రయోగం నిలిపివేత
- అగ్నికుల్ కాస్మోస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన చిన్న రాకెట్ ఇది
- గతంలో రెండుసార్లు వాయిదా.. ఇది మూడోసారి



ప్రయోగ వేదికపై అగ్నిబాన్ రాకెట్

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): ప్రైవేటు అంతరిక్ష సంస్థకు చెందిన అగ్నిబాన్ రాకెట్ ప్రయోగం మరోసారి వాయిదా పడింది. సాంకేతిక లోపాల కారణంగా ఈ రాకెట్ ప్రయోగం గతంలో రెండుసార్లు వాయిదా పడింది. అందులో తలెత్తిన సాంకేతిక లోపాలను సరిదిద్ది మంగళవారం తెల్లవారుజామున ప్రయోగానికి సిద్ధం చేశారు. అయితే, ప్రయోగానికి కొద్ది సెకన్ల ముందు మరోసారి సాంకేతిక లోపాన్ని గుర్తించి, ప్రయోగాన్ని నిలిపివేశారు. అగ్నికుల్ కాస్మోస్ ప్రైవేట్ లిమిటెడ్ (చెన్నై) అనే ప్రైవేటు ఎస్ఓఆర్‌టీఈడీ మిషన్–01 అనే ఈ చిన్న తరహా రాకెట్‌ను రూపొందించింది. సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని ధనుష్ రాకెట్ కాంప్లెక్స్ నుంచి ఈ ఏడాది మార్చి 22న తొలిసారి దీనిని ప్రయోగానికి సిద్ధం చేశారు. చివర్లో సాంకేతిక లోపంతో వాయిదా వేశారు. మళ్లీ ఏప్రిల్ నెల 6న మరోసారి ప్రయోగానికి సిద్ధమైనప్పటికీ, సాంకేతికపరమైన కారణాలు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో వాయిదా పడింది. వీటన్నింటినీ అధిగమించి మంగళవారం తెల్లవారుజామున 5.45 గంటలకు మరోసారి ప్రయోగానికి పూనుకొన్నారు. 6 గంటల ముందు నుంచి (సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి) కౌంట్‌డౌన్ ప్రారంభించారు. ఆఖర్లో 11 సెకన్లకు ముందు కమాండ్ కంట్రోల్ సిస్టంలో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయోగాన్ని నిలిపివేశారు.తదుపరి ప్రయోగ తేదీని నిర్దిష్టంగా ప్రకటించలేదు.

ఈ సడలింపులు.. 'పచ్చ'సిరాతో!

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ఎన్నికల సంఘం ఉద్దేశపూర్వకంగా ఇచ్చిందని స్పష్టంగా తెలిసిపోతోంది కాబట్టి. గత ఎన్నికల్లో లేని సడలింపుల్ని.. పైగా ఇంకెక్కడా లేని మినహాయింపులను ఇక్కడే అమలుచేయడం.. అది కూడా టీడీపీ చెప్పింది చెప్పినట్లుగా రాష్ట్ర ఎన్నికల సంఘం తలూపుతూ చేయడం చూస్తుంటే.. రాష్ట్రంలో ఎన్నికల సంఘం.. టీడీపీ సంఘంలా వ్యవహరిస్తోందని కాక ఇంకేమనాలి?

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు భిన్నంగా..

నిజానికి.. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫారంపై అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం చేసి, స్టాంప్ లేకపోయినా.. తన పేరు, డిజిగ్నేషన్ వివరాలను చేతితో రాస్తే ఆమోదించాలని గతేడాది జూలై 19న కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) మార్గదర్శకాలు జారీచేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇవే మార్గదర్శకాలు అమలవుతున్నాయి. కానీ.. రాష్ట్రంలో టీడీపీ నేతల విజ్ఞప్తి మేరకు ఈ మార్గదర్శకాలను సడలిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్‌కుమార్ మీనా ఈనెల 25న ఉత్తర్వులు జారీచేశారు. అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం ఉంటే చాలు.. డిజిగ్నేషన్ పూర్తి వివరాలను చేతితో రాయకపోయినా సరే.. ఆ సంతకంపై ఏమైనా అనుమానం వస్తే రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో), జిల్లా ఎన్నికల అధికారి వద్ద ఉన్న సంబంధిత అటెస్టింగ్ అధికారి సంతకంతో సరిపోల్చుకుని పోస్టల్ బ్యాలెట్‌ను పరిగణనలోకి తీసుకునేలా సడలింపు ఇవ్వడంపై రాజకీయ పక్షాలు నివ్వెరపోతున్నాయి. ఎన్నికల సంఘం పచ్చపాతం మరోసారి బహిర్గతమైందని విమర్శిస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు సందర్భంగా ఇది వివాదాలకు దారితీస్తుందని.. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

మరీ ఇంత 'పచ్చ'పాతమా?..

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద ఎన్నికల సంఘం ఏర్పాటుచేసిన అటెస్టింగ్ ఆఫీసర్లు కొంతమంది సీల్ వేయకుండా కేవలం సంతకాలు మాత్రమే చేశారని.. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని తమ ఓట్లను తిరస్కరించకుండా ఆమోదించేలా చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనాకు టీడీపీ నుంచి పలు విజ్ఞాపనలు వచ్చాయి. వాటిని పరిగణనలోకి తీసుకున్న ఆయన.. 2023, జూలై 19న కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలను ఉటంకిస్తూ ఈనెల 25న ఉత్తర్వులు జారీచేశారు. వాటి ప్రకారం.. డిక్లరేషన్ ఫారం మీద అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం, పేరు, హోదా (డిజిగ్నేషన్) పూర్తి వివరాలు తప్పనిసరిగా ఉండాలి. ఇవి ఉండి స్టాంప్ లేకపోయినా వాటిని పరిగణనలోకి తీసుకోవచ్చు. ఈ నిబంధన దేశవ్యాప్తంగా అమలవుతోంది. కానీ.. అటెస్టింగ్ ఆఫీసర్ స్టాంప్ లేకపోయినా.. పేరు, డిజిగ్నేషన్ వివరాలను చేతితో రాయకపోయినా.. సంతకం ఉంటే చాలు.. దానిపై ఏమైనా అనుమానం వస్తే దాన్ని రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా ఎన్నికల అధికారి వద్ద ఉన్న సంబంధిత అటెస్టింగ్ ఆఫీసర్ సంతకంతో సరిపోల్చుకుని పోస్టల్ బ్యాలెట్‌ను పరిగణనలోకి తీసుకోవాలంటూ సడలింపు ఇవ్వడం గమనార్హం.

పోస్టల్ బ్యాలెట్ ఆమోదానికి ఇతర నిబంధనలివీ..

- పోస్టల్ బ్యాలెట్ పేపర్ వెనుక రిటర్నింగ్ ఆఫీసరుగానీ లేదా ఫెసిలిటేషన్ సెంటర్ ఇన్‌ఛార్జి సంతకం తప్పనిసరిగా ఉండాలి.
- బ్యాలెట్ పేపర్ వెనుక సంతకం విషయంలో ఏమైనా సందేహాలొస్తే సీరియల్ నెంబర్ ప్రకారం కౌంటర్ ఫైల్‌ను పరిశీలించి అది నిజమైన బ్యాలెట్ అవునా కాదా అని నిర్ధారించుకోవాలి. ఒకవేళ సందేహం ఉంటే వాటిని తిరస్కరించాలి.
- ఓటరు కవర్–బీ మీద సంతకంలేదన్న కారణంతో కూడా ఓటును తిరస్కరించకూడదు. డిక్లరేషన్ ఫాం–13ఏ ప్రకారం ఓటరును గుర్తించవచ్చు. ఇవికాక.. బ్యాలెట్ పేపర్ ఉండే ఇన్నర్ కవర్ ఫారం–13బీని తెరవకుండానే ఈ సమయాల్లో ఓటును తిరస్కరించవచ్చు.
- కవర్–బీని తెరవగానే, ఓటరు డిక్లరేషన్ ఫారం లేకపోతే, డిక్లరేషన్ ఫారంపై గెజిటెడ్ లేదా అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం లేకపోయినా, ఫారం–13ఏ, ఫారం–13బీలో బ్యాలెట్ సీరియల్ నెంబర్లు వేర్వేరుగా ఉంటే బ్యాలెట్ పేపర్ తెరవకుండానే తిరస్కరించొచ్చు.
- ఈ విధానం అంతా పూర్తయి బ్యాలెట్ పేపరు తెరిచిన తర్వాత.. ఎవరికీ ఓటు వేయకపోయినా.. ఒకరి కంటే ఎక్కువ మందికి ఓటువేసినా.. అనుమానాస్పద బ్యాలెట్ పేపరుగా గుర్తించినా.. బ్యాలెట్ పేపరు చిరిగిపోయినా.. అది నిజమైన బ్యాలెట్ అని నిర్ధారించడానికి అవకాశంలేని సమయంలో.. రిటర్నింగ్ ఆఫీసరు ఇచ్చిన కవర్–బీ లేకపోయినా.. ఓటరు ఎవరో గుర్తించే విధంగా ఏమైనా గుర్తులు, లేక రాతలున్న సందర్భాల్లో తిరస్కరించవచ్చు.

క్లుప్తంగా...

ఎన్టీఆర్ సేవలు తరతరాలకు స్ఫూర్తి

ఎక్స్‌లో ప్రధాని మోదీ



సాక్షి, న్యూఢిల్లీ: దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ ఒక మహనీయుడని ప్రధాని మోదీ కొనియాడారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవడం ఆనందంగా ఉందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంగళవారం తెలుగులో పోస్ట్ చేశారు. 'తెలుగు సినీ రంగంలో విశిష్ట నటుడైన ఆయన ఎంతో దార్శనికత గల నాయకుడు. సినీ, రాజకీయ రంగాలకు ఆయన చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. తెరపై ఆయన ధరించిన పాత్రలను, ఆయన నాయకత్వ పటిమను ఇప్పటికీ తలుచుకుంటారు ఆయన అభిమానులు. ఆయన కలలు కన్న సమాజం కోసం మేము నిరంతరం పనిచేస్తాము' అని మోదీ పేర్కొన్నారు.

త్వరలో ఎన్‌సీసీ విస్తరణ

ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ వీఎం రెడ్డి



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ వీఎం రెడ్డి

ఒంగోలు: నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) విస్తరణకు కేంద్రం నుంచి అనుమతి లభించిందని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల డైరెక్టరేట్ కార్యాలయ పరిధిలోని డిప్యూటీ డైరెక్టర్ వీఎం రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ట్రిపుల్ ఐటీలో ఈనెల 20 నుంచి ప్రారంభమైన ఎన్‌సీసీ 34 (ఎ)బెటాలియన్ క్యాంపును సందర్శించి ఆయన మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యి.. నూతన ప్రభుత్వం చేపట్టగానే ముఖ్యమంత్రి, ముఖ్య కార్యదర్శి తదితరులను కలిసి ఎన్‌సీసీ విస్తరణ ప్రణాళికను వారికి అందించి, దాని అమలుకు అవసరమైన సహకారాన్ని కోరతామన్నారు. ప్రతి జిల్లాలో ఎన్‌సీసీ కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. ప్రస్తుతం 2025 రిపబ్లిక్ దినోత్సవ ప్రదర్శనలో పాల్గొనే ఎన్‌సీసీ క్యాడెట్లను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. గతేడాది ఏపీ, తెలంగాణ రాష్ట్రాల బృందం ద్వితీయస్థానంలో నిలిచిందని, ఈ ఏడాది ప్రథమ స్థానంలో నిలుస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

పది పాసైన వారిని ప్రభుత్వ కాలేజీల్లోనే చేర్పించాలి


ఆ బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలి: కత్తి పద్మారావు



పొన్నూరు: ప్రభుత్వ స్కూళ్లలో పదో తరగతి పాసైన విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనే ఇంటర్మీడియెట్ చేర్పించాలని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపక కార్యదర్శి, కవి డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. ఆ బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించాలని కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ప్రభుత్వానికి, విద్యాశాఖకు లేఖ రాశారు. కార్పొరేట్ కళాశాలల అధ్యాపకులు గ్రామాలకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను తమ కళాశాలల్లో చేర్పించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్ కళాశాలల్లో చేరిన పిల్లల నుంచి ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని, ఫీజులు చెల్లించలేని విద్యార్థులను చీకటి గదిలో పెట్టి వారి మీద ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. ఈ విషయాల పట్ల ప్రభుత్వం తగిన శ్రద్ధ వహించి ముందుగానే ప్రభుత్వ స్కూల్లో టెన్త్ పాసైన విద్యార్థులందరినీ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనే ఇంటర్మీడియెట్ చేర్పించే ఏర్పాట్లు చేయాలన్నారు. నారాయణ, శ్రీచైతన్య వంటి కళాశాలలపై ప్రభుత్వ విజిలెన్స్ ఎందుకు బలంగా లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. హైస్కూళ్లలో ప్రారంభించిన ప్లస్ వన్, ప్లస్ టు గురించి, ఉచిత విద్య, పుస్తకాలు, హాస్టల్, స్కాలర్‌షిప్ తదితర సదుపాయాల గురించి విద్యాశాఖ ఆధ్వర్యాన గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పాసైన ప్రతి విద్యార్థిని ఇంటర్ కూడా ప్రభుత్వ కాలేజీల్లో చేర్పిస్తే తప్పకుండా విద్యా వ్యవస్థలో విప్లవం వస్తుందన్నారు. విద్యావ్యవస్థలో మార్పులు తీసుకువచ్చి హైస్కూల్, కళాశాల విద్యను శక్తివంతం చేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

ఉత్తరాదిలోనూ మోదీకి వ్యతిరేక పవనాలే

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



తిరుపతి కల్చరల్: ఎన్నికల్లో ప్రధాని మోదీ ఓటమి అంచున ఉన్నారని, తాజాగా జరిగిన పోలింగ్‌లో ఉత్తర భారతంలోనూ మోదీకి వ్యతిరేక పవనాలు బలంగా వీచాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. బీజేపీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. మంగళవారం తిరుపతి సీపీఎం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఎత్తేస్తామని చెబుతున్న మోదీ దేశంలో వెనుకబాటు, పేదరికాన్ని దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్లు ఏర్పాటు చేశారన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. జూన్‌లో పింఛన్ల కోసం పడిగాపులు పడేలా చేస్తే క్షమించరాని తప్పిదం అవుతుందని దీనిపై ఈసీ చర్యలు తీసుకోవాలని కోరారు.

తల్లిదండ్రులకే పిల్లల మార్కులు

రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి హోలిస్టిక్ రిపోర్టు కార్డు

సాక్షి, అమరావతి: విద్యార్థి ఒక్క రోజు బడికి రాకపోతే తల్లిదండ్రులకు మెసేజ్ (ఎస్‌ఎంఎస్‌లు)ల ద్వారా తెలియజేస్తున్న పాఠశాల విద్యాశాఖ.. మరో వినూత్న ప్రక్రియను చేపట్టింది. విద్యార్థులు వివిధ పరీక్షల్లో సాధించిన మార్కులను, నెలలో ఎన్నిరోజులు బడికి వచ్చారో చెబుతూ 'హోలిస్టిక్ రిపోర్టు కార్డు' లను తల్లిదండ్రులకు పంపిస్తోంది. ఫార్మేటివ్ (యూనిట్), సమ్మేటివ్ (అర్థ, వార్షిక) అసెస్‌మెంట్స్‌లో విద్యార్థులు సాధించిన మార్కులను నేరుగా తల్లిదండ్రులకే చేరవేస్తోంది. గతంలో వార్షిక పరీక్షల ఫలితాలను మాత్రమే ప్రోగ్రెస్ కార్డుల్లో ఇవ్వగా, ఈ ఏడాది అందుకు భిన్నంగా రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఫోన్లకు హోలిస్టిక్ రిపోర్టు కార్డులను ఎస్‌ఎంఎస్ రూపంలో పంపించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి 9 తరగతుల పిల్లలకు ఈ నూతన విధానం ప్రవేశపెట్టింది. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆధ్వర్యంలో ఐటీ విభాగం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చింది. అన్ని మేనేజ్‌మెంట్స్‌లోని బడుల్లో 9వ తరగతి వరకు చదువుతున్న సుమారు 61.81 లక్షల మంది విద్యార్థుల మార్కులు, బడికి హాజరైన రోజుల సమాచారాన్ని తల్లిదండ్రులకు పంపిస్తున్నారు. ఇప్పటి వరకు 55,71,173 మందికి (90.13 శాతం) ఎస్‌ఎంఎస్‌లు పంపారు.



హోలిస్టిక్ రిపోర్టు కార్డు

పిల్లల ప్రగతి తల్లితండ్రులకు తెలిసేలా..

గతంలో విద్యార్థులు వార్షిక పరీక్షల్లో సాధించిన మార్కులను ప్రోగ్రెస్ రిపోర్టుగా ఏప్రిల్/ మే నెలల్లో పంపించేవారు. అయితే 2023–24 విద్యా సంవత్సరంలో నాలుగు ఎఫ్‌ఏ పరీక్షలు, రెండు ఎస్‌ఏ పరీక్షల్లో సాధించిన మార్కులు, ఎన్ని రోజులు బడికి హాజరయ్యారో కూడా వివరిస్తూ తల్లిదండ్రులకు హోలిస్టిక్ రిపోర్టు కార్డులను వారి ఫోన్ నంబర్లకు ఎస్‌ఎంఎస్ ద్వారా పంపిస్తున్నారు. కార్డులను డౌన్‌లోడ్ చేసుకుని చూసుకోవచ్చు. దీనిద్వారా తమ పిల్లలు ఏ పరీక్షలో ఎన్ని మార్కులు సాధించారు, ఎన్ని రోజులు బడికి వెళ్లారో తల్లిదండ్రులకు తెలుస్తుంది. ఏ సబ్జెక్టులో మార్కులు తక్కువ వచ్చాయో గుర్తించి తల్లిదండ్రులు తప్పనిసరిగా ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, మేనేజ్‌మెంట్లను అడిగేందుకు అవకాశముంటుంది. దీనిద్వారా తల్లిదండ్రుల్లో బాధ్యత పెరుగుతుందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు.

100 శాతం పూర్తిచేసిన ప్రభుత్వ బడులు

విద్యార్థుల మార్కులు, హాజరు వివరాలను పాఠశాల విద్యా శాఖ కమిషనరేట్ వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు రాష్ట్రంలోని ప్రతి పాఠశాల (ప్రాథమిక, ఉన్నత) ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక లాగిన్ ఇచ్చారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత హాజరు, ఎఫ్‌ఏ, ఎస్‌ఏ పరీక్షల్లో సాధించిన మార్కులను ఇందులో నమోదు చేయాలి. ఈ ప్రక్రియను ప్రభుత్వ పాఠశాలలు నూరు శాతం పూర్తి చేయగా, ప్రైవేటు పాఠశాలలు 89 శాతం మాత్రమే నమోదు చేశాయి. బడులు తెరిచేలోగా అన్ని స్కూళ్లు ఈ వివరాలను నమోదు చేయాలని విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది.

డిజీ లాకర్‌లో 8, 9 తరగతుల మార్కులు

ఇప్పటికే డిగ్రీ, ఇంటర్మీడియట్‌తో పాటు పదో తరగతి మార్కుల జాబితాలను 'డిజీ లాకర్'లో నమోదు చేస్తుండగా.. 2023–24 విద్యా సంవత్సరంలో 8, 9 తరగతుల మార్కుల జాబితాలను సైతం డిజీ లాకర్‌లో అందుబాటులో ఉంచారు. బడులు తెరిచాక పేరెంట్స్ కమిటీ సమావేశాల్లో డిజీ లాకర్‌పై అవగాహన కల్పించనున్నారు.

వేగంగా బీసీజీ వ్యాక్సినేషన్

టీబీ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో క్షయ(టీబీ) వ్యాధి నియంత్రణ చర్యల్లో భాగంగా వైద్యశాఖ బాసిల్లస్ కాల్మెట్–గ్వెరిన్ (బీసీజీ) వ్యాక్సిన్‌ను వేగంగా పంపిణీ చేస్తోంది. రాష్ట్రంలోని 12జిల్లాల్లో టీకా పంపిణీని ఈ నెల 12న ప్రారంభించింది. తొలి రెండు వారాల్లోనే 16.98శాతం టీకా పంపిణీ పూర్తిచేసింది. కరోనా వ్యాప్తి సమయంలో అవలంబించిన టీటీటీ (ట్రేసింగ్, టెస్టింగ్, ట్రీట్‌మెంట్) విధానాన్ని టీబీ నియంత్రణలోను వైద్యశాఖ పాటిస్తోంది. ఈ క్రమంలో కరోనా నిర్ధారణ పరీక్షల తరహాలో వీలైనంత ఎక్కువ మందికి టీబీ పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా వైద్యం, మందులు, పౌష్టికాహారం అందిస్తున్నారు. 2025 నాటికి టీబీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పెద్దలకు ఉచితంగా టీకా పంపిణీ చేస్తున్నారు.

హైరిస్క్ వర్గాలకు...

క్షయ వ్యాధి బారినపడే అవకాశం ఉన్న హైరిస్క్ వ్యక్తులను గుర్తించి వారికి టీకా పంపిణీ వేస్తున్నారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, టీబీతో బాధపడుతున్న వ్యక్తుల కుటుంబ సభ్యులు, టీబీ చరిత్ర కలిగిన వారితోపాటు ధూమపానం చేసేవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, చ.మీ.కు 18కిలోల కంటే తక్కువ బాడీ మాస్ ఇండెక్స్ కలిగిన వ్యక్తులు.. ఇలా ఆరు వర్గాలకు చెందిన వారికి తొలి దశలో టీకా పంపిణీ చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు, అన్నమయ్య, చిత్తూరు, గుంటూరు, కృష్ణా, నంద్యాల, పల్నాడు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీ సత్యసాయి, విశాఖపట్నం, విజయనగరం, వైఎస్సార్ జిల్లాల్లో ఆరు వర్గాలకు



చెందినవారు 50లక్షల మంది వరకు ఉన్నట్టు వైద్యశాఖ ప్రాథమికంగా నిర్ధారించింది. తొలి మూడు నెలల్లో 20లక్షల మందికి టీకా వేయాలని లక్ష్యం కాగా, రెండు వారాల్లోనే 16.98 శాతం 3,39,640 మందికి పూర్తిచేశారు. అత్యధికంగా విజయనగరం జిల్లాలో 45,891మందికి, నెల్లూరులో 38,602మందికి, వైఎస్సార్ జిల్లాలో 37,995మందికి టీకాలు వేశారు. ప్రస్తుతం ఎంపికచేసిన 12 జిల్లాల్లో ప్రతి గురువారం బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నారు.

ఇప్పటికే పిల్లలకు టీకా

ఇప్పటికే వైద్యశాఖ పిల్లలకు సాధారణ టీకాలతోపాటు టీబీకి సంబంధించిన టీకాను వేస్తోంది. వైద్యశాఖ 2022లో ఉచితంగా వ్యాక్సినేషన్ ప్రారంభించింది. తొమ్మిది నెలల్లోపు పిల్లలకు మూడు డోసులుగా ఈ టీకాను వేస్తున్నారు. పుట్టిన ఆరు వారాలలోపు ఒక డోసు, 14 వారాల్లోపు రెండో డోసు, చివరిగా 9 నెలల వయసులోపు మూడో డోసు వేస్తున్నారు. మూడు డోసుల టీకా వేసుకున్న పిల్లలకు న్యుమోనియా నుంచి రక్షణ లభిస్తుందని వైద్యవర్గాలు చెబుతున్నాయి.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు చేశాం

- కౌంటింగ్ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తాం
- ప్రజలకు ఎన్నికల కమిషన్‌పై నమ్మకం కల్పిస్తాం
- సీఈవో ముఖేష్‌కుమార్‌మీనా, డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా

నరసరావుపేట/బాపట్ల: ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. మంగళవారం పల్నాడు జిల్లా నరసరావుపేటతో పాటు బాపట్లలో ఆయన పర్యటించారు. నరసరావుపేట మండలం కాకాని సమీపంలోని జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన మీనా జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యాత్మక జిల్లా అయినా పల్నాడులో రీపోలింగ్‌కు అవకాశం లేకుండా ఎన్నికలు నిర్వహించారంటూ అధికారులను అభినందించారు. వెబ్‌కాస్టింగ్ వంటి ఏర్పాట్లు చేసినా కొన్ని బూత్‌లలో జరిగిన ఘటనలు దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించటంతో కేంద్ర ఎన్నికల కమిషన్ పలు కఠిన చర్యలు తీసుకుందని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించి.. ఎన్నికల కమిషన్‌పై ప్రజలకు నమ్మకం తీసుకొస్తామన్నారు. అవాంఛనీయ ఘటనలు జరిగితే సంబంధిత రిటర్నింగ్ అధికారి వెంటనే స్పందించాలని ఆదేశించారు.

మద్యం అమ్మకాలను నిషేధించాలి

డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా మాట్లాడుతూ.. జూన్ 3, 4, 5 తేదీల్లో మద్యం అమ్మకాలను నిషేధించాల్సిన అవసరం ఉందన్నారు. అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ శ్రీకేశ్ మాట్లాడుతూ.. పారదర్శకంగా ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు 700 మందికి పైగా కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లతో పాటు ఇతర సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఎస్పీ మలికా గర్గ్ మాట్లాడుతూ.. కౌంటింగ్ సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 1,196 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఏడు ఈవీఎంలు ధ్వంసం చేసిన కేసుల్లో 59 మందిని అరెస్టు చేశామని చెప్పారు. సమావేశంలో పోలీస్ అధికారులు గోపినాథ్ జెట్టి, సర్వశ్రేష్ఠ త్రిపాఠి, శ్రీకాంత్, జేసీ శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పల్నాడు జిల్లా కాకాని వద్ద కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను మీనాకు, డీజీపీకి వివరిస్తున్న కలెక్టర్

ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించొద్దు

అలాగే బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ కేంద్రాల్లోని ఏర్పాట్లను సీఈవో ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం పరిశీలించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ సీహెచ్ శ్రీధర్, ఆర్‌వోలతో మీనా సమావేశమయ్యారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన పాస్‌లున్న వారినే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని ఆయన ఆదేశించారు. సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి అనుమతించవద్దని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, ఆర్‌వోలు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై సడలింపులు ఇక్కడే ఎందుకు?

- దేశవ్యాప్తంగా ఒక విధానముంటే.. ఏపీలో మరో విధానమా?
- ఇది నిబంధనలకు విరుద్ధం.. పైగా గొడవలకు ఆస్కారం ఉంది
- మాజీ మంత్రి పేర్ని నాని

సాక్షి, అమరావతి: కేంద్ర ఎన్నికల సంఘం చేయని సడలింపులు ఏపీలోనే ఎందుకని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రశ్నించారు. పోస్టల్ బ్యాలెట్‌పై దేశవ్యాప్తంగా ఒక విధానం ఉంటే.. ఒక్క ఏపీలోనే మరో విధానమా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోస్టల్ బ్యాలెట్ నిబంధనల సడలింపుపై వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఆక్షేపిస్తోందని తెలిపారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నేతలు మంత్రి మేరుగు నాగార్జున, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు పేర్ని నాని, మద్దాళి గిరి, మాజీమంత్రి రావెల కిషోర్‌బాబు, పార్టీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నారాయణమూర్తితో కూడిన ప్రతినిధి బృందం మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం సమర్పించింది. అనంతరం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

ఇదెక్కడి న్యాయం

పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫారంపై అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం, స్టాంప్ లేదన్న కారణంతో తిరస్కరించొద్దు. అటెస్టింగ్ ఆఫీసర్ సంతకంతో పాటు తన డిజిగ్నేషన్ పూర్తి వివరాలను చేతితో రాసి ఉన్న వాటిని కూడా తిరస్కరించొద్దని కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. కానీ, టీడీపీ నేతల విజ్ఞప్తి మేరకు అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం ఉంటే చాలు, దానిని రిటర్నింగ్ ఆఫీసర్ వద్ద ఉన్న, సంబంధిత అటెస్టింగ్ ఆఫీసర్ వద్ద ఉన్న వాటితో సరిపోల్చుకుని నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను సడలించింది. దీనిపై వైఎస్సార్‌సీపీ అభ్యంతరం వ్యక్తంచేస్తోంది. ఇది నిబంధనలకు విరుద్ధం.



ఇదెక్కడి న్యాయం? దేశంలో ఎక్కడా లేనిది ఇక్కడే ఎందుకు?

ఈసీ సడలిస్తూ ఇచ్చిన ఆదేశాలు గొడవలకు దారితీసే అవకాశముంది. ఈ నిబంధనలవల్ల ఓటు గోప్యత ఉండదు. ఏజెంట్లు అభ్యంతరం తెలిపితే ఘర్షణలకు దారితీస్తుంది. ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా చెప్పని నిబంధనలను ఎలా అమలు చేస్తారని ఈసీని ప్రశ్నించాం. దేశంలో ఎక్కడా లేనిది ఇక్కడే ఎందుకు? ఈ నిబంధనలపై పునరాలోచించాలని కోరాం. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపుపై సీఈఓ ఇచ్చిన ప్రత్యేక మార్గదర్శకాలపై అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాం. ఏ రాష్ట్రంలో లేనటువంటి వెసులుబాటు ఈ రాష్ట్రంలోనే ఎందుకు? ఒక పార్టీ కోరగానే ఇలాంటి గైడ్‌లైన్స్ ఎలా ఇస్తారు? ఎక్కడా లేని సర్క్యులర్ ఇవ్వడం ఎంతవరకు సబబు? ఈ నిర్ణయంపై పునరాలోచన చేయాలి.

ఓటమి భయంతోనే అరాచకాలు

మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. ఓటర్లపై టీడీపీ నేతలు దాడులుచేస్తే ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా ఈ రాష్ట్రంలో ఆదేశాలిచ్చారన్నారు. నిబంధనలను పాతరేసినట్లుగా ఉందని.. వెంటనే ఆ ఆదేశాలు ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం స్పెసిమన్ సంతకం ద్వారా ఆమోదించడం సరికాదన్నారు. ఇక వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమనే భయంతో పోలింగ్ రోజు టీడీపీ అరాచకాలకు తెగబడిందని.. కౌంటింగ్ కూడా సక్రమంగా జరగకూడదని కుట్ర పన్నిందని తెలిపారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా టీడీపీ కుట్రలకు తెరలేపుతోందని.. ఈసీ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విభజన చట్టంలోని 90% అంశాలు అమలు కాలేదు



మాట్లాడుతున్న వీవీఆర్ కృష్ణంరాజు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): రాష్ట్ర విభజన చట్టంలోని అంశాల్లో ఇంకా 90శాతం అమలు కాలేదని, అందువల్ల హైదరాబాద్‌ను మరో 10 ఏళ్లపాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని కోరుతూ ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విభజన చట్టం అమలుకాకుండా తెలంగాణ ప్రభుత్వం అడుగడుగునా అడ్డుపడుతోందన్నారు. విభజన చట్టంలోని 9, 10 షెడ్యూళ్లలో పేర్కొన్న 196 ఆస్తుల విభజన జరక్కుండా తెలంగాణ అడ్డుకుంటోందని ఆరోపించారు. ఈ ఆస్తుల విలువ ప్రస్తుతం రూ.4లక్షల కోట్ల వరకు ఉంటుందన్నారు. 2014–17 మధ్య తెలంగాణకు ఆంధ్రప్రదేశ్ కోట్లాది యూనిట్ల విద్యుత్ సరఫరా చేసిందని తెలిపారు. ఇందుకు సంబంధించిన చార్జీలతోపాటు ఆలస్యం చేసినందుకు పరిహారంగా మొత్తం రూ.6,755 కోట్లను ఏపీకి చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినప్పటికీ తెలంగాణ పట్టించుకోలేదన్నారు. దీనిపై కోర్టుకు వెళ్లినా తెలంగాణ కేసు ముందుకు సాగకుండా అడ్డుపడుతోందన్నారు. జూన్ 2తర్వాత రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మారబోతుందని, అందువల్ల హైదరాబాద్‌ను మరో పదేళ్లు ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సామాజికవేత్త, సన్మూర్తి సంస్థ నిర్వాహకులు తిలక్ పట్నాయక్ పాల్గొన్నారు.

వేగంగా ఎంఎస్‌ఎంఈల అభివృద్ధి

2024-25లో ఎంఎస్‌ఎంఈలకు రూ.88,481.62 కోట్లు అవసరం

ఇందులో పెట్టుబడి కింద రూ.55,577.47 కోట్లు

- వర్కింగ్ క్యాపిటల్‌కు రూ.32,904.15 కోట్లు
- ఎంఎస్‌ఎంఈలకు పలు ప్రోత్సాహకాలు అందిస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం
- జగనన్న బడుగు వికాసంతో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- నైపుణ్య విశ్వవిద్యాలయం, బహుళ నైపుణ్య కేంద్రాల ఏర్పాటు
- ఎంఎస్‌ఎంఈ క్లస్టర్ డెవలప్‌మెంట్‌తో ఉత్పాదకత, పోటీతత్వం పెంపు
- నాబార్డు స్టేట్ ఫోకస్ పత్రం వెల్లడి

సాక్షి, అమరావతి: ఐదేళ్లుగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, చేపట్టిన సంస్కరణలతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ముఖ్యంగా కరోనా సంక్షోభ సమయంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఇచ్చిన చేయూత ఎంఎస్‌ఎంఈ రంగాన్ని తిరిగి నిలబెట్టడమే కాకుండా, మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు దోహదపడింది. రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈ రంగం అభివృద్ధిని నాబార్డు స్టేట్ ఫోకస్ పత్రం – 2024–25 సమగ్రంగా వివరించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.13,360.15 కోట్ల పెట్టుబడులతో 55,761 యూనిట్లు ఏర్పాటయ్యాయని, 2,27,027 మందికి ఉపాధి కల్పించిందని పత్రం తెలిపింది. ఈ తరహా యూనిట్లు పెరుగుతుండటంతో 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఎంఎస్‌ఎంఈ రంగానికి సుమారు రూ.88,481.62 కోట్ల రుణాలు అవసరమవుతాయని ఫోకస్ పత్రంలో పేర్కొంది. ఇందులో పెట్టుబడి రుణం రూ.55,577.47 కోట్లు కాగా వర్కింగ్ క్యాపిటల్‌కు రూ.32,904.15 కోట్లు అవసరమని ఫోకస్ పత్రం స్పష్టం చేసింది. ఈమేరకు జిల్లాలవారీగా అవసరమయ్యే రుణాలను వివరించింది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం

ఆంధ్రప్రదేశ్‌లో ఎంఎస్‌ఎంఈ రంగం ఉద్యోగాల కల్పనకు ఉత్ప్రేరకంగా ఉందని నాబార్డు స్టేట్ ఫోకస్ పత్రం – 2024–25లో పేర్కొంది. ఆహారం, ఖనిజ, నిర్మాణ సామగ్రి., డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్, ఫ్యాబ్రికేటెడ్ మెటీరియల్స్, ట్రేడింగ్, సర్వీస్ సెక్టార్ తదితర రంగాలకు చెందిన సూక్ష్మ, చిన్న పరిశ్రమలు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని, సమగ్ర ఫ్రేమ్‌వర్క్ రూపొందించిందని, ఈ పరిశ్రమలు ప్రపంచవ్యాప్తంగా పోటీపడేలా విధానాలు, ప్రోత్సాహకాలను అందిస్తోందని తెలిపింది. మౌలిక సదుపాయాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం, స్కిల్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్‌తో పాటు ఖాయిలా పడిన పరిశ్రమల పునరుద్ధరణకు మద్దతు ఇస్తోందని వివరించింది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు జగనన్న బడుగు వికాసం పేరుతో ప్రత్యేక ప్రోత్సాహకాలను ఇస్తోందని తెలిపింది. నైపుణ్య విశ్వవిద్యాలయంతో పాటు బహుళ నైపుణ్య కేంద్రాల ఏర్పాటు, ఎంఎస్‌ఎంఈ క్లస్టర్ డెవలప్‌మెంట్‌తో ఉత్పాదకతతో పాటు పోటీతత్వం పెంపునకు చర్యలు తీసుకున్నట్లు వివరించింది. వైఎస్సార్ నవోదయం కింద రుణాలను వన్‌టైమ్ రీస్ట్రక్చరింగ్‌తో ఎంఎస్‌ఎంఈలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని, అర్హత కలిగిన ఎంఎస్‌ఎంఈల రుణాల ఆడిటర్ ఫీజులను తిరిగి చెల్లిస్తోందని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ 33.87 లక్షల ఎంఎస్‌ఎంఈలతో దేశంలోనే 7వ స్థానంలో ఉందని పేర్కొంది. ఆర్టిజన్ పార్కులు, ప్రొడక్షన్ కమ్ సేల్స్ అవుట్‌లెట్‌లను ఏర్పాటు చేయాలని, నేత కార్మికుల కోసం ఇన్ఫర్మేషన్ కమ్ సేల్స్ పోర్టల్‌ను ప్రారంభించాలని, చిన్న పట్టణ కమ్యూనిటీల కోసం సాంకేతికతతో నడిచే ఈ–కామర్స్‌ను ప్రోత్సహించాలని, ఉపాధి కల్పన కోసం పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని, క్లస్టర్‌లు, మెగా క్లస్టర్‌లను సమగ్రంగా నిర్వహించేందుకు అవసరమైన మద్దతు ఇవ్వాలని నాబార్డు ఫోకస్ పత్రం సూచించింది.

2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలవారీగా ఎంఎస్‌ఎంఈ రంగం రుణం ఆవశ్యకత ఇలా..

జిల్లా	రుణం (రూ.కోట్లలో)
శ్రీ సత్యసాయి	2,163.87
అనంతపురం	3,352.92
నెల్లూరు	3,713.45
శ్రీకాకుళం	1,482.10
ప్రకాశం	2,920.17
పల్నాడు	2,138.30
బాపట్ల	3,857.33
గుంటూరు	7,915.62
అల్లూరి సీతారామరాజు	652.27
అనకాపల్లి	4,390.43
విశాఖపట్నం	11,494.77
కృష్ణా	4,913.77
ఎన్టీఆర్	8,193.87
కర్నూలు	2,060.91
నంద్యాల	1,259.16
చిత్తూరు	3,407.45
తిరుపతి	5,055.71
పశ్చిమ గోదావరి	4,234.68
ఏలూరు	2,240.27
తూర్పు గోదావరి	2,915.65
అంబేడ్కర్ కోనసీమ	1,908.69
కాకినాడ	3,009.96
అన్నమయ్య	1,623.41
వైఎస్సార్	2,298.94
పార్వతీపురం మన్యం	378.20
విజయనగరం	899.60

వన సంపదకు పెద్ద ఆపద!

- ప్రపంచవ్యాప్తంగా వన్యప్రాణుల, వృక్ష జాతుల అక్రమ రవాణా
- 80 శాతానికి పైగా దేశాల్లో వన్యప్రాణుల అక్రమ వాణిజ్యం
- నాలుగు వేలకు పైగా జంతు, వృక్షజాతుల అక్రమ రవాణా
- వరల్డ్ వైల్డ్ లైఫ్ క్రైమ్ రిపోర్ట్ 2024 నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: ప్రకృతికి మనిషి హాని తలపెడుతున్నాడు. తద్వారా తన ఉనికిని తానే దెబ్బతీసుకుంటున్నాడు. జంతుజాలాన్ని బతకనివ్వడం లేదు. మనిషి స్వార్థం వృక్షజాలాన్నీ వదలడం లేదు. తత్ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా వన్యప్రాణులు అంతరించిపోతున్నాయి. వృక్షజాలమూ బోసిపోతోంది. అక్రమ వ్యాపారుల దుశ్చర్యలకు పర్యావరణం సమతౌల్యాన్ని కోల్పోతోంది. 2015–2021 మధ్య కాలంలో 162 దేశాల్లో యథేచ్ఛగా జంతు, వృక్షజాతుల అక్రమ వాణిజ్యం జరిగినట్టు ఐక్యరాజ్య సమితి నివేదిక చెబుతోంది. దాదాపు 4 వేలకు పైగా జంతు, వృక్షజాతులు నిత్యం అక్రమ రవాణాలో పట్టుబడుతున్నట్టు ఇటీవల ఐక్యరాజ్య సమితి ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ విడుదల చేసిన వరల్డ్ వైల్డ్ లైఫ్ క్రైమ్ రిపోర్ట్–2024లో పేర్కొంది. వీటిల్లో సుమారు 3,250 రకాలు అంతరించిపోతున్న జాతుల్లో ఉండటం కలవరపెడుతోంది. ఫ్యాషన్ ఉత్పత్తులు, గృహోపకరణాలు, అలంకరణ వస్తువుల తయారీ, ఔషధాల కోసం చట్ట విరుద్ధంగా అడవుల్లోని జీవజాలాన్ని మట్టుబెడుతున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. ఖడ్గమృగం, దేవదారు వృక్షాలు అక్రమ వ్యాపారానికి ఎక్కువగా అంతరించిపోయినట్లు తేల్చింది. బ్లాక్ మార్కెట్‌లో ఖడ్గమృగం కొమ్ము 29 శాతం డిమాండ్‌తో అగ్ర స్థానంలో నిలిచింది. ఆ తర్వాత పాంగోలిన్ స్కేల్స్ 28 శాతం, ఏనుగు దంతాలు 15 శాతంగా ఉన్నాయి.

అక్రమ రవాణాకు తెగటారిపోతున్న జంతు, వృక్షజాలం

అక్రమ వ్యాపారానికి బలవుతున్న జంతు జాతుల్లో ఏనుగులు (6 శాతం), ఈల్స్ (5 శాతం), మొసళ్లు (5 శాతం), చిలుకలు, కాకాటూలు (2 శాతం), సింహాలు, పులుల వంటి ఇతర మాంసాహార జంతువులు (2 శాతం), తాబేళ్లు (2 శాతం), పాములు (2 శాతం), సీహార్స్ చేపలు (2 శాతం) ఉన్నాయి. అక్రమ రవాణాలో ధూపం, పరిమళ ద్రవ్యాలు, కలప, ఔషధాల వినియోగానికి దేవదారు, మహోగని, హోలీ వుడ్, గుయాకం వృక్ష జాతులు యథేచ్ఛగా నరికి వేస్తున్నారు. మార్కెట్‌లో వీటి వాటా 47 శాతంగా ఉంది. ఇంకా రోజ్‌వుడ్ 35 శాతం, ఔషధ మొక్కలు అగర్వుడ్, రామిన్, యూకలిప్టస్ 13 శాతంగా ఉన్నాయి. సముద్ర జీవులకు ఆవాసాన్ని కల్పించడంతో పాటు తీరప్రాంతాన్ని కోత నుంచి రక్షించడంలో కీలక పాత్ర పోషించే పగడపు దిబ్బలనూ అక్రమ వ్యాపారులు తొలిచేస్తున్నారు. అక్రమ రవాణాలో ఈ పగడాల వాటా 16 శాతంగా ఉంటోంది. గత దశాబ్దంలో ఏనుగు దంతాలు, ఖడ్గమృగం కొమ్ముల వేట తగ్గినట్టు నివేదిక చెబుతోంది. మార్కెట్‌లోనూ ధరలు క్షీణించినట్టు తెలిపింది. కరోనా కాలంగా చైనా మార్కెట్లు మూసివేయడంతో ఇది జరిగి ఉండవచ్చని భావిస్తోంది.

దేశ సరిహద్దుల్లో అక్రమ రవాణా గుర్తింపు

భారత్‌లోనూ విమానాశ్రయాలు, ఓడరేవులు, దేశ సరిహద్దు రాష్ట్రాలైన మిజోరం, మణిపూర్‌లలో ఎక్కువగా వన్యప్రాణుల అక్రమ రవాణాను గుర్తించారు. స్మగ్లింగ్ ఇన్ ఇండియా రిపోర్టు 2022–23 ప్రకారం 1,652 క్షీరదాలు, పక్షులు, సరీసృపాలు, ఉభయచర జాతులను స్వాధీనం చేసుకున్నట్టు డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ పేర్కొంది. వీటిల్లో 40 శాతానికి పైగా అత్యంత ప్రమాదంలో ఉన్న జాతులుగా పేర్కొంది. సజీవంగా ఉన్న జంతువులు ముఖ్యంగా పెంపుడు జంతువులకు విదేశాల్లో డిమాండ్ పెరుగుతున్నందుకు దేశంలో అక్రమ వ్యాపారం పెరిగినట్టు వన్య ప్రాణుల నేర నియంత్రణ నిపుణులు చెబుతున్నారు.



దేని మీదా ఆరాటం, తపన లేని మనసు...
మలినరహితమైన ప్రజ్ఞ, సమతలను పొందుతుంది.
– బుద్ధదాస భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 29 మే 2024

ఈ పాపం ఎవరిది?

గత వారం జరిగిన అగ్ని ప్రమాదాలు దేశాన్ని ఉలిక్కిపడేలా చేశాయి. ఇరవై నాలుగు గంటల్లో వేర్వేరు చోట్ల సంభవించిన ఈ ప్రమాదాల్లో అభం శుభం తెలియని పలువురు చిన్నారులతో సహా 40 మంది ప్రాణాలు కోల్పోవడం పెను విషాదం. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఓ గేమింగ్ జోన్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 33 మంది, అదే రాత్రి తూర్పు ఢిల్లీలోని పిల్లల ఆసుపత్రిలోని ఘోర ప్రమాదంలో నవజాత శిశువులు ఏడుగురు దుర్మరణం పాలైన ఘటనలు సున్నిత మనస్కుల్ని చాలా కాలం వెంటాడనున్నాయి. ఆక్సిజన్ సిలిండర్ల పేలుడు సంభవించిన ఆ ఆసుపత్రి లైసెన్స్ గడువు రెండు నెలల క్రితమే తీరిపోతే, రాజ్‌కోట్ గేమింగ్ జోన్ నిరభ్యంతర పత్రమే (ఎన్‌ఓసీ) లేకుండానే యథేచ్ఛగా నడుస్తుండడం మన వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది. నిబంధనల అమలులో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం మరోసారి బహిర్గతమైంది. అగ్నిప్రమాద నివారణ నిబంధనలు, భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరంపై మరోసారి చర్చ మొదలైంది.

తాజా ఘటనల నేపథ్యంలో – పాతికేళ్ళ పైచిలుకు క్రితం 1997లో ఢిల్లీలో జరిగిన ఉపహార్ సినిమా హాలు ప్రమాదం మొదలు 2004లో 90 మంది పాఠశాల విద్యార్థులను బలి తీసుకున్న కుంభకోణం అగ్నిప్రమాదం దాకా పాత పీడకలలు మళ్ళీ గుర్తుకొస్తున్నాయి. గతం నుంచి మనం ఏం పాఠాలు నేర్చుకున్నామని నిలదీస్తున్నాయి. వాణిజ్య సంస్థల నుంచి నివాస ప్రాంగణాల దాకా అన్ని చోట్లా ఇవాళ ప్రాథమిక భద్రతా ఏర్పాట్లు మృగ్యమైపోతున్నాయి. అనుకోనిది ఏం జరిగినా పదుల కొద్దీ ప్రాణాలను ప్రమాదంలో పెడుతున్నాయి. మే 26 నాటి ప్రమాదంలో శిక్షణ పొందిన వైద్య సిబ్బంది కానీ, ప్రమాద భద్రతా సర్టిఫికెట్ కానీ, చివరకు అగ్ని ప్రమాద నివారణ సామగ్రి కానీ, సరైన నిష్క్రమణ మార్గాలు కానీ లేకుండానే ఢిల్లీ లాంటి చోట ఒక ఆసుపత్రి నడుస్తోందంటే ఏమనాలి? రాజ్‌కోట్ గేమింగ్ జోన్‌లో ఎలాంటి కనీస అగ్నిప్రమాద భద్రతా లేకుండా దాదాపు రెండంతస్తుల భవనం ఎత్తున రేకులతో పెద్ద నిర్మాణం చేపడితే అధికారులు ఏం చేస్తున్నట్టు? ఆ ప్రాంగణంలో 2 వేల లీటర్ల పెట్రోల్, లెక్కకు మిక్కిలి టైర్లు నిల్వ చేస్తుంటే అడ్డుచెప్పే నాథుడు లేడా?

ఒక్క ఢిల్లీలోనే గత రెండేళ్ళ పైచిలుకు కాలంలో 66 ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు జరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. దీన్నిబట్టి, అగ్నిప్రమాద నివారణ నిబంధనలు ఎంతగా ఉల్లంఘనకు గురవుతున్నాయో స్పష్టమవుతోంది. సాక్షాత్తూ మన దేశ రాజధానిలోనే ఇలా ఉంటే, దేశంలోని ఇతర ప్రాంతాల్లో పరిస్థితిని ఇట్టే ఊహించుకోవచ్చు. మన దేశంలో ఆరోగ్య సంరక్షణ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు ఇప్పటికీ అంతంత మాత్రమే. మూడేళ్ళ క్రితం దేశంలో కరోనా మహమ్మారి విజృంభించి, డెల్టా వేరియంట్ విలయ తాండవం చేసినప్పుడు ఆ నిష్ఠురసత్యం మన కళ్ళ ముందు కనిపించింది. ప్రభుత్వ రంగంలో ఆరోగ్య రంగం అలా కునారిల్లుతుండడం వల్లే, ఆ లోటును పూడ్చడానికి ప్రైవేట్ రంగం అవసరం ఉంటోంది. జనం ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, తదితరాలపై ఆధారపడడం ఎక్కువవుతోంది. సరిగ్గా ఈ కారణాల రీత్యానే ప్రైవేట్ ఆరోగ్యరక్షణ రంగంలో భవనాల మొదలు నాణ్యమైన మందులు, సేవల వరకు అన్నింటిలో కనీసపాటి భద్రతా ప్రమాణాలు తప్పనిసరి. కానీ, చాలాచోట్ల అవి హుళక్కి. తాజా ఘటనలే అందుకు తార్కాణం.

నిజానికి, మన దేశంలో అగ్నిప్రమాదాల నుంచి భద్రతకు కీలకమైన ప్రమాణంగా జాతీయ నిర్మాణ నిబంధనావళి (ఎన్‌బీసీ) ఉంది. 1970లోనే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) దీన్ని ప్రచురించింది. 2016లో సైతం దాన్ని నవీకరించారు. అగ్నిప్రమాద నివారణ అనేది రాష్ట్ర జాబితాలోని అంశమైనా, అన్ని రాష్ట్రాలూ దీన్ని పాటించడం తప్పనిసరి. ఇవి కాక స్థానిక భవననిర్మాణ చట్టాల్లోనూ కావాల్సినన్ని కఠిన నియమ నిబంధనలున్నాయి. అయితే, అవి తరచూ ఉల్లంఘనకు గురవుతున్నాయి. తాజా ప్రమాదాల్లోనూ అదే జరిగింది. ఆ మాటకొస్తే, గడచిన 2022లోనే మన దేశంలో 7500 పైగా అగ్నిప్రమాదాలు జరిగాయని తాజా నివేదిక. వాటిలో కనీసం 7435 మంది మరణించినట్టు ప్రమాద మరణాలు, ఆత్మహత్యలపై తాజా నివేదిక మాట. నిన్నటి ఢిల్లీ ప్రమాదంలో సైతం అగ్నిమాపక సిబ్బంది వేగంగా స్పందించి, పక్కనున్న భవనం నుంచి నిచ్చెన ఎక్కి, ఆసుపత్రి వెనకవైపు నుంచి వెళ్ళబట్టి కనీసం అయిదుగురు శిశువుల్ని ఆఖరు క్షణంలో కాపాడగలిగారు. లేదంటే ఏమిటి పరిస్థితి? అందుకే, ఇది ప్రభుత్వ యంత్రాంగం అంతటికీ మరోసారి మేలుకొలుపు.

గుజరాత్ లాంటి చోట్ల నిబంధనల్లోని లోపాలను అడ్డం పెట్టుకొని, అహ్మదాబాద్, గాంధీనగర్ సహా అనేకచోట్ల చట్టవిరుద్ధంగా వినోద కార్యకలాపాల వసతులు పుట్టగొడుగుల్లా మొలుస్తున్నాయి. తాత్కాలిక నిర్మాణాలతో భద్రతా ప్రమాణాలను తుంగలో తొక్కి, ప్రాణాలకే ముప్పు తెస్తున్నాయి. దీన్ని అరికట్టాలి. తప్పులు జరిగినప్పుడు సంబంధిత శాఖల అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడం పరిష్కారం కాదు. కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. మనుషుల ప్రాణాలను తృణప్రాయంగా తీసుకొని కొందరు సాగిస్తున్న దుర్మార్గ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలి. ఎవరినీ ఉపేక్షించేది లేదనే సంకేతాలు మాటల్లోనే కాదు చేతల్లోనూ చూపాలి. ప్రమాదాల నివారణకు సమర్థ, ప్రామాణిక చర్యల ప్రణాళికను అమలుచేయాలి. దీనికి ముందు రాజకీయ నేతల చిత్తశుద్ధి అవసరం. ఆపైన అలాంటి వసతులనే ఎంచుకోవడంలో సామాన్యుల అప్రమత్తత కీలకం. దేశవ్యాప్తంగా అధికారులు రంగంలోకి దిగి, చర్యలు చేపట్టేందుకు ప్రమాద భద్రతపై సత్వరమే జాతీయ స్థాయి ఆడిట్ జరిపితే మేలు. నేతల సంతాపాలు, నష్టపరిహారాలు మనుషుల ప్రాణాల్ని వెనక్కి తీసుకురాలేవు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
వైశాఖ మాసం, **తిథి:** బ.షష్ఠి ప.1.18 వరకు, తదుపరి సప్తమి
నక్షత్రం: శ్రవణం ఉ.8.41 వరకు, తదుపరి ధనిష్ఠ
వర్జ్యం: ప.12.27 నుండి 1.58 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.32 నుండి 12.24 వరకు, **అమృతఘడియలు:** రా.9.31 నుండి 11.02 వరకు.

సూర్యోదయం : 5.29
సూర్యాస్తమయం: 6.25
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఇజ్రాయెల్‌పై కొత్త ఒత్తిళ్లు

పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తూ కొత్తగా నార్వే, స్పెయిన్, ఐర్లాండ్ ప్రకటన చేయడం ఇజ్రాయెల్ మీద ఒత్తిడిని పెంచింది. ప్రస్తుతం రఫా మీద భీకర దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ ఇప్పటివరకూ సుమారు 36,000 మంది పాలస్తీనియన్ల మరణానికి కారణమైంది. అంతర్జాతీయ నేర న్యాయస్థానం ప్రాసిక్యూటర్ కరీం ఖాన్ ఏకంగా గాజా నేరాలపై విచారణ కోసం నెతన్యాహూకు అరెస్టు వారెంట్లు జారీ చేయవలసిందిగా కోర్టుకు ప్రతిపాదించారు. నిరుడు అక్టోబర్ 7న హమాస్ మిలిటెంట్ల దాడిలో సుమారు 1200 మంది యూదులు మృతి చెందడానికి ప్రతీకారంగా తమ ఆత్మ రక్షణ కోసం హమాస్‌ను పూర్తిగా నిర్మూలించటం తమ లక్ష్యమనీ, తమను నిందించవలసింది లేదనీ ఇజ్రాయెల్ వాదిస్తున్నది. దీన్ని ప్రపంచం నిరాకరిస్తున్నది.

విశ్లేషణ



టంకశాల అశోక్

పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తున్నట్లు మూడు యూరోపియన్ రాజ్యాలు ఈ నెల 22న ప్రకటించటంతో ఇజ్రాయెల్‌కు కొత్త చిక్కులు మొదలవుతున్నాయి. అమెరికా ఒత్తిళ్లను సైతం తోసిపుచ్చి నార్వే, స్పెయిన్, ఐర్లండ్‌లు ఈ ప్రకటన చేయటం గమనార్హం. పైగా వీటిలో నార్వే, స్పెయిన్ నాటో సభ్య దేశాలు. పాలస్తీనాను ప్రపంచంలో ఇప్పటికే 143 దేశాలు గుర్తించినందున ఆ జాబితాలో ఈ మూడు కూడా చేరటం వల్ల సాధారణంగానైతే విశేషం ఉండదు. కానీ ఇజ్రాయెల్ సైన్యం గాజాలో గత ఆరు మాసాలుగా సాగిస్తున్న మారణహోమం పట్ల ప్రపంచ వ్యాప్తమైన తీవ్ర నిరసనల మధ్య సైతం అమెరికన్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు అడుగడుగునా మద్దతునిస్తున్న స్థితిలో, ఈ మూడు దేశాల ప్రకటనకు తగిన ప్రాముఖ్యత ఏర్పడుతున్నది.

వీరి నిర్ణయంతో ఇజ్రాయెల్‌పై కలిగిన ఒత్తిడికి రుజువు కొద్ది గంటలలోనే కనిపించింది. నార్వే, ఐర్లండ్, స్పెయిన్‌ల నుంచి తమ రాయబారులను నెతన్యాహూ ప్రభుత్వం వెనక్కి రప్పించింది. తమ రాజధాని టెల్ అవీవ్‌లో గల ఆ మూడు దేశాల రాయబారులను పిలిపించి నిరసనను తెలియజేసింది. వారు పాలస్తీనియన్ల తీవ్రవాదాన్ని సమర్థిస్తున్నారనీ, తమకు గల ఆత్మ రక్షణ హక్కును గుర్తించటం లేదనీ, సమస్య పరిష్కారానికి ఆటంకాలు సృష్టిస్తున్నారనీ వ్యాఖ్యానించింది. అదే సమయంలో, గాజాపై తమ యుద్ధం యథావిధిగా కొనసాగగలదని స్పష్టం చేసింది. దీనిని బట్టి, మూడు యూరోపియన్ దేశాల ప్రకటన ఇజ్రాయెల్‌పై ఏవిధంగా ప్రత్యేకమైన ఒత్తిడిని సృష్టించిందో గ్రహించవచ్చు.

ఈ విధమైన తీవ్ర ఒత్తిడి ఇది మూడవది కావటం మరొక గమనించదగ్గ పరిణామం. గతవారం ద హేగ్ లోని అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు) ప్రాసిక్యూటర్ కరీం ఖాన్, గాజా నేరాలపై విచారణ కోసం నెతన్యాహూకు అరెస్టు వారెంట్లు జారీ చేయవలసిందిగా కోర్టుకు ప్రతిపాదించారు. అది ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సంచలనమైంది. ఇజ్రాయెల్ అయితే భూమ్యాకాశాలను ఏకం చేయటం మొదలుపెట్టింది. అమెరికన్ బైడెన్ ప్రభుత్వమైతే కోర్టును ఖండించటమే గాక, ఆ న్యాయమూర్తులపై ఆంక్షలు విధించగలమనే స్థాయికి వెళ్ళింది. విశేషమేమిటంటే, స్వయంగా నాటో సభ్య దేశాలైన ఫ్రాన్స్, బెల్జియం మొదలైనవి కరీం ఖాన్ ప్రతిపాదనలను బలపరిచాయి. ఇందులో మరో విశేషం ఉన్నది. ఈ నాటో రాజ్యాలు ఒకవైపు అమెరికాతో పాటు ఇజ్రాయెల్‌కు ఆయుధ సరఫరా చేస్తున్నాయి. మరొకవైపు ఐక్యరాజ్య సమితిలో, భద్రతా సమితిలో ఇజ్రాయెల్‌కు అనుకూలంగా అమెరికా ఓటు వేస్తున్నా అవి మాత్రం ఓటు వేయటం లేదు. పైగా ఇప్పుడు కరీం ఖాన్ చర్యను సమర్థిస్తున్నాయి. ఇది ఒక స్థాయిలో పరస్పర విరుద్ధమైన వైఖరి. కానీ వారి వాదన ఇజ్రాయెల్ ఆత్మరక్షణ చేసుకోవలసిందే గానీ అంతర్జాతీయ నియమ నిబంధనలను ఉల్లంఘించకూడదని!



నెతన్యాహూ

మొత్తానికి క్రిమినల్ కోర్టు పరిణామం ఇజ్రాయెల్‌పై ఇటీవలనే ఏర్పడిన మరొక ఒత్తిడి. ప్రాసిక్యూషన్ వారంట్ల జారీ ముగ్గురు హమాస్ అగ్ర నేతలకు కూడా జరగాలని కరీం ఖాన్ సిఫారసు చేశారు. దానిని హమాస్ కూడా ఖండించింది. కానీ ఇజ్రాయెల్ స్పందనలు విపరీత స్థాయిలో ఉన్నాయి. అమెరికాతో పాటు ఆ శిబిరానికి చెందిన కొన్ని దేశాలు అందుకు తోడయ్యాయి. ఇంతకూ కరీం ఖాన్ ప్రతిపాదనను చివరికి కోర్టు ఆమోదిస్తుందా, మార్పులు చేస్తుందా, తిరస్కరిస్తుందా తెలియదు. ఒకవేళ ఆమోదిస్తే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న. హమాస్ నేతలు అజ్ఞాతంలో ఉన్నందున వారి అరెస్టు సాధ్యం కాదు. నెతన్యాహూ ఇజ్రాయెల్‌లో ఉన్నంతకాలం ఆయన అరెస్టూ వీలు కాదు. ఇందులో మరొక మెలిక ఉంది. కోర్టులో సభ్యత్వం గల దేశాలకు వెళ్లినట్టయితే మాత్రమే వారంట్లు వర్తిస్తాయి. ఆ యా ప్రభుత్వాలు వారిని అరెస్టు చేయక తప్పదు. ప్రస్తుతం ఆ సభ్య దేశాల సంఖ్య 124. వాటిలో అమెరికా, రష్యా, చైనా, ఇండియా వంటివి లేవు. సభ్య దేశాలలో అమెరికా లేదు గాని యూరోపియన్ యూనియన్‌లోని మొత్తం 27 దేశాలకూ సభ్యత్వం ఉంది. ఇది నెతన్యాహూకే గాక అమెరికాకు కూడా చాలా చిక్కులు తెచ్చి పెట్టే స్థితి. నెతన్యాహూకు వారంట్లు జారీ కావచ్చుననే చర్చ ఇప్పటికే వారం రోజులుగా సాగుతున్నది. దానితో, ఏమి చేయాలంటూ అమెరికా, యూరోప్ ఇప్పటికే తలలు పట్టుకుంటున్నాయి. కొందరు అటు, కొందరు ఇటుగా చీలిపోయారు. వారికి సంకట పరిస్థితి ఏమంటే, ప్రపంచ వ్యవహారాలన్నీ నియమ నిబంధనల ప్రకారం సాగాలని పట్టుదలగా వాదించేది వారే. అటువంటప్పుడు, తామే ఒప్పందంపై సంతకాలు చేసిన అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు వారంట్లను ఎట్లా తిరస్కరించగలరు? ఈ స్థితి నెతన్యాహూను గత పదిరోజులుగా భయపెడుతున్నది.

ఆయనపై తీవ్రమైన ఒత్తిడిని సృష్టించిన మూడవ పరిణామం అంతర్జాతీయ న్యాయస్థానం గత జనవరిలో చెప్పిన వ్యతిరేక తీర్పు. గాజాలో ఇజ్రాయెల్ అమాయక పౌరుల సామూహిక హననానికి, విధ్వంసానికి పాల్పడుతున్నదనీ, వేలాదిమంది స్త్రీ పురుషులు, పిల్లలు, వృద్ధులు, రోగులు ప్రాణాలు కోల్పోయారనీ, ప్రజలకు ఆహార పానీయాలు, మందులు సైతం అందకుండా నిర్బంధాలు విధిస్తున్నారనీ దక్షిణాఫ్రికా ప్రభుత్వం ఆ న్యాయస్థానంలో కేసు వేసింది. అప్పుడు కూడా ఇజ్రాయెల్ నానా హంగామా సృష్టించింది. అయినా కోర్టు ఇజ్రాయెల్‌కు వ్యతిరేక తీర్పునిచ్చింది. అయినప్పటికీ ఇజ్రాయెల్ మారణకాండ ఆగలేదు. దక్షిణాఫ్రికా ఆరోపణలు నిజమైనట్లు అనేక స్వతంత్ర సంస్థల నివేదికలే గాక, సాక్షాత్తూ ఐక్యరాజ్య సమితి, ప్రపంచ ఆహార సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ, మానవ హక్కుల సంస్థల నివేదికలు కూడా ధ్రువీకరించాయి. అయినప్పటికీ, నిరుడు అక్టోబర్ 7న హమాస్ మిలిటెంట్ల దాడిలో సుమారు 1200 మంది యూదులు మృతి చెందడానికి ప్రతీకారంగా తమ ఆత్మ రక్షణ కోసం హమాస్‌ను పూర్తిగా నిర్మూలించటం తమ లక్ష్యమనీ, ఆ క్రమంలోనే ఇప్పటికి దాదాపు 35,000 పాలస్తీనియన్లు మరణించారనీ, అందులో తమను నిందించవలసింది లేదనీ ఇజ్రాయెల్ వాదిస్తున్నది. ఈ వాదనలను అత్యధిక ప్రపంచం నిరాకరిస్తున్నది.

ఇక్కడ రెండు సమస్యలున్నాయి. మొదటిది, ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు. రెండవది, మౌలికంగా పాలస్తీనా సమస్య దశాబ్దాల పాటు పరిష్కారం కాకుండా పెచ్చరిల్లుతుండటం. ఇటీవల ఇంత జరుగుతున్నా అమెరికన్లు ఇజ్రాయెల్‌కు వేలకు వేల కోట్ల డాలర్ల ఆయుధాలు సరఫరా చేస్తూ, ఆర్థికసాయం కూడా పంపుతున్నారు. ఐక్యరాజ్య సమితిలో ఇజ్రాయెల్‌కు అనుకూలంగా ఓటు వేస్తూ, భద్రతా సమితిలో వీటోను ఉపయోగిస్తున్నారు. పాలస్తీనా రాజ్యం ఏర్పాటును వ్యతిరేకిస్తూ, అటువంటి ఒప్పందం అంటూ జరిగితే అది ఇజ్రాయెల్, పాలస్తీనియన్ల మధ్య చర్చల ద్వారా జరగవలసిందే తప్ప బయటి జోక్యంతో కాదని విచిత్రమైన వాదన చేస్తున్నారు. మరొకవైపు ఇజ్రాయెల్ మాత్రం పాలస్తీనా ప్రసక్తే లేదనీ, తామే ఆ భూభాగాలను నియంత్రించగలమనీ అంటున్నది. గాజా బయట వెస్ట్ బ్యాంక్ ప్రాంతంలో యూదు సెటిలర్లు క్రమక్రమంగా పెరిగిపోతూ అక్కడి పాలస్తీనియన్లను నిర్మూలిస్తున్నారు. అయినప్పటికీ అమెరికా ఈ విధమైన వైఖరి తీసుకోవటానికి ఏకైక కారణం వారి సామ్రాజ్యవాద ప్రయోజనాలు. మొదటి నుంచి ఇప్పటి వరకూ అంతే. కనుకనే తాము స్వయంగా నిర్వహించిన క్యాంప్ డేవిడ్, ఓస్లో ఒప్పందాల ప్రకారం గానీ, ఐక్యరాజ్యసమితి తీర్మానాల ప్రకారం గానీ పాలస్తీనా దేశాన్ని ఏర్పడనివ్వటం లేదు. వారిని ధిక్కరించి ఇప్పుడు నార్వే, స్పెయిన్, ఐర్లండ్‌లతో కలిపి (ఇండియా సహా) 146 ప్రపంచ దేశాలు స్వతంత్ర పాలస్తీనాను గుర్తిస్తున్నాయి.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

సరైన గౌరవం



జీవితమంతా మీరు కష్టపడ్డందుకు గాను పదవీ విరమణ తర్వాత కూడా మీకు గౌరవం, భద్రత తప్పక ఉండాలి.

– రిషి సునాక్, బ్రిటన్ ప్రధాని

సాయానికి సిద్ధం



పాపువా న్యూ గినియాలో విధ్వంసకర భూపాతం వల్ల జరిగిన ప్రాణనష్టం తీవ్రమైన బాధ కలిగించింది. బాధిత కుటుంబాలకు మా హృదయపూర్వక నివాళులు. గాయపడ్డవారు వేగంగా కోలుకునేందుకు ప్రార్థిస్తున్నాం. అన్ని రకాలుగా సహాయం అందించేందుకు ఇండియా సిద్ధంగా ఉంది.

– నరేంద్ర మోదీ, ప్రధాని

ఫాసిస్టులతో పోరాడుదాం!



ఈ వీడియోలో (షేర్ చేశారు) పండిట్ రవిశంకర్ తన గురువు బాబా అల్లావుద్దీన్ ఖాన్, గురు మా ఆశీర్వాదాలు తీసుకుంటున్నారు. ఇదిగో ఈ ఇండియానే ఇప్పుడు ఫాసిస్టులతో పోరాడుతోంది. జూన్ 4న మనం గెలవచ్చు, గెలవకపోవచ్చు, కానీ మనం పోరాడకుండా మాత్రం విరమించేది లేదు.

– సంజయ్ ఘోష్, న్యాయవాది

చైనా వేగం



చైనాలో మరో పర్యటన జరిపి వచ్చాను. 6 రోజులు - 5 నగరాలు- 8 ఫ్యాక్టరీలు. ఎప్పటిలాగానే చైనా మనల్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది. వేగం, విస్తృతితో భయపెడుతుంది. గత ఐదేళ్లలో విశేషమైన వృద్ధిని చూపిన ఫ్యాక్టరీలను చూశాము. వాటినే ఇండియాలో ఎట్లా అనుసరించవచ్చో నేర్చుకోవడం అనేది ఈ పర్యటన తాలూకు ఒక లక్ష్యం.

– రాహుల్ రాజ్, ఆంట్రప్రెన్యూర్

దూషిస్తే ఎలా?



ఇండిపెండెంట్ జర్నలిజాన్ని ప్రోత్సహిస్తున్నట్లుగా కొందరు నటిస్తుంటారు. వాళ్ల ప్రకారం లౌకిక వాదం అంటే ప్రధాని మోదీని దూషించడం, ఆర్‌ఎస్‌ఎస్‌ను దూషించడం, బీజేపీని దూషించడం, భారత సంస్కృతిని దూషించడం! ప్రభుత్వాన్ని స్వేచ్ఛగా విమర్శించండి, కానీ బీజేపీని ఓడించేందుకు దేశాన్నీ, దాని వ్యవస్థలనూ దూషించవద్దు.

– కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రి

ఏమవుతున్నారు?



ఇన్ఫోసిస్ ఉద్యోగులు: 30 ఏళ్ల వరకు ఉన్నవారు- 54.7 శాతం; 31-50 ఏళ్లవారు- 42.4 శాతం. 50 పైబడినవాళ్లు- 2.9 శాతం. టీసీఎస్ ఉద్యోగులు: 30 ఏళ్ల వరకు ఉన్నవారు- 50.3 శాతం; 31-50 ఏళ్లవారు- 48.4 శాతం. 50 పైబడిన వాళ్లు- 1.3 శాతం. యాభై ఏళ్లు దాటినవాళ్లు ఐటీలో భారీగా రిటైర్ అవుతున్నారా? లేక, ఇంకెక్కడైనా మేనేజ్‌మెంట్ అవుతున్నారా?

– కిరణ్ కుమార్ ఎస్., విశ్లేషకుడు

ఇండియా తీరు



జనానికి మరోసారి చెబుతున్నాను. సైడ్‌వాక్స్ ఉన్నవి పాదచారుల కోసమేగానీ డ్రైవ్ చేయడానికీ, పార్కింగ్ కోసమూ కాదు. నాకు దిగ్భ్రాంతి కలిగించినది ఏమంటే, ఇతరులనూ, తమ చట్టాలనూ అగౌరవపరచడాన్ని గర్వంగా ఫీలవుతున్నారు. మళ్లీ వాళ్లే ఎప్పుడూ 'వెల్‌కమ్ టు ఇండియా' (భారత్‌కు స్వాగతం) అంటుంటారు. ఇదేనా మీరు ప్రపంచానికి చూపాలనుకునేది?

– ఓల్లీ ఎస్సే, ఇటాలియన్ డీజే

ఇన్ బాక్స్

కుక్క కాటు మరణాలు

వీధి కుక్కల కాట్ల విషయంలో దేశానిది ప్రపంచంలో మొదటి స్థానం. ఈ మధ్య కాలంలో దేశం నలుమూలలా ఈ ప్రమాదం పెరిగింది. ఒక అంచనా ప్రకారం భారత దేశంలో వీధి కుక్కల సంఖ్య ఆరు కోట్లు. ఏటేటా నమోదౌతున్న కాట్లు పాతిక లక్షల పైమాటే. ఇంకా గ్రామీణ ప్రాంతాలలో దృష్టిలోకి రానివి ఎన్నో ఉంటాయి. అవి పెరుగుతూ రావడం ఆందోళనకరం.

పార్వతీపురం మన్యం జిల్లా, జియ్యమ్మవలస మండలంలో నెల రోజుల వ్యవధిలో వీధికుక్కల దాడిలో ఇరువురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. ఒక వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయి రెండు వారాలు గడవక ముందే ఇంకో యువకుడికి అదే దుర్గతి పట్టడం విషాదం. ఈ రెండు దుర్ఘటనలు కుక్కలు గుంపుగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన కారణంగా సంభవించినవి. ఏటేటా కుక్కకాటు వల్ల రాబిస్ సోకి జరుగుతున్న మరణాలకు, ఇలా దాడి ద్వారా సంభవిస్తున్న మరణాల సంఖ్య కలవడం సామాజిక సమస్యగా పరిణమించింది.

వీధికుక్కల్ని అదుపు చేయడంలో స్థానిక ప్రభుత్వాలది ముఖ్య పాత్ర. వాటి సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరగకుండా శస్త్ర చికిత్సలు చేయించాలి. రాబిస్ తదితర వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలి. పుర పాలికలు, స్థానిక సంస్థలు తమ ప్రాంతంలో కుక్కలు ఎక్కువైతే వాటిని పట్టుకుని వేరే ప్రాంతంలో వదిలేస్తున్నాయి. ఆ కొత్త ప్రాంతానికి అవి సమస్యగా మారుతున్నాయి. తిండి, నీడ కరవైన ఆ ప్రాణులు ప్రమాదకరమైన ప్రవర్తన అలవర్చుకుంటున్నాయి. లేదా ఇలాంటి దుర్ఘటనలు ఎదురైనప్పుడు వాటిని చంపేయడం జరుగుతుంది. అలా చంపడం చట్టరీత్యా నేరమైనా, ప్రజలకు వేరే గత్యంతరం లేకుండా పోతోంది. కనుక పెరుగుతున్న కుక్క కాట్లకు సమగ్రమైన పరిష్కారం ఆలోచించాలి. ఏమైనా అనారోగ్య కారణాల వల్ల ఇలా కుక్కలు ప్రవర్తిస్తున్నాయా అన్నది కూడా పశువైద్య నిపుణుల సాయంతో తెలుసుకోవాలి.

వాతావరణ మార్పులు, వాటి మనుగడ సమస్య, వ్యాధులు తదితర ప్రభావాలపై స్పష్టత ఉంటే దానికి తగ్గట్టుగా పరిష్కారం వెతకడం వీలౌతుంది. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం, స్థానిక సంస్థలు, ప్రజాసంఘాలు, మీడియా, ప్రజలు అంతా చేయి కలపాలి.

– డా॥ డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

గెలుపెవరిదో వారి పాలనే చెబుతుంది!

అభిప్రాయం



ఎ. జయప్రదా రాఘవరెడ్డి

జూన్ 4న ఎన్నికల ఫలితాల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎదురు చూస్తున్నారు. చంద్రబాబు, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాలు ప్రజలకోసం అమలు చేసిన కార్యక్రమాలు లోతుగా పరిశీలిస్తే గెలుపు ఎవరిది అనేది స్పష్టంగానే బోధపడుతుంది.

బాబు పాలన ఎక్కువకాలం రాజధాని అమరావతి చుట్టూ తిరిగింది. ఒక పెద్ద స్కామ్‌ను నడిపింది. బాబు ముఖ్యమంత్రిగా దిగిపోయేనాటికి తాత్కాలిక సచివాలయం, కోర్టు భవనాలు నిర్మించారే తప్ప శాశ్వతమైన నిర్మాణాలు ఏవీ జరగలేదు.

జగన్ మోహన్ రెడ్డి జూన్ 2019లో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుండి మనసా, వాచా, కర్మణా ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి నిర్వహించారు. గ్రామస్థాయికి అధికార వికేంద్రీకరణ చేశారు. గ్రామ సచివాలయం, దానికి అనుబంధంగా వలంటీర్ వ్యవస్థను గ్రామాలలో ఏర్పాటు చేసి ప్రజలకు కావలసిన అన్ని సేవలు ఇంటి వద్దకే చేర్చారు.



బాబు పాలనలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో కావలసిన వైద్య పరికరాలు, రోగులకు కావలసిన మందులు ఇవ్వలేదు. వైద్యులు, నర్సుల ఖాళీలు నింపలేదు. ప్రైవేట్ పాఠశాలలను, వైద్యశాలలను బాగా ప్రోత్సహించారు బాబు. అయితే జగన్ పాలన ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలకు స్వర్ణయుగం అయ్యింది. వైద్యులు, నర్సుల పోస్టులు భర్తీ చేశారు. ఆరోగ్యశ్రీ కింద పరిమితిని ఇరవై ఐదు లక్షల వరకు పెంచి, అధిక రోగాలకు ఆ పథకాన్ని వర్తింపజేశారు. కొత్తగా జగన్ ప్రభుత్వం 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తోంది. జగన్ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టడం, బడికి పిల్లలను పంపించే తల్లులకూ, బడికి వచ్చే పిల్లలకూ అనేక పథకాలను వర్తింపచేయడం తెలిసిందే.

బాబు 2014లో ఇచ్చిన మ్యేనిఫెస్టోలోని ముఖ్య హామీలైన రైతు, డ్వాక్రా గ్రూపుల రుణమాఫీ చేయలేదు. పుట్టిన బిడ్డకు రూ. 25,000 డిపాజిట్ చేసే 'మహాలక్ష్మి' పథకం పూర్తిగా అమలు కాలేదు. ఇంటింటికీ ఉద్యోగాలు ఇవ్వలేదు. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత వేల కోట్ల డ్వాక్రా రుణాలు మాఫీ చేశారు. మేనిఫెస్టోలో చెప్పిన హామీలు 99 శాతం అమలు చేశారు. ఇళ్లస్థలాలను మహిళల పేర ఇవ్వడం, వారికి రాజకీయాల్లోనూ మంచి అవకాశాలు ఇవ్వడం, అనేక రకాల పెన్షన్‌లు అమలుచేయడం చూస్తే ఆయన మహిళా పక్షపాతి అని అర్థమవుతుంది.

2014 మేనిఫెస్టో అమలులో పూర్తిగా విఫలమైన బాబు 2024లో 'బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ' పేరుతో 177 హామీలు, 'సూపర్ సిక్స్' పేరుతో ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం వంటివాటిని చేర్చారు. అయితే సంక్షేమ పథకాలతో జగన్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేస్తున్నారని విమర్శించిన బాబు ఇప్పుడు ఆయన కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలు అమలు చేస్తానని ఎన్నికల్లో చెప్పడాన్ని ప్రజలు నమ్మలేదు. అందుకే మే 13న రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో 80 శాతం మంది వృద్ధులు, 65 శాతం మంది మహిళలు జగన్ ప్రభుత్వానికి అనుకూలంగా ఓట్లు వేసినట్లు అంటున్నారు. కావున ఎన్నికలలో జగన్ విజయం సునాయాసమే!

వ్యాసకర్త సామాన్య గృహిణి, కడప

అసలు శక్తి

అడవిలో ఉన్న ఒక ముని దీర్ఘతపస్సుతో దివ్య శక్తి పొందాడు. అనంతరం ఆయన మెల్లగా కళ్ళు తెరిచాడు. ఆయన ఎదురుగా ఓ ఎలుక బిక్కుబిక్కుమంటూ కనిపించింది. ఈ ఎలుక ఎందుకలా వణుకుతోందని దివ్యదృష్టితో గ్రహించాడు. దానికి సాయం చేయాలనుకున్నాడు. తన తపశ్శక్తితో దానిని పిల్లిలా మార్చాడు ముని. ఇప్పుడది మరో పిల్లిని చూసి భయపడక్కర్లేదనుకున్నాడు. అనంతరం ఆయన కళ్ళు మూసుకున్నాడు. మరుసటి రోజు ఆయన మెల్లగా కళ్ళు తెరిచాడు. ఇప్పుడు పిల్లి రూపంలో ఉన్న ఎలుక మళ్ళీ భయపడుతూ కనిపించింది. సమీపంలో ఉన్న కుక్కను చూసి అది భయపడుతోందని గ్రహించాడు. దాంతో ఆయన ఆ పిల్లిని కాస్తా కుక్కగా మార్చాడు. ఇప్పుడది మరో కుక్కను చూసి భయపడాల్సిన పని లేదనుకున్నాడు.

జ్యోతిర్మయం

మరుసటి రోజు ఉదయం ఆయన ముందర కుక్కగా మారిన పిల్లి దగ్గర్లో ఉన్న ఓ నక్కను చూసి భయపడటం చూశాడు. ఆ వెంటనే ముని కుక్కను కాస్తా నక్కగా మార్చాడు. ఇప్పుడది నక్కను చూసి భయపడాల్సిన పని లేదు, అది ప్రశాంతంగా ఉంటుందని భావించాడు. కానీ మరుసటి రోజు ఆ నక్క కూడా భయపడుతూ కనిపించింది. కారణం దాని వెనుక ఒకింత దూరంలో పులి నిల్చుని ఉండటమే. మునికి విషయం అర్థమైంది. నక్కను కాస్తా తన తపశ్శక్తితో పులిగా మార్చాడు. ఇక పులికి ఏ బాధా ఉండదనుకున్నాడు. కానీ మరుసటి రోజు ఆ పులి ఒక పిల్లిని చూసి భయపడుతోంది.

ఇలా ఎందుకు భయపడుతోందా అని ఆలోచిస్తే వాస్తవం బోధపడింది. ప్రారంభంలో ఎలుకగా ఉన్నదే ఒక్కో మెట్టుగా మారి పులి అయ్యింది కానీ, మానసికంగా అది ఇంకా ఎలుకగానే ఉండిపోయింది. అందుకే అది పిల్లిని చూసి భయపడుతోంది. అంతే, మరేమీ ఆలోచించకుండా పులిని కాస్తా ఎలుకగా మార్చాడు. పిల్లి నుంచి దానిని కాపాడి అక్కడి నుంచి పంపించేశాడు.

మనుషులలో అంతర్గత శక్తి పెరగకుండా ఉత్త రూప మార్పుతో ఉపయోగం లేదు. సమాజంలో చాలామంది ఇపుడు అలాగే ఉంటున్నారు. కానీ అది ఎప్పుడో ఒకసారి బయటపడక మానదు. అందుకే అంతర్గత శక్తి పెంపొందించుకోవాలి.

– యామిజాల జగదీశ్

అప్పన్న సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ మెహతా దంపతులకు శేషవస్త్రాలు అందజేస్తున్న ఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా సతీసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. న్యాయమూర్తి దంపతులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం న్యాయమూర్తికి శేషవస్త్రాలు, ప్రసాదం, స్వామివారి జ్ఞాపికను దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే బుల్లెబ్బాయిరెడ్డి మృతి

కొత్తపల్లి: సంపర మాజీ ఎమ్మెల్యే అనిశెట్టి బుల్లెబ్బాయిరెడ్డి (72) కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం నాగులాపల్లి గ్రామంలోని తన నివాసంలో మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 1982 నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన ఆయన 1989–94, 2004–09లో సంపర నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేశారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. ఆర్టీసీ చైర్మన్‌గానూ సేవలందించారు. బుల్లబ్బాయిరెడ్డి భౌతిక కాయాన్ని పలువురు నాయకులు సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సాగుకు చక్కనైన సాయం

- రైతుల సందేహాలు తీరుస్తున్న రైతు భరోసా, పశుమత్స్యదర్శిని
- అత్యాధునికంగా తీర్చిదిద్ది... అందంగా ముద్రించి...
- రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ
- ఇప్పటికే లక్షన్నర దాటిన చందాదారులు
- అమ్మకాలపై ఆర్బీకే సిబ్బందిపై ఒత్తిళ్లు లేవు
- పనిగట్టుకుని అడ్డగోలు కథనాన్ని అందించిన ఈనాడు

ఎన్నికలు ముగిసినా ఇంకా ఈనాడు దుగ్ధ తీరలేదు. ఏదోలా ప్రభుత్వంపైనా... అనుసరిస్తున్న విధానాలపైనా లేనిపోని విమర్శలు గుప్పించడమే పనిగా పెట్టుకుంది. ప్రజలను తప్పుదారి పట్టించేలా కథనాలు అందిస్తూ పైశాచికానందం పొందుతోంది. తాజాగా ప్రభుత్వం అందిస్తున్న రైతుభరోసా, పశు మత్స్యదర్శిని మ్యాగజైన్స్‌పైనా తన అక్కసును వెళ్లగక్కింది. దురుద్దేశంతో ఇచ్చిన ఈ కథనాన్ని ప్రభుత్వాధికారులు నిర్ద్వంద్వంగా ఖండించారు. వారి ఆరోపణలను తిప్పి కొట్టారు.

సాక్షి, అమరావతి: వ్యవసాయంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు సమగ్రంగా... సచిత్రంగా ఆకర్షణీయంగా అందించేందుకు రైతు భరోసా, పశుమత్స్య దర్శిని మ్యాగజైన్స్‌ను ఐదేళ్లుగా ప్రభుత్వం అందిస్తోంది. గతంలో మూస పద్ధతిలో బ్లాక్ అండ్ వైట్ కలర్‌లో నాణ్యత లేని మెటీరియల్‌తో 'పాడి పంటలు' పేరిట వ్యవసాయ అనుబంధ శాఖలన్నింటినీ కలిపి ఒకే మాస పత్రిక అందించేవారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గతం కంటే మెరుగ్గా... ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఆయిల్ ప్రింట్ కవర్, అన్ని పేజీలు రంగుల్లో 44 పేజీలతో కూడిన ఈ మ్యాగజైన్‌ను ముద్రిస్తూ కేవలం రూ.25లకే అందిస్తున్నారు. గన్నవరం సమీకృత రైతు సమాచార కేంద్ర పరిధిలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి దాదాపు పది మంది పర్యవేక్షణలో ఈ మ్యాగజైన్ రూపొందుతోంది.

ఆర్బీకేలకు ఉచితంగా సరఫరా

వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి ఆర్బీకేల ద్వారా అందుబాటులో ఉంచే సాగు ఉత్పాదకాల వివరాలతో పాటు వ్యవసాయ, ఉద్యాన, పట్టు, ఆక్వా సాగులో పంటల వారీగా మెలకువలు, ఉత్తమ యాజమాన్య పద్ధతులు, శాస్త్రవేత్తలు, ఆయా రంగాల నిపుణుల సలహాలు, సూచనలు, ఆదర్శ రైతుల అభిప్రాయాలతో విభిన్న కథనాలను అందిస్తున్నారు. 2020 జూలైలో ఈ మ్యాగజైన్‌కు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం రైతులకు అవసరమైన సమాచారాన్ని నిక్షిప్తం చేస్తోంది. నాటి నుంచి నేటి వరకు ప్రతి నెల దాదాపు 14,300 ప్రతులను ముద్రించి ఆర్బీకేలకు వ్యవసాయ శాఖ అధికారులకు ఉచితంగా ఇస్తున్నారు.

లక్షన్నర మంది చందాదారులు

ఆర్బీకే పరిధిలో 400–500 మంది రైతులు ఉండగా ఆర్బీకేలోని డిజిటల్ లైబ్రరీలో ఒక మాస పత్రిక మాత్రమే ఉంచడం వల్ల మెజారిటీ రైతులు చదవలేకపోతున్నారు. వీరి కోసం ఓ వైపు వ్యవసాయ, అనుబంధ శాఖల వెబ్‌సైట్లలో ఈ పత్రికను డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంచారు. అయినప్పటికీ మెజార్టీ రైతుల నుంచి వస్తున్న ఒత్తిళ్ల మేరకు స్వచ్ఛందంగా చందాదారులుగా చేరుతున్న వారికి నేరుగా మ్యాగజైన్స్ అందజేస్తున్నారు. లాభ, నష్టాలతో సంబంధం లేకుండా ఉచితకాపీలు ఏ ధరతో ముద్రిస్తున్నారో అదే ధరకు రైతులకు అందిస్తున్నారు. చందాదారులుగా చేరగోరే రైతుల నుంచి మొత్తాన్ని వసూలు చేసే బాధ్యతను ఆర్బీకే సిబ్బందికి అప్పగించారు. ప్రస్తుతం ఈ పత్రికల చందాదారులు లక్షన్నరకు పైగా ఉన్నారు. ఉన్నతాశయంతో నిర్వహిస్తున్న ప్రభుత్వంపై ఈనాడు బురద జల్లడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



స్వచ్ఛందంగానే చేరుతున్నారు



ఈ మాసపత్రికల కోసం రైతులు స్వచ్ఛందంగానే చందాదారులుగా చేరుతున్నారు. వారిపై ఎలాంటి ఒత్తిళ్లు లేవు. వీటి ప్రాముఖ్యతపై గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించే బాధ్యతను ఆర్బీకే సిబ్బందికి అప్పగించాం. చందాదారులంతా ఆర్బీకే పరిధిలో ఉండే రైతులే కాబట్టి, వారికి ప్రతీ నెలా ఈ మాసపత్రికలు అందజేసే బాధ్యతను అప్పగించాం. చందాదారులుగా చేర్పించేందుకు ఆర్బీకే సిబ్బందిపై ఎలాంటి లక్ష్యాలు నిర్దేశించలేదు.
– చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

కూచిపూడి నర్తకి టీనా చౌదరికి వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్



సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ నుంచి సర్టిఫికెట్‌ను అందుకుంటున్న టీనా చౌదరి

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కూచిపూడి నర్తకి, సినీనటి మన్నే టీనా చౌదరి లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందుకున్నారు. తనకు వచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని మంగళవారం తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ చేతుల మీదుగా స్వీకరించారు. బీటెక్ చదువుతూ కూచిపూడి నాట్యకళలో ఆరితేరిన టీనా లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా వరల్డ్ రికార్డ్‌కు ఎంపికవటం అభినందనీయమని ప్రఖర్ జైన్ అన్నారు. మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ..గతంలో నాటి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, తెలంగాణ, మిజోరాం, ఏపీ గవర్నర్ల నుంచి టీనా చౌదరి సత్కారం అందుకున్నట్లు గుర్తుచేశారు. మా–ఏపీ సభ్యురాలైన టీనా చౌదరి భవిష్యత్‌లో మరిన్ని గౌరవాలను అందుకోగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నృత్య విభాగంలో తనకు ఈ గుర్తింపు లభించినట్లు టీనా వెల్లడించారు. కార్యక్రమంలో టీనా తండ్రి, విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు మన్నే సత్యనారాయణ, తల్లి శివకుమారి, సహాయ దర్శకులు ఇంటూరి విజయభాస్కర్, వెంకీ రావణ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

విశాఖ లీగల్: చిన్నారిపై అతి కిరాతకంగా లైంగిక దాడి చేసిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష, పది వేల రూపాయలు జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. ప్రభుత్వం బాధితురాలికి నాలుగు లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడు పి.గణేష్ (29) అలియాస్ ద్రాక్ష గాజువాక ప్రాంతంలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బాధితురాలు (11 ఏళ్లు) చిన్న నడుపూరులో తన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ స్థానిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. ఈ నేపథ్యంలో 2017 జూన్ 14వ తేదీ సాయంత్రం నిందితుడు ఆటోలో వచ్చి పక్కనే మైదానంలో ఆడుకుంటున్న బాలికను అపహరించాడు. పెదగంట్యాడ సమీపంలోని ఆటో నగర్ కొంగపాలెం రోడ్డులో చిన్నారిపై బలవంతంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. సాయంత్రం 6 గంటల సమయంలో బాలికను పెదగంట్యాడ సమీపంలో వదిలిపెట్టి పారిపోయాడు. ఆమె బంధువులు, బావ కౌశల్ కుమార్‌కు పెదగంట్యాడ దగ్గర బాలిక కనిపించడంతో జరిగిన విషయాన్ని తెలుసుకుని న్యూ పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు అప్పటి నుంచి ఈ ఏడాది జనవరి వరకు పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నాడు. నాలుగు నెలల క్రితం నిందితుడిని పట్టుకుని కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

హజ్‌యాత్రకు బయలుదేరిన రెండో బృందం

విమానాశ్రయం (గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) నుంచి పవిత్ర హజ్‌యాత్రకు మంగళవారం రెండో బృందం బయలుదేరి వెళ్లింది. 322 మందితో కూడిన ఈ బృందం స్పైస్‌జెట్ సంస్థకు చెందిన ఎయిర్‌బస్ ఎ340–300 విమానంలో జెడ్డాకు పయనమయ్యారు. తొలుత విమానాశ్రయం సమీపంలోని దుర్గాపురం వద్ద మదరసాలో బస చేసిన హజ్ యాత్రికులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి, హజ్ ఆపరేషన్స్ చైర్మన్ హర్షవర్ధన్ చేతుల మీదుగా యాత్రికులకు కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆర్టీసీ ఏసీ బస్సుల్లో యాత్రికులను ఉదయం 11 గంటలకు విమానాశ్రయంలోని అంతర్జాతీయ టెర్మినల్‌కు తరలించారు. బస్సులను హర్షవర్ధన్‌తో పాటు హజ్ కమిటీ ఈవో అబ్దుల్ ఖదీర్, సభ్యులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను పూర్తిచేసుకున్న బృందం 5.40 గంటలకు జెడ్డాకు బయలుదేరి వెళ్లారు.



యాత్రికులతో వెళ్తున్న బస్సుకు పచ్చ జెండా ఊపుతున్న హర్షవర్ధన్

ఆధునికంగా రైల్వే ట్రాక్

- సంప్రదాయ ఫిష్‌ప్లేట్ జాయింట్ల స్థానంలో వెల్డబుల్ కాస్ట్ మాంగనీస్ స్టీల్ వినియోగం
- విజయవాడ–గూడూరు సెక్షన్‌లో వేటపాలెం వద్ద ఏర్పాటు
- దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ఇదే తొలిసారి

వేటపాలెం/రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ మార్గదర్శకంగా నిలుస్తోంది. పెరుగుతున్న రైళ్ల వేగాన్ని, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని రైల్వే ట్రాక్‌లను ఆధునీకరిస్తోంది. తాజాగా విజయవాడ డివిజన్‌లోని వేటపాలెం వద్ద వెల్డబుల్ కాస్ట్ మాంగనీస్ స్టీల్(డబ్ల్యూసీఎంసీ) క్రాసింగ్‌ను విజయవంతంగా ఏర్పాటు చేసింది. ఈ వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అత్యంత రద్దీగా ఉండే విజయవాడ–గూడూరు సెక్షన్ పరిధిలోని బాపట్ల జిల్లా వేటపాలెం డౌన్‌లైన్‌లో మంగళవారం రైల్వే అధికారులు విజయవంతంగా ఏర్పాటు చేశారు. ఈ పరిజ్ఞానాన్ని దక్షిణ మధ్య రైల్వేజోన్ పరిధిలో మొదటి సారిగా ఉపయోగించారు. భారతీయ రైల్వేలో ఇది రెండవది. రైళ్లలో పెరిగిన వేగం, హెవీ యాక్సిల్ లోడ్‌ను అధిగమించేందుకు డబ్ల్యూసీఎంసీ క్రాసింగ్ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. రైలు ఒక లైను నుంచి మరో లైను దాటే జంక్షన్‌ల వద్ద ట్రాక్‌లో ఉపయోగించే కీలక భాగమే డబ్ల్యూసీఎంసీ. ఇప్పటి వరకు రెండు బ్లాక్ సెక్షన్ల మధ్య లాంగ్ వెల్డ్ రైల్స్(ఎల్‌డబ్ల్యూఆర్) ఉండేవి. జాయింట్ ఫ్రీ టెక్నాలజీ అందుబాటులో లేకపోవడం వల్ల యార్డ్‌లలో టర్న్ అవుట్‌ల వెనుక ఫిష్ ప్లేట్ జాయింట్‌తో వేరు చేసేవారు. ఇప్పుడు డబ్ల్యూసీఎంసీ అందుబాటులోకి రావడం వల్ల 130 కి.మీ వేగంతో నడిచే రైళ్లకు ఎలాంటి ఇబ్బంది కలగదని అధికారులు చెప్పారు. ప్రయాణికులు సురక్షితంగా, కుదుపులు లేకుండా ప్రయాణించేందుకు ఈ పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం నరేంద్ర పాటిల్ మాట్లాడుతూ.. డబ్ల్యూసీఎంసీ క్రాసింగ్ ఏర్పాటు విజయవాడ డివిజన్‌లో చారిత్రాక మైలురాయిగా నిలుస్తుందన్నారు. డివిజన్ సీనియర్ డీఈఎన్ వరుణ్‌బాబు, ఇతర అధికారులను ఆయన అభినందించారు.



వేటపాలెం వద్ద మాంగనీస్ స్టీల్ క్రాసింగ్ లైన్‌కు వేసిన రంగులు

తెనాలి.. 'సప్తాహ ముద్దపప్పు' తినాలి

అలనాటి వైభవానికి సాక్షి తెనాలిలోని శంకర మఠం

ముద్దపప్పు సప్తాహాలతో ఘనకీర్తి

ఆరు అగ్రహారాల నుంచి వేద పండితులు, ముద్దపప్పు ప్రియుల రాక

ఆ రోజుల్లో..

మాఘ మాసం వచ్చిందంటే.. తెనాలి రామలింగేశ్వరపేటలోని శంకర మఠం ముద్దపప్పు సప్తాహాలతో ఘుమఘుమలాడేది. వారం రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి తెనాలి చుట్టుపక్కల గల ఆరు అగ్రహారాల నుంచి వేద పండితులతోపాటు అన్ని కులాల్లోని ముద్దపప్పు ప్రియులు ముద్దపప్పు భోజనం ఆరగించి.. మఠంలోనే నిద్రించేవారు. సుమారు 50 ఏళ్ల క్రితం వరకు కొనసాగిన ఈ ముద్దపప్పు సప్తాహాల విశేషాల్లోకి వెళితే..




తెనాలి రామలింగేశ్వరపేటలోని శంకర మఠం, (ఇన్‌సెట్లో) వారణాసి మణెమ్మ

తెనాలి: ఎనిమిదో శతాబ్దపు తత్వవేత్త.. అద్వైత గురువు జగద్గురు ఆదిశంకరాచార్యులు పేరిట తెనాలి రామలింగేశ్వరపేటలోనూ శంకర మఠం ఏర్పాటైంది. దేవీచౌక్ ప్రాంతంలోని చినరావూరు పార్కు రోడ్డులో కుడిపక్క దాదాపు పది సెంట్ల విస్తీర్ణంలో ఈ మఠం విస్తరించి ఉంది. మఠం వ్యవస్థాపకురాలు వేలమూరి లింగమ్మ. కాషాయధారి ఎవరొచ్చినా మఠంలోనే బస చేసేవారు. అప్పట్లో ఇక్కడ హోమాలు, యజ్ఞాలతోపాటు మాఘ మాసంలో ముద్దపప్పు సప్తాహాలు ఘనంగా నిర్వహించేవారు. మాఘశుద్ధ పాడ్యమి రోజు నుంచి మొదలై వారం రోజులపాటు ముద్దపప్పు వేర్వేరు అనుపానాలతో ముద్దపప్పు సప్తాహాలు జరిగేవి. వీటికితోడు హరికథ, బుర్రకథ, పురాణ పఠన కాలక్షేపాలతో శంకర మఠం ఓ వెలుగు వెలిగింది. సుమారు 50 ఏళ్ల క్రితం వరకూ ఈ సప్తాహాలు జరిగేవి.

సప్తాహాలు ఇలా..


నలభీమ పాకంలో చెయ్యి తిరిగిన నరసరావుపేట వంటవారు కృష్ణా నదీ తీరమైన కొల్లూరు పొలాల్లో పండిన ఏడాది వయసు గల కందిపప్పును గోధుమ రంగు వచ్చే వరకు వేయించి.. బాగా ఉడకబెట్టి.. ఉప్పు, పసుపు వేసి ముద్దపప్పు వండేవారు. దీనికి అనుపానాలుగా అంగలకుదురు పుల్ల దోసకాయల్ని వినియోగించి.. అనకాపల్లి ఆవపిండి, చినరావూరు గానుగ నువ్వుల నూనె, బుడంపాడు ఎర్ర మిరపకాయలతో కొట్టిన కారం, వేటపాలెం రాళ్ల ఉప్పు వేసి.. దేవతా దోసావకాయ తయారు చేసేవారు. వలివేరు మెట్ట పొలాల్లో కాసిన ఎర్ర గుమ్మడి కాయలు, ముదురు బెండకాయల ముక్కలకు ప్రశస్తమైన ఇంగువ తిరగమోత (తాలింపు) వేసి.. గుమ్మడి ముక్కల పులుసు గొప్పగా చేసేవారు. అనంతవరంలో పండిన వడ్ల దంపుడు బియ్యంతో అన్నం వండేవారు. వేజెండ్ల గ్రామపు నెయ్యి.. సంగం జాగర్లమూడి బర్రెలు బకింగ్‌హాం కాలువ గట్టున గడ్డిమేసి ఇచ్చిన చిక్కటి పాలతో జిడ్డు గడ్డ పెరుగు కుండల్లో తోడు పెట్టేవారు. ఇంగువ మినప వడియాలు, పెసర ఎర్ర అప్పడాలు వేయించేవారు. పచ్చల తాడిపర్రు అరిటాకులు పరిచి.. పంక్తులుగా వడ్డన చేయగా.. అలనాటి ఆ ముద్దపప్పు భోజనం చేసిన వారంతా తాదాత్మ్యం చెందేవారు. నాటి సప్తాహాలను వారణాసి మణెమ్మ మహిళ దగ్గరుండి చేయించేవారు. వంటలు చేయటంలో మణెమ్మది అందె వేసిన చెయ్యి. శుభకార్యాల్లో వంటలకు అప్పట్లో ఆమె ప్రసిద్ధి. మఠం వ్యవస్థాపకురాలు లింగమ్మ కుమారుడు శంకరశాస్త్రి ఉన్నత విద్యను అభ్యసించి ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ మఠం నిర్వహణ చూస్తుండేవారు. తర్వాత శంకరమఠం శ్రీశృంగేరీ శారదా పీఠం అధీనంలోకి వెళ్లింది.

మణెమ్మ మా అమ్మ



మాది ప్రకాశం జిల్లా అద్దంకి. కుటుంబ పోషణ నిమిత్తం మా కుటుంబం తెనాలి చేరుకుంది. శుభకార్యాల్లో వంటలు చేయడంలో మా అమ్మ వారణాసి మణెమ్మ పేరు తెచ్చుకుంది. శంకర మఠం కేంద్రంగా జరిగిన ముద్దపప్పు సప్తాహాలు, కార్తీక సమారాధనలు మణెమ్మ చేతుల మీదుగానే జరిగేవి. మా అమ్మ 26 ఏళ్ల క్రితం చనిపోయారు. ఇప్పటికీ ఆమె పేరిట ఏటా కార్తీకమాస సమారాధనల్ని మఠంలో చేస్తున్నాం.
– రాయప్రోలు సుందరమ్మ, మణెమ్మ పెద్ద కుమార్తె, సదాశివశాస్త్రి, మనవడు

ఆ రోజుల్లో గొప్పగా ఉండేది



ఆధ్యాత్మిక ప్రచారంలో ఒక వెలుగు వెలిగిన శంకర మఠం తర్వాతి కాలంలో ఆ ప్రాభవాన్ని కోల్పోయింది. గొప్పగా నడిచిన ముద్దపప్పు సప్తాహాలు నిలిచిపోయాయి. భోజనం వడ్డనకు ముందు మా తండ్రి ములుకుట్ల సదాశివశాస్త్రి హరికథా కాలక్షేపం తప్పనిసరిగా ఉండేది.
– ములుకుట్ల విశ్వనాథశాస్త్రి, భక్తి ప్రచారక

ధూపదీప నైవేద్యం ఇస్తున్నా

శంకర మఠం శ్రీశృంగేరీ పీఠం ఆధ్వర్యంలో ఉంది. 30 ఏళ్లుగా ధూపదీప నైవేద్యం పెడుతున్నా. మఠం ఆవరణలోని ఇంట్లో ఉండేవాళ్లం. మఠంతో సహా ఇల్లు శిథిలావస్థకు చేరటంతో అద్దె ఇంట్లోకి మారాల్సి వచ్చింది.
– యనమండ్ర నరసింహమూర్తి, అర్చకస్వామి

ఐటీఐ శిక్షణతో పక్కా కొలువు

- పరిశ్రమల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 37 ఐటీఐ కళాశాలలు
- అప్రెంటీస్‌కు ఎంపికైతే ఖాతాలో రూ.9,550 జమ



ఐటీఐలో వర్క్‌షాప్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పదో తరగతి పాసైనా, ఫెయిలైనా, ఇంటర్ పాసైనా, ఫెయిలైనా ఐటీఐల్లో చేరి వివిధ కోర్సుల్లో నైపుణ్యం సాధించవచ్చని మీకు తెలుసా? ఆ నైపుణ్యంతో చిన్న వయసులోనే పరిశ్రమల్లో మంచి ఉద్యోగాలు సాధించవచ్చని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. పారిశ్రామిక శిక్షణ కోర్సుల్లో ఏడాది, రెండేళ్ల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతి ఫెయిలైనా ఆయా కోర్సుల్లో చేరి మంచి నైపుణ్యం సాధించవచ్చు.

అందుబాటులో వివిధ కోర్సులు

ఐటీఐ కళాశాలల్లో పరిశ్రమలకు అవసరమైన వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తారు. వాటిలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌స్‌మెన్ సివిల్, మోటార్ వెహికల్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెషినిస్ట్, టర్నర్, రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండీషనింగ్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, వెల్డర్, కోపా వంటి కోర్సులకు పరిశ్రమల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆయా కోర్సులు పూర్తి చేసి వాటిలో ప్రావీణ్యం కనబరిస్తే యువతకు వెంటనే ఉద్యోగాలు లభించే అవకాశం ఉంటుంది. రెండేళ్ల కాలపరిమితితో ఎలక్ట్రీషియన్ కోర్సు పూర్తి చేస్తే గ్రామ సచివాలయం, ట్రాన్స్‌కో, జెన్‌కో, ఈపీడీసీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు సాధించవచ్చు. భీమవరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ ట్రేడ్‌ను అందుబాటులో ఉంచారు.

ఫిట్టర్ కోర్సుకు డిమాండ్

ఐటీఐలో ఫిట్టర్ కోర్సు నిత్యనూతనంగా ఉంటుంది. ఈ కోర్సుకు విద్యార్థుల్లో మంచి డిమాండ్ ఉంది. ఐటీఐ కళాశాలల్లో తొలుత సీట్లన్నీ భర్తీ అయ్యేది ఈ కోర్సులోనే. రెండేళ్ళ కోర్సు పూర్తి చేస్తే అటు ప్రైవేట్ పరిశ్రమలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా మంచి ఉద్యోగాలు వస్తాయి. డ్రాఫ్ట్‌స్‌మెన్ సివిల్ కోర్సు రెండేళ్ళు ఉంటుంది. నిర్మాణ రంగంలో ఈ కోర్సు చేసిన వారికి అవకాశాలు ఎక్కువ. గ్రామ, వార్డు సచివాలయల్లో భర్తీ చేసే సర్వేయర్ పోస్టులకు ఈ కోర్సు చేసిన వారు అర్హత పొందుతారు. మోటార్ వెహికల్ మెకానిక్ కోర్సు రెండేళ్ళు. ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే రైల్వే, ఆర్టీసీలతో పాటు వివిధ మోటార్ సైకిల్, కార్ల తయారీ సంస్థల్లో ఉద్యోగావకాశాలతో పాటు సొంతంగా మోటారు వాహనాల సర్వీస్ సెంటర్లు, ఓలా క్యాబ్ వంటి వాటిలో స్వయం ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. ఎలక్ట్రానిక్స్, మెకానిక్ కోర్సు చేసిన వారికి టీవీలు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు వంటి ఉత్పత్తి సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చు.

అప్రెంటిస్‌షిప్‌కు ఎంపికైతే రూ.9,550 జమ

ఐటీఐ పూర్తి చేసి అప్రెంటిస్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అతని ఖాతాకు రూ.9,550 జమ చేస్తాయి. వాటిలో రాష్ట్ర ప్రభుత్వం రూ.8,050, కేంద్ర ప్రభుత్వం రూ.1,500 జమ చేస్తాయి. ఐటీఐ ఉత్తీర్ణులైన వారు ఉన్నత చదువులకు వెళ్ళాలన్నా డిప్లొమా అర్హత పొందేందుకు బ్రిడ్జి కోర్సు అందుబాటులో ఉంటుంది. బ్రిడ్జి కోర్సు పూర్తి చేసిన విద్యార్థి నేరుగా డిప్లమో 2వ సంవత్సరం చదవడానికి అర్హత పొందుతాడు. వీటితో పాటు కోపా కోర్సు కేవలం 10వ తరగతి విద్యార్హతతో చేయవచ్చు. ఈ కోర్సు చేసిన వారికి కంప్యూటర్ ఆపరేటర్లుగా, హార్డ్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగానే లభిస్తున్నాయి. 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఏడాది మాత్రమే చదివే వెల్డర్ కోర్సులో చేరవచ్చు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి రైల్వేలతో పాటు ఓఎన్‌జీసీ, ఆర్టీసీల్లో, పరిశ్రమల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 37 ఐటీఐ కళాశాలలు

ఐటీఐలో చేరి వివిధ కోర్సులు చేయాలనుకునే విద్యార్థులకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొత్తం 37 కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఏలూరు జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు 5 ఉండగా వివిధ ట్రేడుల్లో 876 సీట్లు, 14 ప్రైవేట్ ఐటీఐలు ఉండగా వాటిలో 1,672 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 2 ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 308 సీట్లు, 16 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2,736 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

సర్వీస్ టెక్నీషియన్‌గా రూ.20 వేల జీతం

2020–22 మధ్య ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో శిక్షణ పొందాను. శిక్షణ కాలంలో అనేక అంశాల్లో నైపుణ్యం పెంచుకోగలిగాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మేధా సర్వోడ్రైవ్స్ సంస్థలో సర్వీస్ టెక్నీషియన్‌గా ఉద్యోగం లభించింది. రూ. 20 వేలు జీతం వస్తోంది.
– ఎస్‌వీఎస్‌పీ రవి కుమార్, ఐటీఐ విద్యార్థి

మధ్యప్రదేశ్‌లో ఉద్యోగం

నేను ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో శిక్షణ పొందాను. వివిధ అంశాల్లో పట్టు సంపాదించాను. ప్రస్తుతం మధ్యప్రదేశ్‌కు చెందిన మెగా ఇంజనీరింగ్ సంస్థలో సర్వీస్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాను. రూ. 20 వేలు సంపాదిస్తున్నాను.
– ఆర్.సాయిబాబా, ఐటీఐ విద్యార్థి

జూన్ 10 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు

ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు ప్రభుత్వం జూన్ 10 వరకూ గడువు ఇచ్చింది. కోర్సుల్లో ప్రవేశించిన వారికి శిక్షణ కాలంలో ప్రభుత్వం నుంచి అన్ని రాయితీలు అందుతాయి.
– పీ రజిత, ఏలూరు పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రధానాధికారి

పశ్చిమ బెంగాల్‌లో సార్వత్రిక ఎన్నికల ఘట్టం తుది అంకానికి చేరింది. ఆరు విడతల్లో 33 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు పూర్తయ్యాయి. మిగతా 9 స్థానాల్లో జూన్ 1న చివరిదైన ఏడో విడతలో పోలింగ్ జరగనుంది. వీటిలో చాలా సీట్లు కోల్‌కతా నగర పరిధిలో ఉన్నవే. ఇవన్నీ అధికార తృణమూల్ ఖాతాలోని స్థానాలే. ఈసారి వాటిపై కమలనాథులు కన్నేశారు. దాంతో బీజేపీ, తృణమూల్ మధ్య హోరాహోరీ సాగుతోంది. బెంగాల్లో ఇండియా కూటమికి మమత దూరంగా ఉండటంతో కాంగ్రెస్–సీపీఎం కలిసి పోరాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కీలక సీట్లపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్

కోల్‌కతా మే సవాల్

తృణమూల్ కోటపై కమలం గురి!

బెంగాల్లో 9 స్థానాలకు జూన్ 1న పోలింగ్

పోలింగ్ జరిగే లోక్‌సభ స్థానాలు

డమ్ డమ్, బారాసత్, బసీర్హాట్, జయనగర్, మథురాపూర్, డైమండ్ హార్బర్, జాదవ్‌పూర్, కోల్‌కతా దక్షిణ్, కోల్‌కతా ఉత్తర్



• అభిషేక్ బెనర్జీ

డైమండ్ హార్బర్...

అభిషేక్ హ్యాట్రిక్ గురి

బ్రిటిషర్ల కాలంలో నిర్మించిన డైమండ్ హార్బర్ పోర్టు యూరప్‌కు ముడి సరుకుల రవాణా హబ్‌గా వెలుగు వెలిగింది. ఈ నియోజవర్గంలో 2009లో తృణమూల్ జెండా పాతింది. గత రెండు ఎన్నికల్లోనూ మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీ గెలిచారు. ఈసారి హ్యాట్రిక్‌పై గురిపెట్టారు. బీజేపీ ఇక్కడ గత ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచినా పోయినసారి 4.7 లక్షల పైగా ఓట్లు దక్కించుకుంది. ఈసారి అభిజిత్ దాస్ (బాబీ)ను రంగంలోకి దించింది. సీపీఎం నుంచి ప్రతీకుర్ రెహ్మాన్ పోటీలో ఉన్నారు.



• సుదీప్ బందోపాధ్యాయ్

కోల్‌కతా ఉత్తర్..

తృణమూల్ వర్సెస్ మాజీ

తృణమూల్‌కు మరో కంచుకోట. 2009లో ఉనికిలోకి వచ్చింది. తృణమూల్ సీనియర్ నేత సుదీప్ బందోపాధ్యాయ్ హ్యాట్రిక్ కొట్టారు. ఈసారీ బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి తృణమూల్ మాజీ నేత తపస్ రాయ్ పోటీ చేస్తున్నారు. తృణమూల్ నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, పార్టీ డిప్యూటీ చీఫ్ విప్‌గా ఉన్న ఆయన ఇటీవల తన ఇంట్లో ఈడీ సోదాలు జరిగిన కొద్ది రోజులకే బీజేపీ తీర్థం పుచ్చుకోవడం విశేషం! లెఫ్ట్ మద్దతుతో కాంగ్రెస్ తరఫున ప్రదీప్ భట్టాచార్య బరిలో ఉండటంతో ముక్కోణపు పోరు నెలకొంది. 20 శాతం పైగా ఉన్న ముస్లిం ఓటర్లు ఇక్కడ కీలకం.



• సయానీ ఘోష్

జాదవ్‌పూర్...

బరిలో బెంగాలీ నటి

ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోట. కోల్‌కతా పరిధిలోని ఈ స్థానంలో 2009 నుంచీ తృణమూల్ వరుస విజయాలు సాధిస్తోంది. సిట్టింగ్ ఎంపీ, ప్రముఖ నటి మిమి చక్రవర్తి ఇటీవలే తృణమూల్‌కు, లోక్‌సభ సభ్యత్వానికి గుడ్‌బై చెప్పారు. దాంతో ఈసారి మరో బెంగాలీ నటి, తృణమూల్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సయానీ ఘోష్‌కు దీదీ టికెటిచ్చారు. బీజేపీ నుంచి అనిర్బన్ గంగూలీ, సీపీఎం నుంచి శ్రీజన్ భట్టాచార్య బరిలో ఉన్నారు.



• మాలా రాయ్

కోల్‌కతా దక్షిణ్...

దీదీ అడ్డా

ఇది మమత కంచుకోట. 1991, 1996ల్లో కాంగ్రెస్ తరఫున గెలిచిన ఆమె తర్వాత 2009 దాకా సొంత పార్టీ తృణమూల్ తరఫున నెగ్గారు. ఆమె సీఎం అయ్యాక కూడా ఇక్కడ తృణమూల్ జెండాయే ఎగురుతోంది. ఈసారి కూడా సిట్టింగ్ ఎంపీ మాలా రాయ్ బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి దేబశ్రీ చౌదరి, సీపీఎం అభ్యర్థిగా సైరా షా హలీం రేసులో ఉన్నారు. పోటీ ప్రధానంగా తృణమూల్, బీజేపీ మధ్యే నెలకొంది.



• ప్రతిమా మండల్

జయనగర్...

టఫ్ ఫైట్

అపార అటవీ సంపదకు నెలవైన ఎస్సీ రిజర్వుడ్ స్థానం. సజ్నేఖాలీ పక్షుల సంరక్షణ కేంద్రం, సుందర్బన్ మాగ్రూవ్ నేషనల్ పార్క్ దీని పరిధిలోవే. 2004 దాకా ఆరెస్పీ కంచుకోట. 2014 నుంచి తృణమూల్ పాగా వేసింది. ఆ పార్టీ సిట్టింగ్ ఎంపీ ప్రతిమా మండల్ హ్యాట్రిక్‌పై గురి పెట్టారు. బీజేపీ నుంచి గత ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చిన అశోక్ కందారీయే మళ్లీ బరిలో ఉన్నారు. 2019లో ఆయనకు 4.5 లక్షల ఓట్లు వచ్చాయి! కాంగ్రెస్ దన్నుతో సీపీఎం సమేంద్రనాథ్ మండల్‌ను పోటీలో నిలిపింది.



• అశోక్ పురకాయిత్

మథురాపూర్..

హోరాహోరీ

ఈ కూడా ఎస్సీ రిజర్వుడ్ స్థానంలో కమ్యూనిస్టులదే ఆధిపత్యం. 94 శాతం మంది గ్రామీణ ప్రజలే. 30 శాతం మంది ఎస్సీ ఓటర్లు. 2009 తర్వాత ఇక్కడ తృణమూల్ జెండా పాతింది. ఆ పార్టీ నుంచి బపీ హల్దార్ పోటీలో ఉన్నారు. బీజేపీ అశోక్ పురకాయిత్‌ను బరిలోకి దించింది. కాంగ్రెస్ దన్నుతో సీపీఎం శరత్ చంద్ర హల్దర్‌ను పోటీలో నిలిపింది. దీంతో త్రిముఖ పోరు ఆసక్తికరంగా మారింది.

విపక్షాలు చల్లే బురదలోనే కమల వికాసం

- నేను లంచాలు తీసుకోను.. తీసుకోనివ్వను
- జూన్ 4 తర్వాత అవినీతిపై యుద్ధం ఉధృతం
- జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రచారంలో మోదీ



దుమ్కా: ''బురద చల్లి మోదీని భయకంపితులను చేయగలమని ప్రతిపక్ష నాయకులు అనుకుంటున్నారు. వారు ఎంత ఎక్కువ బురద చల్లితే అన్ని ఎక్కువ కమలాలు విరగబూస్తాయి. ఆ సంగతి వారికి అర్థం కావడం లేదు'' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. విపక్ష నాయకుల బండారం తాను బయటపెడుతుండటంతో వారు తట్టుకోలేక తనపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు లాక్కొని ఓటు బ్యాంక్‌కు కట్టబెట్టడానికి విపక్ష 'ఇండియా' కూటమి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. తాను జీవించి ఉన్నంతకాలం రిజర్వేషన్లను కాపాడుతానని ప్రకటించారు. మంగళవారం జార్ఖండ్‌లోని దుమ్కా, పశ్చిమ బెంగాల్‌లోని బరాసత్‌లో ఎన్నికల ప్రచార సభల్లో మోదీ మాట్లాడారు. జూన్ 4 తర్వాత అవినీతిపై యుద్ధం ఉధృతం చేస్తామని వెల్లడించారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తాను లంచాలు తీసుకోనని, ఎవరినీ తీసుకోనివ్వనని తేల్చిచెప్పారు. ఒకవేళ ఎవరైనా లంచాలు తీసుకుంటే తిరిగి ఇచ్చేయాల్సిందేనని, ఇది తన కొత్త గ్యారంటీ అన్నారు.

'లవ్ జిహాద్' పుట్టింది జార్ఖండ్‌లోనే...

జార్ఖండ్‌లోని సంథాల్ పరగణాల్లో గిరిజనుల జనాభా తగ్గిపోతోందని, అక్రమ వలసలే ఇందుకు కారణమని ప్రధానిమంత్రి మండిపడ్డారు. జేఎంఎం ప్రభుత్వం అక్రమ వలసదార్లను ప్రోత్సహిస్తోందని ధ్వజమెత్తారు. అక్రమ వలసదార్లు గిరిజనుల భూములు కబ్జా చేస్తున్నారని, మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నారని, వారిని వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. 'లవ్ జిహాద్' పదం మొదట జార్ఖండ్‌లోనే పుట్టిందన్నారు. జేఎంఎం ప్రభుత్వం మత రాజకీయాలు, బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం ఓటు జిహాద్ చేసే వారిని సంతోషపర్చడానికి ఓబీసీ యువత హక్కులను కాజేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ప్రధాని మోదీ రోడ్ షోలో పాల్గొన్నారు. బాగ్‌బజార్‌లోని శారదా మాత ఇంటిని దర్శించుకున్నారు. ఆమెకు నివాళులర్పించారు. అనంతరం శ్యామ్‌బజార్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

మూడు రోజులపాటు మోదీ ధ్యానం

ఈ నెల 30 నుంచి కన్యాకుమారి వివేకానంద రాక్ మెమోరియల్‌లో ధ్యానం చేయనున్న ప్రధాని

న్యూఢిల్లీ/చెన్నై: లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు రోజులపాటు ధ్యానం చేయనున్నారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రం నుంచి వచ్చే 1వ తేదీ సాయంత్రం దాకా తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారిలోని స్వామి వివేకానంద రాక్ మెమోరియల్ ధ్యాన మండపంలో ఆయన ధ్యానం చేస్తారని బీజేపీ నేతలు మంగళవారం వెల్లడించారు. 2019 ఎన్నికల ప్రచార సమయంలో ప్రధాని మోదీ ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ గుహలో ధ్యానం చేసిన సంగతి తెలిసిందే. ఈసారి ఆయన దక్షిణాదిని ఎంచుకున్నారు. స్వామి వివేకానందను మోదీ తన ఆధ్యాత్మిక గురువుగా భావిస్తుంటారు. కన్యాకుమారి రాక్ మెమోరియల్‌లో వివేకానంద మూడు రోజులపాటు ధ్యానం చేశారు. శివుడి కోసం పార్వతీదేవి ఇక్కడే తపస్సు చేశారని చెబుతుంటారు. ఇప్పుడు అదే ప్రదేశంలో మోదీ ధ్యానం చేయబోతున్నారు.

సీజేఐ పరిశీలనకు.. కేజ్రీవాల్ పిటిషన్

న్యూఢిల్లీ: మధ్యంతర బెయిల్ గడువును పొడిగించాలంటూ ఆప్ నేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఆ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పరిశీలనకు పంపించనున్నట్లు వెల్లడించింది. మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై అరెస్టయిన కేజ్రీవాల్‌కు అనారోగ్య కారణాలతో సుప్రీంకోర్టు జూన్ ఒకటో తేదీ వరకు బెయిలిచ్చిన విషయం తెల్సిందే. జూన్ 2వ తేదీన తిహార్ జైలు అధికారుల ఎదుట లొంగిపోవాల్సి ఉంది. మంగళవారం కేజ్రీవాల్ పిటిషన్ వెకేషన్ బెంచ్‌లోని జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ విశ్వనాథన్‌ల ముందుకు వచ్చింది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కేజ్రీవాల్ కొన్ని అత్యవసర వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందని, బెయిల్ మరో వారం పొడిగించాలంటూ ఆయన తరఫున సీనియర్ లాయర్ అభిషేక్ మనుసింఘ్వి కోరారు. పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టాలని తెలిపారు. అయితే, ధర్మాసనం 'వాదనలు విన్నాం. తీర్పు రిజర్వు చేశాం. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి ఎదుట ఉంచుతున్నాం' అని తెలిపింది.

నిర్దోషిగా బయటపడిన 'డేరా' బాబా

పంజాబ్, హరియాణా హైకోర్టు తీర్పు



చండీగఢ్: ఇరవై రెండు సంవత్సరాల క్రితం నాటి హత్య కేసులో డేరా సచ్చా సౌదా ఆశ్రమం అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ బాబాను నిర్దోషిగా ప్రకటిస్తూ పంజాబ్, హరియాణా హైకోర్టు మంగళవారం తీర్పు వెలువర్చింది. బాబాతోపాటు మరో నలుగురినీ నిర్దోషులుగా తేల్చింది. అయితే తన శిష్యులైన ఇద్దరు సాధ్విలను అత్యాచారం చేశారన్న కేసులో 2017లో దోషిగా తేలడంతో ప్రస్తుతం బాబా హరియాణాలోని రోహ్‌తక్‌లో ఉన్న సునారియా జైలులో ఖైదీగా 20 ఏళ్ల కారాగార శిక్ష అనుభవిస్తున్న విషయం తెల్సిందే. 2002లో డేరా సచ్చా సౌదా ఆశ్రమ మాజీ మేనేజర్ రంజిత్‌సింగ్ హత్య కేసు తీర్పును మంగళవారం జస్టిస్ సురేశ్వర్ ఠాకూర్, జస్టిస్ లలిత్ బాత్రాల డివిజన్ బెంచ్ వెలువర్చింది. గతంలో ఈ కేసులో బాబాతోపాటు మరో నలుగురిని దోషులుగా ప్రకటిస్తూ 2021 అక్టోబర్‌లో పంచకులలోని సీబీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును వీరంతా హైకోర్టులో సవాల్ చేయడం తెల్సిందే. ఆనాడు వీరందరికీ సీబీఐ కోర్టు 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది.

ఢిల్లీ మంత్రి అతిశీకి కోర్టు సమన్లు

న్యూఢిల్లీ: బీజేపీ నేత వేసిన పరువునష్టం కేసులో ఆప్ నేత, ఢిల్లీ మంత్రి అతిశీకి కోర్టు సమన్లు పంపింది. ఆప్ ఎమ్మెల్యేలను ప్రలోభాలతో లొంగదీసుకునేందుకు బీజేపీ ప్రయత్నించిందంటూ అతిశీ చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ ఢిల్లీ విభాగం మీడియా హెడ్ ప్రవీణ్ శంకర్ కపూర్ ఏప్రిల్ 30న ఢిల్లీ కోర్టులో పిటిషన్ వేశారు. ఆప్‌కు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలకు రూ.25 కోట్ల చొప్పున బీజేపీ ఇవ్వజూపిందని అతిశీ చేసిన ఆరోపణల కారణంగా తనకు, తమ పార్టీ ప్రతిష్టకు భంగం వాటిల్లిందని అందులో పేర్కొన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న కోర్టు జూన్ 29వ తేదీన తమ ఎదుట హాజరుకావాల్సిందిగా అతిశీకి సమన్లు పంపించింది. పిటిషన్‌దారు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌పైనా ఆరోపణలు చేశారు. ప్రాథమికంగా ఆధారాలు లేనందున కేజ్రీవాల్‌కు నోటీసులు పంపడం లేదని కోర్టు పేర్కొంది.

షాజహాన్ షేక్‌పై హత్యాయత్నం కేసు

సందేశ్‌ఖాలి ఉదంతంపై నమోదు చేసిన సీబీఐ

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాలిలో జనవరి 5వ తేదీన సోదాలకు వెళ్లిన ఈడీ అధికారులపై దాడి చేసిన కేసులో సస్పెండైన టీఎంసీ నేత షాజహాన్ షేక్, అతడి సోదరుడు మరో ఐదుగురిపై సీబీఐ సెక్షన్ 120–బీ(నేరపూరిత కుట్ర), సెక్షన్ 307 (హత్యాయత్నం) కింద కేసులు నమోదు చేసింది. ఈ ఘటనకు సంబంధించిన మొదటి చార్జిషీట్‌ను బసీర్‌హాత్ స్పెషల్ కోర్టులో సోమవారం దాఖలు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. షాజహాన్‌ను ఫిబ్రవరి 29వ తేదీన రాష్ట్ర పోలీసులు అరెస్ట్ చేయగా మార్చి 6న సీబీఐ కస్టడీలోకి తీసుకుంది. రేషన్ పంపిణీ కుంభకోణం ఆరోపణలపై షేక్ నివాసంలో సోదాలకు వెళ్లిన ఈడీ అధికారులపై అతడి అనుచరులు సుమారు వెయ్యి మంది దాడికి దిగారు. ఈ కేసులో షాజహాన్‌పై కీలక కుట్రదారుగా ఆరోపణలున్నాయి.

వారణాసి వెళ్లే విమానానికి బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: వారణాసి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో తీవ్ర కలకలం రేపింది. 'bomb @5.30 am' అని రాసి ఉన్న కాగితం విమానం మరుగుదొడ్డిలో ఉదయం 5 గంటల సమయంలో పైలట్‌కు కనిపించింది. ఆయన వెంటనే కంట్రోల్ రూంకు సమాచారమిచ్చారు. నిబంధనల మేరకు 176 ప్రయాణికులతో టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న విమానాన్ని తక్షణమే దూరంగా తీసుకెళ్లారు. అత్యవసర ద్వారాల గుండా ప్రయాణికులందరినీ ఖాళీ చేయించారు. ఆపైన విమానంలో క్షుణ్నంగా తనిఖీలు పూర్తి చేశారు. ఎటువంటి అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో బెదిరింపుగా తేల్చారు. మరో విమానంలో ప్రయాణికులను 11.10 గంటల సమయంలో వారణాసికి పంపారు. బెదిరింపు ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు 'ఇండిగో' తెలిపింది.

మిజోరంలో 'రెమాల్' బీభత్సం

25 మంది మృతి

ఐజ్వాల్: మిజోరంలో 'రెమాల్' తుపాను బీభత్సం సృష్టించింది. కుండపోత వానల కారణంగా కొండచరియలు విరిగిపడి ఐజ్వాల్ శివారులో రాళ్ల క్వారీ కుప్పకూలి 14 మంది చనిపోయారు. మెల్తుమ్–హిలిమన్ మధ్య ఉన్న క్వారీలో మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. వెంటనే స్పందించిన యంత్రాంగం ఇద్దరిని రక్షించగలిగింది. ఘటనాస్థలి నుంచి 13 మృతదేహాలను వెలికితీసింది. శిథిలాల కింద మరో 8 మంది చిక్కుకుని ఉంటారనే ఆందోళన వ్యక్తమవుతోంది. మృతుల్లో నాలుగేళ్ల బాలుడు, ఆరేళ్ల బాలిక ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సహాయక చర్యలకు కుండపోత వర్షాలు అడ్డంకిగా మారాయన్నారు. రాష్ట్రంలో వర్షం సంబంధ ఇతర ఘటనల్లో మరో 11 మంది మృతిచెందారు. వరదలతో ఐజ్వాల్‌లోని సాలెంవెంగ్‌లో ముగ్గురు కొట్టుకుపోయారు. హుంటార్ వద్ద ఆరో నంబర్ జాతీయ రహదారి కొట్టుకుపోవడంతో ఐజ్వాల్‌కు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

పీఎంఎల్–ఎన్ చీఫ్‌గా మళ్లీ నవాజ్ షరీఫ్

లాహోర్: పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్(పీఎంఎల్–ఎన్)పార్టీ అధ్యక్షుడిగా మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్(74) మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పనామా పత్రాల కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2018లో ఆయన పార్టీ అధ్యక్ష పదవి నుంచి వైదొలిగారు. ఇదే కేసులో 2017లోనే నవాజ్ ప్రధాని పదవికి రాజీనామా చేయడం తెల్సిందే. నవాజ్ సోదరుడు, ప్రస్తుత ప్రధాని షెహబాజ్ షరీఫ్ అప్పటి నుంచి పార్టీ అధ్యక్ష బాధ్యతల్లో ఉన్నారు. మే మొదట్లో షెహబాజ్ షరీఫ్ పార్టీ అధ్యక్ష బాధ్యతలకు రాజీనామా చేశారు. దీంతో, మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నవాజ్ షరీఫ్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పంజాబ్ పీఎంఎల్–ఎన్ అధ్యక్షుడు రానా సనావుల్లా తెలిపారు. ఫిబ్రవరిలో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఏపార్టీకీ పూర్తి మెజారిటీ రాకపోవడంతో పీఎంఎల్–ఎన్, పీపీపీ మరికొన్ని పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైంది. సోదరుడు షెహబాజ్‌ను ప్రధాని కుర్చీపై కూర్చోబెట్టిన నవాజ్ షరీఫ్ తెరవెనుక నుంచి చక్రం తిప్పుతున్నారు.

ఆరో విడతలో 63.37% పోలింగ్

- నాలుగో విడతలో అత్యధికం..
- ఐదో విడతలో అత్యల్పం: ఈసీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 25వ తేదీన 58 సీట్లకు ఆరో విడత జరిగిన పోలింగ్‌లో 63.37 శాతం పోలింగ్ నమోదైంది. ఈ విడతలో అర్హులైన మొత్తం 11.13 కోట్ల మందికి గాను 7.05 కోట్ల మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల కమిషన్(ఈసీ) మంగళవారం తెలిపింది. 2019 ఎన్నికల్లో ఆరో విడతలో 59 సీట్లకు జరిగిన పోలింగ్‌లో 64.4 శాతం మంది ఓటేసినట్లు ఈసీ వివరించింది. అదేవిధంగా, నాలుగో విడతలో అత్యధికంగా 69.16 శాతం మంది ఓటేయగా, అత్యల్పంగా ఐదో విడతలో 62.20 శాతం మంది మాత్రమే ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఈసీ వివరించింది. తాజా ఎన్నికల్లో మొదటి ఆరు విడతల్లో కలిపి 87.54 కోట్ల ఓటర్లకు గాను 57.77 కోట్ల మంది ఓట్లేశారు. ప్రపంచంలోనే అత్యధికంగా మన దేశంలో 96.88 కోట్ల మంది ఓటర్లున్నారు.

ఆయన మాజీ సీఎం అవడం ఖాయం

ఒడిశా సీఎం నవీన్‌పట్నాయక్‌పై అమిత్ షా వ్యాఖ్య


భద్రక్/జాజ్‌పూర్(ఒడిశా): ఒడిశా శాసనసభ ఎన్నికల్లో 75కుపైగా సీట్లు సాధించి ప్రస్తుత ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను జూన్ 4 తర్వాత మాజీ ముఖ్యమంత్రిని చేస్తామని బీజేపీ అగ్రనేత అమిత్ షా వ్యాఖ్యానించారు. భద్రక్ లోక్‌సభ నియోజకవర్గంలోని చాంద్‌బలీ ప్రాంతంలో మంగళవారం అమిత్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. '' జూన్ 4 తర్వాత నవీన్ బాబు సీఎంగా ఉండరు. మాజీ సీఎం అవుతారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలు, 75 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుంది' అని అమిత్ అన్నారు. ఒడిశాలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఒకేసారి జరుగుతున్న విషయం తెల్సిందే.

రానున్నది కూటమి ప్రభుత్వమే: లాలు

పట్నా: ప్రధానమంత్రి మోదీ తనను దేవుడే పంపించాడంటూ చేసిన వ్యాఖ్యలపై ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ స్పందించారు. ఆయన మంగళవారం 'ఎక్స్'లో..'మోదీ తనను తాను దేవుడి అవతారమని, దేవదూత అని చెప్పుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు త్వరలోనే వెల్లడవుతాయి. మోదీ గద్దె దిగక తప్పదు. జూన్ 4వ తేదీ తర్వాత కేంద్రంలో ఏర్పాటయ్యేది ఇండియా కూటమి ప్రభుత్వమే'అని పేర్కొన్నారు. మూడోసారి కూడా ఎన్డీఏ ప్రభుత్వమే వస్తే రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు రద్దు చేస్తుందన్నారు.

హృదయం, ప్రాణం, రక్తంతో రాజ్యాంగాన్ని కాపాడుతాం

రాహుల్ గాంధీ హామీ



బనస్‌గావ్: కేంద్రంలో విపక్ష 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై అమల్లో ఉన్న 50 శాతం పరిమితిని తొలగిస్తామని, బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. భారత రాజ్యాంగాన్ని హృదయం, ప్రాణం, రక్తంతో కాపాడుతామని ప్రకటించారు. మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని బనస్‌గావ్‌లో ఎన్నికల ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. కేవలం అంబానీకి, అదానీకి మేలు చేయడానికే ప్రధాని మోదీని భగవంతుడు భూమికిపైకి పంపించాడని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో సిద్ధాంతాల మధ్య పోరాటం కొనసాగుతోందన్నారు. ఇండియా కూటమి, రాజ్యాంగం ఒకవైపు, రాజ్యాంగాన్ని అంతం చేయాలనుకుంటున్న శక్తులు మరోవైపు ఉన్నాయని చెప్పారు. భారత రాజ్యాంగానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన జీవితాన్ని అంకితం చేశారని ఉద్ఘాటించారు. దళితులకు రాజ్యాంగం తగిన గౌరవం కల్పించిందని గుర్తుచేశారు. అలాంటి రాజ్యాంగాన్ని రద్దు చేయాలని బీజేపీ కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. అంబేడ్కర్, జవహర్‌లాల్ నెహ్రూ ఇచ్చిన ఇచ్చిన రాజ్యాంగం జోలికి ఎవరూ రావొద్దని రాహుల్ గాంధీ హెచ్చరించారు.

ఈ ఎన్నికలు చాలా కీలకం

ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో 22 మంది బిలియనీర్లను సృష్టించారని, తమకు అధికారం అప్పగిస్తే దేశంలో కోట్లాది మంది లక్షాధికారులను సృష్టిస్తామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మోదీ తన బిలియనీర్ మిత్రుల కోసం రూ.16 లక్షల కోట్ల రుణాలు రద్దు చేశారని, ఈ విషయాన్ని దేశం ఎప్పటికీ మర్చిపోదని అన్నారు. పేదలను లూటీ చేసి, పెద్దలకు కట్టబెట్టారని, ఆ సొమ్మంతా విదేశాలకు తరలిపోయిందని విమర్శించారు. ఈ ఎన్నికలు ప్రజలకు చాలా కీలకమని వెల్లడించారు. మన దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రిజర్వేషన్లను కాపాడుకోవడానికి ఈ ఎన్నికలను ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఉడుకుతున్న ఉత్తరాది

ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు


న్యూఢిల్లీ/కొచ్చి: ఆదిత్యుని ఆగ్రహ కిరణాలకు ఉత్తరభారతం ఎండలతో భగభగ మండుతోంది. వడగాలులు తోడవడంతో వేసవి కాలంలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఢిల్లీలో మంగళవారం దాదాపు 50 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ముంగేశ్‌పూర్, నరేలా ప్రాంతాల్లో 49.9 డిగ్రీ సెల్సియస్, నజఫ్‌గఢ్‌లో 49.8 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. ఇది ఇక్కడి సాధారణ ఉష్ణోగ్రత కంటే 9 డిగ్రీసెల్సియస్ ఎక్కువ ఉండటం గమనార్హం. ఉత్తర ప్రదేశ్, హరియాణా, రాజస్తాన్, పంజాబ్‌లోనూ ఎండలు ఇలాగే మండిపోయాయి. రాజస్తాన్‌లోని చురులో అత్యధికంగా 50.5 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది ఇక్కడి సాధారణ ఉష్ణోగ్రత కంటే 7 డిగ్రీ సెల్సియస్ ఎక్కువ. హరియాణాలోని సిర్సాలో 50.3, హిసార్, పంజాబ్‌లోని భటిండాలో 49.3, ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ పట్టణంలో 49, ప్రయాగ్‌రాజ్‌లో 48.2, వారణాసి, కాన్పూర్‌లో 47.6 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యప్రదేశ్‌లోనూ నాలుగైదు ప్రాంతాల్లో 48 డిగ్రీలకంటే ఎక్కువ ఉష్ణోగ్రత రికార్డయింది.

కేరళలో భారీ వర్షాలు

ఉత్తరాది ప్రజలు ఉక్కపోతతో చెమట చిందిస్తుంటే దక్షిణాదిన కేరళలో భారీ వర్షాలతో ప్రజలు తడిసి ముద్దయ్యారు. ఈదురుగాలులతో కూలిన భారీ వర్షం కేరళ దక్షిణ, మధ్య ప్రాంతాలను అతలాకుతలం చేసింది. కొన్ని చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఇళ్లు కూలిపోయాయి. దీంతో కొందరు పునరావాస శిబిరాల్లో తలదాచుకున్నారు. చాలా జిల్లాల్లో పర్యాటక కేంద్రాలను మూసేశారు. కొండ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నిషేధించారు. కొచ్చి సిటీ, ఎర్నాకులం జిల్లాల్లో గంటల తరబడి వర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కొచ్చిలోని కలమసెర్రీ ప్రాంతంలో వందలాది ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. మీనాచిల్, కొల్లియార్ నదుల్లో నీటిమట్టాలు పెరిగాయి. అరవిక్కర, మలాంకర డ్యామ్‌ల గేట్లను స్వల్పంగా ఎత్తారు. జలాశయాలు ఉప్పొంగడంతో శివారు గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. తిరువనంతపురంలోని ముథలపోజీ తీరం వద్ద భారీ అల కారణంగా పడవ బోల్తాపడి మత్స్యకారుడు చనిపోయాడు.

యూకే నా సొంతిల్లు

- అమెరికాకు మకాం మార్చట్లేను
- బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ స్పష్టీకరణ



లండన్: త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల తర్వాత తన కుటుంబం అమెరికాకు తరలిపోతుందని సొంత పార్టీలో చక్కర్లు కొడుతున్న వార్తను బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ కొట్టిపారేశారు. మంగళవారం సునాక్ ఆగ్నేయ ఇంగ్లాండ్‌లోని అమెర్షామ్ ప్రాంతంలో కన్జర్వేటివ్ పార్టీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీ మద్దతుదారులనుద్దేశించి ప్రసంగించారు. '' మాజీ విదేశాంగ మంత్రి, పార్టీ నేత జాక్ గోల్డ్‌స్మిత్ మాటలు వింటుంటే ఆశ్చర్యమేస్తోంది. అసలు ఆయనతో నేను మాట్లాడక చాలా కాలమైంది. నా విషయాలు ఆయనకెలా తెలుస్తాయి. అయినా నేను బ్రిటన్‌ను వదిలి అమెరికాకు వెళ్లట్లేను. యూకే నా సొంతిల్లు. ఇక్కడి సౌతాంప్టన్‌లో పుట్టి పెరిగా'' అని సునాక్ వ్యాఖ్యానించారు. బ్రిటన్‌ను వీడతారంటూ వచ్చిన వదంతులను ఇటీవల 'లూజ్ ఉమెన్' టెలివిజన్ షోలోనూ రిషి కొట్టిపారేశారు. ''ఇక్కడ ఎంపీగా ఉండటానికే ఇష్టపడుతున్నా. ఇక్కడే ఉంటా. నా నియోజకవర్గ ప్రజలను ప్రేమిస్తా. నార్త్ యార్క్‌షైర్‌లోని నా సొంతిల్లు అంటే చెప్పలేని ప్రేమ'' అని అన్నారు. అయితే ముందస్తు ఎన్నికలకు సొంత పార్టీ నేతలు సన్నద్ధం కాకపోవడం, ఈసారి విపక్ష లేబర్ పార్టీ మెజారిటీ సాధిస్తుందని సర్వేల్లో తేలడంతో సొంత కన్జర్వేటివ్ పార్టీ ఎంపీల్లో గుబులు పెరిగింది. దీంతో చాలా మంది ఎంపీలు పార్టీ మారొచ్చని వార్తలొచ్చాయి.

స్వలింగ సంపర్కులకు పోప్ క్షమాపణలు

వాటికన్ సిటీ: ఒక సమావేశంలో స్వలింగ సంపర్కులనుద్దేశిస్తూ అసభ్య పదాన్ని ఉచ్చరించారని పోప్ ఫ్రాన్సిస్‌పై విమర్శలు వెల్లువెత్తడంతో ఆయన క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు క్రైస్తవుల మత కేంద్రస్థానం వాటికన్ అధికార ప్రతినిధి మేటియో బ్రూనీ మంగళవారం ఒక ప్రకటన విడుదలచేశారు. '' స్వలింగ సంపర్క పురుషులను కించపరచాలనే ఉద్దేశంతో ఆయన ఆ పదాన్ని ఉచ్చరించలేదు. సరదా సంభాషణలో అనుకోకుండా దొర్లిన ఆ పదం వల్ల బాధపడిన వర్గానికి పోప్ క్షమాపణ చెబుతున్నారు' అని వాటికన్ ఆ ప్రకటనలో పేర్కొంది. మే 20వ తేదీన ఇటాలియన్ బిషప్‌లతో 87 ఏళ్ల పోప్ ప్రత్యేకంగా సమావేశయ్యారు. 'గే'లను మతబోధకులుగా శిక్షణనిచ్చేందుకు మళ్లీ అనుమతిస్తే ఎలా ఉంటుంది అంటూ చర్చ జరిగింది. దీంతో పోప్ '' ఆ 'కట్టె'పుల్లలను మతబోధకుల శిక్షణకు అనుమతించకండి. అయినా ఇప్పటికే 'గే' వాసన దట్టంగా కమ్ముకుంది కదా' అని పోప్ సరదాగా మాట్లాడారు. అంతర్గతంగా జరిగిన ఈ భేటీ వివరాలను స్థానిక మీడియా బట్టబయలు చేయడంతో పోప్ పలికిన ఇటాలియన్ పదంపై విమర్శలు వెల్లువెత్తాయి. స్వలింగ సంపర్కులను మతబోధనకు అనర్హులుగా ప్రకటిస్తూ 2005లో వాటికన్ ఒక నిబంధన తెచ్చింది. దానిని 2016లో పోప్ సమర్థించారు. అర్జెంటీనాకు చెందిన పోప్ ఫ్రాన్సిస్‌కు ఇటాలియన్ భాషపై అంతగా పట్టులేదు. అందుకే ఇలా భాషలో తప్పుడు దొర్లిన ఘటనలూ గతంలోనూ జరిగాయి. ' ఒక మతబోధకుడు గే అయి ఉండొచ్చు. అతను దేవుని కరుణ కోసం అన్వేషిస్తుండొచ్చు. అలాంటప్పుడు నేనెవర్ని అతడి స్థాయిని నిర్ణయించడానికి?' అని గతంలో పోప్ స్వలింగ సంపర్కుల అనుకూల వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
బుధవారం : 29 : మే : 2024

జూన్‌లోనూ పామోలిన్, కంది పప్పు పంపిణీ

సాక్షి, చెన్నై: రేషన్ దుకాణాలలో మేనెల కోటగా పామోలిన్, కందిపప్పును జూన్ మొదటి వారం వరకు పంపిణీ చేస్తామని పౌరసరఫరాల విభాగం అధికారులు మంగళవారం ప్రకటించారు. తమిళనాడు ప్రభుత్వం ప్రత్యేక ప్రజా పంపిణీ పథకం ద్వారా 2.23 కోటు కుటుంబ కార్డుదారులకు ప్రతి నెలా కిలో కందిపప్పు రూ. 30కు , లీటర్ పామాయిల్ రూ.25కు సబ్సిడీపై అందిస్తున్నారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కందిపప్పు, పామోలిన్ కొనుగోలులో జాప్యం తప్పలేదు. దీంతో మే నెలలో వీటిని పూర్తి స్థాయిలో కుటుంబ కార్డుదారులకు అందజేయలేని పరిస్థితి నెలకొంది. దీనిని పరిగణనలోకి తీసుకున్న అధికారులు మే నెల కోటా కంది పప్పు, పామోలిన్‌ను జూన్‌లో తీసుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

న్యూస్‌రీల్

1న ఢిల్లీకి సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై : ఇండియా కూటమి భేటీ కోసం సీఎం స్టాలిన్ వెళ్లనున్నారు. ఇందులో ప్రస్తావించాల్సిన అంశాల గురించి మంగళవారం అన్నా అరివాలయంలో పార్టీ సీనియర్లతో ఆయన చర్చించారు. వివరాలు.. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగింపు దశకు చేరిన విషయం తెలిసిందే. గెలుపు ధీమాతో ఇండియా కూటమి ఉంటోంది. ఈ పరిస్థితుల్లో వివిధ పార్టీల నేతలతో సమావేశమయ్యేందుకు కూటమి నేతలు నిర్ణయించారు. జూన్ ఒకటో తేదీన ఢిల్లీలతో ఈ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి సీఎం స్టాలిన్ హాజరు కానున్నారు. ఈ సమావేశంలో డీఎంకే తరపున ప్రస్తావించాల్సిన అంశాలు, ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన పక్షంలో తమ పాత్ర తదితర అంశాల గురించి పార్టీ సీనియర్లతో చెన్నైలో స్టాలిన్ చర్చించారు. పార్టీ సీనియర్‌లు దురై మురుగన్, టీఆర్ బాలు, నెహ్రూ తదితరులు తేనాంపేటలోని డీఎంకే కార్యాలయం అన్నా అరివాలయంలో చర్చించారు. అదే సమయంలో ఎన్నికల ఫలితాల లెక్కింపునకు ముందుగా పార్టీ ఏజెంట్లు, లోక్‌సభ అభ్యర్థులు తదితరులుతో భేటీకి నిర్ణయించారు. ఓట్ల లెక్కింపు రోజున వీరు వ్యవహరించాల్సిన అంశాలు, చట్ట పరమైన సూచనలు తదితర అంశాలను వివరించే విధంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జూన్ ఒకటో తేదీ ఉదయం సమావేశం జరగనుంది. పార్టీ ఎంపీ, సీనియర్ న్యాయవాది ఎన్‌ఆర్ ఇళంగో అన్ని వివరాలను అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు తెలియజేయనున్నారు.

పాంబన్ వంతెన మార్గంలో పడవలపై నిషేధం

కొరుక్కుపేట: పాంబన్ రైల్ వంతెన మరమ్మతు పనుల కోసం ఆ మార్గంలో ఓడలు, ఫిషింగ్ బోట్‌ల రాకపై అధికారులు నిషేధం విధించారు. వివరాలు.. రామేశ్వరం పాంబన్ వంతెన వద్ద సుమారు 2.3 కి.మీ దూరంలో రైల్వే వంతెన ఉంది. ఇది భారతదేశంలోనే అతి పొడవైన సముద్ర వంతెన. ఇందులో ఓడలు వెళ్లేందుకు వీలుగా ఓ వంతెన కూడా ఉంది. సుమారు 110 ఏళ్లుగా వినియోగంలో ఉన్న ఈ వంతెన తుప్పు పట్టడంతోపాటు ఇనుప గర్డర్లు పాడైపోయాయి. 2022 నాటికి రూ.550 కోట్ల విలువ తో పాంబన్ కొత్త వంతెన నిర్మాణం గత ఏడాది ఆగస్టులో ప్రారంభమైంది. అలాగే ట్రాఫిక్‌ను నిలిపివేసి రామేశ్వరం వెళ్లే రైళ్లు ప్రస్తుతం మండబంవరం వరకు మాత్రమే నడుస్తున్నాయి. ఈ పరిస్థితిలో ప్రస్తుతం పంబన్ బ్రిడ్జి వద్ద కొత్త వేలాడే వంతెనను నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులు ప్రారంభించి వంతెన మధ్యలో స్టీల్ పిల్లర్లు నిర్మిస్తున్నారు. ఈనేపథ్యంలో సస్పెన్షన్ బ్రిడ్జి గుండా ఓడలు, డీప్ సీ ఫిషింగ్ పడవలు వెళ్లకుండా నిషేధం విధించినట్లు రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ అధికారులు తాజాగా తెలిపారు.

అగ్నికి టాటా!

- మరో నాలుగు రోజులు భానుడి సెగ
- నైరుతిపై రైతుల ఆశలు

సాక్షి, చెన్నై : అగ్ని నక్షత్రం మంగళవారంతో ముగిసింది. దీంతో ఎండలు తగ్గుముఖం పట్టనున్నాయి. అయితే మరో నాలుగైదురోజులు ఉత్తర తమిళనాడులో భానుడు సెగ తీవ్రంగా ఉంటుందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. తర్వాత నైరుతి రుతు పవనాల రాకతో వాతావరణం చల్లబడుతుందని పేర్కొంది. వివరాలు.. రాష్ట్రంలో ఏటా వేసవిలో ఎండలు తీవ్రంగా ఉంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాది భానుడి ప్రతాపం మరీఎక్కువగా కనిపించింది. రెండు నెలలు జన జీవితాన్ని భానుడు పిప్పి చేశారు. మే నెల మొదటి వారంలో అగ్ని నక్షత్రం(కత్తిరి)నెల ఆరంభంతో ఎండలు మరింతగా మండుతాయని భావించారు. అయితే అకాల వర్షం రూపంలో ఈ ఏడాది అగ్నినక్షత్రం వేళ భానుడి సెగ తగ్గినట్లయ్యింది. అదే సమయంలో రెమల్ తుఫాన్ పుణ్యమా అని ప్రస్తుతం గాలితో తేమ కరువైంది. దీంతో మళ్లీ మంగళవారం నుంచి భానుడి సెగ అనేక జిల్లాల్లో మొదలైంది. ఇదే రోజు అగ్ని నక్షత్రానికి చివరి రోజుకావడం గమనార్హం. మరో నాలుగైదురోజులు ఉత్తర తమిళనాడులోని పలు జిల్లాల్లో భానుడి ప్రతాపం అధికంగానే ఉంటుందని, ఆ తర్వాత క్రమంగా తగ్గే అవకాశాలు ఉన్నట్టు వాతవరణ కేంద్రం ప్రకటించింది. కేరళ తీరాన్ని నైరుతి రుతు పవనాలు తాకే సమయం ఆసన్నమైందని, ఇది క్రమంగా విస్తరించి పశ్చిమ కనుమల వెంబడి ఉన్న తమిళనాడు జిల్లాలో అధిక వర్షాన్ని కురిపించే అవకాశాలు ఉన్నట్టు ప్రకటించారు. ఈ పవనాల రూపంలో డెల్టా, ఉత్తర తమిళనాడులోమోస్తారుగా వర్షాలు ఎదురు చూడవచ్చు అని పేర్కొన్నారు.

మదురై, కోయంబత్తూర్‌కు హెలికాప్టర్ సేవలు

కొరుక్కుపేట: తమిళనాడులోని చెన్నై, మదురై, కోయంబత్తూరు వంటి ప్రధాన నగరాల మధ్య త్వరలో హెలికాప్టర్ సేవలను ప్రారంభించనున్నట్లు తమిళనాడు ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ నందూరి తెలిపారు. తమిళనాడులో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో ఫ్లయింగ్ ట్యాక్సీని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. ఈ దశలో దూరంగా ఉన్న ప్రధాన నగరాలకు హెలికాప్టర్లు నడపాల్సి ఉంది. ఈ సందర్భంగా తమిళనాడు ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ నందూరి మాట్లాడుతూ.. నేషనల్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ పౌర విమానయాన విధానం హెలికాప్టర్ విధానాన్ని రద్దు చేయడం ద్వారా తమిళనాడులోని ప్రధాన నగరాల్లో హెలికాప్టర్ సేవలు పునరుద్ధరణ జరుగుతోందన్నారు.

గ్రామాలే అభివృద్ధికి పట్టుకొమ్మలు


ఉత్తమ పంచాయతీలకు అవార్డులు అందజేస్తున్న సీఎం స్టాలిన్ (ఫైల్)


కొత్త గృహాల ప్రారంభోత్సవం (ఫైల్)

- రూ.1,484 కోట్లతో రోడ్లు
- రూ.4,035 కోట్లతో 2,97,414 గృహాల నిర్మాణం
- మహిళా బృందాలకు రూ.71,960 కోట్లు
- యువతకు మెరుగ్గా ఉపాధి అవకాశాలు
- గ్రామీణాభివృద్ధి నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి

రాష్ట్ర ప్రగతికి గ్రామాలే పట్టుకొమ్మలు అని, అందుకే వాటి అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. సీఎం స్టాలిన్ నేతృత్వంలో మూడేళ్లలో గ్రామాలలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నివేదికను మంగళవారం విడుదల చేసింది. ఇందులో రూ. 1484 కోట్లతో రోడ్లు, మహిళా బృందాలకు రూ. 71,960 కోట్ల రుణాలు, రూ. 4.035 కోట్లతో గృహాల నిర్మాణాలతోపాటు యువతకు ఉపాధి అవకాశాల కల్పన గురించి వివరించారు.

సాక్షి, చెన్నై: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై సీఎం స్టాలిన్ ప్రత్యేక దృష్టి సారించినట్టు రాష్ట్ర ప్రభుత్వం ముడేళ్ల ప్రగతి నివేదికలో పేర్కొంది. డీఎంకే మూడేళ్ల పాలనలో ఎన్నో ప్రాజెక్టులు ప్రవేశపెట్టి అమలు చేస్తూ వస్తోందని వివరించారు. 12,525 గ్రామ పంచాయతీలను కంప్యూటరీకరణ చేశామని, నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆస్తి పన్ను, నీటి పన్ను, వ్యాపార పన్ను, వివిధ ప్రణాళికలకు అనుమతులు, ప్లాట్లు, పౌర సంక్షేమానికి ప్రభుత్వం అనుమతులు, భవన నిర్మాణ అనుమతులు ఇలా.. అన్నీ ఈ- గవర్నెన్స్ విధానంలో అమలు చేస్తూ వస్తున్నామని గుర్తుచేశారు. అలాగే గ్రామ పంచాయతీలకు పరిపాలన కోసం ఆర్థిక పరిమితి రూ.2 లక్షల నుంచి రూ. 10 లక్షలు, యూనియన్ పంచాయతీలకు రూ. 10 నుంచి 25 లక్షలు, జిల్లా పంచాయతీలకు రూ. 20 నుంచి రూ. 50 లక్షలకు పెంచామని వివరించారు. అలాగే రాష్ట్రంలో ఉత్తమ పనితీరు కనబరుస్తున్న గ్రామ పంచాయతీలను గుర్తించి గాంధీ అవార్డులను అందజేస్తూ వస్తున్నామన్నారు. అవార్డు అందుకున్న పంచాయతీలకు రూ. 10 లక్షలు ప్రోత్సాహక నగదును అందజేస్తున్నామన్నారు.

ఉపాధి పథకంతో..

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాలకు అదనపు లబ్ధి చేకూరినట్టు పేర్కొన్నారు. 2,87,461కి ఈ పథకం ద్వారా ఉపాధి కల్పించినట్టు వివరించారు. నాబార్డ్ ఆర్ఐడీఎఫ్ పథకం కింద గత మూడేళ్లలో 550 కి.మీ 287 పొడవైన రహదారి పనులు, 342 వంతెన నిర్మాణ పనులు రూ.1,221 కోట్ల నిధులు కేటాయించామన్నారు. అలాగే రూ.354 కోట్ల అంచనా వ్యయంతో రోడ్డు పనులు, 151 వంతెనలు పూర్తి చేశామన్నారు. తమిళనాడు గ్రామీణ రహదారుల అభివృద్ధి పథకం ద్వారా 6,208 కి.మీ పొడవునా 4,606 రోడ్డు పనులు రూ. 1,484 కోట్లతో పూర్తి చేశామని వివరించారు. 9 జిల్లాల్లో రూ.20 కోట్ల అంచనా వ్యయంతో పట్టణ ప్రాంతానికి ఆనుకుని ఉన్న గ్రామీణ పంచాయతీల్లో 10 గ్యాస్ శ్మశాన వాటికల నిర్మాణానికి అనుమతి ఇచ్చామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ గృహ నిర్మాణ పథకం అమలు, పెరియార్‌సమత్తువ పురంల ఏర్పాటు గురించి ఈ నివేదికలో ప్రస్తావించారు. గ్రామీణాభివృద్ధిలో భాగంగా పంచాయతీలకు 631 భవనాలు 73 బస్టాండ్‌లతోపాటు 5,377 పనులు పూర్తి చేశామని వివరించారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఏడాదికి 3 కోట్లు కేటాయిస్తూ, మూడేళ్లలో 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు గ్రామీణాభివృద్ధికి ఈ పథకం కింద రూ.2,106 కోట్లు కేటాయించామన్నారు. అలాగే ఒక్కో పార్లమెంటు సభ్యునికి ఆర్థిక సంవత్సరంలో రూ. 5 కోట్లు గ్రామీణాభివృద్ధి, పంచాయతీ శాఖ పథకాలకు అందజేశామన్నారు. తద్వారా ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. స్వచ్ఛ భారత్ ఉద్యమంలో భాగంగా ప్రతి ఇంటికి మరుగు దొడ్ల ఏర్పాటు దిశగా గ్రామాలలో 1,44,489 కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించామన్నారు. 2,940 కమ్యూనిటీ హెల్ సెంటర్ల నిర్మాణాలతో పాటు మన ఊరు పథకం ద్వారా 37 జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాల్లో డంపింగ్ యార్డ్‌లు, పాఠశాలల భవనాలు, అంగన్‌వాడీలు, తాగునీటి పథకాలు, కమ్యూనిటీ హెల్త్ సౌకర్యాలు, భూగర్భ డ్రైనేజీ పథకాలను పూర్తి చేశామన్నారు. అలాగే జల్ జీవన్ పథకంద్వారా 2024 చివరి నాటికి గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని కుటుంబాలకు అవసరమైన స్వచ్ఛమైన తాగునీరు అందించే విధంగా పైప్‌లైన్ కనెక్షన్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళాస్వయం సహాయక బృందాలకు రూ. 71,960 కోట్ల రుణాలను అందజేశామని, ఇది వారి అభ్యున్నతికి ఎంతో దోహదకరంగా ప్రకటించారు. స్వయం ఉపాధి పథకం, వృత్తి నైపుణ్యాల అభివృద్ధి శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా పేద యువతకు ఉపాధి అవకాశాలను దరిచేర్చామని ప్రకటించారు.

ఆకలి దినోత్సవం వేళ సహపంక్తి భోజనాలు


అన్నదానం చేస్తున్న విజయ్ అభిమానులు

సాక్షి, చెన్నై : ప్రపంచ ఆకలి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తమిళగ వెట్రి కళగం నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా సహపంక్తి భోజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు అన్నదానాలతో విజయ్ అభిమానులు ముందుకెళ్తారు. రాజకీయ పార్టీని ప్రకటించిన విజయ్ ప్రజా సేవలో నిమగ్నమయ్యే విధంగా ప్రస్తుతం కార్యక్రమాలను విస్తృతం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగాప్రపంచ ఆకలి దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ వర్గాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సంహపంక్తి భోజన కార్యక్రమాలను ఏర్పాటు చేయించారు. అన్నదానాలతో పేదల ఆకలి తీర్చేప్రయత్నం చేశారు. వాడవాడలా ఈ కార్యక్రమాలు విస్తృతంగా జరిగాయి. కొన్ని చోట్ల ఆహారం మిగిలిపోగా, వాటిని అనాథ ఆశ్రమాలకు అందజేశారు. చెన్నై తిరువొత్తియూరులో సంహపంక్తి భోజన కార్యక్రమాన్ని తమిళగ వెట్రి కళగం ప్రధాన కార్యదర్శి భుషిఆనంద్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, పార్టీ పరంగా ఏ నిర్ణయమైనాసరే విజయ్ ప్రకటిస్తారని, ఆయనే తీసుకుంటారని ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఆయన సూచనలు, సలహా మేరకు ప్రస్తుతం ఆకలిదినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జూన్ 22వ తేదీన విజయ్ బర్త్‌డే సందర్భంగా పెద్దఎత్తున కార్యక్రమాలకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. తమ పార్టీ వరకు 365 రోజుల ప్రజా సేవ చేయాలన్న నిర్ణయం, ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేయాలనే తపన ఉందన్నారు. సీమాన్ నేతృత్వంలో నామ్ తమిళర్ కట్చితో కలిసి పనిచేస్తారా? అని ప్రశ్నించగా పార్టీ పరంగా ఏ నిర్ణయమైనా విజయ్ ప్రకటిస్తారని, అంత వరకు ఎదురు చూడండి అంటూ ముగించారు.

కలైంజ్ఞర్ గృహ పథకానికి రూ. 3,100 కోట్లు

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో ఈ సంవత్సరం లక్ష కలైంజ్ఞర్ గృహాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ. 3,100 కోట్లను కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం కలైంజ్ఞర్ కరుణానిధి కలలగృహం పేరిట పథకాన్ని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. పేదలు, మధ్య తరగతి వర్గాలకు సొంతింటి కలను సాకారం చేసే విధంగా అమల్లోకి తెచ్చిన ఈ పథకం మేరకు ఈ ఏడాది లక్ష గృహాల నిర్మాణానికి సిద్ధమయ్యారు. ఇందుకోసం భారీగా నిధులను కేటాయించారు.

ఆగస్టులో ముత్తమిళ్ మహానాడు

- వేదికగా పళని
- 24, 25 తేదీలలో నిర్వహణ
- ప్రత్యేక వెబ్‌సైట్ ఆవిష్కరణ



వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న సలహా కమిటీ సభ్యులు

సాక్షి,చెన్నై: ఈ ఏడాది ఆగస్టు 24, 25 తేదీలలో అరుపడై వీడులలో ఒకటైన పళని వేదికగా ముత్తమిళ్ మురుగన్ మహానాడు జరగనుంది. ఇందుకోసం ప్రత్యేక వెబ్ సైట్‌ను మంగళవారం ఆవిష్కరించారు. దీని ద్వారా మురుగన్ సంబంధిత రచనలు, కవితలు, పరిశోధన పత్రాలను సమర్పించే అవకాశం కల్పించామని హిందూ దేవదాయ శాఖ ప్రకటించింది. వివరాలు.. తమిళుల ఆరాధ్య దైవం మురుగన్ వైభవాన్ని చాటే విధంగా హిందూ, దేవదాయ శాఖ , సలహాకమిటీల నేతృత్వంలో సుబ్రహ్మణ్య స్వామి భక్తుల కోసం ఆరుపడై వీడులలో ఒకటిగా ఉన్న ఆధ్యాత్మిక క్షేత్రం పళనిలో ముత్తమిళ్ మురుగన్ 2024 మహానాడు నిర్వహణకు నిర్ణయించారు. అంతర్జాతీయ స్థాయిలో జరగనున్న ఈ మహానాడుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ మత పెద్దలు , పెద్ద సంఖ్యలో ఆధ్యాత్మిక వేత్తలు, శివాచార్యులు , భక్తులు హాజరయ్యే విధంగా ఏర్పాట్ల మీద అధికారులు చర్యలు చేపట్టారు. ఈ రెండురోజుల వేదుకలో విదేశాల నుంచి వచ్చే అతిథులను ఆహ్వానించడమే కాకుండా పరిశోధనా పత్రాలను సమర్పించే వారి కోసం ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించారు. అలాగే, మతపరమైన వ్యవహారాలు, పర్యాటక, సాంస్కృతి, హిందూ ధర్మాదయ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి, స్పెషల్ డ్యూటీ ఆఫీసర్లు, కమిషనర్, ఉన్నత అధికారులు ఆధ్యాత్మిక పెద్దలతో ఈ మహానాడు కోసం కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీల పర్యవేక్షణలో సబ్ కమిటీలు సైతం ఏర్పాటయ్యాయి. దేవాలయాల ప్రదర్శన హాలు, పరిశోధనా పత్రాల కోసం ఓ ప్రయోగశాల, పెద్దల ప్రసంగాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, భక్తి సంగీతం, తదితర కార్యక్రమాలు ఈ మహానాడులో నిర్వహించనున్నారు. ఈ మహానాడు ముగింపు రోజున తమిళుల ఆరాధ్య దేవుడు మురుగన్ మహిమలు ప్రపంచానికి తెలియజేసే విధంగా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా తమిళం ఆంగ్లంలో రూపొందించబడిన ఈ వెబ్‌సైట్‌ను హిందూ చారిటబుల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు తవ తిరుకొమార మఠం సిరవై ఆధీనం కుమరగురు బరస్వామి, తవతిరు మైలం బొమ్మాపుర ఆధీనం శ్రీ శివజ్ఞాన బాలయ స్వామి, సత్యవేల్ మురుగనార్, సుకి శివం, మంగయ్య కరసి ఈ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ మహానాడుకు హాజరయ్యే వారు ఇందులో పేర్లను నమోదు చేసుకోవచ్చు. అలాగే మురుగన్ సంబంధిత అన్ని రకాల పత్రాలను సమర్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఈ వెబ్‌సైట్‌లో చేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. మణివాసన్, స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ కుమారగురుపరన్, కమిషనర్ మురళీధరన్, అదనపు కమిషనర్లు శంకర్, తిరుమల్, ప్రత్యేక అధికారులు సి. హరి ప్రియ, కవిత, జానకి తదితరులు పాల్గొన్నారు.

సంగమ క్షేత్రంలో 'మోదీ' ధ్యానం

- రేపు కన్యాకుమారికి రాక
- నిఘా వలయంలో సాగర తీరం
- వివేకానంద రాక్‌లో 2 రోజులు ధ్యానం


పీఎం మోదీ


వివేకానంద రాక్

సాక్షి, చెన్నై: మూడు సముద్రాలు కలిసే త్రివేణి సంగమం, సూర్యోదయం.. సూర్యాస్తమయాన్ని తన్మయత్వంతో తిలకించేందుకు ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రదేశంగా ఉన్న కన్యాకుమారిలో ప్రధాని నరేంద్రమోదీ రెండు రోజులు గడపనున్నారు. సముద్రం మధ్యలో ఉన్న వివేకానంద రాక్‌లో ఆయన ఈ రెండు రోజులు ధ్యానంలో లీనంకానున్నారు. ఇందుకోసం గురువారం సాయంత్రం కన్యాకుమారికి ఆయన రానుండడంతో సాగర తీరాన్ని నిఘా వలయంలోకి తీసుకొచ్చారు. వివరాలు.. కాశ్మీర్ టూ కన్యాకుమారి అంటూ భారత దేశానికే చిరునామా నిలిచిన తమిళనాడులోని సాగర తీరం ఎన్నో ప్రత్యేకతలకు నెలవు. బంగాళాఖాతం, హిందూ , అరేబియా సముద్రాల సంగమ క్షేత్రం ఇదే. ఈ త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించేందుకు ఇక్కడికి యాత్రికులు తరలి వస్తుంటారు. సముద్రం నుంచి సూర్యుడు ఉదయించడం.. మళ్లీ సముద్రంలోనే అస్తమించడం ఇక్కడే ప్రత్యక్షంగా చూడొచ్చు. పర్యాటక కేంద్రంగా బాసిల్లుతున్న ఈ కన్యాకుమారి ఆధ్యాత్మికతకు, చరిత్రకు, పురాణాలకు ఆలవాలంగా కూడా నిలుస్తోంది. ఇక్కడే స్వామి వివేకానంద ధ్యానం చేసిన రాక్ సముద్ర మధ్యలో ప్రత్యేక ఆకర్షణతో గంభీరంగా కనిపిస్తుంటుంది. సముద్రం మధ్యలో నల్ల చలువ రాతితో వివేకానంద రాక్ స్మారక మందిరం నిర్మించారు. ఈ రాక్‌కు కూత వేటు దూరంలో పరమ శివుడిని పరిణయం ఆడేందుకు పార్వతి దేవి తపస్సు చేసినట్టు గా పేర్కొన బడే శిలారూపం లోని ఆమె పాద ముద్రులను వీక్షించొచ్చు. ఇక తమిళుల మహా కవి తిరువళ్లువర్ 133 అడుగుల నిలువెత్తు విగ్రహం ఇక్కడే కొలువు దీరి ఉంది. దక్షిణాసియాలోని ఎత్తైన విగ్రహాల జాబితాలో ఇది కూడా ఒకటి. అంతే కాదు ఆధ్యాత్మికతకు నెలవుగా భగవతి అమ్మవారు , పురాణాలకు ప్రతిబింబంగా మురుతువజమలై ఇక్కడే ఉంది. హనుమంతుడు లంకకు వెళ్తూ ఈ కొండను ఇక్కడ ఉంచి వెళ్లినట్టుగా పురాణాలు చెబుతాయి. అందుకే కాబోలు ఈ సారి ప్రత్యేకతలకు నెలవుగా ఉన్న కన్యాకుమారిని ప్రధాని నరేంద్ర మోదీ తన రెండు రోజుల ధ్యానం కోసం ఎంపిక చేసుకున్నట్టుగా సంకేతాలు వెలువడ్డాయి.

రెండు రోజుల పాటు ధ్యానం

2019 లోక్ సభఎన్నికల అన ంతరం ప్రధాని నరేంద్ర మోదీ కేథార్‌నాథ్‌లోని గుహలో ధ్యానంలో లీనమయ్యారు. ప్రస్తుతం 2024 లోక్ సభ ఎన్నికల ప్రక్రియ ముగింపు దశకు చేరింది. చివరి విడత ఎన్నికల ప్రచారం గురువారంతో ముగియనున్నది. జూన్ ఒకటో తేదితో లోక్ సభ ఎన్నికలు సమాప్తం కానున్నాయి. జూన్ 4వతేదీ ఓట్ల లెక్కింపు జరగనున్నది. ఎన్నికల ప్రక్రియ ముగియనున్నడంతో ఈ సారి ప్రత్యేకతలకు నెలవుగా ఉన్న కన్యాకుమారిని తన ధ్యానం కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఎంపిక చేసుకున్నారు. సముద్ర మధ్యలో ఉన్న వివేకానంద రాక్‌లో రెండు రోజులు ఆయన ధ్యానం చేయబోతున్నారు. ఇందు కోసం 30వ తేదీ కేరళ రాష్ట్రం తిరువనంతపురం నుంచి కన్యాకుమారికి హెలికాఫ్టర్‌లో సాయంత్రం 3.55 గంటలకు ప్రధాని రానున్నారు. సముద్రం ఒడ్డు నుంచి ప్రత్యేక పడవలో వివేకానంద రాక్‌కు వెళ్తారు. వివేకానంద స్మారకం, రాక్‌ను సందర్శిస్తారు. అక్కడి శ్రీ పాద మండపంలోని పార్వతీ దేవి పాద ముద్రల వద్ద పుష్పాలతో పూజలు నిర్వహిస్తారు. ఈ రాక్‌లో ధాన్య మండపంలోని జూన్ ఒకటవ తేదీ మధ్యాహ్నం వరకు మోదీ ధ్యానంలో లీనమవుతారు. అదే రోజు సాయంత్రం 3.15 గంటలకు కన్యాకుమారి నుంచి తిరువనంతపురం వెళ్లి, అక్కడి నుంచి ఢిల్లీకి వెళ్తారు. మోదీ రాకతో కన్యాకుమారి సముద్ర తీరాన్ని నిఘా వలయంలోకి తెచ్చారు. ఆ రాక్ సందర్శనకు పర్యాటకులకు అనుమతి నిషేధించారు. రాక్ పరిసరాలను పూర్తిగా కేంద్ర బలగాలు తమ ఆధీనంలోకి తెచ్చుకోనున్నాయి. రాక్‌లో ధాన్య మందిరంలో ప్రధాని మాత్రమే ఉండబోతుండటంతో, చుట్టూ సముద్ర తీరాన్ని నిఘా వలయంలోకి తెచ్చే విధంగా కేంద్ర, రాష్ట్ర బలగాలు, కోస్టుగార్డు వర్గాలు భద్రతా పర్యవేక్షణకు సిద్ధమయ్యాయి. మోదీ ధ్యానం పర్యటన పుణ్యమా కన్యాకుమారి పర్యటనకు ముందుగానే ఏర్పాట్లతో సిద్ధమైన సందర్శకులకు మిగిలింది నిరాశే. అదే సమయంలో కేంద్ర హోం శాఖమంత్రి అమిత్ షా మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో ఈనెల 31, జూన్ ఒకటోతేదిలలో పూజలకు ఏర్పాట్లు చేసుకోవడం గమనార్హం.

కేరళ ప్రభుత్వానికి కేంద్రం షాక్

- కమిటీ భేటీ రద్దు
- కొనసాగుతున్న రైతుల ఆందోళనలు

సాక్షి, చెన్నై: ముల్లైపెరియార్ డ్యాం కూల్చి వేసి, కొత్త డ్యాం నిర్మాణ వ్యవహారంలో కేరళ ప్రభుత్వానికి షాక్ తప్పలేదు. మంగళవారం జరగాల్సిన కమిటీ సమావేశాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రతినిధులు రద్దు చేశారు. వివరాలు.. కేరళ రాష్ట్రం ఇడిక్కిలోని ముల్లైపెరియార్ జలాశయంపై తమిళనాడుకు ఉన్న పూర్తి హక్కులను కాలరాసే విధంగా మళ్లీ కేరళ పాలకులు చేపట్టిన చర్యలు వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. ఈ జలాశయాన్ని కూల్చి వేసి కొత్తగా డ్యాం నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన అనుమతుల కోసం కేంద్రానికి కేరళ పాలకులు నివేదిక పంపించారు. ఈ సమాచారంతో రాష్ట్రంలో నిరసనలు బయలుదేరాయి. కేరళ ప్రతిపాదనలను పక్కన పెట్టాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రికి సీఎం స్టాలిన్ లేఖ కూడా రాశారు. మంగళవారం ఢిల్లీలో అటవీ, పర్యావరణ శాఖ నేతృత్వంలోని కమిటీ సమావేశంలో ఈ నివేదిక చర్చకు రావాల్సి ఉంది. అయితే, హఠాత్తుగా ఈ కమిటీ సమావేశాన్ని కేంద్రం రద్దుచేసింది. తమిళనాడుతో చర్చించకుండా, తమిళనాడు అనుమతి లేకుండా ఈ సమావేశం నిర్వహించలేమని, తమిళనాడు అనుమతితోనే సమావేశం నిర్వహించాల్సిన అవశ్యం ఉందనిపేర్కొంటూ, రద్దు చేశారు. ఇది కాస్త కేరళ పాలకులకు షాక్ ఇచ్చినట్లయ్యింది. ఇది తాత్కాలికమే అయినా, తదుపరి ప్రయత్నాలపై కేరళ పాలకులు దృష్టి పెట్టారు. అదే సమయంలో కేరళ చర్యలను వ్యతిరేకిస్తూ మంగళవారం తేని, విరుదునగర్, మదురై, దిండుగల్, రామనాథపురం, శివగంగై జిల్లాలలోని రైతులు, ప్రజా సంఘాల నిరసనలు కొనసాగాయి.

క్లుప్తంగా

జూన్ చివరిలో వీధి కుక్కల గణన

కొరుక్కుపేట: చెన్నై కార్పొరేషన్‌లో 2018 సంవత్సరం తర్వాత, వచ్చే జూన్ నెలాఖరులో వీధి కుక్కల గణనను కార్పొరేషన్ ప్రారంభించనుంది. ప్రస్తుతం చెన్నైలో లక్షకు పైగా వీధికుక్కలు ఉండవచ్చని కార్పొరేషన్ అధికారులు అంచనా వేశారు. చెన్నై కార్పొరేషన్‌లో వీధికుక్కల సమాచారాన్ని మూడేళ్ల వ్యవధిలో సేకరించారు. ఈ సమయంలో వీధి కుక్కలను పట్టుకుని, రేబిస్ నివారణ టీకాలు వేసేలా చర్యలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా గత నవంబర్‌లో తండయార్ పేట్ ప్రాంతంలో రేబిస్ సోకిన 87 కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. అలాగే వీధికుక్కలు కూడా వివిధ ప్రాంతాల్లో మనుషులను పెంచుకుంటున్నారని, ఈ కారణంగా చెన్నైలో రేబిస్ వ్యాధి అధికమైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. 10 మండలాల్లో వీధికుక్కల గణన చేపట్టారు. ఈ నేపథ్యంలో వచ్చే నెలాఖరులో చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కుక్కల గణన నిర్వహించేందుకు పశువైద్య విభాగం, మున్సిపాలిటీ సన్నాహక పనుల్లో నిమగ్నమైంది. చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వీధికుక్కలను పట్టుకుని, ప్రతి కుక్కకు రంగు వేసి, రేబిస్ వ్యాక్సినేషన్ మాత్రమే వేస్తారు. కరోనా మహమ్మారి తరువాత, వీధి కుక్కల పెంపకాన్ని నిరోధించే ప్రయత్నాలు అమలు కాలేదు. దీంతో వీధికుక్కల బెడద పెరిగి ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా మారింది. ఈ క్రమంలో జంతు సంతానోత్పత్తి నిషేధ కార్యక్రమాన్ని సరిగ్గా అమలు చేయడానికి రూ.20 కోట్లు కేటాయించారు. వీధికుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక వాహనంలో ఐదుగురు సిబ్బంది, ఒక డ్రైవర్ ఉంటారని అధికారులు వెల్లడించారు.

ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మత్తు మాత్రల విక్రయం
– రౌడీ అరెస్టు

తిరువొత్తియూరు: పెరంబూరు సమీపంలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మత్తు మాత్రలు విక్రయిస్తున్న రౌడీని పోలీసులు అరెస్టు చేశారు. పెరంబూరు సమీపంలోని సెంబియం ప్రాంతంలో ఉన్న బందర్ గార్డెన్ వీధిలో సందేహాస్పదంగా నిలబడి ఉన్న యువకుడిని ప్రత్యేక బృందం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. అతను మత్తుమాత్రలు విక్రయిస్తున్నట్లు తెలిసింది. విచారణలో అతను అంబత్తూరుకు చెందిన రౌడీ అజిత్ అని తెలిసింది. అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. అతడి ఇంట్లో తనిఖీ చేసి దాచి ఉంచిన 3,300 మత్తు మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. ఇతను చెన్నై, శివారు నగర ప్రాంతాల్లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మత్తు మాత్రలు విక్రయిస్తున్నట్లు తెలిసింది. సెంబియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ చిరంజీవి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ప్రధానమంత్రి గృహ నిర్మాణ ప్రాజెక్టులో భారీ స్కామ్

- 50 మంది తమిళనాడు అధికారులపై చర్యలు
- కేసు నమోదు చేసిన డీవీఏసీ


నిర్మాణంలో ఉన్న పక్కా ఇళ్లు(ఫైల్)

కొరుక్కుపేట: ప్రధానమంత్రి గృహ నిర్మాణ ప్రాజెక్టులో (మొత్తం 28 పథకాల్లో) అవకతవకలకు కారణమయ్యారంటూ తమిళనాడులోని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖకు చెందిన 50 మంది అధికారులపై డైరెక్టరేట్ ఆఫ్ కరప్షన్ ప్రివెన్షన్ అండ్ మానిటరింగ్ కేసు నమోదు చేసింది. వివరాలు.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పేదల కోసం ప్రధాన మంత్రి గృహనిర్మాణ పథకం, జూన్ 2013లో ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం కింద సొంత ఇల్లు లేని వారు ఇల్లు నిర్మించుకోవడానికి, కొనుగోలు చేసేందుకు నగదు ప్రయోజనాలను పొందవచ్చు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి సొంత ఇల్లు నిర్మించుకోలేని వారు ఈ పథకం ద్వారా సొంత ఇల్లు నిర్మించుకునేలా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా ప్రతి లబ్ధిదారునికి రూ. 2,77,290 నగదు, నిర్మాణ సామగ్రి, నిర్మాణ పనుల కోసం కార్మికులు వంటి ప్రయోజనాలను పొందవచ్చు. ఈ పథకానికి సంబంధించి 62 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం అందించగా, మిగిలిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు రూ.కోట్ల నిధులను మోసం చేసినట్లు గుర్తించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 2016–2020 మధ్య కాలంలో పేదలకు అందాల్సిన లబ్ధిలో అక్రమాలకు పాల్పడినందుకు గ్రామీణాభివృద్ధి అండ్ పంచాయతీ రాజ్ శాఖలోని 50 మంది అధికారులపై అవినీతి నిరోధక, విచారణ డివిజన్ (డీవీఏసీ) కేసు నమోదు చేసింది. ఈ మోసానికి సంబంధించి ఇటీవలి కాలంలోనే 7 కేసులు నమోదయ్యాయి. తిరువళ్లూరు జిల్లాకు గుమ్మిడిపూండి పంచాయతీ పరిధిలోని చానాబత్తూరు గ్రామంలో గత నెల 20వ తేదీన రూ.31.66 లక్షల ఇళ్లు నిర్మించుకున్న అంశంపై నాలుగు కేసులు నమోదయ్యాయి. అవినీతి నిరోధక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పటికే సొంత ఇళ్లు ఉన్న పలువురు లబ్ధిదారులు, ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు అర్హత లేని వారు కూడా లక్షలాది రూపాయలను కొట్టేసినట్లు తెలిసింది. లబ్ధిదారుల్లో ఎక్కువ మంది ఇళ్లు పూర్తికాకపోయినా పూర్తయినట్లు అధికారులే నకిలీ పత్రాలు సమర్పించారని పేర్కొన్నారు. నాగపట్నంలో 146 మంది లబ్ధిదారులకు ఇవ్వాల్సిన రూ.కోటి నిధులను స్వాహా చేసిన 10 మంది అధికారులపై కేసు నమోదైంది. ప్రధానమంత్రి గృహనిర్మాణ పథకం కింద ఇది అతిపెద్దదిగా పరిగణించబడుతుంది. తరచూ పంచాయతీ కార్యదర్శులు, నియోజకవర్గ అభివృద్ధి అధికారులు (పీడీఓలు), పంచాయతీ పెద్దలు తమ పేర్లను లబ్ధిదారులుగా రిజర్వ్ చేసి, నకిలీ పత్రాలు, ఇంటి స్థలం గురించి నకిలీ వివరాలు సమర్పించినట్లు సమాచారం.

త్రోట్ క్యాన్సర్ శస్త్ర చికిత్సలో కేకేఆర్ మైలురాయి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్లు రామలింగం, గౌరీశంకర్

సాక్షి, చెన్నై: సర్వైవల్ త్రోట్ క్యాన్సర్ శస్త్ర చికిత్సలో కేకేఆర్ ఈఎన్‌టీ ఆస్పత్రి, పరిశోధన ఇనిస్టిట్యూట్ ఓ మైలురాయిని దాటిందని డాక్టర్లు కేకే రామలింగం, గౌరీశంకర్ బృందం ప్రకటించింది. మంగళవారం స్థానికంగా జరిగి సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ మాట్లాడుతూ 22 ఏళ్ల క్రితం తాము జరిపిన శస్త్రచికిత్స గురించి గుర్తు చేస్తూ, నేటికీ ఆ రోగి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్టు ప్రకటించారు. ఆధునిక టెక్నాలజీ అన్నది లేని కాలంలో సర్వైవల్ త్రోట్ క్యాన్సర్‌తో బాధపడుతూ వచ్చిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తేజేశ్వరరావుకు 2002లో కీమో తెరఫీ, రేడియోథెరఫీ చికిత్సలు చేసినా ఫలితం లేకపోవడంతో అప్పట్లో తమ వద్ద ఉన్న కొత్త పద్ధతులను అనుసరించి, చేసిన శస్త్ర చికిత్స వివరాలను గుర్తు చేశారు. గొంతు క్యాన్సర్ శస్త్రచికిత్సకు రెండు రకాల పద్ధతులతో రెండు విభాగాల వైద్య బృందం శస్త్ర చికిత్సను అప్పట్లో విజయవంతం చేసిందన్నారు. ఈ శస్త్ర చికిత్స జరిగి 22 సంవత్సరాలు అవుతుందని, ఆ శస్త్ర చికిత్స చేయించుకున్న రోగి ప్రస్తుతం ఉపాధ్యాయుడిగా ఉన్నారని, ఆయన అందరిలానే ఛలాకీగా, ఉత్సాహంగా తన పనులు తాను 22 ఏళ్లుగా చేసుకుంటుండడం, శస్త్ర చికిత్సలో తాము సాధించిన మైలురాయిగా పేర్కొన్నారు. ఈ సమవేశంలో డాక్టర్ రాజ, రాజసుందరం, జోషఫ్ పాల్గొన్నారు.

తిరువొత్తియూరులో ఇద్దరికి కత్తిపోట్లు

తిరువొత్తియూరు: చెన్నై తిరువొత్తియూరులో ముసుగు ధరించి వచ్చి ఇద్దరిపై కత్తితో దాడి చేసి పారిపోయిన ముఠా కోసం పోలీసులు గాలిస్తున్నారు. చెన్నై తిరువొత్తియూరు త్యాగరాయపురం ప్రాంతానికి చెందిన పార్తీబన్ (35), మోనీష్ (34) స్నేహితులు. వీరిద్దరూ సోమవారం రాత్రి అదే ప్రాంతంలో నిలబడి మాట్లాడుతుండగా.. ముసుగు ధరించి బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు కత్తులతో దాడి చేసి పారిపోయారు. ఈ ఘటనలో తీవ్ర గాయమైన వారిని స్థానికులు స్టాన్లీ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. స్థానిక పోలీసులు సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా పార్తిబన్, మోనిష్‌పై కత్తితో దాడి చేసిన దుండగుల కోసం గాలిస్తున్నారు.

కంపెనీలో స్పృహ తప్పి కార్మికుడి మృతి

తిరువళ్లూరు: కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న వ్యక్తి స్పృహ తప్పి కిందపడిపోయిన క్రమంలో అతడ్ని వైద్యశాలకు తరలించగా మార్గం మధ్యలోనే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా సేతుపాక్కం ప్రాంతానికి చెందిన పుగోంది(62) కవరపేట సమీపంలోని జేసీబీ తయారు చేసే సంస్థలో సెక్యూరిటీగా పని చేస్తున్నాడు. ఈక్రమంలో గత 26 రాత్రి యథావిధిగా విధులకు హాజరయ్యాడు. మరుసటి రోజు సైతం విధులు నిర్వహించగా సోమవారం రాత్రి హఠాత్తుగా స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే సహచరులు అతడిని పొన్నేరి వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు స్పష్టం చేశారు. మృతుడి కొడుకు నల్లతంబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కవరపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోస్ట్ వాంటెడ్ రౌడీ అరెస్టు

అన్నానగర్: పుళల్‌లో వివిధ కేసులతో సంబంధం కలిగి పరారీలో ఉన్న రౌడీ మంగళవారం పట్టుబడ్డాడు. పుళల్ పక్కనే ఉన్న కావంగరై కన్నప్ప సామి పట్టణానికి చెందిన ప్రముఖ రౌడీ శరవణన్ అలియాస్ శరవణన్ (33) హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీ తదితర కేసుల్లో వాంటెడ్ క్రిమినల్. ఇతని కోసం పోలీసులు రోజుల తరబడి వెతికారు. ఈ స్థితిలో పరారీలో ఉన్న శరవణన్ పుళల్ మాథనం గుప్పం ప్రాంతంలో తలదాచుకున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ప్రత్యేక బృందం పోలీసులు మంగళవారం అతడిని అరెస్టు చేశారు. అనంతరం పుళల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజాసింగ్ అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

కౌంటింగ్‌కు ముమ్మర ఏర్పాట్లు


వేలూరు కౌంటింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుబ్బలక్ష్మి, ఎస్పీ మణివన్నన్

వేలూరు: పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్, వేలూరు పార్లమెంట్ ఎన్నికల అధికారి సుబ్బలక్ష్మి తెలిపారు. జూన్ 4వ తేదీన పార్లమెంట్ ఓట్లు లెక్కింపు జరుగుతుందన్నారు. వేలూరు, అరక్కోణం పార్లమెంట్ స్థానాల ఓట్ల లెక్కింపు రాణిపేట ఇంజినీరింగ్ కళాశాల, వేలూరు పార్లమెంట్ కౌంటింగ్ తందైపెరియార్ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళా శాలలో జరగనుంది. దీంతో వేలూరులోని కౌంటింగ్ సెంటర్‌లోని ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుబ్బలక్ష్మి, ఎస్పీ మణివన్నన్‌తోపాటు ఉన్నతాధికారులు మంగళవారం ఉదయం కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారుల బృందం కౌంటింగ్ చేసే గది, కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నమోదు, ఇందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా కౌంటింగ్ కేంద్రాల్లో 74 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అవి 24 గంటల పాటు పనిచేసేలా ఈవీఎం మిషన్‌లు ఉన్న చోట జరిగే ప్రతి విషయాన్ని జిల్లా కేంద్రం నుంచి అధికారులు పర్యవేక్షించనున్నారు. కౌంటింగ్ కేంద్రానికి సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించకుండా ముందుస్తు ఏర్పాట్లను సిద్ధం చేశారు. కౌంటింగ్ నిర్వహించే రోజున మీడియాకు ప్రత్యేకంగా గదిని కేటాయించి ప్రతి రౌండ్‌లో కౌంటింగ్ నిర్వహించిన అనంతరం మీడియాకు తెలిపేలా బోర్డును ఏర్పాటు చేశారు. అలాగే కౌంటింగ్ కేంద్రం నుంచి తెలిపే ప్రతి విషయాన్ని విలేకరులకు తెలిసే విధంగా స్పీకర్ బాక్సులను ఏర్పాటు చేయనున్నారు. వేలూరులోని కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు గురించి పోలీసులతో సమీక్షించడం జరిగిందన్నారు. ఆమెతో పాటు సబ్ కలెక్టర్ కవిత అధికారులు పాల్గొన్నారు.

నారాయణిలో అంతర్జాతీయ అత్యవసర వైద్య దినోత్సవం


సింగపూర్ భక్తుడిని సత్కరిస్తున్న ఆస్పత్రి డైరెక్టర్ బాలాజీ

వేలూరు: శ్రీపురంలోని బంగారుగుడి ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ నారాయణి ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో అంతర్జాతీయ అత్యవసర వైద్య దినోత్సవం ఆస్పత్రి డైరెక్టర్ బాలాజీ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శక్తిఅమ్మ సింగపూర్ భక్తుడు డాక్టర్ హైవే చుంగ్ ఆస్పత్రిలోని అత్యవసర విభాగంలో విశిష్ట సేవలు అందజేసిన వైద్య సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి అత్యవసర విభాగంలో వైద్య సిబ్బంది చేసే సేవ ఎనలేనిదన్నారు. ప్రాణాలకు తెగించి రోగిని కాపాడాలనే తపనతో ఎంతటి సమస్యనైనా ఎదుర్కొని ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. అనంతరం అతిథిని ఆస్పత్రి నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గీతా, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శక్తివేల్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగిబాబు హీరోగా జోరా కైయ తట్టుంగ

తమిళసినిమా: ప్రస్తుతం స్టార్ హీరోల కంటే బిజీగా ఉన్న నటుడు యోగిబాబు. ఇటు హీరోగానూ అటు కమిడియన్‌గానూ ప్రేక్షకులను అలరిస్తున్న ఈయన తాజాగా కథానాయకుడిగా నటిస్తున్న జోరా కైయ తట్టుంగ. వామా ఎంటర్‌టెన్‌మెంట్ పతాకంపై జకీర్ అలీ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీ శరవణా ఫిలిం ఆర్ట్స్ అధినేత జీ.సరా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తీక్కుళిక్కుమ్ పచ్చై మరం చిత్రం ఫేమ్ వినీష్ మిలినియం కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్న ఈ చితంలో యోగిబాబుతో హరీశ్ పేరడీ, విక్రమ్ చిత్రం ఫేమ్ వాసంతి, జాహీర్ అలీ,మణిమారన్, శాంతిదేవి, మేనకా, నైనా, అరువి బాలా, మూర్, శ్రీధర్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. దీనికి జాతీయ అవార్డు గ్రహీత మధు అంబట్ ఛాయాగ్రహణం, ఎస్ఎన్.అరుణగిరి సంగీతం అందిస్తున్నారు. కాగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సోమవారం నటుడు విజయ్‌సేతుపతి ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. దీని గురించి చిత్ర వర్గాలు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో దర్శకుడు పేర్కొంటూ నటుడు యోగిబాబు ఇంతకు ముందెప్పుడూ నటించనటువంటి విభిన్న పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారన్నారు. చిత్రం షూటింగ్‌తో పాటు నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి అయ్యాయని, త్వరలోనే జోరా కై య తట్టుంగ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. దీన్ని శక్తి ఫిలిం ఫ్యాక్టరీ శక్తివేల్ తమిళనాడు విడుదల హక్కులను పొందినట్లు చెప్పారు.


జోరా కైయ తట్టుంగ చిత్రం ఫస్ట్‌లుక్


నటి వరలక్ష్మీశరత్‌కుమార్

నటి వరలక్ష్మీశరత్‌కుమార్ పెళ్లెక్కడో తెలుసా?

తమిళసినిమా: సినీ తారలు ముఖ్యంగా కథానాయికల్లో అధిక శాతం 35, 40 ఏళ్ల వయసులోనే పెళ్లిళ్లు చేసుకుంటారు. కారణం కేరీర్ భద్రత కోసం అని చెప్పవచ్చు. 40 ఏళ్లు దాటినా పెళ్లి కాని వారూ ఉన్నారు. వారి విషయం పక్కనపెడితే 39 ఏళ్ల వరలక్ష్మీ శరత్‌కుమార్ ఇప్పుడు పెళ్లికి సిద్ధం అయ్యారు. 2012లో పోడా పోడీ చిత్రం ద్వారా కథానాయకిగా పరిచయం అయిన నట వారసురాలు ఈమె. వరలక్ష్మీ శరత్‌కుమార్ నటుడు శరత్‌కుమార్ కూతురన్న విషయం తెలిసిందే. విదేశాల్లో చదివిన ఈమె బెల్లీ డాన్స్‌లోనూ శిక్షణ పొందారు. కాగా తొలి రోజుల్లో హీరోయిన్‌గా నటించినా, ఆ తరువాత నాయకి, ప్రతినాయకి అని చూడకుండా నటనకు అవకాశం ఉంటే వచ్చిన అవకాశాలన్నీ అంగీకరించి నటించేస్తున్నారు. అలా విజయ్, విశాల్ వంటి స్టార్ హీరోలతోనే ఢీ కొన్నారు. అంతే కాదు తమిళం, తెలుగు తదితర భాషల్లోనూ నటిస్తూ బహుభాషానటిగా పేరు తెచ్చుకున్నారు. కాగా ఇప్పుడీ భామకు పెళ్లి కళ వచ్చేసింది. మార్చి నెలలో నికోలాయ్ సత్యదేవ్ అనే వ్యక్తితో వరలక్ష్మీ శరత్‌కుమార్ వివాహ నిశ్చితార్థం నిడారంబరంగా జరిగింది. అయితే పెళ్లి ఎప్పుడన్నది ప్రకటించలేదు. అలాంటిది ఈ జంట ఇప్పుడు పెళ్లికి సిద్ధం అవుతోంది. జూలై నెల 2వ తేదీన థాయ్‌ల్యాండ్‌లో వీరి వివాహానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తాజా సమాచారం. అయితే అంతకుముందు చెన్నైలో వరలక్ష్మీ శరత్‌కుమార్, నికోలాయ్ సత్యదేవ్ వివాహ రిసెప్షన్ ఘనంగా నిర్వహించనున్నారని తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

కోలీవుడ్ టాక్స్

ద్విపాత్రాభినయం కాదా?


విజయ్‌తో సంగీత దర్శకుడు యువన్‌శంకర్‌రాజా

తమిళసినిమా: నటుడు విజయ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం గోట్. వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ సైంటిఫిక్ యాక్షన్ ఎంటర్‌టెయినర్ కథా చిత్రాన్ని ఏజీఎస్ ఎంటర్‌టెయిన్‌మెంట్ సంస్థ భారీ ఎత్తున నిర్మిస్తోంది. నటుడు ప్రశాంత్, ప్రభుదేవా, అజ్మల్, వైభవ్, ప్రేమ్‌జీ, నటి శేషాద్రి చౌదరి, స్నేహ, లైలా తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కాగా యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. గోట్ చిత్రంలో పలు ప్రత్యేకతలు సంతరించుకున్నాయని సమాచారం. ముఖ్యంగా ఇందులో విజయ్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారని, అందులో కొడుకు పాత్రలో విజయ్‌ను లేటెస్ట్ టెక్నాలజీ ద్వారా చాలా యంగ్‌గా చూపించబోతున్నట్లు, అందుకోసం అమెరికాలో గ్రాఫిక్స్ సన్నివేశాలను రూపొందించినట్లు ప్రచారం జరిగింది. కాగా తాజాగా ఈ చిత్రంలో విజయ్ ద్విపాత్రాభినయం కాదట. త్రిపాత్రాభినయం చేస్తున్నారట. ఈ విషయాన్ని తాజాగా సంగీత దర్శకుడు యువన్‌శంకర్ రాజా తన ఎక్స్ మీడియాలో పేర్కొనడం విశేషం. దీంతో గోట్ చిత్రం ఇప్పటికే ఉన్న అంచనాలు మరింతగా పెరిగిపోవడం ఖాయం. ఇకపోతే విజయ్ ఈ చిత్రంలో రెండు పాటలను పాడడం మరో విశేషం. సాధారణంగా ఆయన తన చిత్రాల్లో ఒక్కో పాటనే పాడుతుంటారు. ఎప్పుడో ఈయన తండ్రి ఎస్ఏ.చంద్రశేఖర్, నటుడు విజయకాంత్, సూర్య కలిసి నటించిన చిత్రానికి దర్శకత్వం వహించారు. ఆ చిత్రం కోసం విజయ్ మూడు పాటలను పాడారు. ఆ తరువాత రెండు పాటలు పాడటం అన్నది ఇప్పుడే జరిగింది. కాగా ఈ చిత్రంలోని విజిల్ పోడు పాటను విడుదల చేయగా విశేష ఆదరణను పొందుతోంది. తాజాగా మరో పాటను విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సిద్ధం అయ్యింది. ఇకపోతే గోట్ చిత్రానికి సంబంధించిన నిర్మాణాంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, చిత్రాన్ని సెప్టెంబరు 5వ తేదీన తెరపైకి తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తాజా సమాచారం.

అందుకు ఇంకా సమయం ఉంది

తమిళసినిమా: జనాల్లో హీరోయిన్ల పెళ్లిళ్ల మీద ఉన్న ఆసక్తి మరి దేనిపైనా ఉండదేమో. వారు ప్రేమలో పడితే వార్త, పెళ్లి కాకపోతే వార్త, పెళ్లి అయితేనూ వార్తే. ఇదీ హీరోయిన్ల పరిస్థితి. ఇంకా చెప్పాలంటే ఇలాంటి వార్తలు వారికి పెద్ద తలనొప్పే అని చెప్పవచ్చు. అయితే ఇలాంటి వార్తలను కొందరు చాలా ఎంజాయ్ చేస్తారు. కాగా నటి అంజలి కూడా ఇలాంటి పరిస్థితుల్లోనే ఉన్నారు. కారణం ఈమె వయసు 36 ఏళ్లు కావడమే. ఇంకా పెళ్లెప్పుడు అనే ప్రశ్నలు అంజలిని వెంటాడుతూనే ఉన్నాయి. తెలుగు, తమిళం భాషల్లో కథానయకిగా రాణించిన ఈ బ్యూటీ పదహారణాల తెలుగమ్మాయి అన్న విషయం తెలిసిందే. కర్రదు తమిళ్ చిత్రంతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చిన అంజలి తొలి చిత్రంతోనే ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. ఇక అంగాడితెరు చిత్రంతో అందరి ప్రశంసలు అందుకున్నారు. కాగా ఇప్పుడు కథానాయకి పాత్రలనే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానూ అవతారమెత్తారు. ఈమె గురించి చాలా వదంతులు ప్రచారం అయ్యాయి. ముఖ్యంగా అంజలి రహస్యంగా పెళ్లి చేసుకున్నారనే వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. అయితే ఇలాంటి వార్తలను ఆమె ఖండించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అంజలి పేర్కొంటూ తనకు ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో మూడు, నాలుగు పెళ్లిళ్లు చేసేశారని అన్నారు. మొదట్లో ఇలాంటి వార్తలు విన్నప్పుడు ఇంటిలో అందరూ బాధ పడ్డారని, అయితే అలాంటి వార్తలు కొద్ది రోజులే కలకలాన్ని రేకెత్తిస్తాయని, ఆ తరువాత వాటిని ఎవరూ పట్టించుకోరన్నారు. తనపై జరుగుతున్న పెళ్లి వదంతుల కారణంగా తాను నిజంగానే ఒక వ్యక్తిని తీసుకెళ్లి ఇతన్నే తాను పెళ్లి చేసుకోబోతున్నాను అని చెప్పినా ఇంట్లో ఎవరూ నమ్మరని అన్నారు. అయితే తను కచ్చితంగా పెళ్లి చేసుకుంటానని, అయితే అందుకు ఇంకా చాలా సమయం ఉందని అంజలి పేర్కొన్నారు. నటిగా తాను ప్రస్తుతం చాలా బిజీగా ఉన్నానని చెప్పారు. పెళ్లి చేసుకున్నా సినిమాల్లో నటిస్తానని చెప్పారు.


నటి అంజలి


కేక్ కట్ చేస్తున్న కాదలిక్క నేరమిల్లై చిత్రం యూనిట్

కాదలిక్క నేరమిల్లైకు గుమ్మడికాయ కొట్టారు

తమిళసినిమా: చాలా కాలం క్రితం ప్రఖ్యాత దర్శకుడు శ్రీధర్ దర్శకత్వం వహించిన సూపర్‌హిట్ చిత్రం కాదలిక్క నేరమిల్లై. కాగా అదే టైటిల్‌తో ఇప్పుడు జయంరవి, నటి నిత్యామీనన్ జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. దీంతో ఈ చిత్రంపై మంచి అంచనాలు నెలకొంటున్నాయి. రెడ్ జెయంట్ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కృతిక ఉదయనిధి దర్శకత్వం వహిస్తున్నారు. నటుడు యోగిబాబు, లాల్, వినయ్, లక్ష్మీ రామకృష్ణన్, గాయకుడు మనో, టీజే.భాను, జాన్ కోకెన్, వినోదిని తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. కేవ్‌మిక్ ఆరి ఛాయాగ్రహణం అందిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఇటీవల విడుదల చేయగా విశేష ఆదరణను పొందిందని చిత్ర వర్గాలు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం షూటింగ్‌ను పూర్తి చేసి, నిర్మాణాంతర కార్యక్రమాలకు సిద్ధం అవుతున్నట్లు తెలిపారు. త్వరలోనే చిత్రం టీజర్, ఆడియో, ట్రైలర్ విడుదలకు సంబంధిచిన వివరాలను వెల్లడించనున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

పందెంకోడికి శ్రద్ధాంజలి

తిరువొత్తియూరు: నెల్లై పేటలో ఓ వ్యక్తి పెంచుకుంటున్న పందెం కోడిపుంజు మృతి చెందడంతో దాని ఫొటోతో కూడిన శ్రద్ధాంజలి వాల్ పోస్టర్లు అతికించి, కన్నీటి వీడ్కోలు పలికిన సంఘటన సంచలనమైంది. వివరాల్లోకి వెళితే.. నెల్లై, పేట సమీపం చెక్కడి తిరంద ప్రాంతానికి చెందిన యువకుడు ఒక పందెం కోడిపుంజును 2019 సంవత్సరం నుంచి పెంచుకుంటున్నాడు. వయసు మీరిన కారణంగా ఆ కోడిపుంజు సోమవారం మృతి చెందింది. కోడి పుంజు చనిపోయిందన్న దుఃఖం తట్టుకోలేక అతను కోడిపుంజు ఫొటోతో ఫ్లెక్సీ తయారు చేసి, దానిపై జననం, మరణం తేదీలు రాసి శ్రద్ధాంజలి ఘటించిన పోస్టర్లు వివిధ ప్రాంతాల్లో అతికించాడు. ఆ మార్గంలో వెళ్లే ప్రజలు వాటిని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అనుమతి లేకుండా ఇలాంటి పోస్టర్లు అతికించడంతో సోమవారం రాత్రి వాటిని తొలగించారు.

సెప్టిక్ ట్యాంక్‌లో మానవ అస్థిపంజరం

కొరుక్కుపేట: ఇంటి సెప్టిక్ ట్యాంక్‌లో మానవ అస్థిపంజరం వెలుగు చూసిన సంఘటన కలకలం రేపింది. మైలాడుదురై జిల్లా సీర్గాలి పక్కనున్న చట్టనాథ్ పురంలో నివసించే ఆర్. కేశవన్ (49) నాంకూరు పంచాయతీ మాజీ అధ్యక్షుడు. ప్రస్తుతం అతను సెంబతనారిపు కొనుగోలు చేసి కొత్త ఇంటిని నిర్మిస్తున్నారు. అతని ఇంటి వెనుక భాగంలో చెక్క పలకలతో 15 అడుగుల లోతులో సెప్టిక్ ట్యాంక్ నిర్మించారు. సోమవారం సాయంత్రం ఆ ప్రాంతంలో కొందరు విద్యార్థులు క్రికెట్ ఆడుతున్నారు. ఓ బాలుడు కొట్టిన బంతి సెప్టిక్ ట్యాంక్‌లో పడింది. అప్పుడు సెప్టిక్ ట్యాంక్‌లో పడిన బంతిని తీయడానికి విద్యార్థులు వెళ్లారు. సెప్టిక్ ట్యాంక్ లోపల మానవ అస్థిపంజరం ఉంది. సెప్టిక్ ట్యాంక్‌ను కప్పి ఉంచిన చెక్క హ్యాండిల్‌ను తొలగించగా, మానవ అస్థిపంజరం కనిపించింది. దీంతో పిల్లలు కేశవన్‌కు సమాచారం అందించారు. అతను పోలీసులకు తెలియజేశారు. వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి తంజావూరు ఫోరెన్సిక్ విభాగం నిపుణులకు సమాచారం అందించారు. వారిచ్చే నివేదిక ఆధారంగా కేసు నమోదు చేయనున్నారు.

భార్యా భర్తల ఆత్మహత్య

అన్నానగర్: బన్రుటి సమీపంలో సోమవారం రాత్రి భార్యాభర్తలు ఒకే చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదం నింపింది. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కడలూరు జిల్లా బన్రుట్టి సమీపంలోని కట్టాండి గ్రామానికి చెందిన డ్రైవర్ కుమారవేల్(32)కు మీనా (20)తో రెండేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేరు. ఇంటి మిద్దెపై ఒంటరిగా ఉండేవారు. కుమారవేల్ తల్లిదండ్రులు దిగువ ఇంట్లో ఉండేవారు. కుమారవేల్ సోమవారం యథావిధిగా పనికి వెళ్లి రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కుమారవేల్ తల్లిదండ్రులు అతని ఇంటికి వెళ్లారు. అప్పుడు ఇంట్లోని గదిలో భార్యాభర్తలిద్దరూ ఒకే చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించారు. ఇది చూసిన తల్లిదండ్రులు షాక్‌కు గురై కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం కాటంభూలియూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బన్రుటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రంలో పడవ బోల్తా

• జాలరి మృతి

తిరువొత్తియూరు: పడవ బోల్తా పడి జాలరి మృతి చెందాడు. చెన్నై ఎన్నూరు తాళం కుప్పం బహుళ అంతస్తుల నివాసానికి చెందిన హరికృష్ణన్ (58) జాలరి. ఇతను మంగళవారం తెల్లవారిజమున మరో నలుగురుతో కలిసి ఫైబర్ బోట్‌లో సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. సముద్రంలో కొంతదూరం వెళ్లిన తర్వాత సముద్ర అలలు వేగంగా ఉండడంతో వారు వెళుతున్న పడవ హఠాత్తుగా బోల్తా పడింది. ఐదుగురు నీటిలో పడిపోయారు. కొద్ది సమయం తర్వాత నలుగురు తీరానికి చేరుకున్న క్రమంలో హరికృష్ణన్ గల్లంతయ్యాడు. జాలర్లు ఇచ్చిన సమాచారం మేరకు ఎన్నూరు పోలీసులు అక్కడికి చేరుకుని జాలర్ల సహాయంతో ఫైబర్ పడవల సాయంతో సముద్రంలోకి వెళ్లి హరికృష్ణన్ కోసం గాలించారు. కుశస్థలై నది సముద్ర తీరంలోని రాయి వద్ద హరికృష్ణ మృతదేహంగా కనిపించాడు. దీంతో చెన్నై స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఎన్నూరు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

దోపిడీ ముఠా దాడిలో యువకుడి మృతి

తిరువొత్తియూరు: చంబరంబాక్కం చెరువు సమీపంలో దారి దోపిడీ ముఠా దాడిలో గాయపడిన ఓ యువకుడు సోమవారం అర్ధరాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. విల్లుపురం జిల్లా కండాచిపురం సమీపంలోని ఆర్కాడు గ్రామానికి చెందిన రాజేష్ (30) తెరుకు పాలయంలోని ఇటుక బట్టీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతను కుండ్రత్తూరు కూడలి రోడ్డు నడిచివెళుతున్న సమయంలో బైక్‌లో వచ్చిన ముగ్గురు అతని తలపై కత్తితో దాడి చేసి అతని వద్ద సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయారు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స కోసం కోవూరు ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. ఈ క్రమంలో రాజేష్ సోమవారం రాత్రి మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి అతని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం క్రోమ్‌పేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు నిందితుల కోసం గాలిస్తున్నారు.

ప్రతి అసెంబ్లీలో ఐదు బూత్‌ల వీవీప్యాట్‌లు లెక్కింపు



రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభుశంకర్

తిరువళ్లూరు: ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపిక చేసిన ఐదు పోలింగ్ బూత్‌ల్లోని వీవీప్యాట్‌లను లెక్కిస్తామని కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ స్పష్టం చేశారు. కౌంటింగ్‌కు వారం రోజుల వ్యవధి మాత్రమే ఉన్న నేపథ్యంలో మంగళవారం ఉదయం కలెక్టర్ రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లు, అభ్యర్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ మాట్లాడుతూ కౌంటింగ్ విధులు నిర్వహించనున్న అధికారులు జూన్ 4వ తేదీ ఉదయం 5 గంటల లోపు, అభ్యర్థులు, ఏజెంట్లు 7 గంటలలోపు కౌంటింగ్ కేంద్రాలకు గుర్తింపు కార్డులతో రావాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్, ఇంక్ బాటిల్, అగ్గిపెట్టె, బ్లూటూత్, ట్యాబ్ తదితర వాటిని నిషేధించామన్నారు. మొదట 8.30 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందని, అనంతరం ఈవీఎంల కౌంటింగ్‌ను ప్రారంభిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ముగిసిన తరువాత ఏజెంట్‌లు, అభ్యర్థుల సమక్షంలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను తెరిచి, వాటిని బందోబస్తు నడుమ కౌంటింగ్‌కు తరలించాలని సూచించారు. కాగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ జరుగుతుందన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎంల కౌంటింగ్‌కు 14 టేబుళ్ల ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఐదు పోలింగ్ బూత్‌లను ఎంపిక చేసి, వీవీప్యాట్‌లను లెక్కించి ఈవీఎంలతో సరిచూస్తామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడానికి అధికారులు రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు.

అవినీతి కేసులో ముగ్గురి అరెస్టు



అరెస్టయిన సురేష్, నిత్యానందం

పళ్లిపట్టు: నూతన విద్యుత్ కనెక్షన్‌కు రూ. ఆరు వేలు లంచం తీసుకుంటుండగా విద్యుత్‌శాఖ జూనియర్ ఇంజినీర్‌సహా ఇద్దరు సిబ్బందిని అవినీతి నిరోధక శాఖ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఆర్కేపేట మండలంలోని వెడియంగాడు పుదూర్‌లోని సహాయ ఇంజినీర్ కార్యాలయంలో వెడియంగాడుకు చెందిన బాబు అనే వ్యక్తి నూతన విద్యుత్ కనెక్షన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కొత్త దరఖాస్తుపై విచారణ చేపట్టి, కనెక్షన్ మంజూరు కోసం విద్యుత్ శాఖ సిబ్బంది రూ.6 వేలు లంచం డిమాండ్ చేశారు. అయితే లంచం ఇచ్చేందుకు ఇష్టపడని బాబు తిరువళ్లూరులోని అవినీతి నిరోధక శాఖ కార్యాలయంలో ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఏసీబీ డీఎస్పీ రామచంద్రమూర్తి సూచనల మేరకు మంగళవారం ఉదయం వెడియంగాడు విద్యుత్ కార్యాలయానికి వెళ్లిన బాబు అక్కడున్న వైర్‌మన్ నిత్యానందం, షణ్ముగం వద్ద డబ్బులు ఇవ్వగా అక్కడే దాగిఉన్న అవినీతి నిరోధక శాఖ సీఐ తమిళ్‌సెల్వి తదితరులు వారిద్దరిని రెడ్ హ్యాండడ్‌గా పట్టుకుని విచారించగా జూనియర్ ఇంజినీర్ సూచనల మేరకు డబ్బులు తీసుకున్నట్లు నేరాన్ని అంగీకరించడంతో ముగ్గురిని అరెస్టు చేసి, కేసు దర్యాప్తు చేపట్టారు. అనంతరం వారిని రిమాండ్ నిమిత్తం తిరువళ్లూరు కోర్టులో హాజరు పరిచి పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు.

అనారోగ్యంతో ఇద్దరి ఆత్మహత్య

తిరువళ్లూరు: అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగిన ఇద్దరు వ్యక్తులు చిక్సిత పొందుతూ మృతి చెందిన సంఘటనలు పెనాలూరుపేట, వెంగల్ పరిధిలో విషాదం నింపాయి. తిరువళ్లూరు జిల్లా పెనాలూరుపేట సమీపంలోని అల్లికుళి ప్రాంతానికి చెందిన వెంకటేష్(36) కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. చిక్సిత కోసం పలు వైద్యశాలకు వెళ్లినా ఫలితం లేకపోవడంతో వెంకటేష్ గత 10వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అప్రమత్తమైన బంధువులు వెంకటేష్‌ను తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ మూడు రోజుల పాటు చిక్సిత పొంది డిచార్జ్ చేశారు. అయితే గత 24వ తేదీన మళ్లీ కడుపు నొప్పి రావడంతో బాధితుడ్ని శ్రీపెరంబదూరు సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా మారడంతో రాజీవ్‌గాంధీ వైద్యశాలకు తరలించగా అక్కడ చిక్సిత పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల విచారణలో వెంకటేష్ రెండో సారీ సైతం పురుగుల మందు తాగినట్టు నిర్ధారించారు. మృతుడి భార్య వడివు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెనాలూరుపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అలాగే తిరువళ్లూరు జిల్లా పున్నపాక్కం గ్రామానికి చెందిన కరుణామూర్తి(38) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్టు తెలుస్తుంది. ఈ క్రమంలో గత 25న పురుగుల మందు తాగిన రామమూర్తిని స్థానికులు తిరువళ్లూరు జిల్లా వైద్యకేంద్రానికి తరలించి అక్కడ ప్రాథమిక చిక్సిత అనంతరం మెరుగైన చిక్సిత కోసం చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చిక్సిత పొందుతూ మంగళవారం ఉదయం కరుణామూర్తి మృతి చెందాడు.

636 ప్రైవేట్ స్కూళ్లల్లో ప్రవేశానికి విద్యార్థుల ఎంపిక



ఎంపికలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కొరుక్కుపేట: చెన్నైలోని 636 ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశానికి లాటరీ విధానంలో విద్యార్థుల ఎంపిక చేశారు. తమిళనాడులోని నాన్ మైనారిటీ ప్రైవేట్ సెల్ఫ్ ఫైనాన్స్ పాఠశాలల్లో పేద పిల్లలకు ఉచిత విద్యనందిస్తున్నారు. ఎల్‌కేజీ, ఒకటో తరగతి పిల్లలు మాత్రమే ఈ పథకంలో చేర్చారు. రైట్ టూ ఎడ్యుకేషన్ యాక్ట్ (ఉచిత విద్యాహక్కు చట్టం) ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాల 25 శాతం సీట్లను రిజర్వ్ చేసుకోవాలి. తమిళనాడులో రాబోయే విద్యా సంవత్సరానికి దరఖాస్తు నమోదు ఏప్రిల్‌లో ప్రారంభమైంది. తమిళనాడు వ్యాప్తంగా లక్ష సీట్లకు 2 లక్షల మందికి పైగా తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల సంఖ్య పాఠశాల 25 శాతం సీట్ల కోటాను మించి ఉంటే, వాటిని లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారు. దీని ప్రకారం అధికంగా దరఖాస్తులు వచ్చిన పాఠశాలల్లో మంగళవారం లాటరీ నిర్వహించారు. విద్యాశాఖాధికారులు, దేవాదాయ శాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమక్షంలో లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేసి, ప్రవేశం కల్పించారు. ఒక విద్యార్థి సమీపంలోని 4 పాఠశాలల్లో నమోదు చేసుకోవచ్చు. వీటిలో దేనికైనా పాఠశాలలో చోటు ఉంటుంది. ఈ క్రమంలో చెన్నై జిల్లాలోని 636 ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు లాటరీ విధానంలో ఎంపికయ్యారని చెన్నై జిల్లా ప్రాథమిక విద్య అధికారి మార్స్ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి హత్య

అన్నానగర్: వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి 3 హత్యలు జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. చెన్నైలోని క్రోమ్‌పేట టీఎస్ లక్ష్మణ్‌నగర్‌లో నివాసముంటున్న థామస్ (50) అనే వ్యక్తి ట్రక్కు నడుపుతూ లెదర్ వేస్ట్ రవాణా చేసేవాడు. ఇతడు అదే ప్రాంతానికి చెందిన శబరి(31)కి రూ.30 వేలు అప్పు ఇచ్చినట్లు సమాచారం. ఈ స్థితిలో శబరిని సోమవారం రాత్రి థామస్ సంప్రదించి డబ్బు ఇవ్వాలని కోరాడు. వెంటనే శబరి చెప్పిన ప్రదేశమైన తిరునీరుమలై రోడ్డులోని కరుమారియమ్మన్ గుడి దగ్గరకు థామస్ వెళ్లాడు. ఆ సమయంలో శబరి, అతని సహచరులు దాచిన కత్తితో థామస్‌ను నరికి చంపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం క్రోమ్‌పేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి శబరిని అరెస్టు చేసి, విచారిస్తున్నారు. అలాగే తాంబరం పక్కనే ఉరివిలియూర్ సరస్సు ప్రాంతానికి చెందిన కార్తీక్ రాజా (35)పై హత్యాయత్నం, దాడి కేసులున్నాయి. రెండేళ్ల క్రితం మహా అనే మహిళతో వివాహమైంది. అనంతరం ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఆటో నడుపుతున్నట్లు తెలుస్తుంది. ఏ ఆటో డ్రైవింగ్ అసోసియేషన్‌లో చేరకుండానే అన్ని ప్రాంతాలకు వెళ్లాడు. దీంతో తాంబరం ప్రాంతంలో ఆటోడ్రైవర్స్ అసోసియేషన్ అధినేత ఆనందన్, కార్తీక్ రాజాల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ స్థితిలో సోమవారం రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో బస్ స్టేషన్ వద్ద కార్తీక్ రాజా తన ఆటోలో ఉన్నాడు. అప్పుడు అక్కడికి వచ్చిన ఆనందన్‌తో సహా ఆరుగురు కార్తీక్ రాజా ను కత్తితో నరికారు. దీంతో కార్తీక్‌రాజా అక్కడికక్కడే మరణించాడు. తాంబరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం క్రోమ్‌పేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి ఆనందన్ సహా ఆరుగురి కోసం గాలిస్తున్నారు.

మరో వ్యక్తి..

కుండ్రత్తూరు పక్కన మలయంబాక్కం ప్రాంతంలో రాజేష్ (30) అనే వ్యక్తి ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. గత రాత్రి సెంబరంబాక్కం సరస్సు ఒడ్డున నడుచుకుంటూ వెళుతున్న రాజేష్‌ను ఆ మార్గంలో బైకుపై వచ్చిన అనుమానాస్పద వ్యక్తులు అడ్డగించి, డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసి, బెదిరించారు. అతను నిరాకరించడంతో దుండగులు తాము దాచుకున్న కత్తితో రాజేష్‌ను నరికివేశారు. అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్, డబ్బు లాక్కొని పరారయ్యారు. రక్తపు మడుగులో పడి ఉన్న రాజేష్‌ను గ్రామస్తులు రక్షించి సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున రాజేష్ మృతి చెందాడు. ఈ ఘటనపై కుండ్రత్తూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. హంతకుల కోసం గాలిస్తున్నారు.

20 కిలోల ఆఫ్రికన్ క్యాట్ ఫిష్ లభ్యం

అన్నానగర్: సరస్సు పూడికతీత సమయంలో 20 కిలోల బరువు ఉన్న ఆఫ్రికన్ క్యాట్ ఫిష్ దొరికింది. వివరాల్లోకి వెళితే.. సేలం బోడినాయకన్ పట్టి సరస్సు సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. 2019లో రూ. 15 కోట్ల అంచనా వ్యయంతో చెరువు సుందరీకరణకు నిధులు కేటాయించి, పనులు ప్రారంభించారు. పనులు నెమ్మదిగా సాగుతుండగా, వచ్చే నెలలో సరస్సును ప్రారంభించేందుకు తక్షణమే పనులు చేపడుతున్నట్లు తెలుస్తుంది. ఈ స్థితిలో సరస్సులో నిలిచిన నీటిలో నిషేధిత ఆఫ్రికన్ క్యాట్ ఫిష్‌లు పుష్కలంగా ఉన్నాయని ఆ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు జిల్లా యాడ్ షైర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సరస్సును పరిశీలించాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం సరస్సును పరిశీలించిన మత్స్యశాఖ అధికారులు సరస్సులోని చేపలను పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. ఆ సమయంలో సుమారు 20 కిలోల యాఫ్ ట్రికెన్ క్యాట్ ఫిష్ సరస్సులో చిక్కింది. దీంతో జనాలు షాక్‌కు గురయ్యారు. ఆఫ్రికన్ క్యాట్ ఫిష్ జాతులు సరస్సులో ఉన్నందున, సరస్సులోని మొత్తం నీటిని తోడి వేసి, ఇలాంటి చేపలు ఇంకా ఏమైనా ఉన్నాయో? లేదో నిర్ధారించాలన్నారు.

బాలికపై లైంగిక దాడి

• ముగ్గురి అరెస్టు

తిరువొత్తియూరు: విల్లివాక్కంలో ఆరు నెలలుగా 11 ఏళ్ల బాలికను లైంగిక దాడి చేసిన వ్యవహారంలో బాలిక పెదనాన్న కుమారుడు, టైలర్, పక్కింటిలో ఉన్న బాలుడితో సహా ముగ్గురుని పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. చెన్నై విల్లివాక్కం పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న సెల్వం కూలీగా జీవనం సాగిస్తున్నాడు. అతడితోపాటు భార్య కూడా మద్యం మత్తుకు అలవాటు పడి, పిల్లలను పట్టించుకోలేదు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె ఆరో తరగతి చదువుతోంది. ఈమె సోమవారం తిరువేర్కాడు ప్రాంతంలో ఉన్న తన పిన్ని ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో తీవ్ర కడుపు నొప్పిగా ఉందని, పెదనాన్న కుమారుడు తన వద్ద అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు చెప్పి, ఏడ్చింది. ఇది విని దిగ్భ్రాంతి చెందిన ఆమె పిన్ని ఆ బాలికను ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ పరీక్షించిన వైద్యులు బాలికపై కొన్ని నెలలుగా లైంగిక దాడి జరుగుతున్నట్లు తెలిపారు. ఈ విషయమై బాలికను విచారించగా బాలిక పెదనాన్న కుమారుడు, మొదట అసభ్యకరంగా ప్రవర్తించాడని, తరువాత ఎదురింట్లో ఉన్న మరొక 16 ఏళ్ల బాలుడు, అదే ప్రాంతంలో ఉన్న టైలర్ కుమార్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపింది. దీనిపై విల్లివాక్కం మహిళా పోలీసులకు బాలిక పిన్ని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి బాలిక పెదనాన్న కుమారుడు, ఎదురింట్లోని బాలుడు, టైలర్ కుమార్ ముగ్గురిని పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు.

మసాజ్ కోసం వచ్చి చోరీ

తిరువొత్తియూరు: మసాజ్ కోసం వచ్చి చోరీ చేసిన కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వేలచేరి 100 అడుగుల రోడ్డులో మసాజ్ సెంటర్ ఉంది. ఇక్కడ సోమవారం రాత్రి ఇద్దరు యువకులు మసాజ్ చేయించుకోవడానికి వచ్చారు. వారు హఠాత్తుగా అక్కడ ఉన్న ఉద్యోగులపై దాడి చేసి గల్లా పెట్టెలో ఉన్న రూ. 5 వేలు చోరీ చేసుకుని పారిపోవడానికి యత్నించారు. ఆ సమయంలో ఉద్యోగులు ఓ వ్యక్తి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో అతను తిరునల్వేలి నాంగునేరి ప్రాంతానికి చెందిన కొంబయ్య పాండియన్ అని తెలిసింది. తప్పించుకుని పారిపోయిన అతడి స్నేహితుడు సింగ్‌జో అని తెలిసింది. పోలీసులు దర్యాప్తు చేసి ట్రిప్లికేన్ ఉన్న లాడ్జిలో దాగివున్న సింగ్ జోను అరెస్టు చేశారు.

చోలింగనల్లూర్‌లో స్కూల్ వ్యాన్‌ల తనిఖీ

తిరువొత్తియూరు: చోలింగనల్లూర్ రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం తరఫున అధికారులు సెమ్మంచేరిలోని ప్రైవేట్ కళాశాల ఆవరణలో పాఠశాల వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా తహసీల్దార్ బాబు, జిల్లా రవాణా అధికారి యువరాజ్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అరుణాచలం, ముత్తు ట్రాన్స్‌పోర్ట్ సబ్ ఇన్ స్పెక్టర్ కణ్ణన్ తదితరులు 331 వాహనాలను తనిఖీ చేశారు. వీటిలో 29 పాఠశాలలకు సంబంధించిన వాహనాల్లో ఎమర్జెన్సీ తలుపులు, నిఘా కెమెరాలు, వేగ నియంత్రణ పరికరాలు లోపభూయిష్టంగా ఉన్నాయి. దీంతో వాటికి మరమ్మతులు చేయించాలన్నారు.

ఆకాశం నుంచి పడిన వింత వస్తువు

• భూమిలో ఏర్పడిన ఐదు అడుగుల గుంత
• పరిశోధన కేంద్రం అధికారులు తనిఖీ



వ్యవసాయ భూమిలో ఏర్పడిన గుంత

వేలూరు: ఆకాశం నుంచి ఏదో వస్తువు పడి పేలిన పెద్ద శబ్దం వచ్చి, ఆ ప్రాంతంలో ఐదు అడుగుల మేర గుంత ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేట సమీపంలోని అచ్చమంగలం కోట గౌండర్ ప్రాంతానికి చెందిన రైతు రవి. ఇతని వ్యవసాయ భూమిలో గత రెండు రోజుల క్రితం పెద్ద పేలుడు శబ్దం వచ్చింది. దీంతో స్థానికులు గమనించి వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి పరిశీలించగా ఐదు అడుగుల లోతు, రెండు అడుగుల వెడల్పుతో కూడిన గుంత ఏర్పడి ఉండడాన్ని గమనించారు. అలాగే ఈ గుంత నుంచి అధికంగా వేడి గాలి వచ్చినట్లు స్థానికులు గుర్తించిన ఆకాశం నుంచి ఏదైనా వస్తువు పడిందా? లేక వేరే ఏమైనా పడిందా? అనే కోణంలో స్థానికులు జోలార్‌పేట తహసీల్దార్‌కు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ దర్పకరాజ్, తహసీల్దార్ ఆనంద క్రిష్ణన్, రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి, విచారణ జరిపారు. వీటిపై కలెక్టర్ దర్పకరాజ్ మాట్లాడుతూ వ్యవసాయ పొలంలో పెద్ద శబ్దంతో కూడిన వస్తువు పడినట్లు స్థానికులు తెలపడంతో వాటిని తనిఖీ చేశామని, అయితే వీటిపై పరిశోధన కేంద్రం అధికారులకు సమాచారం అందజేయడంతో వీటిని నిపుణులు పరిశోధన చేయనున్నారని, ఇప్పటికే గుంటలోని మట్టిని పరిశోధనకు పంపామన్నారు. దీనిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మంగళవారం ఉదయం వేలూరులోని పరిశోధన కేంద్రం అధికారుల బృందం నేరుగా వచ్చి తనిఖీ చేశారని పల్లంలోని మట్టితో పాటు బాగా కాలిన బూడిదను పరిశోధనకు తీసుకెళ్లినట్లు తెలిపారు. పల్లం చుట్టూ ఎవరూ దగ్గరకు వెళ్లకుండా ట్రంచ్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

వైభవంగా ధర్మపురం జ్ఞానపురీశ్వర్ రథోత్సవం

తిరువొత్తియూరు: మైలాడుదురై ధర్మపురం జ్ఞానపురీశ్వరస్వామి ఆలయంలో వైకాసి మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొని, రథాన్ని లాగారు. 30వ తేదీ పట్టణ ప్రవేశ కార్యక్రమం జరుగుతుంది. మైలాడుదురై సమీపంలోని ధర్మపురంలో 16వ శతాబ్దానికి చెందిన ధర్మపురం అదీన మఠం ఉంది. ఇక్కడ 1,500 సంవత్సరాలు పురాతనమైన జ్ఞానాంబిక సమేత జ్ఞానపురీశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం వైకాసి మాసం సందర్భంగా బ్రహ్మోత్సవాలు కోలాహలంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు ఈ నెల 20వ తేదీన ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. 26వ తేదీ తిరుకల్యాణం నిర్వహించారు. మంగళవారం రథోత్సవం నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, విశేషాలంకరణ చేశారు. ధర్మపురం ఆధీనం 27వ గురు మహా సన్నిధానం శ్రీల శ్రీ మాసిలామని దేశిక జ్ఞాన సంబంధ పరమాచార్య స్వామి పాల్గొని, రథాన్ని లాగి, రథోత్సవం ప్రారంభించారు. తరువాత భక్తులు శివనామ స్మరణల నడుమ పురవీధుల్లో రథోత్సవం కోలాహలంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. కాగా 29వ తేదీ ఉదయం స్వామివారి పల్లకిసేవ నిర్వహించనున్నారు. 30వ తేదీ ప్రస్తుతం ఉన్న మఠం గురువును పల్లకిలో పట్టణ ప్రవేశం ఊరేగింపు నిర్వహించనున్నారు.

చర్చి పాస్టర్ ఇంట్లో 80 సవర్ల నగలు చోరీ

తిరువొత్తియూరు: పుదుకోట్టైలో చర్చి పాస్టర్ ఇంటి తాళం పగలగొట్టి 80 సవర్ల నగలు చోరీ చేసిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పుదుకోట్టై గణేష్ నగర్ ఒకటో వీధికి చెందిన జాన్ దేవా సహాయం (45) చర్చి పాస్టర్‌గా ఉన్నాడు. ఇతని కుమారుడికి అనారోగ్యం కారణంగా కొన్ని రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా కోవైలో ఉన్న ఒక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తిరిగి వచ్చారు. ఆ సమయంలో అతని ఇంటి తాళం పగలగొట్టి ఉంది. దీంతో దిగ్భ్రాంతి చెందిన చర్చి పాస్టర్ ఇంటి లోపలికి వెళ్లి చూడగా అక్కడ ఉన్న వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా పగలగొట్టి అందులో ఉంచిన 80 సవర్ల నగలు అపహరించుకుని వెళ్లినట్లు గుర్తించాడు. జాన్ దేవ సహాయం ఈ విషయమై గణేష్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలిస్తున్నారు. చోరీకి గురైన నగల విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని అంచనా. దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందం పోలీసులను ఏర్పాటు చేశారు.

లైంగిక వేధింపులపై ఉద్యోగిని ఫిర్యాదు

• పూజారి అరెస్టు

అన్నానగర్: ఓ ప్రైవేట్ టెలివిజన్ ఛానల్‌కు చెందిన మహిళా ఉద్యోగినిని లైంగికంగా వేధిస్తున్నాడని చేసిన ఫిర్యాదు మేరకు ఆలయ పూజారిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నైలోని సాలిగ్రామానికి చెందిన ఓ ప్రైవేట్ టెలివిజన్ ఛానల్‌కు చెందిన మహిళా ఉద్యోగి, ప్యారిస్‌లోని ఆలయ పూజారి కార్తీక్ మునుస్వామిపై లైంగిక ఫిర్యాదు చేసింది. ఆలయ తీర్థం అని చెప్పి పూజారి కార్తీక్ మునుసామి ఆమెకు మత్తు లిక్విడ్ ఇచ్చాడని, అది తాగి స్పృహ తప్పిన తనపై లైంగికదాడికి పాల్పడ్డాడని తెలిపింది. ఆ తర్వాత అతను తనకు బలవంతంగా అబార్షన్ చేయించాడని విలపించింది. అంతటితో ఆగక తనను ఒక ప్రముఖ వ్యక్తి ఇంటికి తీసుకెళ్లి, అతనితో సన్నిహితంగా ఉండమని బలవంతం పెట్టాడని ఆమె విరుగంబాక్కం మహిళా పోలీసులు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూజారి కార్తీక్ మునుసామిపై పోలీసులు లైంగిక వేధింపుల నిరోధక చట్టం సహా 6 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీంతో పూజారి కార్తీక్ మునుసామిని ఆలయ నిర్వాహకులు సస్పెండ్ చేశారు. అతడు పరారీలో ఉండడంతో పోలీసులు అతని కోసం వెతుకుతున్నారు. విదేశాలకు పారిపోకుండా లుక్ ఔట్ నోటీసు కూడా జారీ చేశారు. ఈ క్రమంలో మేట్టుపాళయంలో తలదాచుకున్న పూజారి కార్తీక్ మునుసామిని మంగళవారం అరెస్టు చేశారు.

పామును పట్టుకున్న వీడియో సోషల్ మీడియాలో పోస్ట్



వైరల్ అవుతున్న పామును పట్టిన వీడియో

అన్నానగర్: కోయంబత్తూరులో అనుమతి లేకుండా పామును పట్టుకున్న వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఇద్దరిని అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. కోయంబత్తూరులోని గణపతి ప్రాంతానికి చెందిన ఉమామహేశ్వరి చిన్నతనం నుంచి గుడి రూపు ప్రాంతంలో సంచరించే పాములను పట్టుకుని అటవీ శాఖ అధికారులకు అప్పగిస్తూ వచ్చింది. ఈ స్థితిలో కోయంబత్తూరులోని పులియంగులం నివాస ప్రాంతంలో పాము సంచరిస్తోందని ఆ ప్రాంత ప్రజలు వారికి సమాచారం అందించారు. పాములు పట్టే ఉమామహేశ్వరి, సంజయ్ ఘటనా స్థలానికి చేరుకుని 8 అడుగుల పొడవున్న పామును పట్టుకుని అడవిలోకి పంపించారు. అంతకుముందు స్నేక్ క్యాచర్ ఉమా మహేశ్వరి పాము పట్టుకున్న వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఆ వీడియో వైరల్ అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు అనుమతి లేకుండా పామును పట్టుకుని, వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసినందుకు ఇద్దరిని అరెస్ట్ చేశారు.

త్వరలో తిరుత్తణి రింగ్‌రోడ్డు ప్రారంభం



రింగ్‌రోడ్డు పనులు తనిఖీ చేస్తున్న దక్షిణామూర్తి

తిరుత్తణి : పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు త్వరలో రింగ్‌రోడ్డు ప్రారంభించనున్నట్లు హైవే శాఖ ఎక్స్‌క్యూటివ్ ఇంజినీర్ దక్షిణామూర్తి తెలిపారు. తిరుత్తణి పట్టణంలో మురుగన్ ఆలయంతో పాటు వందలాది కల్యాణ మండపాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, వ్యాపార సంస్థలు ఉన్న నేపథ్యంలో నిత్యం వాహన రద్దీ నెలకొంటున్నది. ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు హైవేశాఖ ఆధ్వర్యంలో తిరుత్తణి శివారులోని చెన్నై–తిరుపతి జాతీయ రహదారి నుంచి 3.2 కిలో మీటర్ల దూరం అరక్కోణం రోడ్డు క్రాస్ వరకు రింగ్‌రోడ్డు నిర్మాణానికి రూ. 52 కోట్లు నిధులు కేటాయించి 2018 లో పనులు ప్రారంభించారు. రింగ్‌రోడ్డు మధ్యలోని రైల్వే ట్రాక్, నందినీ నది ఉన్నందున హైవే బ్రిడ్జి నిర్మాణపు పనులు నెమ్మదిగా జరుగుతున్నాయి. ఈ పనులను హైవే శాఖ ఎక్స్‌క్యూటివ్ ఇంజినీర్ దక్షిణామూర్తి తనిఖీ చేసి, పనులు త్వరగా పూర్తి చేసి రోడ్డు ప్రారంభించనున్నట్లు తెలిపారు. డివిజినల్ ఇంజినీర్ చిత్రరసు, డివిజినల్ సహాయ ఇంజినీర్ రఘునాథన్, సహాయ ఇంజినీర్ పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెకానిక్ దినోత్సవం



తిరుత్తణిలో సంబరాలు చేసుకుంటున్న మెకానిక్‌లు

తిరుత్తణి: ప్రపంచ మెకానిక్ దినోత్సవం సందర్భంగా తిరుత్తణిలో మంగళవారం ద్విచక్ర వాహనాల మెకానిక్‌లు కేక్ కట్‌చేసి విద్యార్థులకు సహాయకాలు అందజేసి వేడుకలు జరుపుకున్నారు. తిరుత్తణిలో తనిగై ద్విచక్రవాహనాల మెకానిక్‌ల సంఘం ఆధ్వర్యంలో మెకానిక్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కోటి సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పదో తరగతి, ప్లస్–1, ప్లస్–2 పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు దుస్తులు, విద్యా సామగ్రిని అందజేశారు.

ఓటింగ్ పెంచేందుకు ఈసీ మీమ్స్

సార్వత్రిక ఎన్నికల సమరం చివరాఖరి దశకు చేరుకుంది. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం ఎంత ప్రయత్నిస్తున్నా ఇప్పటిదాకా జరిగిన ఆరు విడతల్లో పెద్ద మార్పేమీ కనిపించలేదు. దాంతో చివరిదైన ఏడో విడతలోనైనా ఓటింగ్ శాతాన్ని వీలైనంత పెంచేందుకు ఈసీ పలు ప్రయత్నాలు చేస్తోంది. యువ ఓటర్లను పోలింగ్ బూత్‌లకు రప్పించేందుకు వారికి బాగా కనెక్టయ్యే మీమ్స్‌ను ఎంచుకుంది. మీర్జాపూర్ వెబ్ సిరీస్ ఎంత హిట్టయిందో, అందులోని మున్నా భయ్యా పాత్ర కూడా అంతే ఫేమస్ అయింది! ఈసీ రిలీజ్ చేసిన కొత్త మీమ్‌లో మున్నా భయ్యా డైలాగ్‌ను ఓటింగ్‌కు అన్వయించింది. మీర్జాపూర్ వెబ్ సిరీస్‌లో మున్నా భయ్యా క్లాస్ రూమ్‌లో చెప్పే

మీర్జాపూర్ వెబ్ సిరీస్ 'మున్నా భయ్యా' టెంప్లేట్ కాపీ



'పడాయీ లిఖాయీ కరో, ఐఏఎస్ వయ్యేఎస్ బనో' (చదువుసంధ్యలపై దృష్టి పెట్టు, కలెక్టరో మరోటో అవ్వు) అనే ఒరిజినల్ డైలాగ్ ఇప్పటికీ రీల్స్, షార్ట్ వీడియోల్లో చక్కర్లు కొడుతూనే ఉంటుంది. ఈసీ ఇప్పుడు దీనికి ఓటింగ్ ట్విస్ట్ ఇచ్చింది. 'యే క్యా రీల్స్ మే టైమ్ బర్బాద్ కర్ రహే? జావో వోట్ దో, లోక్‌తంత్ర్ కో మజ్‌బూత్ కరో' (రీల్స్ వెంటపడి ఎందుకు టైమ్ వేస్ట్ చేసుకుంటారు? వెళ్లి ఓటేయండి... ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి) అని ఓటర్లకు మున్నా భయ్యా చెబుతున్నట్లుగా మీమ్ రూపొందించింది. 'యువతను మున్నా భయ్యా ఓటేయాలని కోరుతున్నాడు' అంటూ క్యాప్షన్‌ను కూడా జోడించింది!

ఏడు విడతల సుదీర్ఘ షెడ్యూల్‌లో ఇప్పటికి ఆరు విడతలు పూర్తయ్యాయి. 57 లోక్‌సభ స్థానాలకు జూన్ 1న చివరి విడతలో పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడవుతాయి. ఆఖరి దశలో చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతంతో సహా బిహార్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లో పోలింగ్ జరగనుంది. దాంతో అక్కడ ప్రచారం దుమ్మురేగిపోతోంది. చివరి దశలో ప్రధాని మోదీ సహా మొత్తం 904 మంది అభ్యర్థులు తలపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈసీ మున్నా భాయ్ మీమ్ ప్రయోగం యూత్‌ను ఏ మేరకు పోలింగ్ బూత్‌లకు రప్పిస్తుందో చూడాలి!

– సాక్షి, నేషనల్ డెస్క్

కశ్మీర్ లోయలో... ఓట్ల పంట!



మూడు లోక్‌సభ స్థానాల్లో రికార్డు ఓటింగ్

మార్పుకు సూచికా, మోదీ సర్కారుపై ఆగ్రహమా?

శ్రీనగర్ 38.49
బారాముల్లా 59.1
అనంత్‌నాగ్-రాజౌరి 54.46

కశ్మీర్ లోయలోని మూడు లోక్‌సభ స్థానాల్లో నమోదైన ఓటింగ్ శాతాలివి. చూడ్డానికి ఇదేమంత భారీ ఓటింగ్ కాదనిపించవచ్చు. కానీ, గత మూడున్నర దశాబ్దాల్లో వాటిలో ఇదే అత్యధిక ఓటింగ్. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370ని, రాష్ట్ర హోదాను తొలగించాక వచ్చిన తొలి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఇంత భారీగా ఓటింగ్‌లో పాల్గొనడంలో ఆంతర్యమేమిటి? వాళ్లు మార్పును ఆహ్వానిస్తున్నారా? లేదంటే మోదీ సర్కారుపై ఆగ్రహాన్ని ఓటు రూపంలో వ్యక్తం చేశారా...?

– సాక్షి, నేషనల్ డెస్క్

కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లో 5 లోక్‌సభ స్థానాలున్నాయి. జమ్మూ పరిధిలో జమ్మూ, ఉధంపూర్.. కశ్మీర్ లోయలోని శ్రీనగర్, బారాముల్లా, అనంత్‌నాగ్-రాజౌరి. జమ్మూ, ఉధంపూర్‌లో హిందువుల ఓట్లు గణనీయంగా ఉన్నాయి. వాటిలో గతంతో పోలిస్తే ఈసారి ఓటింగ్‌లో పెద్ద మార్పు లేదు. కానీ ముస్లింలు అధికంగా ఉండే లోయలోని మూడు లోక్‌సభ స్థానాల్లో మాత్రం 1989లో తీవ్రవాదం పెచ్చరిల్లిన అనంతరం ఎన్నడూ లేనంతగా ప్రజలు భారీగా ఓటేశారు.

మార్పు మొదలైంది..!

కశ్మీర్ దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదని, తమ పిల్లలు పెద్ద చదువులు చదివి ఖాళీగా ఉండాల్సిన దుస్థితి మారాలని స్థానిక ఓటర్లు చెప్పడం గమనార్హం. మార్పు కోరుకుంటున్నట్టు వారి మాటల్లో వ్యక్తమవుతోంది. అయితే ఆర్టికల్ 370 రద్దుతో తాము ప్రత్యేక హక్కులు కోల్పోయామంటూ వారిలో తెలియని ఆందోళన కనిపిస్తోంది. యువతను నిర్బంధించడంతో నిరసనలు వ్యక్తం చేయలేని పరిస్థితులపైనా ఆగ్రహం వ్యక్తమవుతోంది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చేసి, ముస్లిం మెజారిటీ ప్రాంతాల్లోకి ఇతరులను అనుమతించడం ద్వారా ప్రాంత రూపురేఖలే మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ స్థానికుల్లో భయం సృష్టించడంలో ప్రాంతీయ పార్టీలు విజయవంతమయ్యాయి. మోదీ సర్కారుపై ఆగ్రహం అక్కడి ప్రజల మాటల్లో గట్టిగానే వ్యక్తమవుతోంది. "రాళ్లు రువ్వి, ఎన్నికలు బహిష్కరించి మేం సాధించిందేమీ లేదు. నా మిత్రులు ఏళ్లుగా జైళ్లలో మగ్గుతున్నారు. వారిని పట్టించుకున్నవారు లేరు. మెరుగైన భవిష్యత్తుపై ఆశతో ఓటేశాం" అని స్థానిక యువతీ యువకులు చెబుతున్నారు.

గతంలోలా కాదు...

తీవ్రవాదం, వేర్పాటువాదాల కుంపట్ల వల్లే 1989–2019 మధ్య కశ్మీర్లో అల్ప ఓటింగ్ నమోదైందని విశ్లేషకులు చెబుతున్నారు. ఓటర్లనే గాక నేతలను కూడా ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్న ఉదంతాలెన్నో! ఈసారి పరిస్థితి మారింది. వేర్పాటువాదులు, మత పెద్దల నుంచి ఎన్నికలు బహిష్కరణ పిలుపుల్లేవు. ఓటేస్తే ప్రాణాలు తీస్తామంటూ ఎన్నికల వేళ విన్పించే పాక్ ప్రేరేపిత ఉగ్రవాద బెదిరింపులూ వినిపించలేదు. 2019లో ఆర్టికల్ 370 రద్దయినప్పటి నుంచీ కశ్మీర్‌లో శాంతిభద్రతలు మెరుగయ్యాయి. ఉగ్ర కార్యకలాపాలకు అడ్డుకట్ట పడింది. రవాణా వసతులు మెరుగయ్యాయి. స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. పర్యాటకుల రాక పెరగడంతో ఉపాధి అవకాశాలూ మెరుగుపడ్డాయి. యూట్యూబ్ చానళ్లు, సామాజిక మాధ్యమాల ద్వారా కశ్మీర్ అందాలను అక్కడి యువత ప్రపంచంతో పంచుకుంటోంది.

పార్టీల మద్దతు

కశ్మీర్లో ప్రధాన పార్టీలు కూడా ఈసారి ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనడానికి మద్దతుగా నిలిచాయి. ఎన్నికల్లో పాల్గొంటే నేరంగా చూసే భావన వల్ల కశ్మీరీలు ఇంతకాలంగా మూల్యం చెల్లించుకున్నారని శ్రీనగర్ నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి ఆగా సయ్యద్ రుహుల్లా మెహెదీ అన్నారు. ఓటే ఆయుధమని ప్రజలు అర్థం చేసుకున్నారని పీడీపీ అభ్యర్థి వహీదుర్ రెహ్మాన్ పర్రా అన్నారు. ఆర్టికల్ 370 రద్దుపై వ్యతిరేకతను ఓట్ల రూపంలో తెలియజేశారని అభిప్రాయపడ్డారు. ప్రజల్లో 'బీజేపీ భయాన్ని' కల్పించడంలో ఎన్సీ, పీడీపీ విజయవంతమయ్యాయని రాజకీయ విశ్లేషకుడు షేక్ షౌకత్ హుస్సేన్ అన్నారు. అందుకే ఓటింగ్ భారీగా నమోదైందని విశ్లేషించారు. ఎన్నికల సంఘంతో పాటు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ఆర్టికల్ 370 రద్దు వల్లే ప్రజలు స్వేచ్ఛగా ఓటింగ్‌లో పాల్గొన్నారని చెప్పడం విశేషం.

గత మూడు ఎన్నికల్లో జమ్మూకశ్మీర్‌లో ఓటింగ్ (శాతాల్లో)

స్థానం	2024	2019	2014
శ్రీనగర్	38.49	14.43	25.86
బారాముల్లా	59.10	34.89	39.13
అనంత్‌నాగ్-రాజౌరి	54.46	8.98	29
జమ్మూ	72.22	72.5	67.83
ఉధంపూర్	68.27	71.01	70.91

కీలకం

అంచనాలకందని లుధియానా

లుధియానా. ఒకప్పటి సుల్తానుల నగరం. టెక్స్‌టైల్ ఉత్పత్తుల్లో మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పేరున్న ప్రాంతం. ఈ లోక్‌సభ స్థానంలో ప్రధాన పోటీ కాంగ్రెస్, అకాలీదళ్ మధ్యే ఉండేది. ఈసారి నాలుగు ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు కూడా భారీగా బరిలోకి దిగడంతో రాజకీయ దృశ్యం మారిపోయింది...

– సాక్షి, నేషనల్ డెస్క్

లుధియానా లోక్‌సభ స్థానంపై 1952 నుంచీ కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఇక్కడ 11 పర్యాయాలు కాంగ్రెస్ విజయం సాధించింది. శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) ఈ సీటులో ఆరుసార్లు గెలిచింది. అకాలీదళ్‌తో బంధం తెగిపోవడంతో బీజేపీ ఇక్కడ తొలిసారి సింగిల్‌గా బరిలో దిగింది. ఈసారి సిట్టింగ్ ఎంపీ రవ్‌నీత్ సింగ్ బిట్టూను కాదని పీసీసీ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా వారింగ్‌కు కాంగ్రెస్ టికెటిచ్చింది. దాంతో బిట్టూ బీజేపీలో చేరి ఆ పార్టీ తరఫున బరిలో దిగారు. పంజాబ్‌లో అధికార పార్టీ అయిన ఆప్ నుంచి అశోక్ పరాశర్ (పప్పీ), అకాలీదళ్ నుంచి రంజిత్ సింగ్ ధిల్లాన్ పోటీ చేస్తున్నారు.

నాలుగు పార్టీల హోరాహోరీ

- బీజేపీ అభ్యర్థిగా కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ
- పీసీసీ చీఫ్‌ను బరిలో దింపిన కాంగ్రెస్
- ఆప్, అకాలీదళ్ నుంచి గట్టి పోటీ



• రవ్‌నీత్ సింగ్ బిట్టూ



• అమరీందర్ సింగ్ వారింగ్

బిట్టూ వర్సెస్ వారింగ్

బిట్టూ పట్టణ, హిందూ ఓట్లపైనే ఆధారపడుతున్నారు. గెలుపు కోసం ఏ అవకాశమూ వదులుకోవడం లేదు. పాకిస్తాన్‌తో సరిహద్దు వాణిజ్యం కోసం వాఘా సరిహద్దును తెరుస్తానని హామీ ఇచ్చారు! వైద్యపరిశోధన విద్యాసంస్థ, మెట్రో రైలు వాగ్దానం చేస్తూ 'లుధియానా విజన్' పేరుతో సొంత మేనిఫెస్టో విడుదల చేశారు. అయితే రైతుల నుంచి ఆయనకు తీవ్ర నిరసనలు ఎదురవుతున్నాయి. రాజాను గెలిపించుకోవడానికి కాంగ్రెస్ సీనియర్లంతా బరిలో దిగారు. ఈ ఎన్నికలను విధేయుడు, ద్రోహి మధ్య పోటీగా ఆయన అభివర్ణిస్తున్నారు. ఆయన కూడా పలు హామీలతో విజన్ డాక్యుమెంట్ విడుదల చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన కాంగ్రెస్ నేత కమల్జీత్ సింగ్ బ్రార్ ఓట్లను చీల్చేలా ఉన్నారు.

పథకాలనే నమ్ముకున్న పప్పీ

ఆప్ అభ్యర్థి అశోక్ పరాశర్ (పప్పీ) రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఆధారపడుతున్నారు. గృహాలకు 600 ఉచిత విద్యుత్ యూనిట్లతో సహా ఇతర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు తనను గెలిపిస్తాయనే నమ్మకంతో ఉన్నారు. పప్పీకి మద్దతుగా సీఎం భగవంత్ మాన్ రోడ్‌షోలు నిర్వహించారు. ఈ లోక్‌సభ స్థానంలోని 9 అసెంబ్లీ స్థానాలకు గాను 8 ఆప్ గుప్పెట్లో ఉండటం పప్పీకి కలిసొచ్చే అంశం. గ్రామాల్లోని రైతుల నుంచి ఆప్‌కు కూడా వ్యతిరేకత ఎదురవుతుండటం విశేషం.

'డేరా' ఓట్లపైనే ఎస్ఏడీ ఆశలు

భారీ సంఖ్యలో ఉన్న డేరా అనుయాయులు తదితరుల ఓట్లపైనే అకాలీదళ్ అభ్యర్థి ధిల్లాన్ ఆధారపడ్డారు. ఆపరేషన్ బ్లూస్టార్, సిక్కు వ్యతిరేక అల్లర్లు తదితరాలను ప్రధానంగా ప్రస్తావిస్తోంది. రాష్ట్రంపై ఇతర పార్టీలది సవతి తల్లి ప్రేమ అని ధిల్లాన్ ఆరోపిస్తున్నారు.

26 మంది స్వతంత్రులు

లుధియానా లోక్‌సభ స్థానంలో 43 మంది బరిలో ఉన్నారు. వీరిలో 26 మంది స్వతంత్ర అభ్యర్థులు. వీరిలో పీహెచ్‌డీ విద్యార్థి మొదలుకుని 8వ తరగతి ఫెయిలైన వారిదాకా ఉన్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో 12వ తరగతి చదివిన బీజేపీ అభ్యర్థి బిట్టూయే అత్యంత విద్యావంతుడు! కాంగ్రెస్ అభ్యర్థి వారింగ్ మెట్రిక్ పాస్ కాగా ఆప్ పప్పీ ఏడో తరగతి పాసయ్యారు!

సీఎం జగన్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడికి బెయిల్

- షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విజయవాడ కోర్టు
- ప్రతి శని, ఆదివారాల్లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంతకం చేయాలని ఆదేశం
- రూ.50 వేల చొప్పున రెండు ష్యూరిటీలు సమర్పించాలని ఉత్తర్వులు
- కుట్రకోణంపై ఇంకా దర్యాప్తు కొనసాగుతోందన్న ప్రభుత్వ న్యాయవాది

సాక్షి, అమరావతి/విజయవాడ స్పోర్ట్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడు వేముల సతీష్‌కు విజయవాడ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. మంగళవారం 8వ అదనపు జిల్లా న్యాయస్థానంలో సతీష్ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. వాదనలు విన్న న్యాయమూర్తి ప్రతి శని, ఆదివారాల్లో స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట హాజరై, సంతకం చేయాలనే షరతులు విధిస్తూ నిందితుడికి బెయిల్‌ను మంజూరు చేశారు. దీనితో పాటు రూ.50 వేల చొప్పున రెండు ష్యూరిటీలు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏప్రిల్ 13వ తేదీ సీఎం వైఎస్ జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్ డాబాకొట్ల సెంటర్‌లో రోడ్‌షో నిర్వహిస్తుండగా రాత్రి 8.10 గంటలకు సతీష్ సీఎం జగన్ కణతకు గురిపెట్టి పదునైన ఆయుధాన్ని విసిరి హత్యకు యత్నించాడు. ఆ సమయంలో సీఎం జగన్ ప్రజలకు అభివాదం చేస్తూ పక్కకు తిరగడంతో పదునైన ఆయుధం ఆయన ఎడమ కనుబొమ్మపై బలంగా తాకడంతో లోతుగా గాయం ఏర్పడి రక్తం వచ్చింది. బస్సుపై సీఎం పక్కనే ఉన్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ కంటికి సైతం గాయమైంది. వెలంపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. ఈ హత్యాయత్నం ఘటనలో ప్రధాన నిందితుడైన సతీష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం ప్రాథమిక ఆధారాలతో అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచడంతో న్యాయమూర్తి రిమాండ్ విధించారు. అప్పటి నుంచి సతీష్ నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటున్నాడు. నిందితుడి బెయిల్ విచారణ సమయంలో కుట్రకోణంపై ఇంకా దర్యాప్తు జరుగుతోందని ప్రభుత్వ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి దర్యాప్తు కొనసాగుతున్నందున షరతులతో కూడిన బెయిల్‌ను ఇస్తూ తీర్పునిచ్చారు.

'గోరుముద్ద'కు తాజ్ రుచులు

హోటల్ తాజ్ చెఫ్‌ల సూచనలతో వంటలపై ప్రత్యేక వీడియోల రూపకల్పన

- ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేస్తున్న 85 వేల మందికి అవగాహన
- పోషకాలతో వంట ఎలా చేయాలో సూచనలు, సలహాలు
- రాష్ట్రంలో 44,190 పాఠశాలల్లో గోరుముద్ద పంపిణీ
- 36,612 పాఠశాలల్లో 100 శాతం భోజనం తింటున్న విద్యార్థులు
- 396 స్కూళ్లల్లో మాత్రమే 50 శాతంలోపు గోరుముద్ద నమోదు
- బడిలోనే నూరు శాతం మధ్యాహ్న భోజనం తీసుకునేలా ప్రభుత్వం చర్యలు



సాక్షి, అమరావతి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న 'జగనన్న గోరుముద్ద' మరింత రుచిగా మారనుంది. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మంచి పోషకాలతో అందించాలన్న లక్ష్యంతో వంటల తయారీలో మరిన్ని మార్పులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం రోజుకో మెనూ చొప్పున వారంలో ఆరు రోజులపాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే నెల (జూన్) 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత విషయంలో ప్రభుత్వం మరింత దృష్టిపెట్టింది. ప్రస్తుతం అందిస్తున్న మెనూనే మరింత రుచితో పాటు పోషకాలతో అందించేందుకు తిరుపతిలోని హోటల్ తాజ్ చెఫ్‌ల సహకారం తీసుకుంది. రోజుకో మెనూ అందిస్తున్నందున అదే భోజనాన్ని ఇక ప్రత్యేకంగా ఎలా తయారుచెయ్యొచ్చో తెలిపేలా ఆరు వీడియోలను పాఠశాల విద్యాశాఖ రూపొందించింది. వీటిని మధ్యాహ్న భోజనం వండుతున్న సుమారు 85 వేల మంది సిబ్బందికి చూపించి అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆయా వీడియోల్లో రుచికరమైన, ఆరోగ్యకరమైన వంట ఎలా చేయాలో తాజ్ చెఫ్‌లు వివరించడమే కాకుండా వాటి ఆరోగ్య ప్రయోజనాలను తెలియజేస్తారు. గోరుముద్ద యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలను మధ్యాహ్న భోజనం అందించే రాష్ట్రంలోని 44,190 పాఠశాలల్లో పనిచేస్తున్న మొత్తం 85 వేల మంది వంటవారు వారి స్మార్ట్‌ఫోన్లలో చూస్తారు. స్మార్ట్‌ఫోన్ లేకుంటే ఉన్నత పాఠశాలల్లోని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ)పైన, ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీల్లోను పాఠశాల సమయం ముగిశాక సిబ్బందికి చూపిస్తారు.

పిల్లల ఆరోగ్యం కోసం మెనూ రూపకల్పన..

నిజానికి.. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో బాధ్యతలు చేపట్టాక పేద పిల్లల విద్య, ఆరోగ్యంపై ప్రధానంగా దృష్టిపెట్టారు. అప్పటికే నిర్వీర్యమైపోయిన ప్రభుత్వ పాఠశాల విద్యపై పలు సంస్కరణలు అమలుచేశారు. అప్పటివరకు బడుల్లో విద్యార్థులకు మధ్యాహ్నం నీళ్ల సాంబారు, ముద్దయిపోయిన అన్నం పెడుతుండడంతో 40 శాతం మంది పిల్లలు కూడా ఆ భోజనాన్ని తినకపోవడాన్ని గుర్తించారు. దీంతో ముఖ్యమంత్రే స్వయంగా రోజుకో మెనూ చొప్పున 'జగనన్న గోరుముద్ద'ను రూపొందించారు. వంటపై మూడంచెల పర్యవేక్షణ ఏర్పాటుచేసి ఉపాధ్యాయులు, విద్యార్థులను భాగస్వాములను చేశారు. రాష్ట్రంలోని 44,190 ప్రభుత్వ పాఠశాలల్లో ఏ రోజు ఏ మెనూ ఎలా ఉందో పరిశీలించేందుకు.. వంటలో నాణ్యతను చూసేందుకు 'ఏఐ' టెక్నాలజీ యాప్‌ను రూపొందించి, మండల స్థాయి నుంచి పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్, ముఖ్య కార్యదర్శి వరకు ఆ వివరాలు తెలిసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో నాలుగేళ్లుగా ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల సంఖ్య 90 శాతానికి పెరిగింది. మిగిలిన 10 శాతం మంది (ముఖ్యంగా బాలికలు) ప్రత్యేక పరిస్థితుల్లో ఇంటి నుంచి బాక్సులను తెచ్చుకుంటున్నారు.

గోరుముద్ద మెనూ ఇదీ..

- సోమవారం హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు లేదా వెజిటేబుల్ పులావు, గుడ్డు కూర, చిక్కీ
- మంగళవారం ఉదయం రాగిజావ, మధ్యాహ్నం చింతపండు పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు
- బుధవారం వెజిటేబుల్ అన్నం, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- గురువారం ఉదయం రాగిజావ, మధ్యాహ్నం సాంబార్ బాత్/నిమ్మకాయ పులిహోర, టొమాటో పచ్చడి, ఉడికించిన గుడ్డు
- శుక్రవారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- శనివారం ఉదయం రాగిజావ, మధ్యాహ్నం ఆకుకూరతో చేసిన అన్నం, పప్పుచారు, స్వీట్ పొంగల్

జగనన్న 'గోరుముద్ద'తో పరిపూర్ణత..

పేదింటి పిల్లలకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందించేందుకు రాష్ట్రంలోని 44,190 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 'జగనన్న గోరుముద్ద' కింద నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. విద్యార్థుల్లో రక్తహీనత తగ్గించేందుకు ఫోర్టిఫైడ్ సార్టెక్స్ బియ్యంతో అన్నం పెడుతున్నారు. రోజుకో మెనూ చొప్పున సోమవారం నుంచి శనివారం వరకు 16 రకాల పదార్థాలను గోరుముద్దలో చేర్చారు. ఏ రోజు ఏయే పదార్థాలు పెట్టాలో మెనూలో స్పష్టంగా పేర్కొన్నారు. పిల్లల్లో రక్తహీనతను తగ్గించేందుకు వారంలో మూడ్రోజులు బెల్లంతో చేసిన రాగిజావ, మూడ్రోజులు బెల్లం చిక్కీ ఇస్తున్నారు. ఐదు రోజులు ఉడికించిన గుడ్డు తప్పనిసరి చేశారు. ప్రతి గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల లేదా విలేజ్ క్లినిక్ నుంచి సిబ్బంది వచ్చి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తారు. ముఖ్యంగా రక్తహీనతను తగ్గించేందుకు మాత్రలు ఇవ్వడంతో పాటు వారు సక్రమంగా వాడుతున్నారో లేదో పరిశీలిస్తున్నారు.

మధ్యాహ్న భోజనం 100 శాతం తినేలా మార్పులు..

ప్రస్తుతం రాష్ట్రంలోని 36,612 పాఠశాలల్లో విద్యార్థులు 100 శాతం మధ్యాహ్న భోజనం తీసుకుంటున్నారు. మరో 5,012 పాఠశాలల్లో 95–99 శాతం మంది తింటుండగా, 885 పాఠశాలల్లో 90–95 శాతం మధ్య, 439 పాఠశాలల్లో 85–90 శాతం మధ్య, 353 పాఠశాలల్లో 80–85 శాతం మంది గోరుముద్ద తీసుకుంటున్నారు. 522 పాఠశాలల్లో 50–80 శాతం, 60 పాఠశాలల్లో 30–50 శాతం మధ్య ఉండగా, 236 పాఠశాలల్లో మాత్రమే 30 శాతంలోపు తీసుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లోను 100 శాతం మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తీసుకునేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. బడికి వచ్చిన ప్రతి విద్యార్థీ బడిలో అందించే మధ్యాహ్న భోజనం తినేలా రుచిగా, వంటలో పిల్లల ఆరోగ్యానికి మేలుచేసే పోషకాలు ఉండేలా చర్యలు చేపట్టారు. అందుకనుగుణంగా తిరుపతిలోని హోటల్ తాజ్ చెఫ్‌లతో వంటలపై రూపొందించిన వీడియోల ద్వారా సిబ్బందికి అవగాహన కల్పిస్తారు.

చేజ్ చేసి.. రూ.2 కోట్ల ఎర్రదుంగల స్వాధీనం



కారు, ఎర్ర చందనం దుంగలతో డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి, ఎఫ్‌ఆర్‌ఓ థామస్ టీమ్

చిత్తూరు కార్పొరేషన్: దాదాపు 25 కిలోమీటర్లు సినీ ఫక్కీలో చేజ్ చేసిన అటవీశాఖ సిబ్బంది అక్రమంగా రవాణా అవుతున్న రూ.2కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఎర్ర చందనం అక్రమ రవాణాపై నిఘా వేసిన అటవీశాఖ అధికారులు చిత్తూరు జిల్లా పూతలపట్టు సమీపంలోని రంగంపేట క్రాస్ నుంచి స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో అటవీశాఖ అధికారులు స్మగ్లర్ల కంటబడకుండా తిరుపతి జిల్లా శ్రీనివాసమంగాపురం వరకు దాదాపు 25 కిలోమీటర్లు వెంబడించారు. ఇదేమీ తెలియని స్మగ్లర్లు లోడింగ్ చేసుకుని తమిళనాడులోని వేలూరుకు పయనమవ్వడానికి బయలుదేరారు. గమనించిన అధికారులు తమ కారును స్మగ్లర్ల కారుకు అడ్డంగా పెట్టారు. వేగంగా బండి తిప్పుకుని వెళ్లిపోయే హడావిడిలో డివైడర్‌ను ఢీకొట్టి పారిపోతూ.. రంగంపేటక్రాస్ వద్ద కారులోని ముగ్గురు దొంగల్లో ఇద్దరు దూకి పారిపోయారు. తిరువణ్ణామలై జిల్లా కుటకరై ప్రాంతానికి చెందిన నిందితుడు గోవిందరాజులను అరెస్టు చేసి.. కారుతో సహా రూ.2 కోట్ల విలువ చేసే 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్ఆర్ఓ థామస్ ఆధ్వర్యంలో జరిగిన ఆపరేషన్‌ను డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి అభినందించారు.

తెలంగాణ

హిందూ వివాహ చట్టప్రకారం ఎస్టీలు విడాకులు ఇవ్వొచ్చు

పెళ్లికి సంబంధించిన ఆధారాలు తప్పనిసరి: తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: హిందూ వివాహ చట్టప్రకారం వివాహం చేసుకున్న ఎస్టీలకు అదే చట్టప్రకారం విడాకులు ఇవ్వవచ్చని.. అయితే పెళ్లికి సంబంధించిన అన్ని ఆధారాలు ఉండాలని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. కామారెడ్డి జిల్లా నస్రూలాబాద్ మండలానికి చెందిన ఓ గిరిజన (లంబాడ) దంపతులు పరస్పర అంగీకారంతో విడాకులు కోరుతూ కామారెడ్డి సివిల్ కోర్టును ఆశ్రయించారు. ఎస్టీకి చెందిన వారికి హిందూ వివాహ చట్టం సెక్షన్ 2(2) వర్తించదని కోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది. దీనిపై దంపతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది సృజన్‌కుమార్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్లు పూర్తిగా హిందూ వివాహ చట్ట ప్రకారం వివాహం చేసుకున్నారని.. పెళ్లి కార్డు సహా ఇతర ఆధారాలన్నీ పరిశీలించాల్సిన ట్రయల్ కోర్టు ఆ పని చేయలేదన్నారు. హిందూ లంబాడా వర్గానికి చెందిన వారని.. హిందూ వివాహ చట్టం వారికి వర్తించకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్లు లంబాడా వర్గానికి చెందిన వారైనా వివాహం హిందూ సంప్రదాయం ప్రకారం జరిగినందున ట్రయల్ కోర్టు పూర్తి ఆధారాలను పరిశీలించి ఆ మేరకు విడాకులు ఇవ్వవచ్చని స్పష్టం చేశారు. అయితే హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 2(2).. ఇతర సంప్రదాయాల ప్రకారం పెళ్లి చేసుకున్న ఎస్సీలకు వర్తించదని, ఈ కేసుకు మాత్రమే పరిమితమని చెప్పారు. ట్రయల్ కోర్టు నిర్ణయాన్ని కొట్టివేస్తున్నామన్నారు.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
బుధవారం॥ 29-5-2024

‘కెరీర్‌లో ఎంత ఉన్నతంగా ఎదిగినా, ఎంత సంపాదించినా, ఎంతటి ధనవంతులైనా డబ్బును సరైన విధంగా నిర్వహించకపోతే వారికి ఇబ్బందులు తప్పవు’ అంటున్నారు డాక్టర్‌ మణి పవిత్ర. హైదరాబాద్‌ మాదాపూర్‌లో ఉంటున్న మణి పవిత్ర ఆర్థోడాంటిస్ట్‌. ఆర్థిక నిపుణురాలు, ఫార్చ్యూన్‌ అకాడమీ సహ వ్యవస్థాపకురాలు, వ్యాపారవేత్త, యోగా కోచ్‌, సామాజిక కార్యకర్త, రచయిత్రిగా మల్టీటాలెంటెడ్‌ ఉమన్‌గా గుర్తింపు పొందారు. మహిళలు ఆరోగ్యంగా, ఫిట్‌గా, ఆర్థికంగా స్వతంత్రంగా ఉండేందుకు అవగాహన కల్పిస్తున్న ఈ డాక్టర్‌ను ‘మనీ పవిత్ర’ అని కూడా పిలుస్తుంటారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించడానికి షార్ట్‌ ఫిల్మ్‌ కాంటెస్ట్‌ నిర్వహిస్తున్న సందర్భంగా ఎన్నో విషయాలను ఇలా మన ముందుంచారు.


పవిత్ర

మనీ పవిత్ర

‘‘ఆర్థిక అక్షరాస్యత అనేది వ్యక్తిగత డబ్బు నిర్వహణ. ఎవరికి వారు తమదైన అవగాహనతో సంపాదించడం, పొదుపు, పెట్టుబడులు చేయడం చూస్తుంటాం. వారు తీసుకున్న ప్రణాళికల కారణంగా కొందరు తక్కువ సంపాదించినా ధనవంతులు అవుతుంటారు. ఎక్కువ సంపాదన ఉన్నప్పటికీ ఎప్పుడూ డబ్బు సమస్యలతో ఇబ్బందులు పడేవారూ ఉంటారు. అందుకే, ఆర్థిక నైపుణ్యాలను అర్థం చేసుకోవడం, సమర్థవంతంగా నిర్వహించడంలో అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరం.

■ చాలా వెనకబడి ఉన్నాం..

మన జనాభాలో 77 శాతం అక్షరాస్యులు ఉన్నప్పటికీ, 24 శాతం కంటే తక్కువ మంది ఆర్థిక అక్షరాస్యులు ఉన్నారు. వారిలో 17 శాతం మంది యుక్తవయస్కులు మాత్రమే ఆర్థికంగా అక్షరాస్యులు. ప్రపంచంలో చూస్తే భారతదేశం ఆర్థిక అక్షరాస్యత రేటుతో 144 దేశాలలో 73వ స్థానంలో ఉంది. ఆర్థిక పరిజ్ఞానం, అవగాహన లేకపోవడం వల్ల మెజారిటీ భారతీయులు అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇది గమనించి ప్రజలకు డబ్బుతో ఉండే రిలేషన్‌ గురించి దేశంలోని తొమ్మిది ప్రధాన నగరాల్లో క్యాంపెయిన్‌ చేశాం. ఆ క్యాంపెయిన్‌లో మూడు–నాలుగు వందల మంది పాల్గొనేవారు. అనుకున్న ఫలితం రాలేదనిపించి, ఇప్పుడు సోషల్‌మీడియా ద్వారా షార్ట్‌ ఫిల్మ్‌ కాంటెస్ట్‌ నిర్వహిస్తున్నాం.

■ ప్రోత్సాహకరమైన కథనాలు

ధనవంతులు, ప్రముఖుల జీవితాలు మనకు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కానీ పెద్దపెద్ద సెలబ్రిటీలకు కూడా డబ్బు సమస్యలు ఉంటాయి. ఇప్పటికీ బడ్జెట్‌తో జీవించే ధనవంతులు, ప్రముఖులు ఉన్నారు. వారి నియమబద్ధమైన జీవనాన్ని మనం అలవరచుకోవాలి. మా అకాడమీ ద్వారా వారి కథనాలను చెబుతూ అవసరమైన వారికి అవగాహన కల్పిస్తుంటాం. కరోనా సమయంలో ఏర్పాటు చేసిన ఈ ఆన్‌లైన్‌ క్లాస్‌లు నెలలో 21 రోజుల పాటు ఉదయం 6 నుంచి 6.30 వరకు ఓ అరగంటపాటు నిర్వహిస్తుంటాను.

■ షార్ట్‌ ఫిల్మ్‌ ఆలోచన

ఈ రోజుల్లో సోషల్‌ మీడియా ప్రభావం ప్రజలపై బాగా ఉంది. ఏ సమస్య తలెత్తినా సోషల్‌మీడియా వైపుగా వెళుతున్నారు. కొంతమంది ధనవంతులను చూసి తాము కూడా కలల జీవనాన్ని ఊహించుకుంటున్నారు. దానిని సాధించలేక త్వరగా నిరాశకు, డిప్రెషన్‌కు లోనవుతున్నారు. అనవసర బేషజాలకు పోయి అధికంగా డబ్బును ఖర్చుపెట్టుకుని భవిష్యత్తును భారంగా మార్చుకుంటున్నారు. అందుకే, ఆర్థిక అక్షరాస్యత పట్ల అవగాహనకు సోషల్‌మీడియాను ఎంచుకున్నాను. మధ్య, దిగువ మధ్య తరగతి వాళ్లలో పెరుగుతున్న ఆర్థిక సమస్యలను నివారించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాను.

ఆర్థికంగా విజయవంతమైన వ్యక్తుల సైన్యాన్ని సృష్టించడమే మా లక్ష్యం. ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించేందుకు, ఫార్చ్యూన్‌ అకాడమీ ద్వారా ఆర్థిక అక్షరాస్యతపై షార్ట్‌ ఫిల్మ్స్‌ కాంటెస్ట్‌ను నిర్వహిస్తున్నాం. దీనిలో.. డబ్బు ప్రాముఖ్యత, ఏం కొనగలం, దేనిని కొనలేం, పెట్టుబడి, గుణించడం, పొదుపు సంస్కృతి, మధ్యతరగతి డబ్బు సమస్యలు, డబ్బు, ఎమోషనల్‌ కనెక్షన్‌, ర్యాగ్స్‌ టు రిచ్‌, పిగ్గీ బ్యాంక్‌ ప్రాముఖ్యత, ప్లాస్టిక్‌ డబ్బు, డిజిటల్‌ లావాదేవీలు, డబ్బు గురించి ఎక్కువ శ్రద్ధ వహించే ఇతర విషయాలపై రెండు నిమిషాల నిడివిగల షార్ట్‌ ఫిల్మ్‌లు రూపొందించాల్సి ఉంటుంది. ఎంట్రీలను జూలై 31, 2024లోగా fortuneacademyhub@gmail.comకు పంపవచ్చు.



■ తల్లుల సంపాదనకు బ్రేక్‌

ఏడేళ్ల క్రితం తెలంగాణ జిల్లాల్లో మహిళలు గర్భం దాల్చడానికి ముందు, గర్భం దాల్చాక, ప్రసవం తర్వాత ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపైన ‘మిలియన్‌ మామ్స్‌’ క్యాంపెయిన్‌ చేశాం. ఆ సమయంలో తల్లులైన మహిళల సంపాదన పూర్తిగా తగ్గిపోవడం గమనించాం. ప్రసవం తర్వాత చదువుకున్నవారు, చదువు లేనివారు అనే తేడా ఏమీ లేకుండా చాలామంది ఒక బ్రేక్‌ తీసుకోవడం చూశాం. అక్కడి పరిస్థితులు చూశాక ఆర్థిక అవసరాలు ఎంత ముఖ్యమో, డబ్బుకోసం వారు పడే పాట్లు కనిపించాయి. ప్రసవం తర్వాత పూర్తి సంపాదనకు దూరం అవ్వాల్సిన అవసరం లేదు. ఇప్పుడు డబ్బు సంపాదనకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. మా నానమ్మల రోజుల్లో ఇంటి నిర్వహణ మహిళల చేతుల్లో ఉండేది. ఈ తరంలో ఆ నిర్వహణ కనిపించలేదు. ఈ రోజుల్లో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. కానీ, ఏ రోజుకు ఆ రోజే అన్నట్టుగా ఉంటోంది. సంపాదించడంలోనూ, పొదుపు చేయడంలోనూ అవగాహన లేదు. దీంతో కుటుంబం మొత్తం ఇబ్బందులు పాలవుతుంది.

■ పిల్లలకోసం టైమ్‌

మా అమ్మానాన్నలు బిజీ డాక్టర్లు అవడంతో నా చిన్నతనంలో వారిని బాగా మిస్‌ అయ్యేదాన్ని. దీంతో నా పిల్లలకు అలాంటి సమస్య రాకూడదనుకున్నాను. నాకు అనుకూలమైన ఆర్థోడాంటిస్ట్‌ కోర్సు తీసుకున్నాను. నాకంటూ ఒక టైమ్‌ ఉండాలి, కెరియర్‌తో పాటు కుటుంబాన్నీ బాగా చూసుకోవాలి అనే ఆలోచనతో 15 ఏళ్లుగా ప్లాన్‌ చేసుకుంటూ వెళుతున్నాను. దీంతో ఇప్పుడు నా ఇద్దరు పిల్లలను, ఇంటిని, నా పనులను బ్యాలెన్స్‌ చేసుకోగలుగుతున్నాను. ప్రపంచవ్యాప్తంగా అగ్రశ్రేణి మహిళా ఆర్థికవేత్తలు అయిన కిమ్‌ కియోసాకి, మేరీ బఫెట్‌తో కలిసి చర్చాకార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఉమెన్‌ ఇన్‌స్పైరర్‌గా లయన్‌ సెంటెనియల్‌ అవార్డ్, 2020 యూత్‌ ఐకాన్‌ అవార్డ్‌, 2021లో విశిష్ట ఆర్థోడాంటిస్ట్‌ అవార్డులు పొందాను.

■ తెలుగు రాష్ట్రాల్లో క్యాంపెయిన్‌

సమాజంలో ఆర్థిక అక్షరాస్యత పట్ల అవగాహన కల్పించి ప్రజలు ఆర్థికంగా ఎదగడానికి నా వంతు సహాయం చేయాలనే ఉద్దేశంతో క్యాంపెయిన్‌ ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఎనిమిది ప్రధాన ప్రాంతాలను ఎంపిక చేసుకొని, కార్యక్రమాలను చేపట్టనున్నాం. ఆర్థిక అక్షరాస్యత మెరుగైన ఆర్థిక శ్రేయస్సుకు, స్థిరత్వానికి దోహదం చేస్తుంది’’ అంటూ వివరించారు ఈ మనీ పవిత్ర.

– నిర్మలారెడ్డి

ముంబైలో విజి వెంకటేశ్‌ నిర్వహించే టీ పార్టీలకు నలుగురూ ఉత్సాహంగా వస్తారు. కారణం– కొన్ని కబుర్లు నడుస్తాయి. దాంతోపాటు కేన్సర్‌ను నివారించే జీవన విధానం తెలుస్తుంది. కేన్సర్‌ బాధితులకు అండగా నిలిచే వీలూ దొరుకుతుంది. 71 ఏళ్ల విజి వెంకటేశ్‌ గత రెండు దశాబ్దాలుగా కేన్సర్‌పై చైతన్యం కలిగిస్తోంది. విజి వేంకటేశ్‌ కృషి....

కేన్సర్‌ను జయించే టీ పార్టీలు

అవేర్‌నెస్‌



‘కేన్సర్‌ అంటే ఇంకా జనంలో భయం పోలేదు. మాట్లాడటానికి జంకుతారు. టీ అందరికీ ఇష్టం. తాగుతూ కబుర్లు చెప్పుకున్నంత సాధారణంగా కేన్సర్‌ గురించి మాట్లాడుకుంటూ, చర్చించుకుంటూ, బాధితులకు చేయదగ్గ సాయాన్ని గుర్తు చేయడం గురించే నేను టీ పార్టీలు– చాయ్‌ ఫర్‌ కేన్సర్‌ నిర్వహిస్తున్నాను’ అని తెలిపారు విజి వెంకటేశ్‌.

ముంబైకి చెందిన 72 ఏళ్ల ఈ సేవా కార్యకర్త దక్షిణ ఆసియాలో కేన్సర్‌ బాధితుల సహాయానికి పని చేస్తున్న ‘ది మ్యాక్స్‌ ఫౌండేషన్‌’కు ప్రధాన బాధ్యతలు నిర్వరిస్తోంది.

‘మేము చాలా హాస్పిటల్స్‌తో మాట్లాడాము. దిగువ ఆదాయ వర్గాల్లో కేన్సర్‌ బాధితులకు ఉచితంగా వైద్యం చేయడానికి వాళ్లు ముందుకు వచ్చారు. ప్రత్యేకంగా ఛారిటబుల్‌ ఆస్పత్రులు కూడా ఉన్నాయి. కాని సమస్య ఏమిటంటే... ఆ పేషెంట్లు ఆస్పత్రికి వచ్చి వైద్యం చేయించుకోవడానికి దారి ఖర్చులు వారి వద్ద ఉండవు. మందులు కొనుక్కోవడానికి, తగిన పౌష్టికాహారం తినడానికి వీలుండదు. అలాంటి వారికి సహాయం అందించడమే నా లక్ష్యం. అందుకు టీ పార్టీలకు స్నేహితులను పిలుస్తాను. వారి సహాయం కోరుతాను’ అంది విజి వెంకటేశ్‌.

■ కార్మికులను చూసి...

విజి వెంకటేశ్‌ ముందు ఒక సాధారణ కార్యకర్తగానే సేవా రంగంలోకి వచ్చింది. ముంబైలోని కేన్సర్‌ పేషెంట్స్‌ ఎయిడ్‌ అసోసియేషన్‌ కోసం నాలుగు చందాలు వసూలు చేసి పెట్టడం ఆమె పని. చిన్న చిన్న వాడల్లోకి వెళ్లి చందాలు అడిగితే వాళ్లు తమ దగ్గర ఉన్నదాంట్లో ఇరవై రూపాయలో, ముప్పై రూపాయలో ఇచ్చేవారు. మరోవైపు వారంతా కార్మికులు కనుక ధూమపానం వల్ల, ఇతర అలవాట్ల వల్ల ఎక్కువగా కేన్సర్‌ బారిన పడటం విజి గమనించింది. ‘ఒక కేన్సర్‌ పేషెంట్‌తో టెస్ట్‌లు చేయించుకుని, మందులు తీసుకోవచ్చు కదా అనంటే అతను దాని బదులు నా పిల్లలకు పాలు కొనివ్వగలిగితే నాకు ఎక్కువ సంతోషం అన్నాడు. ఆ జవాబు నన్ను కదిలించింది. ఇంత నిస్సహాయ స్థితిలో ఉన్న బాధితులకు జీవితాంతం సహాయం చేయాలని నిశ్చయించుకున్నాను’ అని తెలిపింది విజి.


విజి వేంకటేశ్‌

■ చాయ్‌ పార్టీ 4 లక్షలు

విజి తన టీ పార్టీలకు స్నేహితులను, బంధువులను పిలుస్తుంది. ఆమె సంస్థ, కృషి గురించి విన్న అపరిచితులు కూడా వచ్చి టీ పార్టీలో కూచుంటారు. కేన్సర్‌ అవగాహన కార్యక్రమం ఉంటుంది. దాంతో పాటు సరదా పాటలు, మాటలు నడుస్తాయి. చివరలో విజి దిగువ ఆదాయ వర్గాల కేన్సర్‌ బాధితుల కోసం చందాలు కోరుతుంది. ‘ప్రతి టీ పార్టీలో కూడా విశేష స్పందన వస్తుంది. అప్పటికప్పుడు వారికి తోచింది ఇస్తారు. ఒకోసారి 4 లక్షల రూపాయల వరకూ వస్తాయి. అక్కడ ఉన్నవారు వేరే ఫ్రెండ్స్‌కు కాల్‌ చేసి మరీ డబ్బులు వేయిస్తారు’ అని తెలిపింది విజి.

■ 18 వేల మందికి

విజి తన సంస్థ ద్వారా ముంబై, మహరాష్ట్రలోని 18 వేల మంది కేన్సర్‌ బాధితులకు సహాయం అందిస్తోంది. వారి చికిత్సకు, మందులకు, పరీక్షలకు డబ్బు ఏర్పాటు చేస్తుంది. ఒకోసారి కుటుంబ పరిస్థితి కూడా గమనించాల్సి ఉంటుంది. ‘తగిన వైద్యం అందితే చాలామటుకు కేన్సర్‌ నుంచి బయటపడొచ్చు. ఆ వైద్యం అందే పరిస్థితుల కోసం మనందరం తలా ఒక చేయి వేయాలి’ అందామె.

ప్రస్తుతం దేశంలో 30 చోట్ల విజి సంస్థ కోసం టీపార్టీలు జరుగుతున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇలాంటివి నిర్వహించి నిధులు కేన్సర్‌ బాధితులకు అందేలా చేయొచ్చు.

యూత్‌ పల్స్‌



చక్కని ‘ఫాంగ్‌’కు చాంగు భళా

కొడితే ‘ఫాంగ్‌’ జాబ్‌ కొట్టాలి అనుకుంటోంది యువతరం. ప్రపంచంలోని ఉత్తమ పనితీరు కనబరిచే దిగ్గజ కంపెనీల సంక్షిప్త నామం– ఫాంగ్‌ (ఫేస్‌బుక్, అమెజాన్, యాపిల్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్‌) ‘ఫాంగ్‌’ కంపెనీలలో ఉద్యోగం చేయాలనే కలను నెరవేర్చుకోవడానికి స్కిల్‌ లెర్నింగ్‌ కాన్ఫరెన్స్‌లకు హాజరు కావడం నుంచి సీనియర్‌ ఉద్యోగులతో మాట్లాడడం వరకు ఎంతో కసరత్తు చేస్తున్నారు. కలను నెరవేర్చుకుంటున్నారు.

ప్రతిష్ఠాత్మకమైన ఫాంగ్‌ (ఫేస్‌బుక్, యాపిల్, అమెజాన్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్‌) కంపెనీలలో ఉద్యోగం చేయాలని యువతరం బలంగా అనుకోవడానికి ఎన్నో కారణాలు ఉండవచ్చు. అయితే ప్రధానంగా చెప్పుకోవాల్సి వస్తే... కాంపిటీటివ్‌ స్పిరిట్, వర్క్‌–లైఫ్‌ బ్యాలెన్స్, గ్రౌండ్‌ బ్రేకింగ్‌ టెక్నాలజీపై పనిచేసే అవకాశం అనేవి ముఖ్య కారణాలు.

‘ఫాంగ్‌’ కంపెనీలలో పనిచేయాలనే కలను నెరవేర్చుకోవడానికి తగిన కసరత్తు చేస్తున్నారు. ‘ఫాంగ్‌’ కంపెనీలలో పనిచేస్తున్న ఉద్యోగులతో మాట్లాడుతున్నారు. ‘ఫాంగ్‌’ రిక్రూటర్స్, ఎం.ఎల్‌. ఇంజినీర్స్, రిసెర్చర్‌లు హాజరయ్యే స్కిల్‌ లెర్నింగ్‌ కాన్ఫరెన్స్‌లకు హాజరవుతున్నారు. ‘ఫాంగ్‌’ ఇంటర్వ్యూల గురించి అవగాహన చేసుకోవడానికి ప్రొఫెషనల్స్‌తో మాట్లాడుతున్నారు.



‘నా ఫ్రెండ్‌ ఒకరు మోస్ట్‌ టాలెంటెడ్‌. అయితే మొదటి ప్రయత్నంలో ఫాంగ్‌ కంపెనీలలో ఒకదాంట్లో ఎంపిక కాలేదు. అలా అని డిప్రెస్‌ కాలేదు. ఏ పొరపాట్ల వల్ల తనకు ఉద్యోగం రాలేదో లోతైన విశ్లేషణ చేసుకుంది. ప్రొఫెషనల్స్‌తో మాట్లాడింది. పొరపాట్లను సరిదిద్దుకొని రెండో ప్రయత్నంలో విజయం సాధించింది’ అంటుంది బెంగళూరుకు చెందిన షాలిని.

‘ఓవర్‌ కాన్ఫిడెన్స్‌ వల్ల నా ఫాంగ్‌ కల నెరవేరలేదు. మొదట బాధ అనిపించింది. అయితే ఆ బాధలో నుంచి త్వరగా కోలుకున్నాను. మాస్టర్‌ ఫండమెంటల్‌ కాన్సెప్ట్స్‌పై దృష్టి పెట్టాను. మాక్‌ ఇంటర్వ్యూలకు హాజరయ్యాను. కమ్యూనికేషన్‌ స్కిల్స్, ప్రాబ్లమ్‌–సాల్వింగ్‌ స్కిల్స్, ప్రెజెంటేషన్‌ స్కిల్స్‌ మెరుగుపరుచుకున్నాను’ అంటున్న శైలిమ శ్రీవాస్తవ రెండవ ప్రయత్నంలో విజయం సాధించింది. ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ, గోవాలో గ్రాడ్యుయేషన్‌ పూర్తి చేసిన ఖుష్బు గుప్తా గూగుల్‌లో ఉద్యోగం చేయాలనే తన కలను నెరవేర్చుకుంది.

సవాళ్లను అధిగమిస్తే విజయం ఎప్పుడూ మనదే అవుతుంది. ‘గూగుల్‌లో చేరిన కొత్తలో చాలా మిస్టేక్స్‌ చేసేదాన్ని. అయితే సీనియర్‌ల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ ద్వారా తప్పులు జరగకుండా జాగ్రత్త పడడం నేర్చుకున్నాను’ అంటుంది ఖుష్బు గుప్తా.

అమెజాన్‌ పాపులర్‌ డిజిటల్‌ వాయిస్‌ అసిస్టెంట్‌ ‘అలెక్సా’ను మన దేశంలో లాంచ్‌ చేసిన బృందంలో లీలా సోమశేఖర్‌ ఒకరు. అమెజాన్‌లో పనిచేయాలనేది ఆమె కల. కంటెంట్‌ ఎడిటర్‌గా అమెజాన్‌లో అడుగులు మొదలు పెట్టిన లీల ఆ తరువాత ప్రోగ్రామ్‌ మేనేజ్‌మెంట్‌లోకి వచ్చింది. ‘ఆన్‌ది–జాబ్‌ లెర్నింగ్‌ ఎక్స్‌పీరియెన్స్‌ ఎంతో ఉపయోగపడుతుంది’ అంటున్న లీల సక్సెస్‌ మంత్రకు ఇచ్చే నిర్వచనం... కొత్తగా ఆలోచించడం. చిన్న వయసులోనే పోలియో బారిన పడిన రేఖా పోడ్వాల్‌కు వీల్‌ చైర్‌పై ఆధార పడడం తప్పనిసరి అయింది. అయితే ఏదో సాధించాలనే తపన మాత్రం గట్టిగా ఉండేది. ఆ తపనే ఆమెను అమెజాన్‌ ఇండియా స్టార్‌ ఉద్యోగులలో ఒకరిగా చేసింది.

‘కలను నెరవేర్చుకోవడానికి అదృష్టం, అల్లావుద్దీన్‌ అద్భుతదీపంతో పనిలేదు. కష్టాలను, ప్రతికూల పరిస్థితులను తట్టుకునే ఆత్మవిశ్వాసం ఉంటే చాలు’ అంటుంది పుణెకు చెందిన రేఖా పోడ్వాల్‌.

సుందర సందేశం

ఇటీవల గూగుల్‌ సీయీవో సుందర్‌ పిచాయ్‌ని యూట్యూబర్‌ వరుణ్‌ మయ్యా ‘ఫాంగ్‌’కు సంబంధించి యువత కల గురించి అడిగినప్పుడు అమీర్‌ ఖాన్‌ బ్లాక్‌బాస్టర్‌ మూవీ ‘3 ఇడియట్స్‌’లోని ఒక సన్నివేశాన్ని గురించి ప్రస్తావించాడు పిచాయ్‌. ‘ఆ సీన్‌లో మోటర్‌ అంటే ఏమిటో వివరించే వెర్షన్‌ ఉంది. మోటర్‌ అంటే ఏమిటో అర్థం చేసుకునే వెర్షన్‌ ఉంది. విషయాలను లోతుగా అర్థం చేసుకోవడం ద్వారానే నిజమైన విజయం లభిస్తుంది’ అంటాడు సుందర్‌ పిచాయ్‌. సినిమా సీన్‌ విషయానికి వస్తే ‘మెషిన్‌ అంటే ఏమిటో నిర్వచనం చెప్పండి’ అని ప్రొఫెసర్‌ అడిగిన దానికి అమీర్‌ సింపుల్‌గా చెప్పిన సమాధానం, ‘మెషిన్స్‌ ఆర్‌ ఎనీ కాంబినేషన్‌ ఆఫ్‌ బాడీస్‌ సో కనెక్టెడ్‌ దట్‌ రిలేటివ్‌ మోషన్స్‌....’ అంటూ మార్కులు బాగా తెచ్చుకునే స్టూడెంట్‌ చెప్పిన సుదీర్ఘ, సంక్లిష్ట నిర్వచనం... ఒక విషయాన్ని వివరించడానికి, అర్థం చేసుకోడానికి మధ్య ఉండే తేడాను తెలియజేస్తుంది.

ధైర్యమే దారి చూపుతుంది...

కంప్యూటర్‌ సైన్స్‌లో మాస్టర్స్‌ డిగ్రీ చేసిన సోనాక్షి పాండే స్వభావరీత్యా సిగ్గరి. ఇంట్రావర్ట్‌. నలుగురిలో ధైర్యంగా మాట్లాడేది కాదు. డేటాబేస్‌ గురించి ఒక చర్చాకార్యక్రమంలో టెక్‌ ఎక్స్‌పర్ట్‌ ఒకరు ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడుతున్న, చర్చిస్తున్న యూట్యూబ్‌ వీడియోను చూసింది పాండే. ఈ వీడియో ఆమె కెరీర్‌ గమనాన్ని మార్చేసింది. ఈ వీడియోతో ఇన్‌స్పైర్‌ అయిన పాండే నలుగురిలో ధైర్యంగా మాట్లాడడం అలవాటు చేసుకుంది. అమెజాన్‌లో సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ అయింది. ఆ తరువాత అమెజాన్‌ వెబ్‌ సర్వీసెస్‌లో సాఫ్ట్‌వేర్‌ డెవలప్‌మెంట్‌ నుంచి సొల్యూషన్‌ ఆర్కిటెక్చర్‌లోకి వచ్చింది. ఇందులో పబ్లిక్‌ స్పీకింగ్, క్లయింట్‌ ఇంటరాక్షన్స్‌ ఎక్కువగా ఉంటాయి. అయిదు సంవత్సరాలు అమెజాన్‌లో పనిచేసిన తరువాత మైక్రోసాఫ్ట్, గూగుల్‌కు అప్లై చేసింది. రెజ్యూమ్‌లోని కీ ఎలిమెంట్స్‌ వల్ల రెండు దిగ్గజ సంస్థల్లోనూ పాండేకు ఉద్యోగం వచ్చింది.


సోనాక్షి పాండే

కోటి థెరపీల ఉత్సవం!

కోటి దీపోత్సవంలో దీపాల శిఖలు మిలమిలలాడుతుంటే చూడ్డానికి ఎంత ముచ్చటగా ఉంటుంది! అలాగే చిదిమి దీపం పెట్టుకోవాల్సిన చిన్నారులు ఆటిజమ్‌తో చిన్నబోకుండా ఆ అమాయకపు ముఖాలపై చిరునవ్వుల మిలమిలలను అలాగే ఉంచడానికి పూనుకుంది ‘పినాకిల్‌’ సంస్థ. లక్షణాల్ని బట్టి ఒక్కో ఆటిజమ్‌ చిన్నారికి ఒక్కో థెరపీ అవసరమవుతుంది. అలాంటి ‘కోటి థెరపీ’లను పూర్తి చేసిందీ ఈ సంస్థ.


ప్రతీకాత్మక చిత్రం

‘ఆటిజమ్‌ స్పెక్ట్రమ్‌ డిజార్డర్‌’ (ఏఎస్‌డీ) అని పిలిచే ఈ రుగ్మత ఉన్న పిల్లలకు జ్ఞానేంద్రియాల నుంచి మెదడుకు సమాచారం చేరడమూ... అక్కణ్ణుంచి తాము స్పందించాల్సిన రీతిలో స్పందించకపోవడమనే సమస్య ఉంటుంది. సెన్సెస్‌(జ్ఞానేంద్రియాల)కు సంబంధించిన సమస్య కాబట్టి దీన్ని ‘సెన్సోరియల్‌ సమస్య’గా చెబుతారు. ఆ పిల్లలు తమదైన ఏదో లోకంలో ఉన్నట్టుగా ఉంటారు. కళ్లలో కళ్లు కలిపి చూడలేరు. స్పీచ్‌ ప్రాబ్లమ్స్‌ ఉంటాయి. ఉదాహరణకు నేర్చుకున్న ఒకే పదాన్ని పదే పదే అదే ఉచ్చరిస్తూ ఉంటారు. తోటి పిల్లలతో కలవడానికీ, ఆడుకోడానికి పెద్దగా ఆసక్తి చూపరు.

అలాంటి పిల్లలకు అవసరమైన చికిత్స (థెరపీలు) అందిస్తోంది పినాకిల్‌ సంస్థ. లోపాల్ని చక్కదిద్దడానికి అవసరాన్ని బట్టి స్పీచ్‌ థెరపీ, బిహేవియర్‌ థెరపీ, ఆక్యుపేషనల్‌ థెరపీ, డాన్స్‌ థెరపీ... ఇలాంటి అనేక థెరపీలు అందిస్తోంది. లక్షణాలూ, తీవ్రతలను బట్టి ఒక్కో చిన్నారికి నాలుగైదేసి థెరపీలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి కోటి థెరపీలను ఇటీవలే పూర్తి చేసిందీ సంస్థ. తాము ఈ అసిధారా క్రతువు చేపట్టడం వెనక ఓ నేపథ్యముందంటున్నారు ‘పినాకిల్‌’ వ్యవస్థాపకురాలు శ్రీజారెడ్డి సరిపల్లి.

***

తొలిచూలు పంటగా పుట్టిన పిల్లాడు మొదట్లో అంతా బాగున్నట్టే కనిపించినా... ఏడాదిన్నర గడిచాక కూడా మాటలు రాకపోవడం చూసి ఆందోళన పడ్డారు కోటిరెడ్డి, శ్రీజారెడ్డి దంపతులు. డాక్టర్‌కు చూపిస్తే వినలేకపోతున్నాడనీ, బహుశా ఆటిజమ్‌ కావచ్చని చెప్పారు. చికిత్స కోసం అనేకచోట్ల తిరిగారు. పరిష్కారం దొరకలేదు. వ్యాధి నిర్ధారణ సరిగ్గా జరగలేదు.

పదిహేను రోజులకు అసలు విషయం తెలిసింది. ఆటిజమ్‌ కాదు, చెవి సమస్య అని తేలింది. అందుకు అవసరమైన శస్త్రచికిత్సలను రెండు చెవులకూ ఒకేసారి చేయించారు. పరిస్థితి పరిష్కారమైందనుకున్నారు. కానీ కేవలం శస్త్రచికిత్స సరిపోదు, స్పీచ్‌ థెరపీ కూడా అవసరమని వైద్యులు చెప్పారు.

అన్నీ ఉండి కూడా తమలాంటివారికే ఇంత కష్టంగా ఉంటే, ఏమీ తెలియని వారికి ఇంకెంత కష్టం ఉంటుందన్న ఆలోచన వారిలో రేకెత్తింది. ఆ ఆలోచనల నుంచి రూపుదిద్దుకున్న సంస్థే ‘పినాకిల్‌’. ఆ ఆటిజమ్‌ సమస్యను ఎదుర్కొనే పిల్లల తల్లిదండ్రుల దుఃఖం తీర్చడానికీ, ఆ పిల్లలు తమ పనులు తామే చేసుకునేలా, దాదాపుగా మిగతా పిల్లల్లాగే ఆడుకునేలా, నడచుకునేలా చేసేందుకు ఏర్పాటు చేసిన సంస్థ అది!


● శ్రీజా రెడ్డి సరిపల్లి

***

‘‘పినాకిల్‌ సంస్థకు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలతో పాటు దేశవ్యాప్తంగా దాదాపు 70కి పైగా సేవాకేంద్రాలున్నాయి. ఆటిజమ్‌ పిల్లలకు అవసరమైన రకరకాల థెరపీలను అక్కడ అందిస్తుంటారు. లోపల జరుగుతున్న చికిత్సను తల్లిదండ్రులు బయట ఉండి స్క్రీన్‌ మీద చూడవచ్చు. కేవలం భారత్‌లోనే కాదు... యూఎస్‌ఏ, సింగపూర్, దుబాయ్‌లలోనూ ఈ సేవలున్నాయి. త్వరలో యునైటెడ్‌ అరబ్‌ ఎమిరేట్స్‌లోనూ పినాకిల్‌ సేవలు అందనున్నాయి. ఖర్చు భరించలేని వారికి ‘సేవా’ విభాగం కింద వారు తాము చెల్లించగలిగేంత లేదా కేవలం ఒక్క రూపాయి చెల్లించి సేవలు పొందవచ్చు. పద్దెనిమిది భాషల్లో మా హెల్ప్‌లైన్‌ పనిచేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 130కి పైగా భాషల్లో సమాచారం తెలుసుకునేలా మా ‘థెరపాటిక్‌ ఏఐ’ రూపొందుతోంది. మా హెల్ప్‌లైన్‌ 9100 181 181 కు ఏ టైమ్‌లో ఫోన్‌ చేసినా ఆటిజమ్‌ పిల్లల తల్లిదండ్రులకు ప్రాథమిక సమాచారం ఎల్లవేళలా అందుతుంది.

ఏఐ ఎందుకంటే...

ఇలాంటి ఓ రుగ్మత ఉందని కనుగొన్న నాటి నుంచి నేటికి దాదాపు 133 ఏళ్లు. ఇంతటి చరిత్రా, వేర్వేరు థెరపీల నేర్పూ, నైపుణ్యాలు ఒక్కోచోట ఒక్కొక్కరిలో ఇలా పరిమితంగానే దొరుకుతుండవచ్చు. ఆ అంతటినీ సమగ్రంగా సమీకరించడం, ఒక్కచోటే అందేలా క్రోడీకరించడం అవసరం. అది ‘ఏఐ’తోనే సాధ్యం. అందుకే ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ సాయం తీసుకుంటున్నాం.’’ అంటూ తమ సేవల గురించి వివరించారు పినాకిల్‌ సంస్థ ఫౌండర్, చీఫ్‌ స్ట్రాటజిస్ట్‌ శ్రీజా సరిపల్లి.

– సాక్షి ఫీచర్స్‌ ప్రతినిధి



వింబుల్డన్ టోర్నీకి నాదల్ దూరం!

ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లో ఓడిన స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్ వింబుల్డన్ టోర్నీలో ఆడే అవకాశాలు కనిపించడంలేదు. మట్టికోర్టులపైనే జరిగే పారిస్ ఒలింపిక్స్ టెన్నిస్ ఈవెంట్‌కు సన్నద్ధం కావడానికి నాదల్ జూలైలో గ్రాస్ కోర్టులపై జరిగే వింబుల్డన్ టోర్నీకి దూరంగా ఉండాలని అనుకుంటున్నాడు. 2008, 2010లో వింబుల్డన్ విజేతగా నిలిచిన నాదల్ చివరిసారి ఈ టోర్నీలో 2022లో పాల్గొన్నాడు.



ఏడో సీడ్‌పై నిశేష్ సంచలన విజయం

లిటిల్ రాక్ ఓపెన్ ఏటీపీ–75 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో తెలుగు సంతతికి చెందిన అమెరికా యువతార నిశేష్ బసవ రెడ్డి సంచలన విజయం సాధించాడు. అమెరికాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో 19 ఏళ్ల నిశేష్ 7–5, 6–4తో ఏడో సీడ్ ప్రపంచ 252వ ర్యాంకర్ ఈథన్ క్విన్ (అమెరికా)పై నెగ్గాడు. 93 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిశేష్ ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు చెందిన నిశేష్ తల్లిదండ్రులు 1999లో అమెరికాకు వచ్చి అక్కడే స్థిరపడ్డారు.

సబలెంకా బోణీ

రెండో రౌండ్‌లోకి బెలారస్ స్టార్ ● తొలి రౌండ్‌లో ఓడిన ఆరో సీడ్ సాకరి


సబలెంకా

పారిస్: ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, ప్రపంచ రెండో ర్యాంకర్ సబలెంకా ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో గెలుపు బోణీ కొట్టింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో రెండో సీడ్ సబలెంకా (బెలారస్) 6–1, 6–2తో ఇరీకా ఆంద్రీవా (రష్యా)పై అలవోకగా విజయం సాధించింది. 68 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. 27 విన్నర్స్ కొట్టిన సబలెంకా నెట్ వద్ద 11 పాయింట్లు సాధించింది. ఏడోసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడుతున్న ఈ బెలారస్ స్టార్ గత ఏడాది తొలిసారి సెమీఫైనల్‌కు చేరింది. మరోవైపు ప్రపంచ ఏడో ర్యాంకర్, ఆరో సీడ్ మరియా సాకరి (గ్రీస్) వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీలో తొలి రౌండ్ అడ్డంకిని దాటలేకపోయింది. సాకరి 6–3, 4–6, 3–6తో వర్వరా గ్రెచెవా (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయింది. 2 గంటల 13 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకరి ఆరు డబుల్ ఫాల్ట్‌లతోపాటు 39 అనవసర తప్పిదాలు చేసింది. నాలుగో సీడ్ రిబాకినా (కజకిస్తాన్), ఏడో సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా), పదో సీడ్ దరియా కసత్‌కినా (రష్యా) రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రిబాకినా 6–2, 6–3తో గ్రీట్ మినెన్ (బెల్జియం)పై, కిన్‌వెన్ జెంగ్ 6–2, 6–1తో అలీజా కార్నె (ఫ్రాన్స్)పై, కసత్‌కినా 7–5, 6–1తో మగ్దలీనా ఫ్రెచ్ (పోలాండ్)పై గెలుపొందారు.

రూడ్ శుభారంభం

పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ ఏడో ర్యాంకర్, 2022, 2023 రన్నరప్ కాస్పర్ రూడ్ (నార్వే) శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో రూడ్ 6–3, 6–4, 6–3తో అల్వెస్ మెలెగిని (బ్రెజిల్)పై గెలుపొందాడు. గంటా 55 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రూడ్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. 23 విన్నర్స్ కొట్టిన రూడ్ నెట్ వద్ద 10 పాయింట్లు సాధించాడు. వర్షం అంతరాయం కారణంగా మంగళవారం జరగాల్సిన కొన్ని మ్యాచ్‌లను వాయిదా వేశారు. ఇందులో భారత డబుల్స్ ప్లేయర్లు రోహన్ బోపన్న, యూకీ బాంబ్రీ తొలి రౌండ్ మ్యాచ్‌లు కూడా ఉన్నాయి.

కార్నె వీడ్కోలు...



ఈ టోర్నీతో ఫ్రాన్స్ టెన్నిస్ స్టార్ అలీజా కార్నె కెరీర్‌కు వీడ్కోలు పలికింది. కిన్‌వెన్ జెంగ్ చేతిలో మ్యాచ్ ముగిశాక ఫ్రెంచ్ ఓపెన్ నిర్వాహకులు కార్నెను సన్మానించి చేసి వీడ్కోలు ట్రోఫీని అందజేశారు. 34 ఏళ్ల కార్నె అత్యధిక వరుస గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆడిన మహిళా టెన్నిస్ ప్లేయర్‌గా గుర్తింపు పొందింది. కార్నె 2007 ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి తాజా ఫ్రెంచ్ ఓపెన్ వరకు వరుసగా 69 గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆడింది. 2014 వింబుల్డన్ టోర్నీ మూడో రౌండ్‌లో నాటి ప్రపంచ నంబర్‌వన్ సెరెనా విలియమ్స్‌ను ఓడించిన కార్నె 2022 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరి తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. 2009లో కెరీర్ బెస్ట్ 11వ ర్యాంక్‌ను అందుకున్న కార్నె తాజా ర్యాంకింగ్స్‌లో 106వ స్థానంలో ఉంది. ర్యాంకింగ్‌పరంగా కార్నెకు నేరుగా ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడే అవకాశం రాకపోవడంతో నిర్వాహకులు వైల్డ్ కార్డు కేటాయించారు.

హెడ్ కోచ్‌గా గంభీర్!

భారత మాజీ కెప్టెన్‌తో బీసీసీఐ మంతనాలు

ముంబై: యాదృచ్ఛికమో, కాకతాళీయమో కానీ... కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) కోచింగ్ బృందంలో చేరితే ఆ తర్వాత బోలెడు అవకాశాలు కలిసొస్తాయని మరోసారి నిరూపితం కానుంది. బేలిస్ కోచింగ్‌లోని కేకేఆర్ 2012, 2014లో టైటిల్స్ నెగ్గింది. ఈ ఆస్ట్రేలియన్‌కు వెంటనే ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నుంచి ఆఫర్ వచ్చింది. తొలుత నిరాకరించినా తర్వాత బాధ్యతలు చేపట్టాడు. ఇలాగే మాథ్యూ మాట్, బ్రెండన్ మెకల్లమ్‌లు కూడా ఈసీబీ కోచింగ్ బృందంలో అవకాశాలు దక్కించుకున్నారు. ఇప్పుడు గౌతమ్ గంభీర్ వంతు వచ్చినట్లుంది. గంభీర్‌కు ఆసక్తి ఉందో లేదో ఇంకా స్పష్టంగా తెలియకున్నా... భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మాత్రం త్వరలో పదవీ కాలం ముగియనున్న రాహుల్ ద్రవిడ్ స్థానంలో హెడ్ కోచ్‌గా గంభీర్‌కు బాధ్యతలు అప్పగించాలని ఆరాటపడుతోంది. బోర్డు కార్యదర్శి జై షా క్రమం తప్పకుండా గంభీర్‌తో టచ్‌లో ఉన్నాడు. భారత్ నెగ్గిన రెండు ప్రపంచకప్ (2007లో టి20, 2011లో వన్డే)లలో కీలకపాత్ర పోషించిన గంభీర్ 2010–2011లలో భారత జట్టుకు ఆరు వన్డేల్లో కెప్టెన్‌గా వ్యవహరించి ఆరింటిలోనూ విజయాన్ని అందించాడు. ఐపీఎల్‌లో తన నాయకత్వంలో కేకేఆర్‌ను రెండుసార్లు (2012, 2014) విజేతగా నిలిపిన గంభీర్ తాజాగా ఇదే ఫ్రాంచైజీకి మెంటార్‌గా మూడో టైటిల్ అందించాడు. ఇన్నీ సానుకూలాంశాలు టీమిండియా హెడ్ కోచ్‌కు సరైన, సమర్థమైన అభ్యర్థిగా గౌతీవైపే మొగ్గేలా చేస్తున్నాయి.

కానీ... భారత్ బిజీ షెడ్యూల్‌తో ఎలా?

వృత్తిగతంగా కాలం కలిసొస్తున్న గంభీర్‌కు వ్యక్తిగతంగా కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి! టీమిండియాకు హెడ్ కోచ్ కావడమంటే... లక్నో నుంచి కోల్‌కతాకు మెంటార్‌గా మారినంత సులభం కాదు. ఎందుకంటే ఐపీఎల్ రెండు లేదంటే మూడు నెలల ముచ్చటే! కానీ భారత క్రికెట్ అంటేనే బిజీ బిజీ. ఐసీసీలోని ప్రతి శాశ్వత సభ్యదేశానికి టీమిండియా ముమ్మాటికి కామ ధేనువు. భారత్ తమ దేశంలో పర్యటిస్తే బోర్డులు రూ.వందల కోట్లు పోగేసుకుంటాయి. కాబట్టి ఏడాదిలో పది నెలలు టీమిండియా ఏదో ఓ ఫార్మాట్ ఆడుతూనే ఉంటుంది. క్రికెట్ కెరీర్ అనంతరం ఎంచక్కా కుటుంబంతో కాలం గడుపుతున్న గంభీర్‌ది పెద్ద వయస్సేమీ కాదు. పిల్లలిద్దరు చిన్నవారే కావడంతో 50, 55 ఏళ్ల వయసొచ్చినపుడు నిర్వర్తించే బాధ్యతల్ని ఇప్పుడు భుజాన వేసుకుంటాడా అనేది సంకోచించాల్సిన విషయం. తాజా ఐపీఎల్ సీజన్‌లో రెండున్నర నెలల షెడ్యూల్లోనే గంభీర్ ఐదుసార్లు విరామం తీసుకున్నట్లు తెలిసింది. ఇలాంటి ‘ఫ్యామిలీ మ్యాన్’ కుటుంబానికి నెలల తరబడి దూరముంటాడా అనేది సమాధానం దొరకని ప్రశ్నే!

మోదీ పేరుతోనూ...

బోర్డు కోచ్ పదవి కోసం దరఖాస్తుల గడువు ముగిసిపోగా... విదేశీ కోచ్‌లు, విదేశీ మాజీ క్రికెటర్లెవరూ దరఖాస్తు చేసిన దాఖలాలైతే లేవు కానీ ఏకంగా 3000 పైచిలుకు అప్లికేషన్లు వచ్చాయి. ఆన్‌లైన్ ఫార్మాట్ కావడంతో నెట్టింట ఆకతాయిలు కొందరు ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, దిగ్గజ క్రికెటర్లు సచిన్, ఎమ్మెస్ ధోని తదితర పేర్లతో నకిలీ దరఖాస్తులు సమర్పించారు.


ఐపీఎల్ ఫైనల్ సందర్భంగా గంభీర్‌తో బీసీసీఐ కార్యదర్శి జై షా

డాక్టర్ కూడానా!!

మన నెటిజన్లు హెడ్ కోచ్ పదవి కోసం ఫన్నీగా దరఖాస్తు చేసుకోవడం విశేషం. గూగుల్ ఫామ్స్‌లో తమ వివరాలు రాసి ఆన్‌లైనే కదా అప్లై చేస్తే పోలా అన్నట్లు సోషల్ మీడియా ఫాలోవర్లు చాలామంది ఎగబడ్డారు. ఇంకో ఆసక్తికర విషయం ఏంటంటే బాల్యంలో గల్లీ క్రికెట్ ఆడిన ఓ డాక్టర్ కూడా టీమిండియా కోచ్ పదవి కోసం దరఖాస్తు చేసుకోవడమే విడ్డూరం!

హంపి శుభారంభం

స్టావెంజర్ (నార్వే): భారత చెస్ స్టార్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి నార్వే చెస్ మహిళల ఓపెన్ టోర్నీలో శుభారంభం చేసింది. పియా క్రామ్లింగ్ (స్వీడన్)తో జరిగిన తొలి రౌండ్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్ హంపి అర్మగెడాన్ గేమ్‌లో గెలిచింది. ఈ టోర్నీ నిబంధనల ప్రకారం ముందుగా క్లాసికల్ ఫార్మాట్‌లో గేమ్ జరుగుతుంది. ఒకవేళ గేమ్ ‘డ్రా’ అయితే ఫలితం తేలడానికి అర్మగెడాన్ గేమ్‌ను నిర్వహిస్తారు. అర్మగెడాన్ గేమ్‌లో తెల్ల పావులతో ఆడే వారికి 10 నిమిషాలు, నల్ల పావులతో ఆడే వారికి 7 నిమిషాలు కేటాయిస్తారు. అర్మగెడాన్ గేమ్‌లో తెల్ల పావులతో ఆడే ప్లేయర్ నెగ్గని పక్షంలో... నల్ల పావులతో ఆడిన ప్లేయర్ గేమ్‌ను ‘డ్రా’ చేసుకుంటే దానిని విజయంగా పరిగణిస్తారు. హంపి, పియా క్రామ్లింగ్ క్లాసికల్ గేమ్ 37 ఎత్తుల్లో ‘డ్రా’కాగా... ఫలితం తేలడానికి అర్మగెడాన్ గేమ్ నిర్వహించారు. ఇందులో నల్లపావులతో ఆడిన హంపి 51 ఎత్తుల్లో గేమ్‌ను ‘డ్రా’ చేసుకోవడంతో ఆమెను విజేతగా ప్రకటించారు. భారత్‌కే చెందిన వైశాలి తొలి రౌండ్ క్లాసికల్ గేమ్‌లో 43 ఎత్తుల్లో వెన్‌జున్ జు (చైనా) చేతిలో ఓడిపోయింది. ఇదే టోర్నీ పురుషుల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద అర్మగెడాన్ గేమ్‌లో తెల్ల పావులతో ఆడుతూ 38 ఎత్తుల్లో ఫిరూజా (ఫ్రాన్స్)పై గెలిచాడు. వీరిద్దరి మధ్య క్లాసికల్ గేమ్ 44 ఎత్తుల్లో ‘డ్రా’ అయింది.



ప్రిక్వార్టర్స్‌లో నిశాంత్



బ్యాంకాక్: వరల్డ్ ఒలింపిక్ బాక్సింగ్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు లభించాయి. నిశాంత్ దేవ్ (71 కేజీలు), సచిన్ సివాచ్ (57 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించగా... అభినాశ్ (63.5 కేజీలు) రెండో రౌండ్‌లోనే వెనుదిరిగాడు. రెండో రౌండ్ బౌట్‌లలో సచిన్ 5–0తో ఫ్రెడరిక్ (డెన్మార్క్)పై గెలుపొందగా... నిశాంత్ పంచ్‌ల ధాటికి ఒట్గాన్‌బాటర్ (మంగోలియా) తట్టుకోలేకపోవడంతో రిఫరీ తొలి రౌండ్‌లోనే బౌట్‌ను నిలిపి వేసి భారత బాక్సర్‌ను విజేతగా ప్రకటించారు. అభినాశ్ 0–5తో జోస్ ఫోరీ (కొలంబియా) చేతిలో ఓడిపోయాడు.

సాత్విక్–చిరాగ్ జోడీకి చుక్కెదురు

తొలి రౌండ్‌లోనే ఓడిన ప్రపంచ నంబర్‌వన్ జోడీ ● సింగపూర్ ఓపెన్ టోర్నీ



సింగపూర్: ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉన్న సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీకి అనూహ్య పరాజయం ఎదురైంది. సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన సాత్విక్–చిరాగ్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 34వ స్థానంలో ఉన్న డానియల్ లుండ్‌గార్డ్–మాడ్స్ వెస్టెర్‌గార్డ్ (డెన్మార్క్) ద్వయం 22–20, 21–18తో సాత్విక్–చిరాగ్ శెట్టి జోడీని బోల్తా కొట్టించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. 47 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రెండు గేముల్లోనూ పలు దశల్లో సాత్విక్–చిరాగ్ ఆధిక్యంలో ఉన్నా దానిని సద్వినియోగం చేసుకోలేక పోయారు. ఈ టోర్నీకి ముందు సాత్విక్–చిరాగ్ సీజన్‌లో ఆరు టోర్నీలు ఆడి ఫ్రెంచ్ ఓపెన్ సూపర్–750 టోర్నీలో, థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్–500 టోర్నీలో టైటిల్స్ నెగ్గారు. మలేసియా సూపర్–1000, ఇండియా ఓపెన్ సూపర్–750 టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచి, ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగారు.


సినిమా

ఇండస్ట్రీ నుంచి పంపించేస్తారు అన్నారు - విశ్వక్ సేన్


● విశ్వక్ సేన్, నాగవంశీ, అంజలి

‘‘నిజాయతీగా పని చేసి ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి’ లాంటి మంచి సినిమా తీశాం. అందుకే ఈ మూవీపై చాలా నమ్మకంగా ఉన్నాం. అందరూ కుటుంబంతో కలిసి రావొచ్చు. సినిమా చూశాక రెండు మూడు రోజుల పాటు ప్రేక్షకుల మనసుల్లోనే ఉంటుంది’’ అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. కృష్ణ చైతన్య దర్శకత్వంలో విశ్వక్ సేన్ హీరోగా, నేహా శెట్టి, అంజలి కథానాయికలుగా నటించిన చిత్రం ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి’. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి’ ప్రీ రిలీజ్ వేడుకలో హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ‘‘ఐదేళ్ల క్రితం మార్చి 31వ తేదీనే నా ‘ఫలక్‌నుమా దాస్’ రిలీజ్ అయ్యింది. నేనీ స్థాయిలో ఉన్నానంటే కారణం ఆ సినిమా.. ఆదరించిన ప్రేక్షకులే. నా కెరీర్ ఆరంభంలో ‘ఇలాంటి యాటిట్యూడ్ ఇండస్ట్రీలో పనికి రాదు.. తొక్కేస్తారు.. పంపించేస్తారు’ అన్నారు. అయినా నా క్యారెక్టర్ మార్చుకోలేదు. ఐదేళ్లుగా నన్ను సపోర్ట్ చేస్తున్న ఇండస్ట్రీకి, దర్శక–నిర్మాతలకు, ముఖ్యంగా నా ఫ్యాన్స్‌కి థ్యాంక్స్. ఇప్పటికే ఐదేళ్లు గడిచిపోయాయి. మరో ఐదేళ్లు ఫైనల్.. కాల్చిపడేస్తా మొత్తం. రత్నలాంటి పాత్ర చేయాలన్నది నా కల. అలాంటి కథతో వచ్చిన కృష్ణ చైతన్యకి థ్యాంక్స్. నేను ఇప్పటి వరకూ పనిచేసిన నిర్మాతల్లో నాగవంశీ బెస్ట్’’ అన్నారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ– ‘‘మా అమ్మానాన్నల ఆశీస్సుల వల్లే ఇక్కడ ఉన్నాను. మా గురువు త్రివిక్రమ్ గారే ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి’కి మూలం. ఆయన వల్లే ఈ సినిమా మొదలైంది. నన్ను నమ్మి ఈ సినిమా తీసిన నిర్మాతలు చినబాబు, నాగవంశీ, సాయి సౌజన్యగార్లకు కృతజ్ఞతలు. బుజ్జిగా నేహాశెట్టి, రత్నమాలగా అంజలి పాత్రలు ప్రేక్షకులకు గుర్తుండిపోతాయి. విశ్వక్ సేన్ అద్భుతంగా నటించాడు. తను చేసిన రత్న పాత్ర ప్రేక్షకుల్ని నవ్విస్తుంది.. ఏడిపిస్తుంది.. భయపెడుతుంది’’ అన్నారు. **సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ–** ‘‘ఈ నెల 31 తర్వాత విశ్వక్ సేన్ గురించి మాట్లాడుకుంటే ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి’కి ముందు, తర్వాత అని మాట్లాడుకుంటారు. నట విశ్వరూపం చూపించాడు. సినిమా చూశాక నిజంగా కృష్ణ చైతన్య తీశాడా? అనిపించింది. ఈ మధ్య కాలంలో ఇంత మంచి ఇంటెన్స్ మూవీ రాలేదు’’ అన్నారు. నటి నేహా శెట్టి, నటులు మధునందన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మాస్ మల్లి



● ‘అల్లరి’ నరేశ్

సిగరెట్ కాల్చుతూ రిక్షాలో మాస్‌గా కూర్చొన్న అతని పేరు మల్లి. ఇంటిపేరు బచ్చల. చేసేది ట్రాక్టర్ డ్రైవర్‌గా... ఇంకా అతని పూర్తి వివరాలు తెలుసుకోవాలనుకునేవారు థియేటర్స్‌కు వెళ్లాల్సి ఉంటుంది. ‘అల్లరి’ నరేశ్ టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం ‘బచ్చల మల్లి’. 1990 నేపథ్యంలో సాగే ఈ సినిమాకు ‘సోలో బ్రతుకే సో బెటర్’ ఫేమ్ సుబ్బు మంగాదేవి దర్శకత్వం వహిస్తున్నారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేశ్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌లో సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు ‘అల్లరి’ నరేశ్. ‘‘ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ బచ్చల మల్లి చాలా రోజులు గుర్తిండిపోతాడు. నిర్మాణం పనులు తుది దశకు చేరుకున్నాయి’’ అని చిత్రబృందం పేర్కొంది. అమృతా అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో రోహిణి, రావు రమేశ్, అచ్యుత్ కుమార్, బలగం జయరామ్, హరితేజ, ప్రవీణ్, వైవా హర్ష ముఖ్య పాత్రధారులు. ఈ సినిమాకు సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: రిచర్డ్ ఎం. నాథన్.

ఒకరికొకరు సపోర్ట్ చేసుకోవడం ముఖ్యం - రష్మికా మందన్న


● నయన్, ఆనంద్ దేవరకొండ, రష్మికా మందన్న, ప్రగతీ శ్రీవాస్తవ

‘‘ఇండస్ట్రీలో ఒకరికొకరు సపోర్ట్ చేసుకోవడం ముఖ్యం. సినిమాల్లోకి వచ్చాక నేను ఈ విషయం తెలుసుకున్నాను. ఆనంద్ నాకు బ్రదర్‌లాంటి వాడు. అతని మీద నేను చాలా ఆధారపడుతుంటాననే విషయం ఆనంద్‌కే తెలియదు. ‘గం..గం..గణేశా’ సక్సెస్ సాధిస్తే ఆనంద్ ముఖంలో నవ్వు ఉంటుంది. ఆ విజయం తాలూకు నవ్వుని నేను చూడాలనుకుంటున్నాను’’ అన్నారు హీరోయిన్ రష్మికా మందన్న. ఆనంద్ దేవరకొండ హీరోగా, ప్రగతీ శ్రీవాస్తవ, నయన్ సారిక హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘గం..గం..గణేశా’. ఉదయ్ శెట్టి దర్శకత్వంలో కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి రష్మికా మందన్న ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ– ‘‘గం..గం..గణేశా’ సాంగ్స్‌కు నేను డ్యాన్సులు చేశాను. చేతన్ భరద్వాజ్ మ్యూజిక్ చాలా బాగుంది. డైరెక్టర్ ఉదయ్‌కి ఈ సినిమా పెద్ద సక్సెస్ ఇవ్వాలి. వంశీ, కేదార్, అనురాగ్‌లకు ఈ మూవీ మంచి లాభాలు తీసుకురావాలి’’ అన్నారు. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ‘‘క్రైమ్ కామెడీలో ఫ్యామిలీ ఎమోషన్స్ కలిపి వినోదాత్మకంగా తీసిన చిత్రం ‘గం..గం..గణేశా’. నేను ఈ సినిమాలో కనిపించినంత ఎనర్జిటిక్‌గా ఇప్పటి వరకూ ఏ సినిమాలోనూ కనిపించలేదు’’ అన్నారు. ‘‘గం..గం..గణేశా’లో ఒక అతిథి పాత్ర ఉంది. ఆ పాత్రను థియేటర్‌లో చూసి షాక్ అయ్యేందుకు రెడీగా ఉండండి’’ అన్నారు ఉదయ్ శెట్టి. దర్శక–నిర్మాత ‘మధుర’ శ్రీధర్ రెడ్డి, నిర్మాత బన్నీ వాసు, సహనిర్మాత అనురాగ్ పర్వతనేని తదితరులు పాల్గొన్నారు.

పిడికిలి బిగించాడు


● కల్యాణ్ రామ్

కల్యాణ్ రామ్ హీరోగా, విజయశాంతి ఓ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సోహైల్ ఖాన్, సయీ మంజ్రేకర్, శ్రీకాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మంగళవారం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కల్యాణ్ రామ్ కెరీర్‌లోని ఈ 21వ సినిమా గ్లింప్స్‌ను ‘ది ఫిస్ట్ ఆఫ్ ఫ్లేమ్’ పేరిట విడుదల చేశారు. కల్యాణ్ రామ్ పిడికిలి బిగించి ఓ యాక్షన్ సీక్వెన్స్‌కు రెడీ అవుతున్న విజువల్స్ ఈ గ్లింప్స్‌లో కనిపిస్తాయి. ‘‘సరిలేరు నీకెవ్వరు (2020)’ వంటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ తర్వాత విజయశాంతి గారు ఈ సినిమాకు సైన్ చేశారు. ‘కర్తవ్యం’ సినిమాలో చేసిన పవర్‌ఫుల్ క్యారెక్టర్ తరహా పాత్రను ఈ సినిమాలో చేస్తున్నారామె’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: అజనీష్ లోక్‌నాథ్. కెమెరా: రామ్‌ప్రసాద్.

గుణశేఖర్ యుఫోరియా




‘శాకుంతలం’ (2023) తర్వాత దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కించనున్న చిత్రం గురించి మంగళవారం ప్రకటన వెల్లడైంది. ఓ యూత్‌ఫుల్ సోషల్ డ్రామాతో ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు గుణ శేఖర్. ఈ సినిమాకు ‘యుఫోరియా’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గుణ హ్యాండ్‌మేడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ ఈ చిత్రాన్ని నిర్మించ నున్నారు. ‘‘ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణులకు సంబంధించిన వివరాలను త్వరలో తెలియజేస్తాం’’ అని మేకర్స్ పేర్కొన్నారు.

రాణులకే రాణి


● కాజోల్

జాతర సందడిగా జరుగుతోంది. అమ్మవారి తల్లి సాక్షిగా కొందర్ని రఫ్ఫాడించింది ఆ మహిళ. అమ్మవారిలా ఆమె ఉగ్రరూపం దాల్చిన తీరుకి ఎదుట ఉన్నది ఎవరైనా వణికిపోవాల్సిందే. ఆ మహిళ పాత్రలో కాజోల్ చేసిన ఫైట్‌తో విడుదలైంది ‘మహారాగ్ని’ చిత్రం టీజర్. ఇంకా ఈ టీజర్‌లో ప్రభుదేవా ఫైట్ చేస్తూ, ఏదో పగతో ఉన్నట్లు సంయుక్తా మీనన్, సీనియర్ నటుడు నసీరుద్దీన్ షా ఓ రోల్‌లో కనిపించారు. కాజోల్, ప్రభుదేవా లీడ్ రోల్స్‌లో నసీరుద్దీన్ షా, సంయుక్తా మీనన్, జిషు సేన్ గుప్తా, ఆదిత్యా సీల్ ఇతర పాత్రల్లో నటిస్తున్న చిత్రానికి ‘మహారాగ్ని’ టైటిల్ ఖరారు చేశారు. ‘క్వీన్ ఆఫ్ క్వీన్స్’ (రాణులకే రాణి) అనేది ట్యాగ్‌లైన్. ఈ టైటిల్, ట్యాగ్‌లైన్ కాజోల్ పాత్రను ఉద్దేశించి పెట్టి ఉంటారని ఊహించవచ్చు. నిర్మాత చరణ్ తేజ్ ఉప్పలపాటి దర్శకత్వంలో వెంకట అనీష్ దొరిగిల్లు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా మూవీ టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. ‘‘భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న యాక్షన్ థ్రిల్లర్ మూవీ ‘మహారాగ్ని’. షారుక్ ఖాన్ ‘జవాన్’ చిత్రానికి పని చేసిన జీకే విష్ణు మా సినిమాకి సినిమాటోగ్రాఫర్‌గా చేస్తున్నారు. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకి వెన్నెముక. ఆయన మంచి సంగీతం, అద్భుతమైన నేపథ్య సంగీతం ఇచ్చారు’’ అని యూనిట్ పేర్కొంది.

రామానుజుడి గొప్పతనంతో...


● సాయి వెంకట్

సాయి వెంకట్ నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం ‘జయహో రామానుజ’. జో శర్మ, సుమన్, ప్రవళ్లిక కీలక పాత్రధారులు. రెండు భాగాలుగా సాయిప్రసన్న, ప్రవళ్లిక నిర్మిస్తున్న ఈ సినిమా తొలి భాగం జూలై 12న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ కార్యక్రమానికి శ్రీ కృష్ణమాచార్యులు, నిర్మాతలు టి. రామసత్యనారాయణ, శోభారాణి, ఎ. గురురాజ్, దర్శకుడు రేలంగి నరసింహారావు, బీసీ కమీషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలని అన్నారు. ‘‘మహిళల్ని గౌరవించాలని, మానవాళి ఐకమత్యంతో ఉండాలనే సందేశాన్ని ఇచ్చిన శ్రీ రామానుజాచార్యుల గొప్పతనం ఈ తరం వారికి తెలియాలనే ఉద్దేశంతో ఈ చిత్రం తీస్తున్నాను’’ అన్నారు సాయి వెంకట్.

ప్రేక్షకులు చూపు తిప్పుకోలేరు - ప్రశాంత్ రెడ్డి



‘‘ఈ చిత్రంలో హీరో పెద్ద క్రికెటర్ కావాలనుకుంటాడు. ఆ గోల్‌తో సిటీకి వస్తాడు. ఆ లక్ష్యాన్ని చేరుకుంటున్న సమయంలో హీరోని వేరే సమస్యలు చుట్టుముడతాయి. అప్పుడేం చేశాడు? అన్నదే ‘భజే వాయు వేగం’ చిత్రకథ’’ అన్నారు ప్రశాంత్ రెడ్డి. కార్తికేయ గుమ్మకొండ, ఐశ్వర్యా మీనన్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘భజే వాయు వేగం’. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ప్రశాంత్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ– ‘‘స్వస్థలం మెదక్. అక్కడ రాజమౌళిగారి ‘సై’ సినిమా షూటింగ్ జరిగింది. రాజమౌళిగారి స్ఫూర్తితో సినిమా ఇండస్ట్రీకి వచ్చాను. ఇక ‘భజే వాయు వేగం’ ఫస్టాఫ్‌లో మంచి పెర్ఫార్మర్ కావాలి. మలి భాగంలో ఈ పెర్ఫార్మెన్స్‌కి హీరోయిజం తోడవ్వాలి. ఇందుకు కార్తికేయ కరెక్ట్ అనుకున్నాం. బాగా నటించాడు. సెకండాఫ్‌లో ఒక్క సాంగ్ కూడా ఉండదు. స్క్రీన్‌ప్లే రేసీగా వెళ్తుంటుంది. ప్రేక్షకులు చూపు తిప్పుకోలేరు. నా తర్వాతి చిత్రం యూవీలోనే ఉండొచ్చు’’ అని చెప్పుకొచ్చారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
220	44
75,170	22,888

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,992	△	74
డోజోన్స్	38,974	▽	275
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,254	▽	63
డాక్స్	18,678	△	97
షాంఘై	3,110	▽	14
నికాయ్	38,855	▽	45

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
72,291	△	100
బంగారం (99.5 స్వచ్ఛత)		
72,002	△	100
వెండి (కేజీ)		
93,120	△	2,309

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.69	83.71
£	బ్రిటన్ పౌండ్		104.72	107.28
€	యూరో		89.09	91.47
¥	జపాన్ ఎన్ (100)		52.50	53.66
AUS	ఆస్ట్రేలియా డాలర్		54.22	56.18
S$	సింగపూర్ డాలర్		59.30	63.99
SAR	సౌదీ రియాల్		21.27	22.83
UAE D	యూఏఈ దిర్హామ్		21.75	23.53
¥	చైనా యువాన్		10.36	12.43

ఆర్‌బీఐ మొబైల్ యాప్

- ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడుల కోసం
- నియంత్రణపరమైన అనుమతుల కోసం ప్రవాహ్ పోర్టల్
- ఆవిష్కరించిన రిజర్వ్ బ్యాంక్

ముంబై: రిటైల్ మదుపుదార్లు ప్రభుత్వ బాండ్లలో ఇన్వెస్ట్ చేయడాన్ని సులభతరం చేసే దిశగా రిజర్వ్ బ్యాంక్ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించింది. దీనితో పాటు నియంత్రణపరమైన అనుమతులకు సంబంధించి ప్రవాహ్ పోర్టల్, ఫిన్‌టెక్ సంస్థల డేటా కోసం ఫిన్‌టెక్ రిపాజిటరీని ప్రారంభించింది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మంగళవారం ఈ మూడింటిని ఆవిష్కరించారు. ప్రస్తుతం చిన్న ఇన్వెస్టర్లు రిటైల్ డైరెక్ట్ పోర్టల్ ద్వారా గవర్నమెంట్ సెక్యూరిటీస్ (జీ–సెక్)లో ఇన్వెస్ట్ చేయడానికి వీలుంది. ఇందుకోసం రిటైల్ డైరెక్ట్ స్కీము కింద ఆర్‌బీఐ వద్ద రిటైల్ డైరెక్ట్ గిల్ట్ అకౌంటును తెరవాల్సి ఉంటోంది. దీన్ని ఆండ్రాయిడ్ యూజర్లు ప్లే స్టోర్ నుంచి, ఐవోఎస్ యూజర్లు యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

60 ఫారంలతో ప్రవాహ్..

నియంత్రణ సంస్థపరమైన వివిధ రకాల అనుమతులకు సంస్థలు, వ్యక్తులు దర ఖాస్తు చేసుకునేందుకు ప్రవాహ్ పోర్టల్ ఉపయోగపడుతుంది. వివిధ విభాగాలకు సంబంధించి ఇందులో 60 అప్లికేషన్ ఫారంలు ఉంటాయి. అవసరాన్ని బట్టి వీటిని పెంచనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. అప్లై



చేసుకున్న వారు నిర్దిష్ట దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు, అలాగే దానిపై తీసుకున్న నిర్ణయాన్ని నిర్ణీత వ్యవధిలో దరఖాస్తుదారుకు తెలియజేసేందుకు ఉపయోగపడుతుంది.

ఫిన్‌టెక్ రిపాజిటరీ..

ఫిన్‌టెక్ సంస్థలు, వాటి కార్యకలాపాలు, టెక్నాలజీపరంగా చేకూరే ప్రయోజనాలు మొదలైన డేటాకి ఈ రిపాజిటరీ కేంద్రంగా ఉంటుంది. ఫిన్‌టెక్ కంపెనీలను నియంత్రణ సంస్థ కోణంలో మరింత మెరుగ్గా అర్థం చేసుకునేందుకు, వాటికి తగిన విధానాలను రూపొందించేందుకు ఇది ఉపయోగపడగలదు. నియంత్రిత సంస్థలు, ఆర్‌బీఐ నియంత్రణలో లేని ఫిన్‌టెక్‌లు కూడా ఈ రిపాజిటరీకి సమాచారం సమర్పించవచ్చు. మరోవైపు, ఆర్‌బీఐ నియంత్రణలో మాత్రమే ఉన్న సంస్థలు (బ్యాంకులు, బ్యాంకింగ్‌యేతర ఆర్థిక సంస్థలు) వర్ధమాన టెక్నాలజీలను అందిపుచ్చుకోవడానికి సంబంధించిన వివరాల కోసం ఎంటెక్ (ఈఎంటెక్) రిపాజిటరీని కూడా ప్రవేశపెట్టనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఫిన్‌టెక్, ఎంటెక్ రిపాజిటరీలను ఆర్‌బీఐ అనుబంధ సంస్థ రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌బీఐహెచ్) నిర్వహిస్తుంది.

ఆరోగ్య బీమాలోకి ఎల్‌ఐసీ

- ఎంట్రీపై కసరత్తు
- కంపెనీ చైర్మన్ సిద్ధార్థ మొహంతి

న్యూఢిల్లీ: జీవిత బీమా రంగ దిగ్గజం ఎల్‌ఐసీ తాజాగా ఆరోగ్య బీమా రంగంలోకి కూడా ప్రవేశించే యోచనలో ఉంది. ఇందుకోసం ఇన్‌ఆర్గానిక్ అవకాశాలను (వేరే సంస్థను కొనుగోలు చేయడం వంటివి) పరిశీలిస్తామని సంస్థ చైర్మన్ సిద్ధార్థ మొహంతి తెలిపారు. ప్రస్తుతం దీనిపై అంతర్గతంగా కసరత్తు జరుగుతోందని వివరించారు. అగ్ని ప్రమాద బీమా వంటి జనరల్ ఇన్సూరెన్స్ విభాగంలో ఎల్‌ఐసీకి నైపుణ్యాలు లేవని, కాకపోతే హెల్త్ ఇన్సూరెన్స్ మాత్రం చేయగలదని మొహంతి తెలిపారు. ఇన్సూరెన్స్ చట్టాన్ని సవరించి ఒకే గొడుగు కింద లైఫ్, జనరల్ లేదా హెల్త్ ఇన్సూరెన్స్‌ను ఆఫర్ చేసే విధంగా బీమా కంపెనీలకు కాంపోజిట్ లైసెన్సులు జారీ చేయొచ్చనే అంచనాల నేపథ్యంలో మొహంతి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



ఎన్‌ఎండీసీ లాభం నేలచూపు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఎన్‌ఎండీసీ గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 38 శాతం క్షీణించి రూ. 1,416 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,277 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 6,908 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 4,520 కోట్లకు పెరిగాయి. ఇక పూర్తి ఏడాదికి నికర లాభం స్వల్పంగా రూ. 5,571 కోట్లకు పుంజుకుంది.

షేరు బీఎస్‌ఈలో 1.5% నష్టపోయి రూ. 259గా ముగిసింది.

ఆధార్‌తో పాన్ లింక్ చేసుకోండి

న్యూఢిల్లీ: అధిక రేటుతో టీడీఎస్ కోతల భారాన్ని తప్పించుకోవాలంటే మే 31లోగా ఆధార్‌తో పాన్ నంబరును లింక్ చేసుకోవాలని పన్ను చెల్లింపుదారులకు ఆదాయపు పన్ను శాఖ సూచించింది. ఇన్‌కం ట్యాక్స్ నిబంధనల ప్రకారం పర్మనెంట్ అకౌంట్ నెంబరు (పాన్)ను బయోమెట్రిక్ ఆధార్‌తో అనుసంధానించకపోతే రెట్టింపు రేటుతో టీడీఎస్ (ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్) డిడక్ట్ అవుతుంది. మరోవైపు, ఎస్‌ఎఫ్‌టీ (స్పెసిఫైడ్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్స్ స్టేట్‌మెంట్) దాఖలుకు మే 31



డెడ్‌లైన్‌గా ఉంటుందని ఐటీ శాఖ పేర్కొంది. ఫారెక్స్ డీలర్లు, బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, పోస్టాఫీస్‌లు మొదలైనవి దీన్ని దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎస్‌ఎఫ్‌టీ రిటర్నులు వేయడంలో జాప్యం చేస్తే రోజుకు రూ. 1,000 చొప్పున జరిమానా ఉంటుంది. అధిక విలువ లావాదేవీలను ఐటీ శాఖ ట్రాక్ చేసేందుకు ఎస్‌ఎఫ్‌టీ ఉపయోగపడుతుంది.

ఐటీసీ హోటల్ విడదీతకు ఓకే

సీసీఐ గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ.. హోటళ్ల బిజినెస్‌ను ప్రత్యేక కంపెనీగా విడదీసేందుకు తాజాగా కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) అనుమతిని పొందింది. విడదీత తదుపరి ఐటీసీ హటల్స్ లిమిటెడ్ పేరుతో ఆతిథ్య రంగ విభాగం స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కానుంది. విడదీత తరువాత ఐటీసీ హోటల్స్‌లో ఐటీసీ లిమిటెడ్ 40 శాతం వాటా పొందనుంది. మిగిలిన 60 శాతం వాటా ఐటీసీ వాటాదారులకు లభించనుంది. ఎఫ్ఎంసీజీ, హోటళ్లు, పేపర్, పేపర్‌బోర్డులు, ప్యాకేజింగ్, అగ్రి బిజినెస్‌లతో ఐటీసీ డైవర్సిఫైడ్ కంపెనీగా నిలుస్తున్న సంగతి తెలిసిందే. హోటళ్లు, ఆతిథ్య రంగ బిజినెస్‌ల నిర్వహణకు పూర్తి అనుబంధ సంస్థగా ఐటీసీ హోటల్స్‌ను ఏర్పాటు చేసేందుకు 2023 జులైలోనే ఐటీసీ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 1975లో ప్రారంభమైన ఐటీసీ హోటల్స్ విభాగం 80కుపైగా ప్రాంతాలలో 115 హోటళ్లను నిర్వహిస్తోంది.

ఈ వార్తల నేపథ్యంలో ఐటీసీ షేరు బీఎస్‌ఈలో 0.6 శాతం నీరసించి రూ. 429 వద్ద ముగిసింది.

ఐఆర్‌సీటీసీ లాభం అప్

- క్యూ4లో రూ. 284 కోట్లు
- షేరుకి రూ. 4 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం ఐఆర్‌సీటీసీ గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం స్వల్పంగా 2 శాతం వృద్ధితో రూ. 284 కోట్లకు చేరింది. టికెట్ల విక్రయాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 20 శాతం ఎగసి రూ. 1,155 కోట్లకు చేరింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 4 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. ఈ కాలంలో నిర్వహణ లాభం(ఇబిటా) 3 శాతంపైగా మెరుగుపడి రూ. 403 కోట్లను తాకింది. ఇబిటా మార్జిన్లు 35 శాతానికి నీరసించాయి. 2022–23 క్యూ4లో 36.8 శాతంగా నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో ఐఆర్‌సీటీసీ షేరు బీఎస్‌ఈలో 1.6 శాతం క్షీణించి రూ. 1,083 వద్ద ముగిసింది.

మూడో రోజూ లాభాల స్వీకరణ

- సెన్సెక్స్ 220 పాయింట్ల పతనం
- నిఫ్టీకి 44 పాయింట్ల నష్టం

ముంబై: గరిష్ట స్థాయిల వద్ద మూడో రోజూ లాభాల స్వీకరణ కొనసాగడంతో స్టాక్ సూచీలు మంగళవారమూ నష్టాల్లో ముగిశాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఆరో విడత పోలింగ్, ఎగ్జిట్ పోల్స్, ఎన్నికల ఫలితాల వెల్లడి తదితర పరిణామాలకు ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తున్నారు. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు(–1%) అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బ్యాంకులు, ఇంధన, విద్యుత్ షేర్లను సైతం ఇన్వెస్టర్లు భారీగా విక్రయించారు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచీ మిశ్రమ సంకేతాలు అందాయి. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు..., ఇంట్రాడేలో లాభ, నష్టాల మధ్య ట్రేడయ్యాయి. చివరికి సెన్సెక్స్ 220 పాయింట్లు కోల్పోయి 75,170 వద్ద స్థిరపడింది. రోజంతా 75,083 – 75,585 శ్రేణిలో కదలాడింది. నిఫ్టీ 44 పాయింట్లు పతనమై 22,888 వద్ద ముగిసింది. ఇరు సూచీలకిది మూడోరోజూ నష్టాల ముగింపు. ఫార్మా



మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 1%, 0.63 శాతం చొప్పున క్షీణించాయి. చైనా, హాంగ్‌కాంగ్, జపాన్ దేశాల స్టాక్ సూచీలు డీలాపడ్డాయి. యూరప్ మార్కెట్లు ఒకశాతం వరకు నష్టపోయాయి. అమెరికా మార్కెట్లు సైతం బలహీనంగా కదలాడుతున్నాయి.

- ప్రమోటర్ సంస్థ ఐనాక్స్ విండ్ ఎనర్జీ బ్లాక్ డీల్ ద్వారా 5% వాటాను విక్రయించడంతో ఐనాక్స్ విండ్ షేరు 10% పతనమై రూ.148 వద్ద లోయర్ సర్క్యూట్ తాకింది.

కెమికల్ బిజినెస్‌లోకి సీఐఎల్

బీహెచ్‌ఈఎల్‌తో భాగస్వామ్యం

న్యూఢిల్లీ: కోల్ కెమికల్ బిజినెస్ కోసం ప్రభుత్వ రంగ దిగ్గజాలు కోల్ ఇండియా(సీఐఎల్), బీహెచ్ఈఎల్ చేతులు కలిపాయి. భారత్ కోల్ గ్యాసిఫికేషన్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(బీసీజీసీఎల్)పేరుతో భాగస్వామ్య సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేశాయి. జేవీలో సీఐఎల్ వాటా 51 శాతంకాగా.. బీహెచ్ఈఎల్ వాటా 49 శాతం. నీతీ ఆయోగ్, దీపమ్ నుంచి జేవీ ఏర్పాటుకు క్లియరెన్స్ లభించినట్లు సీఐఎల్ పేర్కొంది. కోల్ ఇండియాకు అనుబంధంగా ఏర్పడిన జేవీ కోల్ టు కెమికల్స్ బిజినె



స్‌లు చేపట్టనుంది. ప్రధానంగా ఇంటర్మీడియెట్ ప్రొడక్టులుగా అ మోనియా, నైట్రిక్ యాసిడ్‌లను తయారు చేయనుంది. అంతేకాకుండా అమోనియం నైట్రేట్‌ను సైతం పూర్తిస్థాయి ఉత్పత్తిగా రూపొందించనుంది. ఇక మరోవైపు కోల్ టు సింథటిక్ నేచురల్ గ్యాస్ ప్రాజెక్టు కోసం ఇంధన రంగ పీఎస్‌యూ గెయిల్‌తో రూ. 13,052 కోట్ల అంచనా వ్యయంతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సీఐఎల్ తెలియజేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-5-2024 ఫామ్ ధర...	
విశాఖ	500-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485-00
విజయవాడ	485-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	490-00
వరంగల్	492-00
రిటైల్ ధర	5.60

జీవీకే నష్టాలు పెరిగాయ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీవీకే పవర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నష్టాలు అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.85 కోట్ల నుంచి రూ.142 కోట్లకు ఎగశాయి. టర్నోవర్ రూ.204 కోట్ల నుంచి రూ.92 కోట్లకు పడిపోయింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,155 కోట్ల టర్నోవర్‌పై రూ.212 కోట్ల నికరలాభం ఆర్జించింది.

ఫలితాల నేపథ్యంలో షేరు ధర బీఎస్‌ఈలో మంగళవారం 1.01% క్షీణించి రూ.10.75 వద్ద స్థిరపడింది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

బీఎస్‌ఎఫ్‌లో 99 ఎస్‌ఐ, ఏఎస్‌ఐ పోస్టులు

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో పారా మెడికల్ స్టాఫ్ గ్రూప్–బి ఎస్‌ఐ(స్టాఫ్ నర్స్), గ్రూప్–సి ఏఎస్‌ఐ(ల్యాబ్ టెక్నీషియన్), ఏఎస్‌ఐ(ఫిజియోథెరపిస్ట్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 99
» **పోస్టుల వివరాలు:** ఎస్‌ఐ(స్టాఫ్ నర్స్)–14, ఏఎస్‌ఐ(ల్యాబ్ టెక్నీషియన్)–38, ఏఎస్‌ఐ (ఫిజియోథెరపిస్ట్)–47.
» **అర్హత:** పోస్టును అనుసరించి 10+2, డిగ్రీ, డిప్లొమా కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** ఏఎస్‌ఐ(ల్యాబ్ టెక్నీషియన్)కు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఏఎస్‌ఐ/ఫిజియోథెరపిస్ట్‌కు 20 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్‌ఐ(స్టాఫ్ నర్స్) పోస్టులకు 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు ఎస్‌ఐ(స్టాఫ్ నర్స్)కు రూ.35,400 నుంచి రూ.1,12,400, ఏఎస్‌ఐకు నెలకు రూ.29,200 నుంచి రూ.92,300 వేతనం లభిస్తుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, నాలెడ్జ్/ట్రేడ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.06.2024.
» **వెబ్‌సైట్:** https://rectt.bsf.gov.in

బీఎస్‌ఎఫ్‌లో వెటర్నరీ స్టాఫ్ పోస్టులు

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్‌ఎఫ్)లో వెటర్నరీ స్టాఫ్ గ్రూప్–సి(నాన్ గెజిటెడ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
» **పోస్టుల వివరాలు:** హెడ్ కానిస్టేబుల్(వెటర్నరీ)–04, కానిస్టేబుల్ (కెన్నెల్‌మ్యాన్)–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, వెటర్నరీ స్టాఫ్ అసిస్టెంట్ కోర్సు సర్టిఫికేట్‌తో పాటు పని అనుభవం ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు హెచ్‌సీకి రూ.25,500 నుంచి రూ.81,100, కానిస్టేబుల్‌కు రూ.21,700 నుంచి రూ.69,100.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:**19.05.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.06.2024.
» **వెబ్‌సైట్:** https://rectt.bsf.gov.in

బీఎస్‌ఎఫ్‌లో 37 ఎస్‌ఐ, కానిస్టేబుల్ పోస్టులు

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్‌ఎఫ్)లో ఎస్‌ఐ, కానిస్టేబుల్ గ్రూప్–బి, సి(నాన్ గెజిటెడ్ నాన్ మినిస్టీరియల్) పోస్టుల భర్తీకి అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 37
» **పోస్టుల వివరాలు:** ఎస్‌ఐ(వెహికల్ మెకానిక్)–03, కానిస్టేబుల్(ఓటీఆర్‌పీ)–01, కానిస్టేబుల్(ఎస్‌కేటీ)–01, కానిస్టేబుల్(ఫిట్టర్)–04, కానిస్టేబుల్(కార్పెంటర్)–02, కానిస్టేబుల్(ఏఈ)–01, కానిస్టేబుల్(వెహికల్ మెకానిక్)–22, కానిస్టేబుల్ (బీఎస్‌టీఎస్)–02, కానిస్టేబుల్(అప్‌హోల్‌స్టర్)–01.
» **అర్హత:** మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడులో ఐటీఐ, డిప్లొమా/డిగ్రీ(ఆటో మొబైల్ ఇంజనీరింగ్/ మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** గ్రూప్–బి పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. గ్రూప్–సి పోస్టులకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు గ్రూప్–బి పోస్టులకు రూ. 35,400 నుంచి రూ.1,12,400, గ్రూప్–సి పోస్టులకు రూ.21,700 నుంచి రూ.69,100.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ప్రాక్టికల్/ట్రేడ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**17.06.2024
» **వెబ్‌సైట్:** https://rectt.bsf.gov.in

ఐటీఐతో సత్వర ఉపాధి!

» ఏపీ, తెలంగాణల్లో ఐటీఐ ప్రవేశాలు ప్రారంభం
» పదో తరగతి అర్హతతో దరఖాస్తు అవకాశం
» కోర్సు పూర్తి చేసుకుంటే ఉపాధి ఖాయం
» దరఖాస్తులకు చివరి తేది: జూన్ 10

పదో తరగతి తర్వాత సత్వర ఉపాధికి మార్గం.. ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ (ఐటీఐ)! ఇవి అందించే కోర్సులు పూర్తి చేసుకుంటే.. సంబంధిత విభాగంలో ప్రాక్టికల్ నైపుణ్యాలు సొంతమవుతాయి. దీంతో తక్షణమే ఉపాధి పొందేందుకు వీలవుతుంది. ఐటీఐ కోర్సులతో ఉన్నత విద్య అవకాశాలు కూడా అందుకోవచ్చు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఐటీఐల్లో ప్రవేశ ప్రక్రియ మొదలైంది. ఈ నేపథ్యంలో.. ఏపీ, తెలంగాణల్లో ఐటీఐల్లో ప్రవేశాల వివరాలు, అవి అందించే ట్రేడ్స్, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కథనం..



తెలుగు రాష్ట్రాల్లోని ఐటీఐలు ఇంజనీరింగ్, నాన్–ఇంజనీరింగ్ విభాగాల్లో వివిధ కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సులను ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడులుగా పేర్కొంటారు. పదో తరగతి అర్హతతో సంవత్సరం, రెండేళ్ల వ్యవధితో కోర్సులను అందిస్తున్నారు. పలు ట్రేడుల్లో ఎనిమిదో తరగతితోనూ ప్రవేశం పొందే అవకాశముంది. అధికారిక గణాంకాల ప్రకారం–ఆంధ్రప్రదేశ్‌లో 82 ప్రభుత్వ, 428 ప్రైవేట్ ఐటీలు అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా తెలంగాణలో 63 ప్రభుత్వ ఐటీఐలు, 211 ప్రైవేట్ ఐటీఐలు ఉన్నాయి.

40కు పైగా ట్రేడ్స్

ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఐటీఐలు 40కు పైగా ట్రేడ్‌లు అందిస్తున్నాయి. వీటిలో నాన్–ఇంజనీరింగ్ విభాగంలో.. కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్ మేకింగ్, డ్రైవర్ కమ్ మెకానిక్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ, హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హాస్పిటల్ హౌస్ కీపింగ్, ఐటీ టెక్నీషియన్, రేడియాలజీ టెక్నీషియన్, సెక్రటేరియల్ ప్రాక్టీస్, స్యూయింగ్ టెక్నాలజీ, స్మార్ట్ ఫోన్ టెక్నీషియన్ కమ్ యాప్ టెస్టర్, స్టెనోగ్రాఫర్ అండ్ సెక్రటేరియల్ అసిస్టెంట్, డెంటల్ లేబరేటరీ ఎక్విప్‌మెంట్ టెక్నీషియన్ ట్రేడులు ఉన్నాయి.

ఇంజనీరింగ్‌లో ట్రేడ్స్ ఇవే

ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్/మెకానిక్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, ఫౌండ్రీమ్యాన్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్ (గ్రైండర్), మోటార్ వెహికిల్ మెకానిక్, ఆటో బాడీ పెయింటింగ్ మెకానిక్, ఆటో బాడీ రిపెయిర్ మెకానిక్, ఆటో ఎలక్ట్రీషియన్ అండ్ ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డీజిల్ మెకానిక్, జనరల్ పెయింటర్, ప్లాస్టిక్ ప్రాసెసింగ్ ఆపరేటర్, ప్లంబర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్, షీట్ మెటల్ వర్కర్, సోలార్ టెక్నీషియన్, టర్నర్, వెల్డర్, వైర్‌మ్యాన్ ట్రేడ్‌ల్లో ప్రవేశం కల్పిస్తున్నారు.

కోర్సుల వ్యవధి వేర్వేరుగా

ఐటీఐల్లో ఇంజనీరింగ్, నాన్–ఇంజనీరింగ్ ట్రేడ్‌లు అందుబాటులో ఉండగా.. వీటి కోర్సుల వ్యవధి వేర్వేరుగా ఉంది. అన్ని బ్రాంచ్‌లకు సంబంధించి ఆయా కోర్సుల వ్యవధి ఏడాది, రెండేళ్లుగా ఉంది.ఇంజనీరింగ్ ట్రేడ్‌లకు సంబంధించి మాత్రం ఎక్కువ శాతం రెండేళ్ల వ్యవధిలోనే ఉన్నాయి.

ప్రాక్టికల్ నైపుణ్యాలు

ఐటీఐల్లో క్రాఫ్ట్స్‌మెన్ ట్రైనింగ్ స్కీమ్, డ్యూయల్ సిస్టమ్ ఆఫ్ ట్రైనింగ్ విధానాల్లో శిక్షణనిస్తారు. దీంతో ఇండస్ట్రీకి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు సొంతం చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. నిర్దిష్ట వ్యవధిలో ప్రాక్టికల్ ట్రైనింగ్ అవకాశం కూడా కల్పిస్తారు. సాధారణంగా 70 శాతం సమయాన్ని ప్రాక్టికల్ ట్రైనింగ్‌కు, మిగతా 30 శాతాన్ని థియరిటికల్ ట్రైనింగ్ ఇచ్చేలా కరిక్యులం అమలు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే కోర్సు వ్యవధిలో దాదాపు మూడో వంతు లేదా సగం కంటే ఎక్కువగా సమయాన్ని క్షేత్ర నైపుణ్యాలు పొందేందుకు కేటాయిస్తున్నారు. దీంతో ఐటీఐ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయి.

ట్రేడ్ టెస్ట్‌కు అర్హత

ఐటీఐలలో ఆయా ట్రేడ్‌లలో కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులు నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ నిర్వహించే ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌కు హాజరయ్యే అర్హత లభిస్తుంది. ఈ ట్రేడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి సదరు కంపెనీల్లో అప్రెంటీస్ నియామకాల్లో ప్రాధాన్యం ఉంటుంది. ఇంజనీరింగ్ ట్రేడ్‌లకు సంబంధించి ట్రేడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణతను కొన్ని సంస్థలు తప్పనిసరి చేస్తున్నాయి. కాబట్టి ఐటీఐ ఉత్తీర్ణులయ్యాక ట్రేడ్ టెస్ట్‌లోనూ విజయం సాధిస్తే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

అప్రెంటిస్

ఐటీఐ పూర్తి చేసుకున్న వారు జాతీయ స్థాయిలో అమలవుతున్న నేషనల్ అప్రెంటీస్ ప్రమోషన్ స్కీమ్‌కు కూడా అర్హత పొందుతారు. ఎన్‌ఏపీఎస్ పోర్టల్‌లో తమ పేరు, అర్హతలు, ట్రేడ్ వివరాలు నమోదు చేసుకుంటే.. అప్రెంటీస్ ట్రైనీ నియామకాలు చేపట్టే సంస్థలు అప్రెంటీస్ ట్రైనీగా ఎంపిక చేసుకుంటాయి. అప్రెంటీస్ శిక్షణ సమయంలో నెలకు గరిష్టంగా రూ.9వేల వరకు స్టయిఫండ్ పొందొచ్చు. శాశ్వత ఉద్యోగుల సంఖ్య 30 మంది ఉన్న సంస్థలు అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకునే విధంగా ఎన్‌ఏపీఎస్ విధానాలను రూపొందించారు. దీంతో ఐటీఐ పూర్తి చేసుకున్న వారికి అప్రెంటీస్ అవకాశాలు లభిస్తున్నాయి.

ఉద్యోగ సాధనలో ముందంజ

ఐటీఐ పూర్తి చేసుకున్న వారు ఉద్యోగ సాధనలోనూ ముందుంటున్నారనేది ఇండస్ట్రీ వర్గాల అభిప్రాయం. ఇంజనీరింగ్ ట్రేడ్‌లు ఉత్తీర్ణులైతే టెక్నీషియన్స్, ఫ్లోర్‌మెన్ ఉద్యోగాలు లభిస్తాయి. వీరికి నెలకు రూ.20 వేల వరకూ వేతనం అందుతోంది. కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ అండ్ సెక్రటేరియల్ అసిస్టెంట్ వంటి నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్‌లు పూర్తి చేసుకున్న వారికి చిన్న, మధ్య తరహా సంస్థల్లో ఆఫీస్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి.

సర్కారీ కొలువులు

ఐటీఐ పూర్తి చేసుకున్న వారు సర్కారీ కొలువులూ సొంతం చేసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలకు పోటీ పడే అవకాశముంది. ముఖ్యంగా రైల్వేలో టెక్నికల్ విభాగంలో అసిస్టెంట్ లోకో పైలట్, ఇతర టెక్నికల్ విభాగాల్లో టెక్నీషియన్ గ్రేడ్–3 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. నవరత్న, మహారత్న, మినీరత్న హోదా కలిగిన ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా టెక్నీషియన్ కొలువులు దక్కించుకోవచ్చు. రాష్ట్ర స్థాయిలో జూనియర్ లైన్‌మెన్, డిప్యూటీ సర్వేయర్ కొలువులతో పాటు విద్యుత్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

స్వయం ఉపాధి

ఐటీఐ పూర్తి చేసుకున్న వారు స్వయం ఉపాధి కూడా పొందొచ్చు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ వంటి ట్రేడ్‌లు ఉత్తీర్ణులైన అభ్యర్థులు సొంతంగా వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించుకునే అవకాశం ఉంది. ఈ ట్రేడ్‌ల అభ్యర్థులు సొంతంగా యూనిట్స్ ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందడంతోపాటు మరికొందరికి ఉపాధి కల్పించొచ్చు.

ప్రవేశాలు ఇలా

ఏపీ, తెలంగాణలోని ఐటీఐలలో.. ప్రవేశాల కోసం అభ్యర్థులు నిర్దేశిత వెబ్‌సైట్‌లో లాగిన్ ఐడీ క్రియేట్ చేసుకోవాలి. ఆ తర్వాత ఆన్‌లైన్ అప్లికేషన్‌ను పూర్తి చేయాలి. ఈ అప్లికేషన్‌ను పూర్తి చేసే సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న ట్రేడ్‌లు, ఐటీఐలను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది. వీటి ఆధారంగా అభ్యర్థులకు సీటు కేటాయిస్తారు. సీటు పొందిన అభ్యర్థులు నిర్దేశిత తేదీలోపు సంబంధిత ఐటీఐలో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- ఏపీ ఐటీఐల్లో దరఖాస్తు చివరి తేదీ: 2024, జూన్ 10
- తెలంగాణ ఐటీఐల్లో దరఖాస్తు చివరి తేదీ: 2024 జూన్ 10
- ఏపీ ఐటీఐ ప్రవేశాలకు వెబ్‌సైట్: https://itiadmissions.ap.gov.in/iti
- తెలంగాణ ఐటీఐ ప్రవేశాలకు వెబ్‌సైట్: https://tsiti.ucanapply.com

క్లుప్తంగా...

అయోధ్య బాలరామునికి పెడన కలంకారి వస్త్రాలు



బాలరాముని వద్ద స్వామి వారికి అలంకరించిన ఎరుపు రంగులోని కలంకారి వస్త్రం

పెడన: అయోధ్య బాలరాముని ఆలయానికి కృష్ణా జిల్లా పెడన నుంచి సహజ సిద్ధ కలంకారి వస్త్రాలను పంపించగా వాటిని మంగళవారం అలంకరించినట్లు పెడన కోరమండల్ కలంకారి వస్త్ర సంస్థ యాజమాని పిచ్చుక వరుణ్ కుమార్ మంగళవారం తెలిపారు. అయోధ్య బాలరాముని ఆలయానికి చెందిన డిజైనర్ సహజ సిద్ధ కలంకారి వస్త్రాలు కావాలని కోరడంతో ఇటీవల ఆల్ ఆవర్, ఫ్లోరల్ డిజైన్‌తో రూపొందించిన ఎరుపు వస్త్రాన్ని పంపించామన్నారు. 10.5 మీటర్ల వస్త్రాన్ని స్వామి వారికి అలంకరించి ఆలయ వర్గాలు ఫొటోలు పంపించారని తెలిపారు. సోమవారం తెలుపు, మంగళవారం ఎరుపు, బుధవారం ఆకుపచ్చ, గురువారం పసుపు, శుక్రవారం క్రీమ్ కలర్, శనివారం నీలం, ఆదివారం పింకు రంగులలోని వస్త్రాలను కావాలని సూచించారని, ప్రస్తుతం ఎరుపు రంగు వస్త్రాన్ని డిజైన్ చేసి పంపించామన్నారు. మిగిలిన రంగులలో వస్త్రాలను కూడా త్వరలోనే పంపుతామన్నారు. డాక్టర్ వైఎస్సార్ లైఫ్ ఎచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత పిచ్చుక శ్రీనివాసరావు కుమారుడినయిన తనకు ఈ అవకాశం రావడం స్వామి అనుగ్రహమని వరుణ్ కుమార్ తెలిపారు.

మెగాస్టార్ చిరంజీవికి గోల్డెన్ వీసా



సాక్షి, హైదరాబాద్: ఇటీవలే పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్న సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి మరో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) గోల్డెన్ వీసాను అందుకున్నారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి యూఏఈ ప్రభుత్వం ఈ వీసాను అందిస్తుంది. తాజాగా దీన్ని అందుకున్న సినీ ప్రముఖుల లిస్ట్‌లో చిరంజీవి చేరారు.

30న ఏపీ ఈసెట్ ఫలితాలు

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) ఆధ్వర్యంలో ఈ నెల 8న నిర్వహించిన ఏపీ ఈసెట్ ఫలితాలు ఈ నెల 30న విడుదల చేయనున్నట్లు సెట్ చైర్మన్ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు, కన్వీనర్ ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రా రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఫైనల్ 'కీ'ని ఏపీ ఈసెట్ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. తుది 'కీ' ప్రకారం ఫలితాలను సిద్ధం చేశామన్నారు.

రేవ్ పార్టీ కేసులో నటి హేమకు మరోసారి నోటీసు

శివాజీనగర: ఇటీవల బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో పాల్గొన్న తెలుగు నటి హేమకు సీసీబీ పోలీసులు మరో నోటీసు జారీ చేశారు. సోమవారం విచారణకు రావాలని మొదటిసారి నోటీసు పంపగా, జ్వరం వచ్చినందున రాలేనని హేమ తెలిపారు. మంగళవారం రెండో నోటీస్ ఇచ్చి విచారణకు రమ్మని చెప్పారు. రేవ్ పార్టీ ఏర్పాటు చేసిన వాసు, అరుణ్, సిద్ధికి, నాగబాబుతో పాటుగా ఐదుగురికి మే 27న 10 రోజుల పాటు పోలీస్ కస్టడీకి కోర్టు ఆదేశించింది. దీంతో మంగళవారం నుంచి వారిని సీసీబీ విచారణ చేపట్టింది. రేవ్ పార్టీ, డ్రగ్స్ సరఫరా వెనక ఉన్న వారిని తెలుసుకునే లక్ష్యంగా వీరిని పోలీసులు ప్రశ్నించనున్నారు.

ప్రజాభవన్‌లో బాంబు కలకలం

తెలంగాణ

హైదరాబాద్: 'ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇంట్లో బాంబు పెట్టాం.. మరో కొద్దిసేపట్లో అది పేలబోతుంది..' అంటూ ఒక అగంతకుడు పోలీస్ కంట్రోల్‌రూం డయల్ 100కు ఫోన్ చేసి చెప్పడంతో పోలీసులు ఒక్కసారిగా ఉరుకులు పరుగులు పెట్టారు. సుమారు నాలుగు గంటలపాటు మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ మొత్తం తనిఖీ చేసి ఎలాంటి బాంబు లేదని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. మంగళవారం మధ్యాహ్నం 12.06 నిమిషాలకు పోలీస్ కంట్రోల్‌రూం 100కు ఓ అగంతకుడు ఫోన్ చేసి ప్రజాభవన్‌లోని మల్లు భట్టి విక్రమార్క ఇంటివద్ద బాబు పెట్టామని ఫోన్ చేశాడు. కంట్రోల్‌రూం సిబ్బంది 12.15కు పంజాగుట్ట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అణువణువూ తనిఖీ చేశారు. మల్లు భట్టివిక్రమార్క ఇంటితోపాటు మంత్రి సీతక్క ఇంటిని, పరిసరప్రాంతాలను సైతం చెక్ చేశారు. ఎక్కడా ఏమీ లేకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

వజ్రాన్వేషణ

తొలకరి మొదలు కాకుండానే పొలాల వైపు ఆశావహుల పరుగులు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: కర్నూలు, అనంతపురం జిల్లాల సరిహద్దుల్లో వజ్రాల నిక్షేపాలు ఉన్నాయనే విషయాన్ని జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) గుర్తించింది. కర్నూలు జిల్లా తుగ్గలి, మద్దికెర మండలాల్లోని తుగ్గలి, జొన్నగిరి, పగిడిరాయి, కొత్తపల్లి, పెరవలి, అగ్రహారం, హంప, యడవలి, మద్దికెరతోపాటు అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలంలోని గంజికుంట, తట్రకల్లు, రాగులపాడు, పొట్టిపాడు, కమలపాడు, గూళపాళ్యం, ఎన్ఎంపీ తండా గ్రామాల్లో తరచూ వజ్రాలు లభ్యమవుతున్నాయి. ఈ ప్రాంతంలోని భూమి పొరల్లో కింబర్‌లైట్ పైప్‌లైన్ ఉందని గనులు భూగర్భ శాఖ నిర్ధారించింది. ఈ నేపథ్యంలోనే తొలకరి జల్లులు కురిసే జూన్‌లో తుగ్గలి, మద్దికెర మండలాల్లో వజ్రాల అన్వేషణ కొన్నేళ్లుగా ముమ్మరంగా సాగుతోంది. ఈ ఏడాది మే మొదటి వారంలోనే వర్షాలు కురిశాయి. ఆ వెంటనే వజ్రాన్వేషణ మొదలైంది. ఈ ప్రాంతంలోని పొలాలన్నీ జనంతోనే నిండిపోయాయి. కర్నూలు, నంద్యాలతో పాటు అనంతపురం, కడప, చిత్తూరు, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి వజ్రాన్వేషకులు తరలివచ్చారు. ఒక్కొక్కరు వారం, పది, పదిహేను రోజులపాటు ఇక్కడే మకాం వేస్తున్నారు. ఓ వైపు వజ్రాల కోసం జనాలు పొలాల్లో తిరుగుతుంటే.. వజ్రాన్వేషకులు తిరగడం వల్ల పొలం గట్టిబారి వ్యవసాయానికి ఇబ్బందిగా ఉంటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు తమ పొలాల్లోకి ఎవరూ రావొద్దని విజ్ఞప్తి బోర్డులు తగిలిస్తున్నారు.




జొన్నగిరి సమీపంలోని పొలాల్లో వజ్రాల వేట

ఈ ఏడాది లభ్యమైన వజ్రాల వివరాలు

- ఈ నెల 8న చెన్నంపల్లిలో రూ.3.96 లక్షల విలువ చేసే వజ్రం లభించింది.
- మే 20న రామాపురంలో రూ.50 వేల విలువైన వజ్రం దొరికింది.
- మే 21న మద్దికెర మండలం మదనంతపురంలో రూ.6.50 లక్షల విలువైన వజ్రం లభ్యమైంది.
- మే 22న ఇదే గ్రామంలో దొరికిన వజ్రాన్ని రూ.18 లక్షలు, 10 తులాల బంగారం చెల్లించి వ్యాపారి కొనుగోలు చేశారు.
- మే 23న జొన్నగిరిలో రూ.15 వేలు, పగిడిరాయిలో రూ.12 వేల విలువ చేసే వజ్రాలు లభించాయి.
- మే 24న జొన్నగిరిలో దొరికిన వజ్రాన్ని రూ.6.20 లక్షలు నగదు, 5 తులాల బంగారం ఇచ్చి కొనుగోలు చేశారు.
- మే 25న జొన్నగిరిలో దొరికిన వజ్రాన్ని రూ.1.20 లక్షల నగదు, జత కమ్మలు ఇచ్చి కొనుగోలు చేశారు.
- తాజాగా తుగ్గలి మండలం గుండాలతండాకు చెందిన వ్యక్తికి మంగళవారం ఓ వజ్రం లభ్యమైంది. స్థానిక వజ్రాల వ్యాపారి రూ.లక్ష నగదు, అర తులం బంగారం ఇచ్చి దానిని కొనుగోలు చేశారు.

ఐదోసారి వచ్చా



వానొస్తే మా ఊరోళ్లంతా రైలెక్కి గుత్తిలో దిగి జొన్నగిరికి వస్తాం. నేను ఇక్కడికి ఐదేళ్ల నుంచి వస్తున్నా. వచ్చి వారమైంది. ఐదేళ్లలో ఒక్క వజ్రం కూడా దొరకలేదు. తిండీ తిప్పలకు ఇబ్బందిగా ఉంది. మాతో పాటు వచ్చిన కొంతమందికి వజ్రాలు దొరుకుతున్నాయి. మాకు ఆశ చావక వెతుకుతున్నాం.

– ఈరయ్య, రామాపురం, వినుకొండ, పల్నాడు జిల్లా

వజ్రాన్ని గుర్తు పడతాం



మాది కలికిరి. హైదరాబాద్‌లోని స్నేహితుడు, నేను కలిసి మూడు రోజుల క్రితం ఇక్కడికి వచ్చాం. దొరికితే వజ్రం. లేదంటే కాలక్షేపంగా ఉంటుందని వచ్చాం. మేం బంగారం నగలు తయారు చేస్తాం. వజ్రం ఎలా ఉంటుందో సులువుగా గుర్తుపడతాం.

– రామాంజులాచారి, కలికిరి, అన్నమయ్య జిల్లా

ఒక చిన్న వజ్రం దొరికినా చాలు



మా ఊళ్లో పనుల్లేవు. వజ్రాలు దొరికాయని పేపర్లు, టీవీల్లో వచ్చింది. ఖాళీగా ఉండలేక ఇక్కడికి వచ్చాం. నాతో పాటు మా ఊరోళ్లు పదిమంది వచ్చారు. వజ్రాలు వెతుకుతున్నాం. కొన్ని రాళ్లు మెరుస్తున్నాయి. అవి వజ్రాలు కాదంటున్నారు. కొద్దిరోజులు చూస్తాం. చిన్న వజ్రం దొరికినా కష్టం తీరకపోతుందా అనే ఆశతో చూస్తున్నాం.

– లక్ష్మక్క, గార్లదిన్నె మండలం, అనంతపురం జిల్లా

ఇతర దేశాలతో పోలిస్తే నాణ్యమైన వజ్రాలు

వజ్రాల మైనింగ్ కోసం వజ్రకరూర్‌లో వజ్రాల ప్రక్రమణ కేంద్రాన్ని 1969లో ఏర్పాటు చేశారు. వజ్రాన్వేషణపై ఇది పెద్దగా దృష్టి సారించలేదు. ఆ తర్వాత ఓ ఆస్ట్రేలియన్ కంపెనీ వచ్చి కొద్దికాలం పాటు సర్వే చేసి తిరిగి వెళ్లింది. ఆఫ్రికాతో పాటు చాలా దేశాలతో పోలిస్తే ఇక్కడి వజ్రాలు చాలా నాణ్యమైనవి, విలువైనవి. అందుకే వీటి వెలికితీతపై ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.

వజ్రాలు ఎలా లభ్యమవుతాయంటే..

మన దేశంలో డైమండ్ మైనింగ్ మధ్యప్రదేశ్‌లోని పన్నాలో ఉంది. అక్కడ భూమిలోని రాళ్లను తవ్వితీసి వజ్రాల తయారీ ప్రక్రియ చేపడతారు. వజ్రకరూర్, తుగ్గలి, జొన్నగిరి ప్రాంతాల్లోని భూగర్భంలో 150 మీటర్ల లోతున వజ్రాలు ఉంటాయి. భూమిలో వాతావరణ మార్పులు జరిగినప్పుడు అవి బయటకు వస్తాయి. ఆ తర్వాత వెదరింగ్ (వికోశీకరణ) వల్ల అంటే ఎండకు ఎండి, వర్షానికి తడిసి పగిలిపోతాయి. వర్షాలు, వరదలు వచ్చినపుడు ఆ రాళ్ల ముక్కలు పొలాల్లో అక్కడక్కడా దొరుకుతుంటాయి. వాగులు, వంకల ద్వారా కూడా వజ్రాలు నీటిలో కొట్టుకుని ఇతర ప్రాంతాలకు చేరతాయి. అలా చెల్లాచెదురైన వజ్రాలే ఇప్పుడు కర్నూలు, అనంతపురం జిల్లాల్లో లభిస్తున్నాయి.

'సీమ'లో ఏజెంట్ల తిష్ట

వర్షాకాలం వస్తే జనాలు ఎలా తరలివస్తారో.. వజ్రాల వ్యాపారులు కూడా గుత్తి, గంతకల్లు, జొన్నగిరి, పెరవలిలో మకాం వేసి వజ్రాల కొనుగోలుకు ప్రయత్నిస్తారు. ఇందుకోసం వజ్రాలు లభ్యమయ్యే గ్రామాల్లో ఏజెంట్లను సైతం నియమించుకుంటున్నారు. వజ్రం దొరికిందనే సమాచారం వస్తే ఏజెంట్లు వాలిపోతారు. వజ్రం దొరికిన వారిని వ్యాపారుల వద్దకు తీసుకెళ్లి రేటు కుదురుస్తారు. వజ్రం విలువైనదైతే వ్యాపారులే వారి వద్దకు వెళ్తారు. వ్యాపారుల మధ్య పోటీ పెరిగితే బహిరంగ వేలం వేస్తారు. వజ్రం నాణ్యత (క్యారెట్)ను బట్టి రూ.20 వేల నుంచి రూ.20 లక్షల వరకు కొనుగోలు చేస్తారు. జిల్లా చరిత్రలో 2022లో లభించిన 30 క్యారెట్ల వజ్రమే అత్యంత విలువైంది. ఈ ఏడాది ఇప్పటికే 9 వజ్రాలు లభ్యమయ్యాయి. గతేడాది సరైన వర్షాలు లేవు. అయినప్పటికీ 18 వజ్రాలు దొరికాయి. ఇక్కడ వజ్రాలను స్థానిక వ్యాపారులకే విక్రయిస్తారు. ఇక్కడి వ్యాపారులు అంత నమ్మకం సాధించారు. చెప్పిన ధర చెప్పినట్టు ఇస్తారు. అదే ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇస్తే దానిని స్వాధీనం చేసుకుని పైసా కూడా ఇవ్వరనే అభిప్రాయంతో వారు అధికారులకు చెప్పకుండా విక్రయిస్తారు.

విదేశాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు

ఆఫ్రికా, అంగోలా, కాంగోతో పాటు చాలా దేశాల్లో ఇదే తరహాలో వజ్రాలు లభిస్తాయి. వాటిని అల్యూవియల్ డైమండ్స్ అంటారు. అక్కడ ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. వజ్రాలు లభించిన వారు నేరుగా ఆ కేంద్రానికి వచ్చి చూపిస్తారు. వజ్రాల నాణ్యత ఆధారంగా కొంత మొత్తం చెల్లిస్తారు. వజ్రాలను లీగల్‌గా ప్రభుత్వం ప్రక్రియను పూర్తి చేసి విక్రయిస్తుంది. కర్నూలు జిల్లాలో ఏటా సగటున 50–60 వజ్రాలు లభిస్తున్నాయి. అలాగే వజ్రకరూరు ప్రాంతంలో కూడా ఏటా 30–40 వజ్రాలు లభిస్తాయి. అంటే ఈ రెండు జిల్లాల్లో ఏటా వంద వజ్రాలు లభిస్తున్నాయి. మైనింగ్ చేస్తే రూ.వందల కోట్ల విలువైన సంపద ప్రభుత్వానికి లభించే అవకాశం ఉంది.

రోహిణి తీవ్రత లేనట్టే!

- మూడు రోజులు స్వల్పంగా పెరగనున్న ఉష్ణోగ్రతలు
- వడగాడ్పులకు ఆస్కారం లేదంటున్న ఐఎండీ
- గంటకు 30–40 కి.మీల వేగంతో పశ్చిమ గాలులు

సాక్షి, విశాఖపట్నం: రోహిణి కార్తె వేళ రోళ్లు పగిలే ఎండలు కాస్తాయన్న నానుడి ఎప్పట్నుంచో ఉంది. ఈ కార్తె వస్తోందంటేనే జనం బెంబేలెత్తి పోయే పరిస్థితి ఉంటుంది. ఈ ఏడాది ఎండలు, వడగాడ్పుల తీవ్రత ఏప్రిల్ నుంచే మొదలవడంతో రోహిణి కార్తె ప్రవేశిస్తే ఇంకెంతలా ఉష్ణతాపం పెరిగిపోతుందోనని అందరిలోనూ ఆందోళన నెలకొంది. ఈ ఏడాది రోహిణి కార్తె ఈనెల 25న ప్రవేశించింది. ఆ సమయానికి బంగాళాఖాతంలో 'రెమాల్' తుపాను కొనసాగుతుండడంతో రోహిణి తీవ్రత కనిపించ లేదు. మరోవైపు రాష్ట్రంలో తుపాను ప్రభావంతో ఏర్పడిన గాలిలో కొద్దిపాటి తేమ ఇంకా ఉంది. అలాగే ప్రస్తుతం రాష్ట్రంపైకి గంటకు 30–40 కి.మీల వేగంతో పశ్చిమ గాలులు వీస్తున్నాయి. ఫలితంగా ఇవి భానుడి ప్రతాపాన్ని అదుపు చేస్తున్నాయి. ఉష్ణోగ్రతలు నియంత్రణలో ఉంటున్నాయి. వాస్తవానికి రోహిణి కార్తె రోజుల్లో ఉష్ణోగ్రతలు 42–46 డిగ్రీల మధ్య నమోదవుతాయి. దీంతో పలు చోట్ల వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులు వీస్తాయి. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల లోపే రికార్డవుతున్నాయి. ఇవి సాధారణంకంటే 2–3 డిగ్రీలు మాత్రమే అధికం. రానున్న మూడు రోజులు కూడా దాదాపు ఇవే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ఉష్ణోగ్రతలు స్వల్పంగానే పెరగడం వల్ల వడగాడ్పులు గాని, తీవ్ర వడగాడ్పులు కూడా వీచే పరిస్థితులు లేవని చెబుతున్నారు. భారత వాతావరణ విభాగం కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. పశ్చిమ గాలుల ప్రభావంతో ఈదురు గాలులు వీస్తున్నాయని, నెలాఖరు వరకు వడగాడ్పులకు ఆస్కారం లేదని వెల్లడించింది. రోహిణి కార్తె ఎండలపై భీతిల్లుతున్న రాష్ట్ర ప్రజలకు ఇది ఊరటనివ్వనుంది.

సీమలో పిడుగుల వాన..

మరోవైపు దక్షిణ తమిళనాడు, పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. నెలాఖరు వరకు రాయలసీమలోని అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మిగిలిన ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొంది.

మొక్కుబడిగా ఎన్టీఆర్ జయంతి

- కేవలం ఎక్స్ సందేశంతో సరిపెట్టిన చంద్రబాబు
- ఇప్పటికే ఓటమి భయంతో మహానాడు రద్దు
- నేడు విదేశాల నుంచి తిరిగి రానున్న చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ఎన్టీఆర్ నామస్మరణ చేయడం, ఆ తర్వాత ఆయన ఊసే ఎత్తకపోవడం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఎన్టీఆర్ అల్లుడు చంద్రబాబుకు అలవాటే. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీని చేజిక్కించుకున్న చంద్రబాబు నాయుడు.. ఆ తర్వాత అవసరం వచ్చినప్పుడల్లా ఎన్టీఆర్ పేరును ప్రజల ముందుకు తెస్తూ తన అవసరాలు తీర్చుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికీ చంద్రబాబుది అదే తీరు అని ఎన్టీఆర్ జయంతి సందర్భంగా చంద్రబాబు, ఆయన పార్టీ వ్యవహరించిన తీరు విస్పష్టంగా చెబుతోంది. ఎన్నికలు అయిపోవడంతో ఇక చంద్రబాబుకు, టీడీపీకి ఎన్టీఆర్ అవసరం తీరిపోయింది. మంగళవారం తెలుగుప్రజలంతా ఎన్టీఆర్ జయంతిని జరుపుకోగా, చంద్రబాబు, టీడీపీ నేతలు మాత్రం మొక్కుబడిగా మమ అనిపించారు. చంద్రబాబు ఎక్స్ (ట్విటర్)లో ఓ మెసేజ్ పెట్టి చేతులు దులుపుకోగా, టీడీపీ ప్రధాన కార్యాలయంలో కొందరు నాయకులు తూతూమంత్రంగా ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి అయిపోందనిపించారు. ఈసారి ఎన్నికల్లోనూ టీడీపీకి ప్రజలు గట్టి దెబ్బ కొట్టారన్న విషయం ఆ పార్టీ నేతలందరికీ అర్థమైపోయింది. గెలుస్తామంటూ పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా, లోలోన మాత్రం వారిని ఓటమి భయం వెంటాడుతోంది. లోకేశ్‌ను పార్టీ అధ్యక్షుడిగా చేయాలని బుద్దా వెంకన్న డిమాండ్ చేయడం కూడా ఈ భయం నుంచే వచ్చినట్లు తెలుస్తోంది. చంద్రబాబు వయసును దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తుపై భయంతోనే వెంకన్న ఆ డిమాండ్ చేసినట్లు చెబుతున్నారు. ఇప్పుడు ఎన్టీఆర్ జయంతిని కూడా పెద్దగా పట్టించుకోకపోవడానికి అదే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మహానాడు రద్దు వెనుక !

నిజానికి ఎన్టీఆర్ జయంతి సందర్భంగానే ప్రతి సంవత్సరం టీడీపీ మహానాడు నిర్వహిస్తారు. ఈసారి దాన్ని కూడా రద్దు చేశారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో తెలియక రద్దు చేసినట్లు ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. గెలుపుపై ధీమా ఉంటే మహానాడు నిర్వహించి ఉండేవారు. కానీ, ఓటమి తప్పదని తేలడం వల్లే మహానాడు నిర్వహించలేదని స్పష్టమవుతోంది. మహానాడు గురించి అధికారికంగా ఒక్క మాట కూడా టీడీపీ చెప్పలేదు. మహానాడు నిర్వహించకపోగా ఎన్టీఆర్ జయంతిని కూడా మొక్కుబడిగా చేశారు. మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో చాలా పేలవంగా జయంతి కార్యక్రమం నిర్వహించారు. దానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఇతర సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు వంటి వారెవరూ హాజరు కాకపోవడాన్ని బట్టి అది ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. జనాదరణ కోల్పోవడంతో సీటు దక్కించుకోలేక కార్యాలయానికి పరిమితమైన దేవినేని ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో తూతూమంత్రంగా జయంతి నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌లో బాలకృష్ణ, పురందేశ్వరి తప్ప టీడీపీ కీలక నాయకులు ఎవరూ నివాళులు అర్పించలేదు.

నేడు చంద్రబాబు హైదరాబాద్ రాక

మహానాడు రద్దు, ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఎన్టీఆర్ జయంతిని కూడా పట్టించుకోకపోవడం, అదే సమయంలో చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ ఎవరికీ తెలియకుండా రహస్యంగా విదేశాల్లో తిరుగుతుండడం టీడీపీలోనే చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల్లో ఓడిపోతామనే ఆందోళనతోనే చంద్రబాబు ఎవరికీ అందుబాటులో లేకుండా, కనీసం కోర్టు అనుమతి కూడా తీసుకోకుండా రహస్యంగా విదేశీ పర్యటనకు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఈనెల 18వ తేదీ అర్ధరాత్రి ఆయన ఎవరికీ తెలియకుండా హైదరాబాద్ నుంచి విదేశీ పర్యటనకు బయల్దేరారు. స్కిల్ డెవలప్‌మెంట్ సహా పలు అవినీతి కేసుల్లో నిందితుడిగా ఉన్న బాబును హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకోవడంతో ఆయన విదేశాలకు వెళుతున్న విషయం బయటకు వచ్చింది. కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళుతుండడంపై వివరణ కోరడంతో మూడు గంటలు ఎయిర్‌పోర్టులోనే ఉండిపోయారు. ఆయన తరుపున న్యాయవాదులు సుదీర్ఘంగా వివరణ ఇచ్చిన తర్వాత చంద్రబాబు విదేశాలకు వెళ్లడానికి అధికారులు అనుమతించారు. ఆయన ఎక్కడికి వెళ్లారనే విషయాన్ని అత్యంత గోప్యంగా ఉంచడం చర్చనీయాంశమైంది. దుబాయ్, ఇటలీ, అమెరికా దేశాల్లో ఆయన పర్యటించినట్లు తెలుస్తోంది. బుధవారం ఆయన అమెరికా నుంచి హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు.

ఘన నివాళులు





ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్, ఎన్టీఆర్ సతీమణి నందమూరి లక్ష్మీపార్వతి తదితరులు

వాట్సాప్‌లో ఫొటోలు.. ముహూర్తం రోజున డెలివరీ..

- చిన్నారులను విక్రయించే ముఠా అరెస్టు
- 11 మంది మధ్యవర్తులకు రిమాండ్
- 16 మంది చిన్నారులను కాపాడిన రాచకొండ కాప్స్
- ఢిల్లీ, పుణే కేంద్రంగా దందా.. ఏపీ, తెలంగాణలో విక్రయం
- డిమాండ్‌ను బట్టి రూ.1.80–5.50 లక్షల వరకు..



సాక్షి, హైదరాబాద్: పాలుతాగే పసికందులను అపహరించి, విమానాలు, రైళ్లలో రాష్ట్రాలు దాటించి పిల్లలు లేని దంపతులకు విక్రయిస్తున్న అంతర్ రాష్ట్ర ముఠా ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. ఫెర్టిలిటీ సెంటర్లు, ఆస్పత్రులు, క్లినిక్‌లలో పనిచేసే ఫోర్త్‌క్లాస్ ఉద్యోగులను ఏజెంట్లుగా పెట్టుకొని, దంపతుల సమాచారం సేకరించి, మధ్యవర్తుల సహాయంతో ఐదేళ్లుగా ఈ అక్రమ దందా సాగుతోంది. ఢిల్లీ, పుణే నగరాల్లో రోజుల శిశువులను ఎత్తుకొచ్చి.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విక్రయిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఒక్క పసికందును రూ.1.80 లక్షల నుంచి రూ.5.50 లక్షల చొప్పున అమ్మేస్తున్నారు. ఈ ముఠాలో కీలకంగా వ్యవహరించిన 11 మంది మధ్యవర్తులను రాచకొండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలను మల్కాజ్‌గిరి డీసీపీ పీవీ.పద్మజ, శిశు సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) అధికారులతో కలిసి రాచకొండ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి మంగళవారం మీడియాకు వెల్లడించారు.

- ఈనెల 22న పీర్జాదిగూడలో మూడు నెలల పాపను విక్రయిస్తుండగా మేడిపల్లి పోలీసులు స్థానిక ఆర్ఎంపీ శోభారాణితోపాటు స్వప్న, షేక్ సలీంలను అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితులను విచారించగా వీరి తరహాలోనే ఏపీ, తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన మరో 8 మంది మధ్యవర్తుల పాత్ర వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు కేసును రివర్స్ ఇన్వెస్టిగేషన్ చేశారు. అన్నోజిగూడకు చెందిన బండారి హరిహర చేతన్– బండారి పద్మ, కుషాయిగూడకు చెందిన యాట మమత, ఉప్పుగూడకు చెందిన ముధావత్ రాజు, విజయవాడకు చెందిన బలగం సరోజ, ముధావత్ శారద, ముంతాజ్, జగన్నాథం అనురాధలను పట్టుకున్నారు.
- ఈ మధ్యవర్తుల సహాయంతో ఢిల్లీకి చెందిన కిరణ్, ప్రీతి, పుణేకు చెందిన కన్నయ్యలు తెలుగు రాష్ట్రాల్లో సంతానం లేని దంపతులకు పిల్లలను విక్రయిస్తున్నారు. ఐదేళ్లలో 60 మంది శిశువులను విక్రయించారు. తాజా కేసులో 16 మంది పిల్లలను విక్రయానికి పెట్టగా.. ఏడుగురిని ఏపీ, 9 మందిని తెలంగాణకు చెందిన దంపతులు కొనుగోలు చేశారు. మధ్యవర్తులను విచారించిన పోలీసులు 16 మంది చిన్నారులను కాపాడారు. శిశువిహార్‌కు తరలించారు. వీరిలో 12 మంది అమ్మాయిలు, నలుగురు అబ్బాయిలు

ముహూర్తం చెబితే పిల్లాడు డెలివరీ

వాట్సాప్, టెలిగ్రాం వంటి సామాజిక మాధ్యమాలలో పిల్లల ఫొటోలు పంపిస్తారు. శిశువుల రంగు, ముఖ కవళికలను బట్టి ఎంపిక చేసుకుంటారు. ఫలానా ముహూర్తానికి పిల్లాడు కావాలని చెబితే చాలు ఆ సమయానికే పిల్లాడిని తీసుకొచ్చి అప్పగిస్తారు. రోజుల వయస్సున్న శిశువులనే దంపతులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఎందుకంటే ఆ వయసులో అయితేనే తనకు పుట్టిన బిడ్డగా, పిల్లలకు కూడా వీరే సొంత తల్లిదండ్రులని భావిస్తారు.

పిల్లలకు దూరం చేయకండి

పిల్లలను రెస్క్యూ హోంకు తరలిస్తుండగా అప్పటివరకు పెంచి పోషించిన తల్లిదండ్రులు తమ పిల్లలను దూరం చేయొద్దంటూ రాచకొండ కమిషనరేట్ ముందు అడ్డుపడ్డారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు తల్లిదండ్రులను మేడిపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఓ దంపతులను 'సాక్షి' పలకరించగా.. పెళ్లై 12 ఏళ్లు అయినా పిల్లలు కలగలేదని, ఎన్ని ఆస్పత్రులు తిరిగినా లాభం లేకపోవడంతో ఆఖరికి దిక్కుతోచని స్థితిలో రెండున్నర ఏళ్ల క్రితం ఆరు రోజుల పసికందును కొనుగోలు చేశామని రావులపాలెంకు చెందిన ఓ జంట తెలిపారు. రూ.3.5 లక్షలు ఖర్చు చేసి 21వ రోజును ఘనంగా చేశామన్నారు. రూ.కోట్లాది ఆస్తిపాస్తులను వారసుడి పేరు మీద రాసేందుకూ సిద్ధమయ్యామని చెప్పారు. ఇలాంటి సమయంలో పిల్లాడిని పోలీసులు తమ నుంచి దూరం చేశారని కన్నీటిపర్యంతమయ్యారు.

న్నారు. ప్రతి శిశువు అమ్మకంపై ఒక్క ఏజెంట్‌కు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు లాభం పొందేవారు. పరారీలో ఉన్న నిందితులు కిరణ్, ప్రీతి, కన్నయ్యల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943